

www.andhrajyothy.com
వెల: రూ.5.00
నిజామాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



గురువారం | 8-3-2018 | పేజీలు: 18 + 16 | సంపుటి: 14 సంచిక: 237

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి తె. 3.45 తదుపరి అష్టమి; నక్షత్రం: అనూరాధ రా. 12.45 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 10.29-11.16, మ. 3.12-3.59; అమృతఘడియలు: మ. 1.25-3.09; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 6.20

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

ముస్లిం కోటా ఇవ్వలేం



ప్రత్యేక హోదా ఇవ్వబోం

తెలంగాణకు తేల్చేశారు | **సమయం చూసి మోదీ మొండి చెయ్యి** | ఏపీకి ఎగవేశారు

మండిపాటు



ముస్లింలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం
50 శాతం దాటేంత గొప్ప కారణాలేవీ చెప్పలేదు
పార్లమెంటులో కుండబద్దలు కొట్టిన కేంద్రం
భగ్గుమన్న టీఆర్ఎస్... స్తంభింపజేసిన ఎంపీలు
మూడో రోజూ కొనసాగిన ఎంపీల నిరసన
అన్ని రాష్ట్రాలనూ సమానంగా చూడాలని నినాదాలు
రిజర్వేషన్లపై రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్
వెల్‌లోకి వచ్చిన 6 ప్రాంతీయ పార్టీలు
30 సెకన్లకే లోక్‌సభ వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జనాభా ప్రాతిపదికన ముస్లిములకు రిజర్వేషన్ ఇవ్వడం కుదరదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా తేల్చిచెప్పింది. కేసీఆర్ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. తెలుగుదేశం రాజ్యసభ సభ్యుడు దేవేందర్‌గౌడ్ ప్రశ్నకు హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని దాటవచ్చని, అలాంటి


మిగతా 11వ పేజీలో...



తెలుగుప్రజల ఆత్మగౌరవం ఢిల్లీ పెద్దల కబంధహస్తాల్లో నలిగి నుజ్జయిపోతోంది..... అంతా నా ఇష్టం అన్న రీతిలో నరేంద్ర మోదీ సర్కారు తెలుగువారి అభీష్టాల్ని, రాజ్యాంగ హక్కుల్నీ నిర్దయగా కాలరాసేస్తోంది. కొత్తగా ఏర్పడిన రెండు తెలుగు రాష్ట్రాలపై మొదట్నుంచీ వివక్ష చూపుతున్న మోదీ ప్రభుత్వం బుధవారం నాడు రెంటికీ పెద్ద ఝలక్ ఇచ్చింది. ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని ఆంధ్రప్రదేశ్‌కు, ముస్లిం రిజర్వేషన్ల కోటా పెంపు అసాధ్యమని తెలంగాణకు తేల్చిచెప్పేసింది. శరాఘాతంలా తగిలిన ఈ నిర్ణయంపై ఉభయ రాష్ట్రాలూ మండిపడుతున్నాయి. కేంద్రంతో బంధాన్ని తెంచుకుంటున్నట్లు తెలుగుదేశం పార్టీ వెన్వెంటనే ప్రకటించింది... కేంద్రంలోని తమ మంత్రులు రాజీనామా చేస్తారని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో అధికారికంగా అనౌన్స్ చేశారు. ఇటు కేంద్రంపై కొద్ది రోజులుగా కత్తిదూస్తున్న తెలంగాణ సర్కారు- తదుపరి కార్యాచరణపై అంతర్గతంగా మంతనాలు సాగిస్తోంది. ఢిల్లీపై దండయాత్రకు సమాయత్తమైన కేసీఆర్ సర్కార్- ఈ తాజా పరిణామంపై సుప్రీంకోర్టుకు కూడా వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

రాజీనామా

కేంద్ర సర్కారుతో టీడీపీ కటీఫ్



వైదొలగనున్న మంత్రులు అశోక్ గజపతి, సుజనా
ప్రకటించిన చంద్రబాబు.. ప్రధానికి కలవని ఫోన్
ఏపీ కేబినెట్ నుంచి తప్పుకోనున్న బీజేపీ మంత్రులు

ఇవ్వాల్సినది అంతా ఇప్పటికే ఇచ్చేశాం

కేంద్రం చేయాల్సిన పనులూ ఉన్నాయి.. నిధులేమీ పొంగి పొర్లడం లేదు
29 రాష్ట్రాలను మేం సమానంగా చూడాలి.. సానుభూతితో డబ్బులు రావు
కరాఖండిగా తేల్చి చెప్పిన జైట్లీ.. ఏపీ ప్రగతిశీల రాష్ట్రం కదా అంటూ వ్యంగ్యం

8

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పోరు పతాక స్థాయికి చేరుకుంది. బీజేపీతో కటీఫ్ దిశగా తెలుగుదేశం పార్టీ తొలి అడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది. 'హోదా ఇవ్వం. రాయితీలు ఇవ్వలేం' అంటూ కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ అధికారికంగా ప్రకటించడం, ఇతరత్రా చేయాల్సిన సహాయంపైనా పాతపాటే పాడటంతో ఈ నిర్ణయం తీసుకుంది. బుధవారం రాత్రి 10.50 గంటల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా ఈ ప్రకటన చేశారు. కేంద్రంలో మంత్రులుగా ఉన్న తమ ఎంపీలు అశోక్ గజపతిరాజు,

మిగతా 8వ పేజీలో...

కొలాబ్ పిడుగు

ఇంద్రావతిపై ఒడిశా విద్యుత్తు ప్రాజెక్టు
54 టీఎంసీల నీరు శబరికి మళ్లింపు
గోదావరికి తగ్గనున్న నీటి ప్రవాహం 3
తుపాకుల గూడెం ప్రాజెక్టుపై ప్రభావం



మహిళా ఉద్యోగులకు నేడు సెలవు 2

కేంద్ర ఉద్యోగులకు 2% డీఏ పెంపు
కోటి మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి 12

అఖిల భారత పరీక్షలకు ఆధార్ తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు

రేపటి నుంచి తెరుచుకోనున్న
సినిమా థియేటర్లు

టెన్త్ పరీక్షలకు నిమిషం నిబంధన లేదు: విద్యాశాఖ 3



14

చిదంబరంపై
సీబీ'ఐ'?

బంగారం స్కాంపైనా దర్యాప్తు
సిఫారసు చేయనున్న పీఏసీ
డీఆర్ఐ వారించినా 80-20 స్కీమ్‌కు గేట్లెత్తిన చిదంబరం


















అదే నిజమైన ఆధ్యాత్మికత

నిత్యం కోట్లాది మంది భక్తులు సాయిబాబాను తలుచుకుంటూ ఉంటారు. బాబా గుడికి వెళ్లి.. తమ కోర్కెలను తీర్చమని ప్రార్థిస్తూ ఉంటారు. విలువైన కానుకలు చదివిస్తూ ఉంటారు. అలా చేస్తేనే బాబా ప్రసన్నుడవుతాడా? అసలు దేవుణ్ని ఎలా పూజించాలి? నిరాకారంగానా? సాకారంగానా? అనే సందేహాలకు సమాధానాలు చూద్దాం. మన సంపద (ధనం, వస్తువులు, ధాన్యాలు ఇలా ఏవైనా)లో దేవుడికి కూడా ఒక వాటా ఉండాలనేది పూర్వీకులు మనకు నేర్పిన ఒక పాఠం. ఈ వాటాను ఈశ్వరుడికి ప్రీతిపాత్రమైన విషయాలకు (అన్నార్తులకు భోజనాలు పెట్టడం, పేద విద్యార్థులకు సాయం చేయటం, వృద్ధాశ్రమాలు కట్టించడం వంటివి) వినియోగించాలి. ఇప్పటికీ కొన్ని కోట్లమంది తాము తినే అన్నాన్ని ముందు దేవుడికి ఆరగింపుగా పెడుతూ ఉంటారు. అయితే ఖరీదైన కానుకలిస్తేనే, ఆరగింపు పెడితేనే దేవుడు ప్రసన్నమవుతాడా? అలా చేయకపోవటం ఒక లోపమవుతుందా? అనే సందేహం కొందరిలో కలుగుతూ ఉంటుంది. మన సంప్రదాయం ప్రకారం.. దేవుణ్నిగానీ, గురువును కానీ నిండు మనసుతో పూజించడం, వారికి తమ మనసును అర్పించడం ముఖ్యమైన విషయాలు. డబ్బు ప్రధానం కాదు. ఇదే నిజమైన ఆధ్యాత్మికత. భక్తుడు తాను నమ్మిన దైవాన్ని లేదా గురువును మనసులో నింపుకొని ప్రార్థించగలిగితే దానిని మానస పూజ అంటారు. అనుక్షణం రకరకాల ఒత్తిళ్లలో జీవించే సాధారణ భక్తులు ఈ మానస పూజ చేయలేరు. వారి కోసమే భగవంతుడికి సంబంధించిన రకరకాల రూపాలున్నాయి. సద్గురు సాయి కూడా అలాంటి ఒక రూపమే. ఒక భక్తుడు ఈ రూపాన్ని ప్రార్థించడం మొదలుపెట్టిన తర్వాత మానస పూజ చేయగలిగిన స్థాయికి చేరుకుంటాడు. అప్పుడు ఈశ్వరుణ్ని నిరాకారుడిగా కొలవగలుగుతాడు. ఈ విధంగా భగవంతుడిని పూజించగలిగిన స్థితిని నిర్వికల్ప సమాధి అంటారు.

Paramjyothi పరంజ్యోతి

-భానుచంద్ర సత్పతి

'కల్యాణ లక్ష్మి'కి లక్ష!

▸ ఆర్థిక సాయం పెంచాలని సర్కారు నిర్ణయం



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మి పథకంలో భాగంగా అందించే ఆర్థిక సాయాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇస్తున్న రూ. 75 వేలను రూ. 1,00,116కు పెంచనున్నట్లు తెలిసింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన తొలినాళ్లలో ప్రభుత్వం రూ. 51 వేల మేర ఆర్థిక సాయం అందించేది. గత బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.75 వేలకు పెంచింది. తాజా బడ్జెట్‌లో మరింత పెంచడం ద్వారా.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లను ఒక స్థాయిలో నిర్వహించే అవకాశాలున్నాయని భావిస్తోంది. ఈ పథకంలో ఆర్థికంగా వెనకబడిన (ఈబీసీ) కుటుంబాలకు కూడా లబ్ధి చేకూర్చే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో ఈ నిర్ణయాన్నీ వెలువరించే అవకాశాలున్నాయి. కాగా.. ఇప్పటి వరకు కల్యాణ లక్ష్మి పథకానికి 3.2 లక్షల దరఖాస్తులు అందగా.. మూడు లక్షల మందికి లబ్ధి చేకూరిందని, మిగతా వారి దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని సంక్షేమ శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

మహిళా స్టార్టప్‌లకు 'వీ-హబ్'.. నేడు ప్రారంభం

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీ-హబ్‌తో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని ఆర్జిస్తున్న తెలంగాణ రాష్ట్రం మరో వినూత్న పథకానికి సిద్ధమైంది. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఇప్పటికే గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన టీ-హబ్ తరహాలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేకంగా వీ-హబ్(విమెన్ ఆంత్రప్రెన్యూర్ హబ్)ను అందుబాటులోకి తేనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం దీనిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. నిరుడు హైదరాబాద్‌లో జీఈఎస్ సదస్సులో భాగంగా "మహిళలే ప్రథమం.. అందరికీ శ్రేయస్సు" ప్రధానాంశంగా జరిగిన కార్యక్రమంలో 170 దేశాల నుంచి 1500 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నేడు మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులకు గురువారం స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అంతర్గత ఉత్తర్వులు జారీ చేసేది. కానీ.. ఈ సారి మార్చి 8న శాశ్వత సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని మహిళలకు గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.



పేరుకే మహిళా దినోత్సవం.. రెక్కాడితేనే కానీ ఆ మహిళల డొక్కాడదు.. పురుషులతో సమానంగా వారు రోజూ పని చేయాల్సిందే.. పొట్టకూటి కోసం బొగ్గును పగుల కొడుతూ కూలీ పని చేస్తున్న ఓ మహిళ నల్లగొండ జిల్లాలో ఆంధ్రజ్యోతి కెమెరా కంటపడింది.

కాల్ సెంటర్ నుంచే గర్భిణులకు ఫోన్

▸ మాతా శిశు మరణాలు తగ్గించేందుకు నిర్ణయం

▸ మూడు రోజుల ముందే పరీక్షల తేదీ సమాచారం

▸ ఈ సేవల వినియోగంలో భద్రాద్రికొత్తగూడెం టాప్



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసవం అనంతరం శిశువుకు టీకాలు వేయించడం దాకా అన్ని దశల్లోనూ తల్లీబిడ్డలకు 102 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఈ సేవల కోసం గర్భిణులు ఫోన్ చేయాల్సిన అవసరం లేకుండానే.. నేరుగా వారికే కాల్‌సెంటర్ నుంచి ఫోన్ చేసి, సమాచారం అందించే ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. 102 వాహనం వారి ఊరికి ఎప్పుడు వస్తుందో చెప్పడంతో పాటు.. గర్భిణులు పరీక్షలకు వెళ్లాల్సిన తేదీని 3 రోజుల ముందే గుర్తు చేస్తున్నారు. కేసీఆర్ కిట్ వాహనం ఏ సమయానికి వస్తుందో చెబుతున్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ వారిని అప్రమత్తం చేయడమే కాకుండా.. వారి వివరాలను ట్రాక్ చేస్తారు. 102 వాహనాల కోసం రోజురోజుకు కాల్స్ పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కాల్ సెంటర్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారు. రాష్ట్రంలోని 241 వాహనాలకు కాల్ సెంటర్‌తో అనుసంధానం చేశారు. ప్రతి జిల్లాకు ఒక కాల్ సెంటర్ ఉండగా హైదరాబాద్‌లో 20 ఉన్నాయి. కేసీఆర్ కిట్ వాహనాలను తొలుత పైలెట్ ప్రాజెక్టుగా ఏజెన్సీ ప్రాంతాల్లో నడిపారు. తొలిదశ విజయవంతం కావడంతో.. జనవరి 17న మరో 200 వాహనాలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ వాహనాల్లో ఎమర్జెన్సీ డెలివరీ కిట్‌లను కూడా అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని అన్ని 102 వాహనాల పనితీరును ఎప్పటికప్పుడు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన డ్యాష్‌బోర్డు ద్వారా తెలుసుకుంటున్నారు. వాటన్నింటికి జియో మ్యాపింగ్ చేశారు. ఈ వాహనాలు ప్రారంభించిన కొత్తలో రోజుకు 500-600 ట్రిప్పులు వేసేవారు. అది ఇప్పుడు మూడు రెట్లు పెరిగింది. రాబోయే రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 1,368 మంది గర్భిణులు ఈ సేవల్ని వినియోగించుకోగా... అత్యల్పంగా యాదాద్రి జిల్లాలో 334 మందే వినియోగించుకున్నారు. హైదరాబాద్‌లో ఆ సంఖ్య 770గా ఉంది.

మహిళా భద్రతపై దృష్టిసారించాలి

▸ లింగ సమానత్వం ఉన్న సమాజం కావాలి: ఉపరాష్ట్రపతి వెంకయ్య

న్యూఢిల్లీ, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరముందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. దాంతోపాటు లింగ సమానత్వం ఉండాలని మహిళా దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి పిలుపునిచ్చారు. మహిళలపై వివక్ష పోయేలా సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. మార్పు మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని, అమ్మాయి, అబ్బాయిల మధ్య వివక్ష చూపొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అమ్మాయిల పట్ల అబ్బాయిలు గౌరవంగా వ్యవహరించాలన్నారు. దక్షిణాసియాలో ఇంకా 27 శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయని యునిసెఫ్ ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులతో పోల్చితే మహిళల్లో అక్షరాస్యత తక్కువగా ఉందని, ఇది సమాజానికి మంచి చేయదని అభిప్రాయపడ్డారు. మహిళలపై నేరాలను నివారించేందుకు పోలీసింగ్ పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. జనాభాలో మహిళలు 50 శాతం ఉన్నారని.. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారిత కల్పించడంతో పాటు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్ని అడ్డంకులున్నా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అభినందనలు తెలిపారు.

ఎంబీఏ విద్యార్థి ఆత్మహత్య

▸ ఉద్యోగం ఇప్పిస్తామంటూ 3.2 లక్షలు వసూలు చేసిన స్నేహితులు

▸ మోసపోయాననే మనస్తాపంతో బలవన్మరణం



మహేశ్(ఫైల్)

జగిత్యాల టౌన్, హైదరాబాద్ సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎంబీఏ పూర్తిచేసిన ఆ విద్యార్థి చక్కని ఉద్యోగంపై కలలు కన్నాడు. తన సంపాదనతో కుటుంబానికి ఆసరాగా నిలవాలనుకున్నాడు. అయితే, అతడి ఆశలను అతడి స్నేహితులు వమ్ము చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని 3.2 లక్షలు వసూలు చేసి, ఉద్యోగం ఇప్పించకపోగా.. డబ్బులూ తిరిగివ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన మేడిశెట్టి గంగ మహేశ్ (27)ది ఈ విషాదాంతం. ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చిన మహేశ్.. స్నేహితులు సంతోష్, శివకృష్ణ, రఘునాథరెడ్డి, ఇమామ్ సాహెబ్‌లతో కలిసి వివేకానగర్‌లోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో ఉంటున్నాడు. టెక్ మహీంద్రలో ఉద్యోగం ఇపిస్తామని అదే కంపెనీలో పనిచేస్తున్న రేలంగి నాగేశ్వర్ రావు, శ్రీనివాస్‌లు స్నేహితల ద్వారా తెలపడంతో మహేశ్ నమ్మాడు. ఆరునెలల క్రితం అప్పుచేసి వారికి రూ.3.2 లక్షలు ఇచ్చాడు. అనంతరం బెంగళూరులో ఇంటర్వ్యూకు హాజరైన మహేశ్‌కు ఇప్పుడు ప్రాజెక్టులు లేవని ప్రాజెక్టులు వచ్చినప్పుడు ఉద్యోగానికి కబురుపెడతామని చెప్పారు. పలుమార్లు అక్కడ సంప్రదించి.. చివరికి మోసపోయానని గ్రహించిన మహేశ్ మంగళవారం తాను ఉంటున్న గదిలో ఉరివేసుకున్నాడు. తన చావుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అతడు రాసిన సూసైడ్ నోట్ లభ్యమైంది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు వెళ్లి బుధవారం మృతదేహాన్ని జగిత్యాలకు తీసుకువచ్చారు. వాళ్లు ఉంటున్న ఇంటి యాజమాని తాము ఇటీవలనే కొత్త గృహం నిర్మించుకున్నామని, మృతదేహాన్ని ఇంటికి తీసుకురావద్దని స్పష్టం చేశాడు. దీంతో చేసేదేమీ లేక ఆ కుటుంబ సభ్యులు మహేశ్ మృతదేహాన్ని శ్మశాన వాటికలోనే ఏర్పాట్లు పూర్తిచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

బాలికలను వేధించిన టీచర్ల సస్పెన్షన్

▸ పొడ్చన్‌పల్లి పాఠశాల ఘటనలో ప్రధానోపాధ్యాయుడికి మెమో

పాపన్నపేట, మార్చి 7: బాలికలను వేధించిన ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడడంతో పాటు ప్రధానోపాధ్యాయుడికి మెమో జారీ అయింది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పోడ్చన్‌పల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటనపై 'కీచకోపాధ్యాయుడు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ఇద్దరు ఉపాధ్యాయులు వెంకటేశం, మల్లేశంలను మెదక్ జిల్లా ఇన్‌చార్జి డీఈవో విజయలక్ష్మి సస్పెండ్ చేయడంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవేందర్‌కు మెమో జారీ చేసినట్లు పాపన్నపేట ఇన్‌చార్జి ఎంఈవో మోహన్‌రాజ్ వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లోకం తీరు



మహిళా బిల్లు కోసం వస్తే..
ఇది ఇచ్చి స్వచ్ఛభారత్ అంటున్నారు..!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	38.0	19.0
నిజామాబాద్	37.0	22.0
ఆదిలాబాద్	37.0	16.1
హైదరాబాద్	36.5	21.3
వరంగల్	34.5	19.5



నేనెందుకు ఈద్ జరుపుకోవాలి?

నేను హిందువుని. నేను ఈద్ ఎందుకు జరుపుకోవాలి? ఎవరైనా ఈద్ జరుపుకోవాలని భావిస్తే ప్రభుత్వం భద్రత కల్పిస్తుంది. నేను హిందువునని గర్వంగా చెప్పుకోవడంలో తప్పేమీ లేదు. ఇంట్లో యజ్ఞోపవీతం వేసుకుని మరో చోట టోపీ ధరించే కపటత్వం మాకు లేదు.

- ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ (యూపీ అసెంబ్లీలో ప్రసంగిస్తూ..)



ట్రంప్ అథమస్థాయి అధ్యక్షుడు

చరిత్రలోనే అథమస్థాయి అధ్యక్షుడు ట్రంప్. ఇతర దేశాలపై ఆయన విధిస్తున్న ఇమ్మిగ్రేషన్ ఆంక్షలు దారుణం. కలలు కనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. వాటిని ఎవరూ అడ్డుకోలేరు.

- జిమ్మీ కిమ్మెల్, అమెరికన్ టెలివిజన్ హోస్ట్ (ఆస్కార్ రేటింగ్స్ 20%కు పడిపోవడంపై ట్రంప్ ఎగతాళి వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ...)

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్		డీజిల్	
పాత ధర	రూ. 76.66	పాత ధర	68.40
కొత్త ధర	రూ. 76.66	కొత్త ధర	68.35
మార్పులేదు		తగ్గింపు 0.05 పైసలు	



దోమ పేగులోనే డెంగీ, జికా నివారణ

వాషింగ్టన్, మార్చి 7 : డెంగీ, జికా, చికున్‌గన్యా వంటి రోగాలను వ్యాపింపజేసే ఈడిస్ ఈజిప్ట్ దోమ మధ్యపేగు (అన్నవాహిక) లోనే ఆ రోగాలను నివారించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా దోమ ఇన్‌ఫెక్షన్‌కు గురైనపుడు వాటి జీవక్రియలు మార్పులకు గురవుతాయి. ఈ ఇన్‌ఫెక్షన్ దోమ మధ్య పేగులోనే ఉంటుంది. వైరస్‌ను వ్యాప్తి చేసే దోమ సామర్థ్యాన్ని ఈ పేగులోని జీవక్రియ నిర్ణయిస్తుందని కొలర్యాడో స్టేట్ వర్సిటీ పరిశోధకులు తెలిపారు. వైరస్ బతకాలంటే దోమలోని జీవక్రియలు ముఖ్యమని , దోమలోని కణాలను నిర్వీర్యం చేయడం, లేదా వైరస్‌ను తట్టుకునేలా దోమలోని జీవక్రియలను మార్చడం ద్వారా ఈ ఇన్‌ఫెక్షన్‌ను నివారించవచ్చని చెప్పారు.

జంక్‌ఫుడ్‌పై మోజెందుకంటే...

వాషింగ్టన్, మార్చి : స్థానికంగా లభించే ఆహారం, ఇంట్లో తయారుచేసిన ఆహారానికి బదులు జంక్‌ఫుడ్‌ను పిల్లలు ఎందుకు ఇష్టపడతారో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఫాస్ట్‌ఫుడ్ కంపెనీల లోగోలను గుర్తించే పిల్లలు పిజ్జా బర్గర్లు, శీతల పానీయాలపై మోజు పెంచుకుంటున్నారని పరిశోధకులు తెలిపారు. చైనా, భారత్, బ్రెజిల్, నైజీరియా, పాకిస్తాన్, రష్యాల్లో అంతర్జాతీయ ఆహారంపై మోజు, మార్కెటింగ్, మీడియా మధ్య ఉన్న సంబంధాలపై అమెరికాలోని మేరీలాండ్ వర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. అంతర్జాతీయ ఆహార కంపెనీల లోగోలు పిల్లల దృష్టిని ఆకర్షిస్తున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని తెలిపారు.

తెలంగాణపై కొలాబ్ పిడుగు!

- ఇంద్రావతిపై ఒడిసా విద్యుదుత్పత్తి ప్రాజెక్టు
- 54 టీఎంసీల నీరు శబరికి మళ్లింపు
- గోదావరిలో తగ్గనున్న నీటి వాటా
- తుపాకుల గూడెం ప్రాజెక్టుపై ప్రభావం
- వ్యతిరేకించాలని నిర్ణయించిన తెలంగాణ
- అధికారుల కసరత్తు..త్వరలో కేంద్రానికి లేఖ



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిలో మాదిరిగానే భవిష్యత్తులో గోదావరిలోనూ నీటి కొరత ఏర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇంద్రావతి నదిపై ఒడిసా ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన మిడిల్ కొలాబ్ విద్యుదుత్పత్తి ప్రాజెక్టు వల్ల తెలంగాణకు రావాల్సిన 54 టీఎంసీల నీటి ప్రవాహం తగ్గిపోనుంది. ఇంద్రావతి నదిపై మిడిల్ కొబాల్ పేరిట ప్రత్యేక విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు అనుమతినివ్వాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై కేంద్రం.. తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రానికి ఏం చెప్పాలనే అంశంపై తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అంతరాష్ట్ర విభాగం ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నతాధికారులతో ఇప్పటికే సమీక్షించారు. సాధారణంగా... విద్యుదుత్పత్తికి ఉపయోగించే నీరు మళ్లీ దిగువకే రావాల్సి ఉంటుంది. అందుకే విద్యుదుత్పత్తి ప్రాజెక్టు వల్ల దిగువ ప్రాంతాలకు నీటి కొరత ఏర్పడదు. అయితే, మిడిల్ కొలాబ్ ద్వారా ఇంద్రావతిలోని సుమారు 54 టీఎంసీల నీటిని శబరి సబ్ బేసిన్‌కు మళ్లించాలని ఒడిసా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇంద్రావతి నది ద్వారా తెలంగాణకు రావాల్సిన 54 టీఎంసీల ప్రవాహం తగ్గిపోనుంది. తద్వారా కాళేశ్వరంలో భాగంగా చేపట్టిన మేడిగడ్డ దిగువలోని తుపాకుల గూడెం ప్రాజెక్టుకు నీటి కొరత ఏర్పడనుంది. కొన్ని సందర్భాల్లో దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేయడానికి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో గోదావరి నదిలో ఇంద్రావతి కలిసిన తర్వాత తుపాకుల గూడెం వద్ద ప్రత్యేక బ్యారేజిని నిర్మిస్తున్నారు. ఈ బ్యారేజి నిర్మాణం పూర్తయితే, దేవాదులకు నీటి కొరత రాదు. అయితే, ఎగువున మిడిల్ కొలాబ్ పేరిట ఇంద్రావతిలోని నీటిని శబరి బేసిన్‌లోకి తరలించడానికి ఒడిసా ప్రభుత్వం డీపీఆర్‌ను రూపొందించింది. దీంతో శబరి కలిసే వరకు గోదావరి నదిలో నీటి లభ్యత తగ్గిపోతుందని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన చెందుతున్నది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, మిడిల్ కొలాబ్ ప్రాజెక్టును వ్యతిరేకించాలనే యోచన చేస్తోంది. ఈ అంశంలో ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయానికి రాలేకపోయినప్పటికీ, మిడిల్ కొలాబ్ పూర్తయితే తెలంగాణకు నీటి కొరత తప్పదనే అభిప్రాయంలో అధికారులు ఉన్నారు. ఈ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం త్వరలోనే తన అభిప్రాయాన్ని తెలియజేయనుంది.

'పది'లో నిమిషం నిబంధన లేదు: విద్యాశాఖ



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలకు 'నిమిషం' నిబంధన అమలు చేయడం లేదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఐదు నిమిషాల నిబంధనే వర్తిస్తుందని, వాటిలో ఎలాంటి మార్పులు చేయడంలేదని స్పష్టం చేశారు.

ఈసారి బడ్జెట్ 1.78 లక్షల కోట్లు!

- పన్నుల వృద్ధి 19.75% ఆధారంగా తుదిరూపు
- శాఖల వారీగా ప్రతిపాదనలు.. కసరత్తు పూర్తి
- ముఖ్యమంత్రి ఆమోదం.. పుస్తకం తయారీలో ఆర్థికశాఖ
- సాగు, బీసీ సంక్షేమానికి పెద్ద పీట
- కల్యాణ లక్ష్మి సాయం రూ.లక్షకు పెంపు!



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను బడ్జెట్ కసరత్తు పూర్తయింది. ఏ ఏ శాఖలకు ఎన్ని కేటాయింపులు చేయాలనే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. ఫిబ్రవరి నాటికి నమోదైన 19.75 శాతం పన్నుల వృద్ధి ఆధారంగా బడ్జెట్‌కు తుది రూపు ఇచ్చినట్టు సమాచారం. ప్రస్తుత బడ్జెట్‌తో పోల్చుకుంటే.. కొత్త బడ్జెట్ 15-19 శాతం మధ్య పెంపు ఉండే అవకాశాలున్నాయి. ఈ లెక్కన కొత్త బడ్జెట్ రూ.1.78 లక్షల కోట్ల వరకు ఉండవచ్చునని సమాచారం. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బడ్జెట్‌పై పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. ఏ శాఖకు ఎంత కేటాయించాలో సూత్రప్రాయంగా ఆర్థిక శాఖకు నిర్దేశించారు. ఆమేరకు ఆర్థిక శాఖ అధికారులు శాఖలవారీగా కేటాయింపులు చేశారు. పరిశీలించిన సీఎం కేసీఆర్.. బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దీంతో ఆర్థిక శాఖ పుస్తకం తయారీలో నిమగ్నమైంది. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 నుంచి జరుగుతాయని గవర్నర్ నరసింహన్ ఇప్పటికే ప్రకటించారు. 15వ తేదీన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో ప్రధానంగా వ్యవసాయం రంగానికి బీసీలకు ప్రాధాన్యమివ్వాలన్నది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. రానున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఇదే పూర్తి స్థాయి బడ్జెట్. అందుకే ఈసారి అన్ని వర్గాలను ఆకట్టుకునేలా బడ్జెట్‌ను రూపొందించినట్టు సమాచారం. శాఖలవారీగా అమలు జరుగుతున్న పథకాలకు, కొత్తగా ప్రకటించిన పథకాలకు కేటాయింపులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రైతులకు పెట్టుబడి మద్దతు కింద ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అలాగే రైతులకు బీమా పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ రెండు పథకాలతో పాటు, వ్యవసాయానికి సంప్రదాయ కేటాయింపులు ఉంటాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే... ఒక్క వ్యవసాయ రంగానికే రూ.15 వేల కోట్ల మేర కేటాయింపులు ఉండవచ్చునని తెలుస్తోంది. బీసీలకు ప్రత్యేక అభివృద్ధి నిధిని పద్దు కింద రూ.10 వేల కోట్ల వరకు కేటాయించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ శాఖ ద్వారా రూ.8వేల కోట్ల మేర సంప్రదాయ ప్రతిపాదనలను పంపారు. ఇందులోనే కొత్త గురుకులాల వ్యయ అంచనాలు కూడా ఉన్నాయి. బీసీల ప్రత్యేక అభివృద్ధి నిధి, సంప్రదాయ ప్రతిపాదనలన్నీ కలిపితే... బీసీ సంక్షేమ శాఖకు రూ.18-20 వేల కోట్ల వరకు కేటాయించే అవకాశాలున్నాయి. ఇక కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకం కింద ఆర్థిక సాయాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇస్తున్న రూ.75వేల సాయాన్ని రూ. లక్షకు పెంచనున్నట్టు సమాచారం. ఇందుకోసం రూ.1000 కోట్లు కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. సాగు నీటి రంగానికి ఎప్పటిలాగే రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 కోట్ల మధ్య కేటాయింపులు జరిపే అవకాశాలున్నాయి. విద్యా, వైద్య రంగాలకు ఎప్పటిలాగే 15 శాతం మేర పెంపు ఉండవచ్చని సమాచారం.



రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- 10 వేల మెగావాట్లు దాటిన వినియోగం
- 6వ తేదీన రికార్డు స్థాయిలో నమోదు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ డిమాండ్ రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతోంది. నెలరోజులుగా 9,500 మెగావాట్లపైనే నడుస్తున్న డిమాండ్.. బుధవారం ఉదయం 7:29 గంటలకు 10,021 మెగావాట్లకు చేరింది. ఉష్ణోగ్రతలతో పాటు వ్యవసాయ వినియోగం గణనీయంగా పెరగడం ఇందుకు కారణమని అధికారులు పేర్కొంటున్నారు. ఎస్పీడీసీఎల్ (హైదరాబాద్) పరిధిలో ఉదయం 7:30 గంటలకు 6,398 మెగావాట్లు, ఎన్పీడీసీఎల్ (వరంగల్) పరిధిలో ఉదయం 7:42 గంటలకు 3,354 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. మంగళవారం (ఈనెల 6న) రికార్డు స్థాయిలో 10,044 మెగావాట్ల డిమాండ్ నమోదు కావడం గమనార్హం. ఇది మార్చి నెలాఖరు నాటికి 11 వేలు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు మధ్యాహ్న వేళల్లో గృహ, పారిశ్రామిక వినియోగం పెరగడంతో 7 రోజులుగా కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని అధికారులు పేర్కొంటున్నారు. బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో దాదాపు అరగంట పాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

కేసీఆర్ అంటే వణుకెందుకు?

- బీసీలకు కాంగ్రెస్, బీజేపీ ఏమీ చేయలేదు: జోగు
- కేసీఆర్ కాలి గోటికి సరిపోరు: ఇంద్రకరణ్‌రెడ్డి
- ప్రత్యామ్నాయం కోసమే థర్డ్ ఫ్రంట్: పోచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్

నిర్మల్, హైదరాబాద్, నిజామాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెచ్చేందుకు జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానన్న సీఎం కేసీఆర్ అంటే అంత వణుకెందుకని కాంగ్రెస్, బీజేపీ నేతలను మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. ఆయన బుధవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి ఆ రెండు పార్టీలు ఏమీ చేయలేదన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడైన మోదీ బీసీల కోసం చేసిన ఒక్క పని చెప్పగలరా? అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల పెంపు కోసం టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో చేస్తున్న ఆందోళనపై ప్రధాని మోదీ స్పందించకపోవడం దారుణమన్నారు. బీసీల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్ల లోపే కేటాయించారని, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించామన్నారు. బీసీలపై సీఎం కేసీఆర్, ప్రధాని మోదీల ప్రేమ దీంట్లోనే తెలుస్తోందన్నారు. టీఆర్ఎస్ ప్లీనరీ వేదికగా జాతీయ నాయకుల సమక్షంలో కొత్త ఫ్రంట్ ప్రకటన వస్తుందని, అది తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. సీఎం కేసీఆర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను, టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నోటికొచ్చినట్లు అంటున్న కాంగ్రెస్ పార్టీ నేతలకు అధికారం కలే అని, వారు సీఎం కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోరని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్‌లో ధ్వజమెత్తారు. ప్రజలు ఇక కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ బస్సుయాత్ర అట్టర్ ఫ్లాప్ షో అన్నారు. 2019లో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నేతలు సంస్కారం లేకుండా మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారని, నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసే ఫెడరల్ ఫ్రంట్‌కు దేశవ్యాప్త మద్దతు లభిస్తోందన్నారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి తన నోరును అదుపులో పెట్టుకోవాలని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎంపీ కవితలను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయాల కోసం చేపట్టిన బస్సు యాత్రకు రైతులు, ప్రజల నుంచి స్పందన లేదని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిజామాబాద్‌లో ఆరోపించారు. కాంగ్రెస్ నేతల్లో సమన్వయం లేదన్న విషయం యాత్రలో స్పష్టమైందని, వీళ్లు ప్రజల సమస్యను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన వల్లే రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతుల జీవితాల్లో కేసీఆర్ వెలుగులు నింపుతున్నారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాల వల్లే సీఎం కేసీఆర్‌కు జాతీయ స్థాయిలో పేరు వచ్చిందన్నారు. జాతీయ రాజకీయాల్లోకి ఎవరు వెళ్తారో, వచ్చే ఎన్నికల తర్వాత సీఎం ఎవరు అవుతారో కేసీఆర్ నిర్ణయిస్తారన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్

సీఎం కేసీఆర్‌కు ఎన్ఆర్ఐల మద్దతు

శంషాబాద్, మార్చి 7 : టీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటనతో విదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు పెద్దఎత్తున మద్దతు పలుకుతున్నారు. ఇందులో భాగంగా విదేశాల్లో స్థిరపడిన సుమారు 40 మంది ఎన్ఆర్ఐలు బుధవారం రాత్రి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ డాక్టర్ మోహన్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా థర్డ్ ఫ్రంట్‌ను రూపొందించే సత్తా సీఎం కేసీఆర్‌కు ఉందని తాము విశ్వసిస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో టీఆర్ఎస్ ఉద్యమం సాగినప్పుడు తాము మద్దతు ఇచ్చామని, ప్రస్తుతం కూడా అదేవిధంగా మద్దతు ఇస్తామన్నారు.

విగ్రహ ధ్వంసం!

తమ ప్రభుత్వం ఇంకా ప్రమాణస్వీకారం చేయకముందే, 'చలో పల్టాయి' అన్న ఎన్నికల నినాదాన్ని త్రిపురలో బీజేపీ ఆచరణలో పెట్టింది. లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడం, వామపక్ష కార్యాలయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలతో ఆ పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయారు. పాతికేళ్ళ తరువాత వామపక్ష కంచుకోటను బద్దలు కొట్టిన ఉత్సాహంలో, ఏదో పొరపాటున దిగువస్థాయిలో జరిగిపోయిన చర్యగా దీనిని సరిపెట్టుకోలేం. ఒక ప్రధాన కూడలిలో ఉన్న విగ్రహాన్ని నినాదాలు, కేరింతల మధ్య బుల్డోజర్ల సహాయంతో కుప్పకూల్చుతూ, ఆ ఘనకార్యాన్ని చిత్రీకరించడానికి అంతటి ధైర్యం వారికి ఎక్కడనుంచి వచ్చిందో తెలియంది కాదు. గోసంరక్షణ పేరిటో, గొడ్డు మాంసం తిన్నారన్న నెపంతోనో దాడులు జరిగినప్పుడు అధినాయకులు నిస్సిగ్గుగా వెనకేసుకొచ్చిన గతానుభావాలు అనేకం వారికి ఉన్నాయి. వారు ఆశించినట్టుగానే, ఈ విధ్వంసాన్ని తక్షణమే వెనకేసుకొచ్చిన అగ్రనాయకులకు కొదవలేదు. లెనిన్ విదేశీ అనీ, టెర్రరిస్టు అనీ ఒకాయన సమర్థించాడు. మరొకాయన వరుస ట్వీట్లతో 'చలో పల్టాయి' అంటూ మరోమారు నినదించాడు. రాజ్యాంగ రక్షకుడంటున్న గవర్నర్ ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంభవించే ఓ తేలికపాటి పరిణామంగా దీనిని తీసిపారేశారు. ఇక, పెరియార్ పనిపడతామంటూ తమిళనాడు బీజేపీ రాజా గర్జించగానే ఆ రాష్ట్రంలోనూ నిప్పంటుకుంది. ఏయే విగ్రహాలు ఎన్ని ధ్వంసమైనాయో, ఎవరెని ఎవరు చంపారో అటుంచితే, ఈ విధ్వంసకాండపై గతంలో మాదిరిగా కాకుండా ప్రధాని నోరువిప్పినందుకు సంతోషించాలి. ప్రధాని కాస్తంత కఠినంగా స్పందించినందువల్లనో, క్షమించేది లేదని సాక్షాత్తూ పార్టీ అధ్యక్షుడు హెచ్చరించినందునో నోరుపారేసుకున్నవారు మాట దిద్దుకున్నారు. ట్వీట్లు వెదజల్లినవారు వాటిని చెరిపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకపక్కన క్షేత్రస్థాయిలో విద్వేషాన్ని విస్తృతంగా వెదజల్లుతూనే, ఆనక మాట వెనక్కుతీసుకున్నంత మాత్రాన విధ్వంసాలు నిలిచిపోతాయా?

విగ్రహాలను కూల్చివేయడం లేదా పాక్షికంగా ధ్వంసం చేయడం గతంలో జరగనివేమీ కావు. స్థానిక గొడవల కారణంగానో, అక్కసుతోనో నాయకుల విగ్రహాలను ఏ అర్ధరాత్రో రహస్యంగా ధ్వసం చేయడం అప్పుడప్పుడు జరుగుతున్నదే. కానీ, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఓ రాజకీయ పార్టీ, ఇంతటి అప్రజాస్వామికంగా తన విజయోత్సవ వేడుకను నిర్వహించడం మాత్రం ఇదే తొలిసారి. భారతదేశ చరిత్రలో మరే రాజకీయపార్టీ కార్యకర్తలూ ఇప్పటివరకూ ఇంతటి ఉన్మాదానికి ఒడికట్టే ధైర్యం చేయలేదు. దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని ఏలిన ఒక పార్టీని ఎన్నికల్లో కుప్పకూల్చి అధికారంలోకి వచ్చినా ఏ ఇతర రాజకీయపక్షమూ ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టలేకపోయింది. శూన్యం నుంచి శిఖరానికి ఎగిరే క్రమంలో నాయకత్వం మధ్యయుగాల నాటి యుద్ధ వాతావరణాన్నే సృష్టించిందో, కార్యకర్తలను యుద్ధానికి సిద్ధం చేసే క్రమంలో అందించిన స్ఫూర్తిని కార్యకర్తలే ఇలా అర్థం చేసుకున్నారో తెలియదు కానీ, విగ్రహం కూల్చివేతతోనే తమ విజయ పరంపర ముగిసినట్టని వారు భావించారు. 1700 సంవత్సరాల నాటి బామియాన్ బుద్ధ విగ్రహాన్ని తాలిబాన్‌లు డైనమైట్లు పెట్టి కుప్పకూల్చినప్పుడు, చారిత్రక కట్టడాలనూ విగ్రహాలను ఇస్లామిక్ స్టేట్ ధ్వసం చేస్తున్నప్పుడు ప్రపంచమంతా ఆ మతోన్మాదానికి నిర్ఘాంతపోయింది. ఇరాక్‌లో విజయం తరువాత అమెరికన్ సైనికులు సద్దాం హుస్సేన్ విగ్రహాన్ని కుప్పకూల్చి, కాళ్ళతో తొక్కుతూ తుపాకుల కాల్పులతో వీరంగం వేసినప్పుడు ప్రపంచం అసహ్యించుకుంది. ఈ దురాక్రమణలో అమెరికా ఇరాక్‌ను వశంచేసుకొని ఉండవచ్చు, దాని దృష్టిలో సద్దాం ఓ నియంతే కావచ్చును కానీ, ఈ చర్య అమెరికా అహంకారానికి పరాకాష్ఠగా, ఓ నాగరికతపై జరిపిన నిస్సిగ్గు చర్యగా ప్రపంచానికి కనిపించింది. కారణాలు వేరు కావచ్చును కానీ, ఉన్మాదంలో బెలోనియా–బామియాన్ ఘటనల మధ్య ఏ తేడాలేదు.

ప్రపంచవ్యాప్తంగా యుద్ధానంతర విజయాల్లో భాగంగానో, ప్రజా ఉద్యమాల్లోనో, తిరుగుబాటు సందర్భంగానో సాగిన విగ్రహాల కూల్చివేత, ఈ దేశంలో ఒక ప్రజాస్వామిక ప్రక్రియ అనంతరం జరగడం ఒక విచిత్రమైన పరిణామం. బెలోనియా నడిబొడ్డున ఉన్న ఈ లెనిన్ విగ్రహం వామపక్ష అనుకూలుర సంగమస్థలిగా ఉంటూ, పాతికేళ్ళ వామపక్ష పాలనకు ప్రతీకగా కనిపిస్తున్నందున చరిత్రను చెరిపేసే తమ లక్ష్యాన్ని ఈ 'విదేశీ' విగ్రహంతోనే ఆరంభించాలన్నది స్వదేశీయుల ఉద్దేశం కావచ్చును. కానీ, ప్రజాస్వామ్యంలో తాము సాధించిన ఎన్నికల విజయం ఇటువంటి విధ్వంసాలకు, ఉన్మాద ఘటనలకు పాల్పడటానికి కాదనీ, అత్యధిక స్థానాలు నెగ్గినంత మాత్రాన అవధులులేని అధికారంతో, అహంకారంతో ప్రవర్తించవచ్చునని ప్రజలు రాసిచ్చినట్టు కాదని పాలకులు గుర్తించాలి. చరిత్రను చెరిపేయడం విగ్రహం కూల్చినంత సులభం కాదు. పాతికేళ్ళ పాలనలో మార్క్సిస్టు ప్రభుత్వం ఏం చేసిందో గ్రహించడం ముఖ్యం. అద్భుతంగా పనిచేసిందని అందరూ అంటున్న ఆ ప్రభుత్వాన్ని కూడా దించి తమను అధికారంలోకి ఎక్కించిన ప్రజలు తమనుంచి ఏమి ఆశిస్తున్నారో, వాటిని నెరవేర్చడం ఎలాగో ఆలోచించడం ముఖ్యం. మాణిక్ సర్కార్ మాదిరిగా కాకున్నా, కనీసం మరోమారు అధికారంలోకి రాగలిగే సానుకూల వాతావరణాన్ని ఈ ఐదేళ్ళకాలంలో సృష్టించుకోగలిగితే, జ్ఞాపకాలను చెరిపేయాలన్న కోరిక దానంతటదే కొంతమేరకైనా నెరవేరుతుంది.

'ఒక్క నిమిషం' నిబంధన వద్దు

ప్రభుత్వం వివిధ పరీక్షలలో అమలు చేస్తున్న 'ఒక్క నిమిషం' నిబంధన విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పరీక్ష రాయడానికి సరైన రవాణా సౌకర్యాలు లేకున్నా విద్యార్థులను నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టడం భావ్యంకాదు. తనకు ఇచ్చిన సమయాన్ని విద్యార్థి చక్కగా ఉపయోగించుకునే నిర్మలమైన వాతావరణం పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేయడం అధికారుల బాధ్యత. ఆ సమయం ఆరంభంలో ఎంత ఆలస్యం జరిగినా నష్టపోయేది సంబంధిత విద్యార్థులే. పరీక్షల అంతిమ సమయం మాత్రం మించకుండా అందరు విద్యార్థుల ఆన్సర్ షీట్‌లను ఇన్విజిలేటర్లు లాగేసుకుంటారు. అది అనివార్యం. కాని రవాణా సౌకర్యాల లోపంతోనో, ఇంకే ఇతర కారణాల చేతనో తమ సమయం కొంత వృథా అయినా లెక్కచేయక మిగిలిన సమయంలోనే పరీక్ష నెగ్గేందుకు ప్రయత్నం చేస్తున్న విద్యార్థులకు అధికారులు పెడుతున్న 'ఒక్క నిమిషం నిబంధన' వాళ్ల మానసిక స్థైర్యం దెబ్బతినేలా చేయడం తప్ప మరోటికాదు. ఉద్దేశ పూర్వకంగా అధికారులు పెడుతున్న నిబంధనలతో విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. తమకు సంబంధం లేని కారణాలతో నిముషం ఆలశ్యంగా వచ్చిన విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించలేక విద్యాసంవత్సరాన్ని కోల్పోవాల్సి రావడం బాధాకరం. వ్యక్తిగతంగా విద్యార్థులే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా ఈ 'ఒక్క నిమిషం' నిబంధనతో తీవ్ర వేదన చెందుతున్నారు. ఇకనైనా ఈ పరిస్థితిని మార్చడానికి కావలసిన ఆలోచనలు మన అధికారులు చేస్తారని, ఒక్కనిమిషం నిబంధనలను ఒక్కసారి పునరాలోచించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మనవి చేస్తున్నాను.

– వి.రాజశేఖర శర్మ, నాగర్‌కర్నూల్ జిల్లా



శ్రామిక మహిళలకూ ఉత్సవమేనా?

మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినం– ఉత్సవమా? పోరాట దినమా? ఎవరికి ఉత్సవం? ఎవరికి పోరాట దినం? మహిళా పారిశ్రామిక వేత్తలకు, సినీతారలకు, పార్లమెంటు, అసెంబ్లీలోని మహిళలకు, ధనిక మహిళలకు దినోత్సవం. దోపిడికి, అణచివేతలకు గురవుతున్న పేద, దళిత, వెనుకబడిన, మైనార్టీ మహిళలకు పోరాట దినం. 1900లోనే అంతర్జాతీయ సోషలిస్టు మహాసభ కోపెన్ హెగెన్‌లో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా జరుపుకోవాలని ప్రకటించింది.

పారిశ్రామిక విప్లవం అనంతరం పరిశ్రమలలో మహిళలు 15 గంటలు పిల్లలతో పాటు బానిసల్లా పనిచేసేవారు. యూరప్‌లో, అమెరికా బట్టల పరిశ్రమలలో పని చేస్తున్న శ్రామిక మహిళలు మెరుగైన వసతులకోసం, కనీస వేతనాల కోసం, 8 గంటల పని దినం కోసం అర్ధ శతాబ్దం పైగా పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటం చేసి, 8 గంటల పని దినాన్ని సాధించారు. శ్రామిక మహిళల పోరాటాలను స్మరించుకుంటూ అంతర్జాతీయ మహిళా పోరాట దినం ఏర్పాటుకు సోషలిస్టు నాయకురాలు క్లారాజెట్కిన్ కృషి చేశారు. చరిత్రలో ఏ హక్కులూ శాంతియుతంగా సాధించబడలేదు. ఈ పోరాటంలో 146 మంది శ్రామిక మహిళలు బలికావాల్సి వచ్చింది. వివక్ష, అణచివేత, దోపిడికి గురవుతున్న మహిళల విముక్తికి ఈ పోరాటం ఒక శాస్త్రీయ మార్గాన్ని అందించింది.

INTERNATIONAL WOMEN'S DAY

ప్రపంచ మహిళా దినోత్సవం

ఏ సమాజంలోనైనా సాధారణ స్వాతంత్ర్యానికి కొలబద్ద స్త్రీ స్వాతంత్ర్యమని మొట్టమొదట ఫోరియర్ ప్రకటించారు. మన దేశంలో భూస్వామ్య, మనువాద, పితృస్వామ్య భావజాలంతో మహిళలను విలాస వస్తువులుగా, పురుషుని సొంత ఆస్థిగా, ఇంటి, పిల్లల, భర్త చాకిరికి పరిమితం చేస్తున్న పరిస్థితి నేటికీ కొనసాగుతోంది. మహిళలు అధిక సంఖ్యలో వ్యవసాయరంగంలో కూలీలుగా, సంఘటిత, అసంఘటిత రంగాలతో పాటు ఇంటిచాకిరిని కలుపుకుంటే అధిక శ్రమ చేస్తున్నారు. అయినా నేడు మహిళల పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. 'ఎవరూ మహిళగా పుట్టరు. మహిళగా తయారు చేయబడతారు' అని సైమన్ డి బవరు చెప్పినట్టుగా పితృస్వామ్యమే మహిళల్ని మరింతగా దోపిడి చేయడానికి పాలకులకు ఉపకరిస్తుంది. అందుకే మహిళలపై పితృస్వామ్య అణచివేతను రూపు మాపేందుకు పాలకులు ఎన్నడూ ప్రణాళికలు రూపొందించరు.

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వలన, అణచివేతల వలన మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా రోజురోజుకూ చితికిపోతున్నారు. అయినా మహిళలు ప్రతిఘటిస్తూనే ఉన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పేరిట భూములు కోల్పోయిన మహిళలు ఉద్యమాలలో ముందు నిలబడి స్వావలంబనకు ప్రతీకలుగా నిలుస్తున్నారు.

1970వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినం జరుపుకోవాలని ప్రకటించింది. ఈ నేపథ్యంలో 1972లో మధురా కస్టోడియల్ రేప్, వరకట్న హత్యలు, కుటుంబ హింస, పనిచేసే చోటే అత్యాచారాలపై ఉద్యమాలు వెల్లువెత్తాయి. ప్రశ్నించే గొంతుకలు పెరగడం వల్ల తొలిసారిగా భారతదేశంలో 1974లో అంతర్జాతీయ మహిళా దినం ప్రారంభమయ్యింది.. కుటుంబ హింసను నిరోధించే 498ఏ లాంటి చట్టాలు కూడా అమలులోకొచ్చాయి. 1980 దశకం తరువాత విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగి అవి మీడియాలోకి కూడా ప్రవేశించాయి. బహుళజాతి కంపెనీలు ప్రజల దైనందిన అవసరాలకు కావాల్సిన సరుకుల నుండి వాహనాల ఉత్పత్తుల అమ్మకాల ప్రచారం వరకూ స్త్రీలను వాడుకొంటున్నాయి. స్త్రీని వ్యక్తిత్వం లేనిదానిగా, అర్ధనగ్నంగా చిత్రీకరించడం ఎక్కువయ్యింది. 1991 తరువాత నూతన ఆర్థిక విధానాలు స్త్రీల జీవితాలనే అంగడి సరుకుగా మార్చేశాయి. అందాల పోటీలు, ఫ్యాషన్ షోలు, కాస్మోటిక్ పరిశ్రమలు, టూరిజం, సినిమాలు వంటి రంగాలలో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. కాస్మోటిక్స్ పరిశ్రమ దేశంలో మూడవ అతి పెద్ద పరిశ్రమగా ఆవిర్భవించింది. 2010 కల్లా సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ ద్వారా స్త్రీ చుట్టూ తిరిగే వ్యాపారాలు రెట్టింపై అంతర్జాతీయ మహిళా దినం స్ఫూర్తి పక్కదారి పట్టింది. మహిళను వంటింటికి పరిమితం చేసే వంటల పోటీలు, ముగ్గుల పోటీలు, ఫ్యాషన్ షోలు, బహుమతులు, సన్మానాలు, అవార్డులు మహిళా దినం రోజున మంచెత్తుతున్నాయి. స్త్రీ అంటే 'అనుభవించు వదిలేయ్' అన్న చందంగా తయారయ్యింది. అందుకే విపరీతంగా అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. నిర్భయ లాంటి చట్టాలు కూడా అత్యాచారాలను ఆపలేక పోతున్నాయి.

జనాభాలో సగ భాగం ఉన్న మహిళల ఓట్లు ఎన్నికల గెలుపోటములను నిర్ణయిస్తాయి. కావునే డ్వాక్రా గ్రూపుల ద్వారా నిత్యం లోన్లు ఇస్తూ మహిళల్ని గుప్పెట్లో పెట్టుకొంటున్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, అమ్మబడి, వృద్ధాప్య పించను, వితంతు పించను, ఒంటరి మహిళా పించనుల పేరుమీద వేలల్లో ఖర్చుపెట్టి, బిలియన్లలో దండుకోవడానికి మహిళలను ఓట్ బ్యాంక్‌గా మార్చుకొంటున్నారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్స్, ఇచ్చిన వాగ్దానాలు మాత్రం ఆర్భాటంగానే మిగిలిపోయాయి.

మహిళలు సాధించుకున్న గృహ హింస చట్టం 498 ఏ, అత్యాచార చట్టాలకు తూట్లు పొడిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాకపల్లి గిరిజనులకు, అయేషా మీరాలకు న్యాయం ఎండమావిగా మారింది. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వలన, అణచివేతల వలన మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా రోజురోజుకూ చితికిపోతున్నారు. అయినా మహిళలు ప్రతిఘటిస్తూనే ఉన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పేరిట భూములు కోల్పోయిన మహిళలు ఉద్యమాలలో ముందు నిలబడి స్వావలంబనకు ప్రతీకలుగా నిలుస్తున్నారు. పితృస్వామ్య, భూస్వామ్య భావజాల వ్యతిరేక పోరాటాలు, సావిత్రీబాయి ఫూలే సంస్కరణోద్యమాల స్ఫూర్తితో మహిళలు ముందుకుపోతున్నారు. ఈ స్థితిలో అంతర్జాతీయ మహిళా దినం స్ఫూర్తితో సంఘటితం కావడం ద్వారా మాత్రమే అనేక హింసలు, అణచివేతల నుండి మహిళలు విముక్తి అవుతారు. కాబట్టి ఈ రోజు సంబురాలు జరుపుకోవడం కాకుండా, పోరాట దినంగా జరుపుకోవడం సమంజసంగా ఉంటుంది.

■ **అనిత**

చైతన్య మహిళా సంఘం

భవ్య భారత నిర్మాతలు

'ఆడపిల్లల తల్లిదండ్రులు తమ కుమార్తె ఇంటి నుంచి బయటికి వెళ్ళుతున్నప్పుడు ఎక్కడకు వెళ్ళుతున్నావు, ఎప్పుడు తిరిగి వస్తావు అని తప్పక అడుగుతుంటారు. అయితే మీ కుమారులను ఎప్పుడైనా ఎక్కడకు వెళ్ళుతున్నారు, ఎందుకు వెళ్ళుతున్నారు? మీ స్నేహితులు ఎవరు? అని అడిగారా? నేరానికి పాల్పడే వ్యక్తి కూడా ఒక తల్లి/ తండ్రి తనయుడే కాదూ?'

2014 చరిత్రాత్మక ఎన్నికల విజయం అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట బురుజు నుంచి జాతి నుద్దేశించి చేసిన తన ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో అన్న మాటలవి. ఆ వివేచనాయుత వాక్కులతో జెండర్ విషయమై ఒక ప్రధాన మూస ఆలోచనను బద్దలు గొట్టారు. సామాజిక మాధ్యమాలలో సమాజంలో, కుటుంబ జీవనంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష గురించి విస్తృత, విపుల చర్చ జరుగుతోంది. ఆ చర్చ గురించి తెలియని, ఆ చర్చలో పాల్గొనలేని అసంఖ్యాక ప్రజలకు ప్రధాని మోదీ పలికిన ఆ మాటలు, జెండర్ న్యాయం గురించి అందిన ఎటువంటి కల్తీలేని, అత్యంత స్వచ్ఛమైన సందేశం.

మహిళల భద్రత, కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదన్నది ఆ సందేశ సారాంశం. ఈ స్ఫూర్తి దాయక ఆలోచనలో, ఆసేతు హి మాచలమూ సమష్టిగా జరుపుకొంటున్న ఒక జాతీయ పర్వదిన వేడుకలలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగాపాలుపంచుకున్నారు. ఇటువంటి న్యాయం, మహిళా సాధికారత దేశానికి ఎంతైనా అవసరం. ఆ న్యాయాన్ని పొందడానికి దేశ ప్రజలు అర్హులైవున్నారు. వారు స్త్రీలు–మనం పురుషులం అనే సంకుచిత భావన నుంచి విముక్తమైన, నిర్దిష్ట శృంఖలాల నుంచి విడి వడ్డ సాధికారతే స్త్రీ పురుష సమానతలకు తావిస్తున్న పరిస్థితులను వ్యతిరేకించడమే కాకుండా, ఆ పరిస్థితులను మార్చే శక్తి సామర్థ్యాలను మహిళలకు సమకూరుస్తుంది.

గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం పాలనాపరంగా పలు చొరవలతో అటువంటి ఉత్కృష్ట మహిళా సాధికారతను మరింతగా సుదృఢపరరుస్తోంది. ఆ విన్నూత్న పురోగతికి గట్టి ఆసరానిస్తోంది. ఈ సాధికారత మహిళా నాయకులు మరింతగా వర్ధిల్లడానికి అవకాశం కల్పిస్తోంది; వివిధ రంగాలలో అసమాన, అనుపమేయ విజయాలు సాధించిన కార్యసాధకురాళ్ళను గుర్తించి గౌరవిస్తోంది, ప్రోత్సహిస్తోంది; జెండర్ న్యాయాన్ని మరింతగా అందించేందుకు యథాతథ పరిస్థితులను బద్దలు గొడుతోంది; మహిళల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి, సాధాకారతకు తగు మార్గాలను సృష్టిస్తోంది; స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షలను రూపుమాపేందుకు తగు విధానాలను రూపొందిస్తోంది.

మహిళా సాధికారత అంటే మహిళల నవజీవనానికి అడ్డుగా ఉన్న పాత అవరోధాలను పూర్తిగా తొలగించగల అవకాశాలను సృష్టించి, కొత్త జీవితాన్ని నిర్మించుకోవడానికి అవసరమైన అత్యుత్తమ సదుపాయాలను సమకూర్చడమే. ఇందులో భాగంగానే జన్ ధన్ యోజన కింద 16 కోట్ల మంది మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థతో అనసంధానించడం జరిగింది. ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్ మిషన్‌తో సహా వివిధ సంక్షేమ పథకాలలో సంఖ్యానేక మహిళలు నేరుగా నగదు బదిలీ మొదలైన ప్రయోజనాలు పొందుతున్నారు. ఈ ప్రయోజనాలన్నిటికీ, బ్యాంకింగ్ వ్యవస్థలో కోట్లాది మహిళలు భాగస్వాములను చేసిన సమ్మిళిత ఆర్థిక విజయమే ప్రధానాధారంగా ఉన్నది. 'ముద్ర' పథకం కింద 7.88 కోట్ల మంది మహిళలు రుణాలు తీసుకుని తాము లబ్ధి పొందడమేగాకుండా, కొత్త ఉద్యోగులను సృష్టించి అనేకానేకమందికి జీవనాధారాలు కల్పించారు. నేడు ఈ మహిళలే నవ భారతదేశ చరిత్రను నిర్మిస్తున్నారు. భారతదేశపు కొత్త ఇతిహాసాన్ని రాస్తున్నారు.

హర్యానాలో 'బేటీ బచావో, బేటీ బడావో' కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇలా అన్నారు: 'ఒక దేశంగా మనం తిరోగమించాము. ఆడపిల్లలు పుట్టడానికి కూడా మనం అనుమతించక పోవడమే ఇందుకు కారణం'. స్త్రీ పురుష నిష్పత్తి హర్యానాతో పాటు దేశవ్యాప్తంగా 104 జిల్లాల్లో చాలా తక్కువగా ఉన్నది. బేటీ బచావో, బేటీ పడావో ప్రారంభమైన తరువాత ఈ 104 జిల్లాల్లోనూ స్త్రీ పురుష నిష్పత్తి గణనీయంగా మెరుగుపడింది.

ఆడపిల్లల కుటుంబ ఆర్థిక అభద్రతకు కారకులనే వైఖరిని రూపుమాపడమే లక్ష్యంగా సుకన్య సమృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టారు. బాలికల ఉన్నత విద్య లేదా వివాహ అవసరాలకు గాను అధిక వడ్డీరేటుతో తల్లితండ్రులు తమ ఆదాయాన్ని పొదుపు చేసుకొనేందుకు ఈ పథకం సహాయపడుతుంది. స్త్రీ పురుష అసమానతల సమస్యలకు విదేశాలనుంచి పరిష్కారాలను దిగుమతి చేసుకోవడానికి బదులుగా దేశీయ/ స్థానిక అవరోధాలను అర్థం చేసుకొని, సహజ వివేకంతో వాటిని తొలగించుకోవడానికి కృషి చేయడం ముఖ్యం. ఇదే జెండర్ న్యాయం దిశగా నిరంతర పురోగతికి దోహదం చేస్తుంది.



సామాజిక దురాగతాలకు బాధితులవుతున్న మహిళలకు న్యాయం జరగనిదే మహిళా సాధికారత సాధ్యం కాదు మరి ఇందుకు మహిళలు బాధితులవుతున్న పాతకాలపు వ్యవస్థలను పూర్తిగా మార్చివేయాలి. యథాతథ పరిస్థితులను బద్దలు గొట్టాలి. ముస్లిం మహిళల అణచివేత సమస్యను ఎదుర్కోవడానికి గతంలో పలు అవకాశాలు వచ్చాయి. అయితే అటువంటి సమస్యల పరిష్కారానికి చేసే ప్రయత్నాలు అంతిమంగా ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకొనేందుకే ఉపయోగపడతాయని షాబానో కేసు ఉదంతం వెల్లడించింది. 2017లో దే శ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ప్రధాన తీర్పులలో ట్రిపుల్ తలాక్ రద్దు ఒకటి. ఈ న్యాయ విజయం నిజంగా ఈ దేశ ముస్లిం మహి ళలదే. న్యాయానికి, జీవిత హుందాకు వారు దశాబ్దాలుగా పోరాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి మద్దతుగా నిలబడింది. మూడు సార్లు తలాక్ అనడం ద్వారా విడాకులు ఇవ్వడాన్ని నేరపూరిత చర్య కావించేందుకు ప్రభుత్వం పార్లమెంటులో ఒక బిల్లును ప్రవేశపెట్టింది. అయితే ప్రతిపక్షం ఆ బిల్లు చట్టం కాకుండా అడ్డుకొంటోంది.

మన తోటి మానవులైన ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ రైట్స్ బిల్ (2016) ను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఆ తరహా మనుషులపై సమాజ ఉదాసీనతను, వారు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపి, విద్యా ఉద్యోగాలు, ఆరోగ్యభద్రతా సదుపాయాలను వారికి అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఆ బిల్లును రూపొందించడం జరిగింది.

మహిళల వ్యక్తిగత ఆకాంక్షలను మరింత ముందుకు తీసుకు వెళ్ళి, దేశ పురోభివృద్ధి చరిత్రలో వారు స్వతసిద్ధ భాగంగా చేసేందుకు ప్రభుత్వం నిబద్ధమయింది. నిజానికి అభివృద్ధి ప్రక్రియలో మహిళలు సమాన భాగ స్వాములుకానంతవరకు ఎటువంటి అభివృద్ధి సుసాధ్యంకాదు.

నేడు మహిళలు రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలకు నేతృత్వం వహిస్తున్నారు. తమ జెండర్ తమ శక్తి సామర్థ్యాలను ఏ విధంగాను పరిమితం చేయదని లక్షలాది యువతులు విశ్వసిస్తున్నారు, నిరూపిస్తున్నారు. నేడు వంట చెరకు కోసం మహిళలు గంటల తరబడి నడవవాలసిన అవసరం లేదు. వంట చేసేందుకు కళ్ళలోను, ఊపిరితిత్తులలోను పొగతో కూర్చొండవలసిన అవసరం లేదు.

నేడు దేశవ్యాప్తంగా గ్రామాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం అమలులో మహిళలే అగ్రగాములుగా ఉన్నారు. ప్రధాని మోదీ ఆలోచన అయిన ఆ కార్యక్రమానికి వారే నాయకత్వం వహిస్తున్నారు. బహిరంగ మలవిసర్జన అవమాన భారాన్ని మోయవలసి వస్తుంది వారే కదా. నేడు మహిళలు కుటుంబ వ్యవహారాలను నిర్వహించుకోవడమే కాదు సొంత వ్యాపార సంస్థలను ప్రారంభించి విజయవంతంగా నడుపుతున్నారు. నవ భారతదేశ ఆకాంక్షలను నిర్వచిస్తున్నారు. మాతృత్వం, ఆర్థిక భద్రతల మధ్య ఒకదాన్ని ఎంచుకోవాల్సిన క్లిష్ట పరిస్థితి మహిళలకు లేదు. ఈ విషయంలో వారికి మాతృత్వ ప్రయోజనాల చట్టం విశేషంగా తోడ్పడుతోంది. ప్రసూతి మరణాల తగ్గుదలలో, స్త్రీపురుష నిష్పత్తి మెరుగుదలలో, పొగరహిత వంటిళ్ళలో, బాలికలకు ప్రపత్యేక టాయ్‌లెట్‌లు ఉన్న పాఠశాల ప్రాంగణాలలో, మహిళలు ఏర్పాటు చేసుకొంటున్న సొంత దుకాణాలలో– నూతన భారతదేశాన్ని నిర్వచిస్తున్న మహిళా సాధికారత కొత్త కథను మనం చూస్తున్నాము.

ప్రసూతి మరణాల తగ్గుదలలో, స్త్రీపురుష నిష్పత్తి మెరుగుదలలో, పొగరహిత వంటిళ్ళలో, బాలికలకు ప్రత్యేక టాయ్‌లెట్‌లు ఉన్న పాఠశాల ప్రాంగణాలలో, మహిళలు ఏర్పాటు చేసుకొంటున్న సొంత దుకాణాలలో – నూతన భారతదేశాన్ని నిర్వచిస్తున్న మహిళా సాధికారత కొత్త కథను మనం చూస్తున్నాము.



■ నిర్మలా సీతారామన్

(వ్యాసకర్త భారత రక్షణమంత్రి)


భాషా సంస్కృతులను ప్రేమించిన మహర్షి

జయేంద్ర సరస్వతి పుట్టుకరీత్యా తమిళుడైనప్పటికీ, చక్కని తెలుగులో మాట్లాడారు. అంతేకాదు, తెలుగువారి స్వంతమైన అవధాన ప్రక్రియ గురించీ, రంగవల్లులు తీర్చే ఆచారం గురించీ ప్రస్తుతిస్తూ ఇలాంటి విద్యలను ప్రోత్సహించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మన చరిత్ర, కళలు, సంగీతం, జానపద కళారూపాలను బతికించుకోవాలని, అవి అంతరించిపోతే మన సంస్కృతి అంతరించిపోయినట్లవుతుందనీ అభిభాషించారు. భాషా సంస్కృతులను అమితంగా అభిమానించిన ఒక మహర్షిగా ఆయన ఆ సమయంలో మాకు కనిపించారు.

ఆధ్యాత్మికమూర్తుల్లో సామాజిక దృష్టి చాలా అరుదుగా కనిపిస్తుంది. జయేంద్ర సరస్వతి స్వామి మానవసేవను ఆచరణలో చూపించిన మాధవ సేవకుడు. కంచి కామకోటి పీఠం అధిపతిగా స్వామి వచ్చాక విద్య, వైద్యరంగాల్లో నిర్వహించిన కార్యక్రమాలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయి. ఎన్నో పాఠశాలలు, ఆసుపత్రులను నెలకొల్పి పేదలకు విద్య, ఆరోగ్య ప్రదానం చేస్తున్న తీరు అచ్చెరువు కలిగిస్తుంది. శంకర నేత్రాలయ, పిల్లల ఆసుపత్రి, హిందూ మిషన్ ఆసుపత్రి, తమిళనాడు ఆసుపత్రులను జయేంద్ర తన ఆధ్వర్యంలో స్థాపించారు. ఎన్నో విద్యాలయాలను నెలకొల్పి ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్నారు. అచ్చమైన జాతీయ సమైక్యతావాది ఆయన. పరమత సహనం, కులమతాలకు అతీతమైన వ్యక్తిత్వం ఆయనను మహనీయుడిగా నిలబెట్టాయి. వారు సిద్ధిపొందారని వినగానే మహమ్మదీయులు సంతాప సూచకంగా ప్రార్థనలు చేశారంటే స్వామి ఉన్నతి ఎంతటిదో వెల్లడి అవుతోంది. అన్ని మతాలూ చెప్పేది ఒకటేననీ, అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలన్న లక్ష్యం స్వామి వారిది.

అనేక సందర్భాలలో నేను స్వామి వారి దర్శనం చేసుకోగలిగినప్పటికీ, 2016కృష్ణా పుష్కరాల సమయంలో వారితో సన్నిహితంగా గడిపే భాగ్యం నాకు కలిగింది. పుష్కరాల సమయంలో అవనిగడ్డకు విచ్చేయవలసిందిగానూ, సాగర సంగమం, హంసలదీవి సందర్శించవలసిందిగానూ స్వామివార్లిద్దరినీ నేను ఆహ్వానించాను. అనారోగ్యాన్ని కూడా పక్కనపెట్టి జయేంద్రసరస్వతి మోపిదేవి వచ్చి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సందర్శించుకున్నారు. పుష్కరాల సమయంలో ప్రతి రోజూ నదీస్నానం, చాతుర్మాస దీక్షల కారణంగా విజయవాడలో ఆయన తీవ్ర అస్వస్థులు కావటంతో ప్రతి ఒక్కరమూ ఆందోళనకు గురయ్యాం. కానీ, ఆయన సంకల్ప బలమూ, మనో నిబ్బరం త్వరగా కోలుకొనేలా చేశాయి. అక్టోబర్ 4న విజయవాడ కంచిమఠంలో బసచేసివున్న సమయంలో వారి పిలుపు మీద వెళ్ళి స్వామి వార్లని కలిశాను. నాతోపాటుగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు దీర్ఘాసి విజయభాస్కర్ రాష్ట్రంలో భాషా సంస్కృతుల వికాసానికి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. స్వామీజీలు ప్రతీ విషయాన్ని ఆధ్యాత్మిక దృష్టితోనే చూస్తారనేది అపోహేనని ఆరోజు స్వామివారితో మాట్లాడినప్పుడు అర్థం అయ్యింది. ఆయన అంతా విని, తన సంతోషాన్ని ప్రకటిస్తూనే మూడు సూచనలు చేశారు. భాషా సంస్కృతుల గురించిన పరిజ్ఞానాన్ని ముఖ్యంగా వృత్తి విద్యలైన ఇంజనీరింగ్, వైద్యం, ఎం.బి.ఏ లాంటి కోర్సులవారికి కూడా బోధించాలి. ఏదో కాలక్షేపం కోసం కాక, మనకు వృత్తిపరమైన సాహితీవేత్తలు, వృత్తిపరమైన కళాకారులు తయారయ్యే విధంగా చూడాలి. రైతులు, శ్రామికులు, ఇతర వృత్తుల వారికి భాషా సంస్కృతులను పరిచయం చేయాలి అనేవి వారు చేసిన సూచనలు. నిజానికి వారు ప్రస్తావించిన ఈ మూడు అంశాల మీద మనం గట్టి దృష్టి పెట్టకపోవటం అనేది భాషోద్యమపరంగా ముఖ్యమైన లోపమే!

భాషా సంస్కృతుల పరివ్యాప్తికి అనేక పరిచయ కోర్సులను ప్రారంభించవలసిన అవసరం గురించి చెబుతూ, ఈ కోర్సులు వివిధ స్థాయిల్లో ఉండేలా చూడాలన్నారు. ఈ పరిచయ పాఠాలు ఏడు అంశాలు ఉండాలంటూ ఇలా సూచించారు. 1. ఆహార పరిచయం: మన జీవన ప్రమాణాలు నాణ్యమైనవిగా ఉండటానికి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆహారం గురించిన అవగాహన కల్పించాలి. సమస్త వ్యాధులకూ ఆహారమే ప్రధాన కారణంగా మారుతున్న ఈ రోజుల్లో మన ఆహార సంస్కృతిని, ఆహారంలో స్వచ్ఛతనీ, నాణ్యతనీ ప్రజలకు సుబోధకం చేయాలన్నారు. 2. నాద పరిచయం: ప్రతీ వ్యక్తికీ కర్ణాటక తదితర సంగీత శాస్త్ర విద్యలలో కనీస పరిజ్ఞానం కలిగేలా చూడాలి. సంగీత సాహిత్యాలు కేవలం చదువుకున్నవారికి మాత్రమే పరిమితమైన విద్యలుగా ఉండకూడదు. నాదస్వరం లాంటి విద్యల్ని కొందరు నిమ్న వర్ణాలవారు మాత్రమే పోషిస్తూ కాపాడుకుంటూ వస్తున్నారనీ, వాటి పరిరక్షణ గురించి పట్టించుకోకపోతే ఆ విద్యలు, ఆయా వాయిద్య పరికరాలు త్వరలోనే అంతరించి పోగలవనీ అన్నారు. కంచి మఠం పక్షాన నాదస్వరం పై ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్న సంగతిని వారు ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సంగీత కళాశాలల్లో నాదస్వరాన్ని కూడా నేర్పిస్తున్నట్టు మేము చెప్పగానే సంతోషించారు. మంగళవాద్యాలు భారతీయ సంస్కృతితో ముడిపడి ఉన్నవి, వాటిని పరిరక్షించుకోవటం మన బాధ్యత అన్నారాయన. 3. వాస్తు పరిచయం: గృహ నిర్మాణానికి సంబంధించిన పరిచయం కూడా ప్రతి ఒక్కరికీ కలిగించాలి. గాలి, వెలుతురూ ధారాళంగా ఉండేలా, స్వచ్ఛమైన పరిసరాలలో స్వచ్ఛజీవనానికి అనుకూలంగా గృహనిర్మాణం ఉండటం గురించి సామాన్యుడికి కూడా అవగాహన కలగ చేయాల్సిన అవసరం ఉందన్నారు. 4. సాహిత్య పరిచయం: వ్యక్తిత్వ వికాసం కలగాలంటే ప్రతీవ్యక్తికీ తెలుగు సాహిత్యంతో కనీస పరిజ్ఞానం ఉండేలా చూడాలి. రామాయణ భారత భాగవతాలతోపాటు, మన జీవితాలను నాణ్యమైనవిగా మలచుకోవటానికి తోడ్పడే ఉత్తమ సాహిత్యం ప్రజలకు అందాలనీ, చదవటం అనే అలవాటుని పెంపొందింపచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలనీ సూచించారు. 5. సంస్కృతి పరిచయం: మనం మన మాతృభాషను, మాతృసంస్కృతినీ మరచిపోతే జాతి సంస్కృతి హీనమై పోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. భాషనీ సంస్కృతినీ చిన్ననాటినుండే ప్రతీవ్యక్తికి పరిచయం చెయ్యాలన్నారు. 6. శిల్పశాస్త్ర పరిచయం: శిల్పం, చిత్రకళలు ఇతర లలిత కళలతో కూడా ప్రతీ ఒక్కరికీ కనీస పరిచయం ఉండేలా చూడాలన్నారు. కంచి మఠంలో చిత్రకళకు సంబంధించి శిక్షణాశిబిరాలను నిర్వహించినట్టు స్వామివారు తెలియచేశారు. 7. ఆగమశాస్త్ర పరిచయం: గుడిగోపురాలు, దైవసంబంధమైన అంశాల గురించికూడా ప్రజలందరికీ అవగాహన ఉండాలి. అపోహలకు ఆస్కారం లేని రీతిలో దేవాలయాల పనితీరు ఉండాలన్నారాయన. ప్రతీ ఒక్కరికీ ఈ ఏడు అంశాలమీద కనీస అవగాహన ఉన్నప్పుడు వ్యక్తి ఉన్నత మనస్కుడిగా ఎదుగుతాడనీ, పౌరులంతా ఉన్నతులైనప్పుడు సమాజం, దేశం కూడా ఉన్నతమైనదిగా రూపొందుతుందనీ స్వామివారి సూచన. మనుషుల్లో కర్కశత్వం నశించి దాని స్థానంలో కరుణ, దయ చోటుచేసుకోవటానికి ఈ ఏడంశాలూ ఉపకరిస్తాయని అన్నారు స్వామి. 'అందరికీ ఆయుర్వేద మార్గం'లో ప్రతీ ఒక్కరికీ గృహ వైద్యం గురించిన అవగాహన కలిగించటం వలన చాలావ్యాధులు పుట్టకముందే నివారించుకోవచ్చని స్వామి అన్నారు. ఆరోగ్యవంతమైన, స్వచ్ఛమైన, నాణ్యమైన జీవనవిధానం మనుషులందరికీ కలగాలనేది వారి అభిభాషణ.



ఉత్తరాదిలో శక్తి ఉంది, దక్షిణాదిలో మేధాశక్తి ఉంది. ఈ రెండింటి సమన్వయంగా మనం జాతిని అభివృద్ధి చేయాలన్న స్వామి వారి మాటలు గొప్పవి. ఆధ్యాత్మిక మూర్తులు లోకకళ్యాణమే ధ్యేయంగా ఆలోచనలు సాగిస్తారనటానికి జయేంద్రసరస్వతి స్వామివారి ఈ సూచనలే తార్కాణం. వేదము, నాదము, ఆహారము, ఆరోగ్యము లాంటి అంశాలలో ప్రజలను భాగస్వాములను చేయాలనేది స్వామి ఆలోచన. వారు పుట్టుకరీత్యా తమిళుడైనప్పటికీ, చక్కని తెలుగులో మాట్లాడారు. అంతేకాదు, తెలుగువారి స్వంతమైన అవధాన ప్రక్రియ గురించీ, ఇంటిముందు రంగవల్లులు తీర్చే తెలుగువారి ఆచారం గురించీ ప్రస్తుతిస్తూ ఇలాంటి విద్యలను బాగా ప్రోత్సహించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'తోలుబొమ్మలాట' లాంటి కళారూపాలను పరిరక్షించవలసిందిగా సూచించారు. అన్ని రకాల మొక్కల పెంపకాన్నీ చేపట్టాలని హితవు చెప్పారు.

మన చరిత్ర, కళలు, సంగీతం, గ్రామీణ, జానపద కళారూపాలను మనమే బతికించుకోవాలని, అవి అంతరించిపోతే మన సంస్కృతి అంతరించిపోయినట్లవుతుందనీ అభిభాషించారు. భాషా సంస్కృతులను అమితంగా అభిమానించిన ఒక మహర్షిగా ఆయన ఆ సమయంలో మాకు కనిపించారు. ఒక ఆధ్యాత్మికమూర్తితో గాక, ఒక భాషావేత్తతో సంభాషిస్తున్న అనుభూతిని పొందగలిగాము. ఈ యేడాది ఫిబ్రవరి 2న కంచి వెళ్లినప్పుడు స్వామివారిని దర్శించి ఆశీస్సులు తీసుకున్నాను. ఇంతలోనే వారు శివైక్యం చెందుతారని ఊహించలేదు. వారి చివరి దర్శనం నాకు అదే అయినది.

■ **డా. మండలి బుద్ధప్రసాద్**

ఉపసభాపతి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ

పుస్తెలు కుదపెట్టి సాగు చేశాం

- నీటిని వదిలి పంటలను కాపాడండి
- కలెక్టర్‌కు యాదాద్రి జిల్లా రైతుల విజ్ఞప్తి



కలెక్టర్‌తో తమ గోడు వెళ్లబుచ్చుతున్న రైతులు

యాదాద్రి,మార్చి 7 (ఆంధ్రజ్యోతి): "అమ్మా.. కలెక్టరమ్మా.. పుస్తెల తాడు తాకట్టుపెట్టి సాగు చేశాం.. నీరులేక పంటలు ఎండిపోతున్నాయి.. నీటిని వదలి మా పంటలను కాపాడి మమ్మల్ని కనికరించండి" ఇదీ యాదాద్రి భువనగిరి జిల్లాలోని మూసీ ఆయకట్టు కింద పంటలు సాగుచేసే మహిళా రైతుల ఆవేదన. యాదాద్రి జిల్లాలోని మూసీ, బునాదిగాని కాల్వకు క్రాప్ హాలిడే ఎత్తివేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బుధవారం భువనగిరి మండలంలోని పలు గ్రామాల రైతులు జిల్లా నీటి పారుదల కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడ గంటపాటు ధర్నా చేసి, అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ధర్నా చేస్తున్న రైతులతో కలెక్టర్ అనితారామచంద్రన్ చర్చించారు. నీటి విడుదలపై ఉన్నతాధికారులతో చర్చించి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీఓ 577ను సవరించాలి

- ఆలయ అర్చక, ఉద్యోగులకు ఒకే వేతనం ఉండాలి
- సీఎం ఆదేశాలు అమలు చేయకుంటే ఐక్య ఉద్యమం
- రాష్ట్ర ఆలయ అర్చక ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ భానుమూర్తి



ముషీరాబాద్/హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీఓ 577ను సవరిస్తూ దేవాలయాలకు సంబంధం లేకుండా ఆలయ, అర్చక ఉద్యోగులకు ఒకే వేతన విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ఆలయ అర్చక, ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ గంగు భానుమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం భోలక్‌పూర్‌లోని భవానీ శంకర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆలయ అర్చక, ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో భానుమూర్తి ప్రసంగించారు. తమ డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి గతేడాది డిసెంబర్ నుంచి అందరికీ ఒకే వేతన విధానాన్ని అమలు అయ్యేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 5,535 మంది అర్చక, ఉద్యోగులు ఉంటే.. అందులో కేవలం 788 మందికి మాత్రమే సవరించిన జీవో ప్రకారం వేతనాలు వస్తున్నాయని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు వేతనాలు ఇవ్వాలని, లేని పక్షంలో ఐక్యంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాండూరి కృష్ణమాచారి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఆలయ, అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఇంటర్ సంస్కృతం 'స్పాట్' బహిష్కరణ

- హన్మకొండ, ఖమ్మంలో నిరసనలు

కేయూ క్యాంపస్/ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 7: ఇంటర్‌లో సంస్కృతం సబ్జెక్టును యాథావిధిగా కొనసాగించాలని సంస్కృతం భాష పరిరక్షణ సమితి జిల్లా నేతలు డిమాండ్ చేశారు. బుధవారం వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో చేపట్టిన సంస్కృతం స్పాట్ క్యాంపు వద్ద అధ్యాపకులు నిరసన చేపట్టారు. స్పాట్ క్యాంప్ ఆఫీసర్, భూపాలపల్లి ఇన్‌చార్జి డీఐఈవో , మహబూబాబాద్ జిల్లా డీఐఈవో షేక్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకొంత కాలంగా ప్రభుత్వం ఒకటవ తరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు తప్పనిసరిగా తెలుగును చదవాల్సిందేనని ప్రకటించడంతో సంస్కృత అధ్యాపకుల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. సంస్కృత అధ్యాపకుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సంస్కృతం సబ్జెక్టును యాథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన ఇంటర్ సంస్కృతం స్పాట్ వాల్యుయేషన్‌ను అధ్యాపకులు బహిష్కరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఐఈవో భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు.

కస్తూర్బా విద్యార్థుల ఆందోళన

- స్పృహ తప్పి పడిపోయిన 8మంది విద్యార్థినులు



స్పృహ తప్పిన విద్యార్థినులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

తాండూర్, మార్చి 7: మంచిర్యాల జిల్లా తాండూర్ కస్తూర్బా పాఠశాలలో మెనూ పాటించడం లేదని 8, 9వ తరగతులకు చెందిన విద్యార్థినులు మంగళవారం రాత్రి భోజనం, బుధవారం టిఫిన్, భోజనం చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. బుధవారంపాఠశాల ముందు ఉన్న రహదారిపై ధర్నాకు దిగారు. ఆందోళనకు దిగిన విద్యార్థుల్లో 8మంది అస్వస్థతకు గురై వాంతులు చేసుకొని పడిపోయారు. వెంటనే సిబ్బంది వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉంది. కాగా, సమస్యలను పరిష్కరిస్తామని విద్యార్థినులకు నచ్చజెప్పి ఎంఈఓ మధ్యాహ్నం భోజనం తినిపించారు. ఇన్‌ఛార్జి డీఈఓ సురేష్‌బాబు, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కస్తూర్బా పాఠశాలల సెక్టోరియల్ అధికారి పద్మజ తదితరులు పాఠశాలకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, వారం రోజులుగా ఒకే రకమైన వంటలు చేస్తున్నారని, ఎస్ఓ, ఉపాధ్యాయురాలు తమను వేధిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఎమ్మెల్యే చిన్నయ్య వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రవికి పునర్జన్మ

- కోలుకుంటున్న హార్బన్ ఫిమర్ బాధితుడు

భద్రాచలం, మార్చి 7: హార్బన్ ఫిమర్ వ్యాధితో బాధపడుతున్న రవికి హైదరాబాద్ బసవతారకం ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం అతడు ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కొర్రాజుల గుట్టకు చెందిన మామిడాల రవి హార్బన్ ఫిమర్ అనే అరుదైన కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతడి పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సబ్ కలెక్టర్ పమెలా సత్పథి అతణ్ణి హైదరాబాద్ బసవతారకం ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజుల చికిత్స తర్వాత అతడికి శస్త్రచికిత్స నిర్వహించారు. కాగా, ఓ ప్రైవేట్ చానల్‌లో ప్రముఖ సినీనటి మంచు లక్ష్మి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'మేముసైతం' కార్యక్రమం ద్వారా సేకరించిన నగదును రవికి అందజేయనున్నారు.

ధర లేక చెరుకు రైతు కుదేలు

- రాష్ట్రంలో పెరిగిన దిగుబడి
- ధర నిర్ణయంలో మిలర్ల ఇష్టారాజ్యం
- పట్టింపేలేని అధికారులు



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక చెరుకు రైతులు కుదేలవుతున్నారు. రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే.. ఈ సారి 9 లక్షల మెట్రిక్ టన్నుల మేర అదనపు దిగుబడి వచ్చినా.. చక్కెర మిల్లుల యాజమాన్యాల తీరుతో పంటపై పెట్టుబడి సైతం వచ్చే సూచనలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేయాల్సినఅధికారులు రాష్ట్ర రాజధానికే పరిమితమవుతుండడం తమ పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో గత ఏడాది 11.37 లక్షల మెట్రిక్ టన్నుల మేర చెరుకు దిగుబడులు రాగా.. ఈ సారి 20.41 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుంది. మిల్లర్లు టన్నుకు రూ. 2,750 ధర చెల్లిస్తున్నారు. ఒక టన్ను చెరుకు ఉత్పత్తికి రూ. 3 వేల వరకు ఖర్చవుతోందని, కనీసం రూ. 3,150 ధర లేకుంటే.. రైతులు నష్టపోవాల్సి ఉంటుందని జహీరాబాద్ చెరుకు రైతు సమాఖ్య ప్రతినిధులు చెబుతున్నారు. గతంలో ప్రభుత్వం టన్నుకు రూ. 60 చొప్పున మిల్లర్ల నుంచి పన్ను వసూలు చేసేది. అది రైతులకు భారంగా మారుతుండడంతో.. ఆ పన్నును చెరుకు అమ్మిన రైతులకే ఇవ్వాలని పేర్కొంది. క్షేత్ర స్థాయిలో మాత్రం రైతుకు ఆ మొత్తం దక్కడం లేదు. కొన్నేళ్లుగా మిల్లర్లు రైతులకు రూ., 140 కోట్ల మేర బకాయి పడ్డారని దానిని వసూలు చేయటంలో రైతులు ఆరోపిస్తున్నారు.

సిరిసిల్లలో నేత కార్మికుడి ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో రైతు మృతి

సిరిసిల్ల క్రైం/పెన్‌పహాడ్, మార్చి7: సిరిసిల్లలోని వెంకంపేటకు చెందిన గాజంగి సాయికుమార్ (24) అనే పవర్ లూం కార్మికుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నేత కార్మికుడైన సాయికుమార్ తన చెల్లెలి పెళ్లి కోసం రూ.2 లక్షల అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు ఓ యజమాని వద్ద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయినప్పటికీ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో మనస్తాపం చెంది ఉరేసుకున్నాడు. కాగా, సాయికుమార్ తండ్రి ప్రభాకర్ కూడా అప్పుల భారంతో ఐదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. మరోవైపు విద్యుదాఘాతంతో సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన దూబని నాగయ్య(27) చనిపోయాడు. బుధవారం పొలానికి నీరు పెట్టేందుకు నాగయ్య వెళ్లే సరికి మోటారు ఆన్ చేసి ఉంది. దీంతో దగ్గరికి వెళ్లి, మోటారును పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్..

అర్ధరాత్రి వీడిన హత్యల మిస్టరీ!

- బాసరలో తండ్రీ కొడుకును హత్య చేసింది వంట మనిషే..!
- సీసీ ఫుటేజీ పరిశీలనలో వెలుగు చూసిన వాస్తవాలు
- పరారీలో నిందితుడు

బాసర, మార్చి 7: నిర్మల్ జిల్లా బాసరలో జరిగిన తండ్రీ కొడుకు హత్యల కేసులో మిస్టరీ వీడింది. మొదట్లో వీరిని హత్య చేసింది పార్థీ ముఠా సభ్యులు అని అనుమానించిన పోలీసులు.. కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ ప్రారంభించారు. అదే సమయంలో నిజామాబాద్ జిల్లా నవీపేటలో చోరీ కావడం.. సీసీ కెమెరాల్లో ముసుగు ధరించిన దొంగలు స్ప్రే పట్టుకుని తిరుగుతుండడంతో.. ఇటు నిజామాబాద్, అటు నిర్మల్ జిల్లా పోలీసులు ఈ వరుస ఘటనలను సీరియస్‌గా తీసుకున్నారు. చివరకు గంటల వ్యవధిలోనే.. బుధవారం అర్ధరాత్రి 12.35గంటలకు కేసును ఛేదించారు! అదే హోటల్‌లో పనిచేసే వంటమనిషే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు తేలింది. సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలను పోలీసులు పరిశీలించడంతో ఈ విషయం వెలుగు చూసింది. తెలిసిన సమాచారం ప్రకారం.. హోటల్‌లోని వర్కర్లతో మృతుడు రితీష్ మంగళవారం రాత్రి 11గంటల వరకు మద్యం తాగి పడుకున్నాడు. బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అందులో వంట మనిషిగా పనిచేసే నేపాల్‌కు చెందిన వ్యక్తి కూరగాయల కత్తితో మొదట గోపి నాయక్‌ను తర్వాత కుమారుడు రితీష్‌ను హతమార్చాడు. దుస్తులపై రక్తం పడడంతో వాటిని బకెట్లోవేసి స్నానం చేసి ఇతర దుస్తులను ధరించి బయటకు వచ్చాడు. ఉదయం 8గంటల ప్రాంతంలో బయట ఇద్దరు హోటల్ వర్కర్లు ఉండడంతో ఒకరిని టిఫిన్ కోసం మరొకరిని ఇతర పనికి పంపించి నిందితుడు పరారైనట్లు సమాచారం. అయితే హత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. కాగా, రెండురోజుల క్రితమే ముంబైలో పనిచేస్తున్న వంట మనిషిని రితీష్ పనిలో పెట్టుకున్నట్లు హోటల్ వర్కర్లు చెబుతున్నా రు. అయితే పోలీసులు ఈ విషయాలన్నింటినీ ధ్రువీకరించాల్సి ఉంది.

ఇంటర్‌లో 49 మాల్ ప్రాక్టీస్ కేసులు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల్లో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 49 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు బోర్డు అధికారులు తెలిపారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 13 మంది మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారని వివరించారు. యాదాద్రి జిల్లాలో 7 కేసులు నమోదయ్యాయి.

'భార్గవి' హంతకుల్ని శిక్షించాలి

- హోంమంత్రికి విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వంచించి భార్గవిని అత్యంత దారుణంగా హతమార్చిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డికి రజక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సచివాలయంలో హోంమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలం బుజలాపురంలో భార్గవి అనే యువతి హత్యకు గురైన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 10 లక్షల పరిహారం, ఐదెకరాల భూమి ఇవ్వాలని సంఘం విజ్ఞప్తి చేసింది.

రేవంత్ దిష్టిబొమ్మ దహనం

నిర్మల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవంత్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన విమర్శలకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. నిర్మల్‌లోని మయూరి హోటల్ వద్ద ప్రధాన రహదారిపై రేవంత్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేశారు. తమ నాయకులపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫారం - సి

(ప్రకటన)

(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10 ఎ మినహాయింపు గలదు)

(నిబంధన 6/12 చూడండి)

తెలంగాణ ప్రభుత్వము

రెవిన్యూ (భూ.సే) శాఖ

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. ఎ/3107/2017 తేది. 02.12.2017

నెం. బి/85/2017, తేది. 25.11.2017

గెజిట్ 118/2017 తేది. 02.12.2017

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, లింగోజిగూడెం గ్రామములో విస్తీర్ణం ఎ.3.20½ గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా పిల్లాయిపల్లి కాలువ నిమిత్తం సదరు భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది.

ప్రభుత్వం ఉత్తర్వుల నెం.108, ఇరిగేషన్ శాఖ (యల్. ఎ. ఆర్ అండ్ ఆర్/ఎ2), తేది: 31.10.2017 ద్వారా పిల్లాయిపల్లి కాలువ నిమిత్తం, భూసేకరణ, నష్టపరిహారం, మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన, (పారదర్శకత మరియు నాయ్యబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013 లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ అంచనా), చాప్టర్-III (ఆహారభద్రత పథకము) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

కావున, పైన తెలిపిన ప్రాజెక్ట్ నిర్మాణమునకు యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, లింగోజిగూడెం గ్రామములో భూముల విస్తీర్ణం ఎ.3.20½ గుంటల నిర్ధిష్ట కొలతలు, దిగువ వివరాలతోయున్న భూములు భూసేకరణ చేయుటకు ప్రతిపాదించనైనది.

గ్రామము : లింగోజిగూడెం మండలం : చౌటుప్పల్ జిల్లా : యాదాద్రి భువనగిరి

క్రమ సంఖ్య	సర్వే నెం.	హక్కు విధము	భూమి విధము	భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ. గుం॥లు	భూమి పట్టేదారు/ అనుభవదారు/ ఆసక్తిదారు పేరు మరియు తండ్రి పేరు చిరునామ	సరిహద్దులు (సర్వే నెం.)				నిర్మాణములు/ వృక్షములు/ మరియు ఇతరములు (సంఖ్య మరియు రకముతో సహా)
						ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1	2	3	4	5	6	7	8	9	10	11
1	77	పట్టా	ఖుష్కి	0.03	సయ్యద్ ఇస్మాయిల్,తండ్రి ఇమాం	79, గ్రామ సరిహద్దు	78, గ్రామ సరిహద్దు	గ్రామ సరిహద్దు	77	--
2		పట్టా	ఖుష్కి	0.03	సయ్యద్ అబ్బాస్, తండ్రి ఇమాం					
3	79	భూదాన్ పట్టా	ఖుష్కి	0.30	దోనూరి ముత్తిరెడ్డి, తండ్రి మసిరెడ్డి	80, గ్రామ సరిహద్దు	77, గ్రామ సరిహద్దు	గ్రామ సరిహద్దు	79	--
4		భూదాన్ పట్టా	ఖుష్కి	0.17	దోనూరి వెంకట్‌రెడ్డి, తండ్రి మసిరెడ్డి					
5	80	ప్రభుత్వ	ఖుష్కి	0.03¼	ఊదరి నర్సింహా, తండ్రి యల్లయ్య	82, గ్రామ సరిహద్దు	79, గ్రామ సరిహద్దు	గ్రామ సరిహద్దు	80	--
5		ప్రభుత్వ	ఖుష్కి	0.03¼	బండమీది లచ్చయ్య, తండ్రి మల్లయ్య					
6	82	ఇనాం పట్టా	ఖుష్కి	0.14	పోలేపల్లి యాదయ్య, తండ్రి మైసయ్య	84, గ్రామ సరిహద్దు	80, గ్రామ సరిహద్దు	గ్రామ సరిహద్దు	82	--
7		ఇనాం పట్టా	ఖుష్కి	0.14	పోలేపల్లి ముత్తయ్య, తండ్రి తిరుపతయ్య					
8	84	పట్టా	ఖుష్కి	0.21	పర్నె రవీందర్‌రెడ్డి, తండ్రి బీమారెడ్డి	89, గ్రామ సరిహద్దు	82, గ్రామ సరిహద్దు	గ్రామ సరిహద్దు	84	--
9		పట్టా	ఖుష్కి	0.03½	రామనగోని అంజయ్య, తండ్రి ఆగయ్య					
10		పట్టా	ఖుష్కి	0.03	రామనగోని నర్సింహ్మా, తండ్రి ఆగయ్య					--
10		పట్టా	ఖుష్కి	0.03	రామనగోని నర్సింహ్మా, తండ్రి ఆగయ్య					--
11		పట్టా	ఖుష్కి	0.03	రామనగోని అండాలు భర్త, రాములు					--
12		పట్టా	ఖుష్కి	0.03	పర్నె జయమ్మ, భర్త భూషిరెడ్డి					--
13		పట్టా	ఖుష్కి	0.04	కొప్పుల జనార్ధన్‌రెడ్డి, తండ్రి లింగయ్య					--
14		పట్టా	ఖుష్కి	0.04½	పర్నె జయమ్మ, భర్త భూషిరెడ్డి					--
15		పట్టా	ఖుష్కి	0.07	కొప్పుల జనార్ధన్‌రెడ్డి, తండ్రి లింగయ్య					--
16	89	పట్టా	ఖుష్కి	0.04	ఆకుల గంగాధర్, తండ్రి సత్యనారాయణ	89	84	గ్రామసరిహద్దు	89	--

మొత్తము 3.20½

ఈ ప్రకటన భూసేకరణ, నష్టపరిహారం, మరియు పునరావాస మరియు పునరుపాది కల్పన, (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) కు సవరించబడిన తెలంగాణ చట్టం భూసేకరణ, నష్టపరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన (సవరణ తెలంగాణ చట్టం-2016) (చట్టం 21/2017) లోని సెక్షన్-11(1)లో గల అంశాల ప్రకారం ఎవరికి సంబంధించిన వారికి చెందును.

సదరు భూములకు సంబంధించిన నక్షను జిల్లా కలెక్టరు, యాదాద్రి భువనగిరి గారి కార్యాలయము నందు ఉంచడమైనది. వాటిని ఏ పని దినములలో పనివేళలయందు తనఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము కలెక్టరు మరియు ప్రభుత్వ ఆదేశాల అనుసారము నియమించబడిన ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) మరియు అతను/అమె సిబ్బందిని, సదరు భూసేకరణ చేపట్టే భూమిని సర్వే చేసి భూమి మట్టము తెలిసికొనుటకు/ భూమిని త్రవ్వటానికి, బోర్లు వేయడానికి, కేటాయించిన పనులను అమలు చేయుటకు, కావలసిన పనులకు నిర్వహించు నిమిత్తము ఇందుమూలముగా అధికారము ఇచ్చినారు. సదరు చట్టం సెక్షన్ 12లో పొందుపర్చినారు.

ప్రకటన ప్రచురించిన తేది నుంచి (కలెక్టరు గారి నుంచి) ముందస్తు అనుమతి లేకుండా సదరు భూములపై ఎవ్వరూ ఎలాంటి వ్యవహారాలు అనగా అమ్మకం/కొనుగోలు మొదలయినవి లేదా సదరు భూములపై ఎలాంటి తాకట్టు చేయడం లాంటి పనులుచేయరాదని సదరు చట్టములోని సెక్షన్ 11(4) క్రింద తెలుపడమైనది.

ఆసక్తి గల వ్యక్తుల నుంచి ఈ భూసేకరణ పై ఎలాంటి అభ్యంతరాలు మరియు అక్షేపణలు ఉన్నచో లేదా నష్టపరిహార సంప్రదింపుల ద్వారా పరిష్కారంలలో బాధితులన్నచో సదరు వ్యక్తులు ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 60 (అరవై దినములు) దినములలోపల సంబంధిత జిల్లా కలెక్టర్/అధికృత అధికారి సదరు చట్టం లోని సెక్షన్ 15 క్రింద గల అంశాల ప్రకారం తమ అభ్యంతరాలను సమర్పించుకోనవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) యాదాద్రి-భువనగిరి జిల్లా.

సం/- సంయుక్త కలెక్టర్, యాదాద్రి-భువనగిరి జిల్లా.

సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

సీఎస్ఐఆర్ - నెట్

ఎగ్జామ్ గైడ్

సైన్సెస్‌లో సమున్నతం

సైన్సెస్‌లో సమున్నత కెరీర్‌కు బాట వేసే పరీక్ష జాయింట్ సీఎస్ఐఆర్ - యూజీసీ నెట్. ఈ పరీక్ష ద్వారా జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలో) సాధించిన విద్యార్థులు దేశంలోని ప్రముఖ సంస్థల్లో పరిశోధనలు చేయవచ్చు. యూజీసీ గుర్తింపు పొందిన కాలేజీల్లో అధ్యాపకులుగా కెరీర్ ప్రారంభించేందుకు లెక్చరర్‌షిప్ కూడా దీని ద్వారా లభిస్తుంది. సీఎస్ఐఆర్ - యూజీసీ నెట్ నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సంబంధిత వివరాలను చూద్దాం..



మొత్తం ఐదు విభాగాల్లో సీఎస్ఐఆర్ - నెట్ పరీక్షను నిర్వహిస్తారు. అవి..

- కెమికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్, ప్లానెటరీ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మ్యాథమెటికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్

అర్హత

55 శాతం మార్కులతో (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులకు 50 శాతం) ఎంఎస్సీ / తత్సమానం లేదా ఇంటెగ్రేటెడ్ బీఎస్ - ఎంఎస్ / నాలుగేళ్ల బీఈ / బీటెక్ / బీఫార్మసీ లేదా ఎంబీబీఎస్ లేదా నిబంధనల మేరకు ఎంఎస్సీ (10+2+3 విధానంలో చేరినవారు) చివరి సంవత్సరం అభ్యర్థులు అర్హులే. లేదా 55 శాతం మార్కులతో (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులకు 50 శాతం) బీఎస్సీ (ఆనర్స్) / తత్సమానం లేదా ఎంఎస్ - పీహెచ్‌డీ.

వయసు: జూనియర్ రీసెర్చ్ ఫెలోకు 28 ఏళ్లు (జనవరి 1, 2018 నాటికి). నిబంధనలకు అనుగుణంగా రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపునిస్తారు. లెక్చరర్‌షిప్‌నకు ఎటువంటి వయోపరిమితి లేదు.

రాత పరీక్ష ఇలా

రాత పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 200 మార్కులకు ఉండే ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు ఉంటాయి. అవి.. పార్ట్ - ఎ, పార్ట్ - బి, పార్ట్ - సి. సమాధానాలను గుర్తించడానికి మూడు గంటల (180 నిమిషాలు) సమయం కేటాయించారు.

- **పార్ట్ - ఎ :** ఈ విభాగం అందరికీ కామన్‌గా ఉంటుంది. ఇందులో లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ అంశాల నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 15 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ప్రతి సరైన సమాధానానికీ రెండు మార్కుల చొప్పున ఇందుకు కేటాయించిన మొత్తం మార్కులు 30.
- **సబ్జెక్టివ్ పార్ట్ - బి:** ఈ విభాగంలో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ ఆధారంగా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అడిగే ప్రశ్నల సంఖ్య ఆయా సబ్జెక్ట్‌లను అనుసరించి భిన్నంగా ఉంటుంది. కెమికల్ సైన్సెస్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కుల చొప్పున కేటాయించిన మొత్తం మార్కులు 70. ఎర్త్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్‌లో 50 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 35 ప్రశ్నలను ఎంచుకోవాలి. ఇందుకు కేటాయించిన మొత్తం మార్కులు 70. మ్యాథమెటికల్ సైన్సెస్‌లో 40 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 25 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున కేటాయించారు, మొత్తం మార్కులు 75. ఫిజికల్ సైన్సెస్‌లో 25 ప్రశ్నల్లో 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు 3.5 మార్కుల చొప్పున కేటాయించారు, మొత్తం మార్కులు 70.
- **నైపుణ్యాధారితం పార్ట్ - సి:** ఈ విభాగంలో అభ్యర్థి నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఇస్తారు. ఈ క్రమంలో ఆయా సబ్జెక్ట్‌ల్లోని శాస్త్రీయ అనువర్తనాలను అభ్యర్థి ఏమేరకు అన్వయించే నైపుణ్యాన్ని కలిగి ఉన్నాడు అనే అంశాన్ని పరీక్షిస్తారు. ఇందులో కూడా అడిగే ప్రశ్నల సంఖ్య ఆయా సబ్జెక్ట్‌లను అనుసరించి భిన్నంగా ఉంటుంది. కెమికల్ సైన్సెస్‌లో 60 ప్రశ్నల్లో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఇందుకు కేటాయించిన మార్కులు 100. ఎర్త్ సైన్సెస్‌లో 80 ప్రశ్నల్లో 25 ప్రశ్నలకు సమాధానం గుర్తించాలి. మార్కులు 100. లైఫ్ సైన్సెస్‌లో 75 ప్రశ్నల్లో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. దీనికి కేటాయించిన మార్కులు 100. మ్యాథమెటికల్ సైన్సెస్‌లో 60 ప్రశ్నలు ఉంటాయి, 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు 4.75 మార్కుల చొప్పున ఈ విభాగానికి ఇచ్చే మార్కులు 95. ఫిజికల్ సైన్సెస్‌లో 30 ప్రశ్నల్లో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఇందుకు కేటాయించిన మార్కులు 100.

నెగిటివ్ మార్కులు

నెగిటివ్ మార్కులు ఎంచుకున్న సబ్జెక్ట్‌ను బట్టి వేర్వేరుగా ఉంటాయి. లైఫ్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్‌లో ప్రతి తప్పునకు 25 శాతం మార్కుల కోత విధిస్తారు. ఎర్త్ సైన్సెస్‌లో పార్ట్ - ఎ, పార్ట్ - బికి 25 శాతం, పార్ట్ - సికి 33 శాతం నెగిటివ్ మార్కులు ఉంటాయి. మ్యాథమెటికల్ సైన్సెస్‌లో పార్ట్ - ఎ, పార్ట్ - బికి 25 శాతం నెగిటివ్ మార్కులు ఇస్తారు. పార్ట్-సికి ఎటువంటి నెగిటివ్ మార్కులు లేవు.

రెండు రకాల జాబితాలు

అభ్యర్థులు నిర్దేశించిన అర్హత మార్కులు సాధించినప్పటికీ మోడరేషన్ కమిటీ నిర్ధారించే కటాఫ్ మార్కుల ఆధారంగా జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలో), లెక్చరర్‌షిప్‌ను ప్రదానం చేస్తారు. ఈ క్రమంలో రెండు రకాల మెరిట్ లిస్ట్‌లను రూపొందిస్తారు. మొదటి లిస్ట్‌లో లెక్చరర్‌షిప్, జేఆర్ఎఫ్ రెంటికి అర్హత సాధించిన అభ్యర్థులకు చోటు కల్పిస్తారు. రెండో లిస్ట్‌లో కేవలం లెక్చరర్‌షిప్‌నకు అర్హత సాధించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయి. అందుబాటులోని జేఆర్ఎఫ్‌ల సంఖ్యను, అభ్యర్థుల ఉత్తీర్ణతను పరిగణనలోకి తీసుకుని తుది కటాఫ్ నిర్ణయిస్తారు. దీని ఆధారంగా జేఆర్ఎఫ్‌ను ప్రదానం చేస్తారు. జేఆర్ఎఫ్ అర్హత జనవరి 1, 2019 నుంచి రెండేళ్ల వరకు చెల్లుబాటవుతుంది. ఈ రెండేళ్లలో ఏదైనా పరిశోధన సంస్థ లేదా విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 26, 2018.
- పరీక్ష తేదీ: జూన్ 17, 2018.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, గుంటూరు.
- వెబ్‌సైట్: http://www.csirhrdg.res.in/

కెరీర్‌ను మలుపు తిప్పే పరీక్ష

- సైన్స్ విద్యార్థులకు సీఎస్ఐఆర్ నెట్ కెరీర్ పరంగా అత్యంత ముఖ్యమైన పరీక్ష. ఇందులో ఉత్తీర్ణులై ఫెలోషిప్ సాధిస్తే, కెరీర్ మంచి మలుపు తిరుగుతుంది. దేశంలోని ప్రతిష్ఠాత్మక పరిశోధన సంస్థల్లో, గొప్ప సైంటిస్ట్‌లతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుంది. అందువల్ల ముందు నుంచే ప్రణాళిక ప్రకారం శ్రమించి జేఆర్ఎఫ్ సాధించడానికి విద్యార్థులు ప్రయత్నించాలి.
- సీఎస్ఐఆర్ నెట్ పరీక్షలో విజయం సాధించాలంటే ప్రాథమిక అంశాలపై పట్టు తప్పనిసరి. బేసిక్స్ మీద మంచి అవగాహన ఏర్పడిన తర్వాత ఆయా సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ స్థాయి అడ్వాన్స్‌డ్ అంశాలను చదవాలి. ఆయా అంశాలను అనువర్తిత పద్ధతిలో నేర్చుకోవాలి.
- వీలైనన్ని ఎక్కువగా నమూనా పరీక్షలు రాయాలి. టైమ్ మేనేజ్‌మెంట్ కూడా కీలకం. ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలుండే పుస్తకాల కంటే పాఠ్యపుస్తకాలను చదవడం మేలు. తద్వారా సబ్జెక్టుపై పూర్తి అవగాహన ఏర్పడుతుంది. ప్రశ్న ఎలా అడిగినా సమాధానం రాయగలరు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది కాబట్టి ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను చదవడం మంచిది. దీని వల్ల సబ్జెక్టు పదజాలంపై పట్టు ఏర్పడుతుంది.



- డాక్టర్
యు.ఎస్.ఎన్. మూర్తి
సీనియర్ సైంటిస్ట్

ప్రయోజనాలు

- సీఎస్ఐఆర్ - యూజీసీ నెట్ ద్వారా జేఆర్ఎఫ్ సాధించిన అభ్యర్థులకు సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థలతోపాటు ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పరిశోధన చేసే అవకాశం లభిస్తుంది. ఈ సమయంలో రెండేళ్లపాటు నెలకు రూ. 25 వేల ఫెలోషిప్, ఏటా కంటిన్‌జెన్సీ గ్రాంట్ రూ.20 వేలు ఇస్తారు.
- జేఆర్ఎఫ్ నుంచి సీనియర్ రీసెర్చ్ ఫెలోగా ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో నెలకు రూ. 28 వేల ఫెలోషిప్ లభిస్తుంది.
- జేఆర్ఎఫ్‌లో అత్యంత ప్రతిభావంతులకు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఫెలోషిప్ లభిస్తుంది. వీరికి రెండేళ్లపాటు నెలకు రూ. 29 వేల ఫెలోషిప్, ఏటా కంటిన్‌జెన్సీ గ్రాంట్ రూ.70 వేలు ఇస్తారు. తరవాత ప్రతిభ ఆధారంగా మూడేళ్లపాటు పొడిగింపు లభిస్తుంది. ఈ సమయంలో నెలకు రూ. 34 వేలు ఫెలోషిప్‌గా చెల్లిస్తారు.
- నెట్‌లో అర్హత సాధిస్తే దేశంలోని అన్ని డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీ / తత్సమాన హోదా ఉన్న సంస్థల్లో లెక్చరర్ / అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు భర్తీ చేసే డిగ్రీ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే నెట్ / స్లెట్‌లో అర్హత తప్పనిసరి.
- ఐఐటీ / ఐఐఎస్సీ వంటి ప్రసంస్థల్లో పరిశోధన కోర్సుల్లో చేరడానికి నెట్ / జేఆర్ఎఫ్ ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు.
- ఓఎన్‌జీసీ వంటి కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నియామకాల కోసం నెట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి.
- సీఎస్ఐఆర్ - యూజీసీ నెట్ ప్రిపరేషన్ ఐఐఎస్సీ, ఐఐటీ, టీఐఎఫ్ఆర్, జేఎన్‌సీఎస్ఐఆర్, బార్క్, హెచ్‌సీయూ, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐ, ఏపీసెట్, టీఎస్‌సెట్, డీఎల్, డీఆర్‌డీఓ, వివిధ విశ్వవిద్యాలయాల పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు, ఇతర పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుంది.

కటాఫ్ (జూన్, 2017, జనరల్ కేటగిరీ)

విభాగం	జేఆర్ఎఫ్	లెక్చరర్‌షిప్
కెమికల్ సైన్స్	55.50 శాతం	49.95 శాతం
ఎర్త్ సైన్స్	53.72 శాతం	48.35 శాతం
లైఫ్ సైన్స్	55 శాతం	49.50 శాతం
మ్యాథమెటికల్ సైన్స్	50.38 శాతం	45.34 శాతం
ఫిజికల్ సైన్స్	40.63 శాతం	36.57 శాతం

జాబ్ కార్నర్

ఈఎస్ఐసీలో బోధనా సిబ్బంది

న్యూఢిల్లీలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) - బోధనా సిబ్బంది నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **206**
- పోస్టులు: అసోసియేట్ ప్రొఫెసర్ 75, అసిస్టెంట్ ప్రొఫెసర్ 85, ప్రొఫెసర్ 46
- విభాగాలు: అనెస్తీషియా, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బ్లడ్ బ్యాంక్, హెమటాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రో బయాలజీ, అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, ఆప్తల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, ఫార్మకాలజీ, సైకియాట్రీ, రేడియాలజీ, టీబీ, చెస్ట్, సైకియాట్రీ, ఫిజియాలజీ, రేడియాలజీ, స్కిన్ & వీడీ, యూరాలజీ.
- అర్హత: సంబంధిత విభాగంలో పీజీ / డాక్టరేట్ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: 25 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 2
- వెబ్‌సైట్: www.esic.nic.in

సీఈఐఎల్‌లో ఇంజనీర్లు

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సీఈఐఎల్) కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఇంజనీర్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **244**
- కన్‌స్ట్రక్షన్ & ఎన్‌డీటీ ఇంజనీర్ల ఖాళీలు: 139
- విభాగాలవారీ ఖాళీలు: సివిల్ 14, మెకానికల్ 30, ఎలక్ట్రికల్ 13, ఇన్‌స్ట్రుమెంటేషన్ 6, వెల్డింగ్ / ఎన్‌డీటీ 16, సేఫ్టీ 30, వేర్‌హౌస్ 15, ప్లానింగ్ 15
- సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ ఇంజనీర్ల ఖాళీలు: 105
- ఎస్‌సీఎం విభాగాలవారీ ఖాళీలు: కాంట్రాక్ట్ & పర్చేజ్ 68, మెకానికల్/ ప్రొడక్షన్/ మెటలర్జికల్ 26, ఎలక్ట్రికల్ 6, ప్లానింగ్ 5
- పోస్టులు: కన్‌స్ట్రక్షన్, వెల్డింగ్/ ఎన్‌డీటీ ఇంజనీర్లు ; ప్లానింగ్, సేఫ్టీ, వేర్‌హౌస్ పర్సనల్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ (కాంట్రాక్ట్స్ & పర్చేజ్/ ఇన్‌స్పెక్షన్/ ప్రొక్యూర్‌మెంట్ & డెవలప్‌మెంట్) ఇంజనీర్స్
- అర్హత: 50 శాతం మార్కులతో బీఈ / బీటెక్ / డిప్లొమా (సివిల్/ మెకానికల్ / ఎలక్ట్రికల్ / ఇన్‌స్ట్రుమెంటేషన్ / మెకానికల్ / మెటలర్జీ / ఇండస్ట్రియల్ సేఫ్టీ) / డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్‌సీఎం పోస్టులకు మాత్రం 60 శాతం మార్కులు ఉండాలి. అన్ని పోస్టులకు నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి.
- వయసు: 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 22
- వెబ్‌సైట్: www.ceil.co.in

మహిళా దినోత్సవ క్విజ్

ఈ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన మహిళలపై ప్రత్యేక క్విజ్ అందిస్తున్నాం. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు కూడా ఈ ప్రశ్నలు ఉపయోగపడతాయి.

1. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మొదట్లో వేర్వేరు దేశాల్లో వేర్వేరు తేదీల్లో నిర్వహించేవారు. అయితే ఎప్పటి నుంచి ఐక్యరాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా పాటిస్తోంది?
ఎ) 1975 బి) 1919 సి) 1946 డి) 2000

2. ఐక్యరాజ్యసమితి పౌర పోలీసు సలహాదారుగా నియమితులైన తొలి మహిళ?
ఎ) ఆలిస్ స్టెబిన్స్, అమెరికా
బి) ఎలిజబెత్ రాబిన్సన్, అమెరికా
సి) క్రిసిడా డిక్, లండన్ డి) కిరణ్ బేడీ, ఇండియా

3. విజయవాడలో పుట్టి, మైక్రోసాఫ్ట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ స్థాయికి చేరుకొని ఫార్చ్యూన్ మ్యాగజైన్ "క్వీన్ ఆఫ్ ఎలక్ట్రిక్ కార్ బిజ్ రాణి"గా గుర్తింపు పొందిన మహిళ?



ఎ) వాణి కోలా బి) అంజలి వాసిరెడ్డి
సి) రేణుక రామనాథ్ డి) పద్మశ్రీ వారియర్

4. రైల్వే బోర్డులో సభ్యురాలుగా చేరిన తొలి మహిళ?
ఎ) సౌమ్య రాఘవన్ బి) మైథిలీ కామ్రాజ్
సి) విజయలక్ష్మి విశ్వనాథన్ డి) రాధా మాధవ్

5. 2002లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) చరిత్రలోనే తొలి మహిళా జాయింట్ డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ఇషా పంత్ బి) మీరా బోర్వాంకర్
సి) అర్చన రామసుందరం డి) కిమ్ శర్మ

6. దేశంలోని ఏ నాన్ సబర్బన్ రైల్వే స్టేషన్‌ను పూర్తిగా మహిళా రైల్వే ఉద్యోగులే నిర్వహిస్తున్నారు?
ఎ) ముంబైలోని మాతుంగ రైల్వేస్టేషన్
బి) జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్
సి) ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వేస్టేషన్
డి) బెంగళూరులోని కంటోన్మెంట్ రైల్వేస్టేషన్

7. దేశంలో మొదటిసారిగా మొత్తం మహిళలతో నిర్వహిస్తున్న రైల్వే స్టేషన్‌గా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్న స్టేషన్?
ఎ) జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్
బి) ముంబైలోని మాతుంగ రైల్వేస్టేషన్
సి) ముంబైలోని ఖార్ రోడ్ రైల్వేస్టేషన్
డి) అరకు వ్యాలీ రైల్వేస్టేషన్, ఆంధ్రప్రదేశ్

8. భారతదేశ తొలి ఐఎఫ్ఎస్ ఆఫీసర్ చోనిర బెలియాప్ప ముత్తమ్మ. ఈమె ఏ దేశానికి మొదటిసారి రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) మలేషియా బి) ఇరాన్ సి) హంగేరి డి) పెరూ

9. భారతీయ సైన్యంలో చేరిన మొదటి మహిళా క్యాడెట్? (1992 వరకు మహిళా క్యాడెట్లకు భారతీయ సైన్యంలో చేరడానికి అనుమతి లేదు)



ఎ) ప్రియా జింగాన్ బి) మిథాలి మధుమిత
సి) నీలా కౌశిక్ పండిట్ డి) దివ్య అజిత్ కుమార్

10. భారత సైన్యంలో తొలి మహిళా సైనిక అధికారి?
ఎ) నీలా కౌశిక్ పండిట్ బి) నిమీతిత చౌదరి
సి) ప్రియా జింగాన్ డి) అంజనా భాదురియా

11. భారత వైమానిక దళం నుంచి మొట్టమొదట ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళ?
ఎ) ఫ్లయిట్ లెఫ్టినెంట్ నివేదిత చౌదరి
బి) ఎయిర్ మార్షల్ పద్మావతి బందోపాధ్యాయ
సి) ఫ్లయిట్ ఆఫీసర్ గున్జన్ సక్సేనా
డి) ఫ్లయిట్ లెఫ్టినెంట్ దీపిక మిశ్రా


12. భారతదేశ మొట్టమొదటి మహిళా మేజిస్ట్రేట్?
ఎ) పార్వతి శివదాసన్ బి) ఫాతిమా బీబీ
సి) ఓమనా కుంజమ్మ డి) డింపుల్ అరోరా

13. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు మొదటి మహిళా చైర్మన్ ?
ఎ) నందిని కె ఆర్ బి) ఇరా సింఘాల్
సి) టినా డబీ డి) రోజ్ మిల్లియన్ బాత్యు

14. నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ మొదటి చైర్ పర్సన్?
ఎ) రేఖా శర్మ బి) జయంతి పట్నాయక్
సి) విబా పార్థసారథి డి) డాక్టర్ గిరిజా వ్యాస్

15. అర్జున పురస్కారం పొందిన మొదటి మహిళా క్రీడాకారిణి ?
ఎ) ఎలిజా నెల్సన్ బి) స్టెఫీ డిసౌజా
సి) ఆన్ లుంస్డెన్ డి) పి.టి.ఉష

16. మెగసెసె అవార్డు పొందిన మొట్టమొదటి భారతీయ మహిళ ?



ఎ) కిరణ్ బేడి
బి) ఇందిరా గాంధీ
సి) అరుంధతీ రాయ్
డి) సంగీతా రెడ్డి

17. రాజ్యసభకు మొదటి మహిళా కార్యదర్శి?
ఎ) విబా పార్థసారథి బి) రమాదేవి వి ఎస్
సి) రేణుకా చౌదరి డి) నజ్మా హెప్తుల్లా

18. ఇంటర్నేషనల్ లెనిన్ శాంతి బహుమతి పొందిన మొదటి భారతీయ మహిళ?
ఎ) అరుణ అసఫ్ అలీ బి) విజయలక్ష్మి పండిట్
సి) మదర్ థెరిసా డి) మేధా పాట్కర్

19. ఎక్సిమ్ బ్యాంకునకు మొదటి మహిళా చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) తరాజని వకీల్ బి) అర్చన భార్గవ
సి) అర్చన హింగోరాణి డి)స్నేహ్లట శ్రీవాస్తవ

20. దేశంలో మొట్టమొదటి పోలీసు డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన మహిళ?
ఎ) సోనియా నారంగ్ బి) మీరా బోర్వాంకర్
సి) కంచన్ చౌదరి భట్టాచార్య డి) విమలా మెహ్రా

21. దేశ తొలి ఆరోగ్య శాఖ మంత్రి రాజ్ కుమారి అమృత్ కౌర్. ఈమె ఏ రాజ్యానికి చెందిన రాజకుమారి?
ఎ) పాటియాలా బి) కాంగ్రా
సి) కపుర్తలా డి) ఫరీద్కోట్

22. భారతదేశ మొట్టమొదటి మహిళా ఆర్కిటెక్ట్?
ఎ) ఉర్మిలా యులీ చౌదరి బి) రంజిని కలప్ప
సి) అనుపమ కుండూ డి) షీలా శ్రీ ప్రకాష్

23. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పని చేసిన తొలి మహిళ?
ఎ) బీనా రమణి బి) రమోల ప్రీత్ సింగ్
సి) గిరిజ వ్యాస్ డి) రమాదేవి వి ఎస్

24. ఏ బోర్డుకు మొదటి మహిళా అధిపతిగా బాదర్ సయ్యద్ నియమితులయ్యారు?
ఎ) కాఫీ బోర్డు బి) టీ బోర్డు
సి) వక్ఫ్ బోర్డు డి) సిల్క్ బోర్డు

25. భారతదేశ సినిమా రంగంలో తొలి మహిళా నిర్మాత, దర్శకురాలు?
ఎ) ఫాతిమా బేగం బి) దేవికా రాణి
సి) దుర్గ కోట్ డి) కరుణ ఫాల్కే

26. 1956లో ముంబైకి తొలి మహిళా మేయర్‌గా ఎవరు ఎన్నికయ్యారు?
ఎ) నిర్మలా సయంట్ బి) సులోచా ఎం. మోడి
సి) తారా చెరియన్ డి) శ్రద్దా జాదవ్

27. 1958లో ఎవరు ఢిల్లీకి మొట్టమొదటి మహిళా మేయర్‌గా ఎన్నికయ్యారు?
ఎ) రజని అబీ బి) విశాఖ రౌత్
సి) మీరా అగర్వాల్ డి) అరుణ అసఫ్ అలీ

28. 1958లో చెన్నై మేయర్‌గా ఎన్నికయిన మొట్టమొదటి మహిళ?
ఎ) నూర్జహాన్ బి) విజయలక్ష్మి బిదారి
సి) తారా చెరియన్ డి) కామాక్షి జయరామన్

29. భారతదేశ మొదటి మహిళా ఐఏఎస్ అధికారి?
ఎ) అన్నా రాజమ మల్హోత్ర
బి) నిరుపమ రావు
సి) రూపా మిశ్రా డి) విజయలక్ష్మి బిదారి

30. అగ్ని క్షిపణి కోసం పని చేసిన టెస్సీ థామస్‌ను 'మిస్సైల్ ఉమన్ ఆఫ్ ఇండియా", "అగ్ని పుత్రి"గా పిలుస్తారు. ఆమె ఏ సంస్థలో విధులు నిర్వహిస్తున్నారు?



ఎ) ఇస్రో బి) డీఆర్‌డీఓ
సి) నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ
డి) అణు శక్తి శాఖ

31. విజయలక్ష్మీ పండిట్ భారతదేశంలో మొట్టమొదటి మహిళా రాయబారి. ఆమె ఏ దేశానికి రాయబారిగా వ్యవహరించారు?
ఎ) యూకే బి) అమెరికా
సి) యూఎస్ఎస్ఆర్ డి) చైనా

32. భారతదేశంలోని మొట్టమొదటి మహిళా స్పీకర్ ఏ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు?
ఎ) హర్యానా బి) పంజాబ్
సి) ఉత్తరప్రదేశ్ డి) బీహార్

33. భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఏ రాష్ట్రంలో ఒక మహిళ హోమ్ మంత్రిగా బాధ్యతలు నిర్వహించింది?
ఎ) ఆంధ్రప్రదేశ్ - సబితా ఇంద్రారెడ్డి
బి) ఢిల్లీ - సుష్మా స్వరాజ్
సి) ఉత్తర ప్రదేశ్ - మేనకా గాంధీ
డి) ఉత్తర ప్రదేశ్ - డింపుల్ యాదవ్.

34. 1939లో సైన్స్‌లో పీహెచ్‌డీ పొందిన మొదటి భారతీయ మహిళ ?
ఎ) కమలా సోహోనీ బి) రాజేశ్వరి ఛటర్జీ
సి) అసిమా చటర్జీ డి) జానమి అమ్మాల్

35. భారతదేశంలో మొట్టమొదటి మహిళా జనరల్ సర్జన్ ఎవరు?
ఎ) నీలం క్లార్ బి) మంజుల అనగాని
సి) మేరీ పూనన్ లూకాస్ డి) సుభద్ర నాయర్

36. సినీ పరిశ్రమ నుంచి ఏ నటీమణి మొదటగా రాజ్యసభకు నామినేట్ అయ్యారు?
ఎ) వైజయంతిమాల బి) నర్గీస్ దత్
సి) షబానా ఆజ్మీ డి) హేమమాలిని

37. ఆంధ్రప్రదేశ్ శాసనసభ మొదటి మహిళా స్పీకర్?



ఎ) గ్రంధి మాధవి
బి) మణెమ్మ
సి) కుతూహలమ్మ
డి) ప్రతిభా భారతి

38. భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఏ రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా ఒక మహిళ బాధ్యతలు నిర్వహించారు?
ఎ) పంజాబ్ - డాక్టర్ ఉపింజర్జిత్ కౌర్
బి) మధ్యప్రదేశ్ - ఉమా భారతి
సి) బీహార్ - రబ్రీ దేవి
డి) ఒడిషా - నందిని శతపతి

39. భారతదేశపు మొదటి మహిళా రైల్వే మంత్రి ?
ఎ) మమతా బెనర్జీ బి) జయంతి నటరాజన్
సి) విజయ రాజే సింధియా డి) అంబికా సోని

40. ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి భారతీయ మహిళ?
ఎ) మధుమిత బిస్త్ బి) పి.టి. ఉష
సి) షైనీ విల్సన్ డి) నోరా పోలీ

41. ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించిన తొలి భారత మహిళ ?
ఎ) సైనా నెహ్వాల్ బి) పి.టి. ఉష
సి) షైనీ విల్సన్ డి) కరణం మల్లీశ్వరి

42. ఒలింపిక్స్‌లో మహిళా కుస్తీ పోటీల విభాగంలో పాల్గొన్న మొదటి భారతీయ మహిళ ?
ఎ) గీతా ఫోగట్ బి) బబిత
సి) షైనీ విల్సన్ డి) అంకితా దాస్

43. వరుసగా మూడు ఒలింపిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన మహిళ?
ఎ) సైనా నెహ్వాల్ బి) అవినీట్ కౌర్ సిద్ధూ
సి) అంజలి భగవత్ డి) కరణం మల్లీశ్వరి

44. 2012 లండన్ ఒలింపిక్స్‌లో జుడోకా విభాగంలో పాల్గొన్న ఏకైక భారతీయ మహిళ?
ఎ) మేరీ కోమ్ బి) గరిమా చౌదరి
సి) చెక్రావోల్యు స్వారో డి) అవినీట్ కౌర్ సిద్ధూ

సమాధానాలు

1. ఎ	10. ఎ	19. ఎ	28. సి	37. డి
2. డి	11. ఎ	20. సి	29. ఎ	38. ఎ
3. డి	12. సి	21. సి	30. బి	39. ఎ
4. సి	13. డి	22. ఎ	31. సి	40. డి
5. సి	14. బి	23. డి	32. ఎ	41. డి
6. బి	15. బి	24. సి	33. ఎ	42. ఎ
7. బి	16. ఎ	25. ఎ	34. ఎ	43. సి
8. సి	17. బి	26. బి	35. సి	44. బి
9. ఎ	18. ఎ	27. డి	36. బి	

సునీల్ ధవళ
సిఇఒ, ద థర్డ్ అంపైర్ మీడియా, మాజీ వైస్ ప్రెసిడెంట్, నేషనల్ జియోగ్రాఫిక్ , ఫాక్స్ ఇండియా

పొట్ట చుట్టూ కొవ్వుతో ఆందోళన

వాషింగ్టన్, మార్చి 7: అధిక బరువుగల మహిళలు ఎక్కువగా ఆందోళన చెందే అవకాశాలున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ప్రత్యేకంగా మధ్య వయసున్న మహిళలపై ఇది ఎక్కువ ప్రభావం చూపువచ్చని పేర్కొన్నారు. మహిళ పొట్ట చుట్టూ ఉన్న కొవ్వు.. ఆ మహిళ నడుము పెరగడానికి కారణమవుతుందని, ఇది వారు ఆందోళన చెందడానికి దారితీయవచ్చన్నారు. లాటిన్ అమెరికాలోని 5,580 మంది మధ్య వయసున్న, మెనోపాజ్ దశ దాటిన మహిళలపై అధ్యయనం చేశారు. వీరిలో 61.3 శాతం మంది మహిళలు ఆందోళన చెందుతున్నట్లు కనుగొన్నారు. మధ్యవయసులో ఈస్ట్రోజన్ తగ్గుదల కూడా మహిళల ఆందోళనకు కారణం కావచ్చని చెప్పారు.

'అతడు'గా ఆసరా!

నాన్న కోసం కొడుకైన కూతురు.. స్వయం ఉపాధితో నెలకు రూ.25వేలు


చికెన్ కొడుతున్న ఆతియా

"నాలో అమ్మాయిననే భావన లేదు. పెళ్లి చేసుకోవాలనే ఆలోచన కలగడం లేదు. మా నాన్న నాలో కొడుకును చూసుకున్నాడు. మగపిల్లల దుస్తులను కుట్టి నాకు వేశాడు. నాన్న చనిపోవడంతో 12 ఏళ్ల వయసులోనే ఇంటి పోషణ కోసం

నాలో అమ్మాయి అనే భావనే లేదు


చిన్న చిన్న పనులకు కుదిరాను. కోడిగుడ్ల సలీం సోదరుల సహకారంతో చికెన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాను. అది బాగానే నడుస్తోంది. అమ్మకు సేవలు చేయడం, చెల్లెలికి పెళ్లి చేయడం, తమ్ముడి పురోగతిని చూడాలన్నదే నా లక్ష్యంగా పెట్టుకున్నాను. నాన్నకు కూతురుగా పుట్టి కొడుకులా ఎదిగినందుకు గర్వంగా ఉంది"
- ఆతియా

- ఘనంగా ముగ్గురు అక్కల పెళ్లిళ్లు
- భుజాలపై మరో చెల్లి పెళ్లి, తమ్ముడి బాధ్యత
- 32 ఏళ్లుగా పురుషుడి వేషధారణలోనే ఆతియా

గద్వాల, మార్చి 6 : (ఆంధ్రజ్యోతి): కుమారుడు లేకపోవడంతో సరదాగా తన చిట్టితల్లికి అబ్బాయి దుస్తులు వేసి.. జుట్టును కట్‌చేసి చక్కగా క్రాప్ దువ్వి ముచ్చట తీర్చుకున్నాడా తండ్రి! అబ్బాయి రూపం భలే ఒప్పేసరికి ఆ బాలికకు అప్పటి నుంచి చొక్కా, నిక్కరే వేస్తూపోయాడు. ఆ భావనే.. రానురాను ఆమెలో కుటుంబ భారాన్ని తన భుజాననెత్తుకునే కొండత బాధ్యతను, ఓర్పును అలవడేలా చేసింది. 12 ఏళ్ల ప్రాయంలోనే నాన్న చనిపోతే.. తల్లి, ఐదుగురు తోబుట్టువులకు 'కొడుకు'గా నేనున్నాను అంటూ భరోసాగా నిలిచింది. ముగ్గురు అక్కల పెళ్లిళ్లను ఘనంగా చేసింది. చెల్లి పెళ్లి కోసం, తమ్ముడిని జీవితంలో స్థిరపడేలా చేసేందుకు ఇంకా కష్టపడుతోంది. కుటుంబం కోసం అతడుగా మారిన ఆమే గద్వాల పట్టణానికి చెందిన 32 ఏళ్ల ఆతియా! చూస్తే... ఎవరూ ఆతియాను 'ఆమె' అని అనుకోరు. గడ్డాలు, మీసాలు లేకున్నా.. ఎవరూ గుర్తుపట్టని రీతిలో ప్యాంటు, చొక్కా ధరించి అతడుగా నడుచుకుంటోంది. నాన్నపై ప్రేమతో.. కుటుంబానికి పెద్దదిక్కుగా మారిన ఆతియాపై మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం!!

గద్వాలలోని ఎర్రమట్టి వీధిలో అబ్దుల్‌సత్తార్, కుర్షీద్‌బీ దంపతుల నాలుగో సంతానం ఆతియా. ఆమెకన్నా ముందు సత్తార్ దంపతులకు ముగ్గురూ ఆడపిల్లలే. ఆతియా తర్వాత పాప, బాబు పుట్టారు. సత్తార్ టైలరింగ్ చేసేవాడు. నాలుగో కూతురైన ఆతియాను సత్తార్ కొడుకులానే చూసుకునే వాడు. వస్త్రధారణ కూడా అబ్బాయిల మాదిరే ఉండేది. ఆతియా ఆరో తరగతి చదువుతున్న సమయంలో నాన్న చనిపోయాడు. దీంతో కుటుంబ పెద్దగా ఆతియా బాధ్యతలు తీసుకుంది. చదువు మానేసి.. ఆటోమొబైల్ షాపులో కొన్నాళ్లు, చెప్పుల దుకాణంలో కొన్నాళ్లు పనిచేసింది. తర్వాత గద్వాలలోనే కోడిగుడ్ల సలీం సోదరులకు చెందిన చికెన్ సెంటర్‌లో రూ.8వేల జీతానికి చేరింది. అక్కడ పదేళ్ల పాటు పనిచేసి, చివరికి తానే చికెన్ సెంటర్ పెట్టుకుంది. నెలకు రూ.25 వేల ఆదాయాన్ని పొందుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి కుర్షీద్ బీకి అన్నీతానై సేవలందిస్తోంది.





మౌనమే మరక

నెలసరి సహజ ప్రక్రియ..! సిగ్గు పడాల్సిందేముంది?

'బ్లడీ మెన్.. మహిళల్లా మగాళ్లకు అరగంట బ్లీడింగ్ అయితే నేరుగా చస్తారు'-ప్యాడ్ మ్యాన్ సినిమా క్లైమాక్స్‌లో అక్షయ్ కుమార్ ఎమోషనల్ డైలాగ్ ఇది! ఈ మాట వాస్తవం! నెలసరిలో మహిళలు పడే బాధ వారికే తెలుస్తుంది. చాలు..! ఇన్నేళ్లుగా రోగాలతో బాధపడింది చాలు.. భరించిన అవమానాలు చాలు.. ఆచారాలు, మూఢ నమ్మకాలకు పోగొట్టుకున్న ప్రాణాలు చాలు! ఇది సిగ్గుపడాల్సిన విషయం కాదు..! ఇది కోట్లాది మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం! మహిళా దినోత్సవం సందర్భంగా.. శానిటరీ ప్యాడ్ చేతిలోకి తీసుకుని.. నెలసరి సహజ ప్రక్రియ అని నినదించాల్సిన సమయం!!

'మేం మహిళలం. నలుగురిలో తలదించుకోవడం కంటే రోగాలతో చావడమే నయం' వంటి 'ప్యాడ్‌మ్యాన్' సినిమాలో రాధికా ఆప్టే డైలాగులు సమాజంలో ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి. నెలసరిపై శతాబ్దాలుగా కొనసాగుతున్న మౌనం, మూఢ నమ్మకాలు, అపరిశుభ్ర పరిస్థితులు వారిని రోగాలపాలు చేస్తూనే ఉన్నాయి. దేశ మహిళల్లో శానిటరీ ప్యాడ్స్ వాడుతున్నది 12 శాతమే. మిగతా మహిళలు అపరిశుభ్రమైన గుడ్డలు, ఆకులు, కాగితాలు, బూడిద వాడుతున్నారని అధ్యయనాలు ఘోషిస్తున్నాయి. దీనివల్ల మహిళల్లో 70 శాతం మంది ఇన్ఫెక్షన బారిన పడుతున్నారు. కొందరైతే సర్వికల్ క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు 70శాతం మంది మహిళలు తమకు శానిటరీ నేప్కిన్స్ కొనే స్థోమత లేదని వెల్లడించారు. ఈశాన్య భారతంలో 83 శాతం మంది మహిళలు పీరియడ్ ప్యాడ్స్ ఉపయోగించడం లేదు. విద్యార్థినుల పరిస్థితి దారుణం! 12 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలు.. పీరియడ్ పెయిన్‌తో నెలకు నాలుగైదు రోజుల చొప్పున ఏడాదికి 50 రోజులపాటు బడికి వెళ్లడం లేదు. దేశవ్యాప్తంగా దాదాపు 23శాతం మంది బాలికలు.. పదో తరగతిలోపే చదువుకు దూరమవుతున్నారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న బాలికలకు 6 శానిటరీ నేప్కిన్స్ ఉన్న ప్యాక్‌ను రూపాయికి, మిగతావారికి 5 రూపాయలకు సరఫరా చేయాలన్న పథకం దేశంలో ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, లక్నో, హైదరాబాద్, గోరఖ్‌పూర్, ఔరంగాబాద్, విజయవాడల్లో 31 శాతం మంది ఉద్యోగినులు నెలకు సగటున 2 రోజులపాటు పనికి దూరమవుతున్నారు.

మహారాష్ట్రలో 'అస్మిత'

గ్రామీణ బాలికల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి 'అస్మిత' పేరుతో మహారాష్ట్ర సర్కారు.. విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ అందిస్తోంది. అక్కడ ప్రతి నెలా విద్యార్థినులకు 8 ప్యాడ్స్ ఉన్న ప్యాక్‌ను రూ.5లకు అందజేస్తారు. గ్రామీణ బాలికలకు ఆన్‌లైన్‌లో శానిటరీ ప్యాడ్స్ స్పాన్సర్ చేయొచ్చు. మహారాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖకు చెందిన 'అస్మిత' పోర్టల్‌లోకి వెళ్లి కనీసం రూ.182 విరాళం ఇవ్వాలి!

ప్రపంచమంతా 'పీరియడ్ పావర్టీ'

కెన్యా, భారత్‌వంటి దేశాల్లోనే కాదు.. యూకే, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఈ సమస్య ఉంది. శానిటరీ ప్యాడ్స్ కొనే స్థోమత లేక..ప్రతి నెలా స్కూలుకి వెళ్లలేని దుస్థితి యూకే అంతటా ఉంది! బ్రిటీష్ స్కూళ్లలో 26శాతం మంది బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమెరికాలో 58 శాతంమంది మహిళలు నెలసరిలో అసహనానికి గురవుతున్నారు. సిగ్గుతో శానిటరీ ప్యాడ్స్ ఎవ్వరికీ కనిపించకుండా దాచేస్తామని 73 శాతం మంది మహిళలు వెల్లడించారు. భారత్‌లో కొన్ని సామాజిక వర్గాల్లో మహిళలను బహిష్టు సమయాల్లో వంటింట్లోకి రానివ్వరు. ఊరగాయలను తాకనివ్వరు. ఆలయాలకు వెళ్లడం, పూజల్లో పాల్గొనడం నిషిద్ధం! నేపాల్లో మహిళలు నెలసరి సమయంలో ఇంటి బయట గుడిసెల్లో లేదా పశువుల కొట్టంలో ఉండాల్సిందే! జపాన్‌లో మహిళా చెఫ్‌లు బహిష్టు సమయాల్లో వండటానికి వీల్లేదు. వాళ్లు వంట చేస్తే ఆహారంలో రుచి ఉండదని నమ్ముతారు.
–సెంట్రల్ డెస్క్

మూఢనమ్మకాలు వీడాలంటూ ఉద్యమాలు
'ఆరోగ్యం మహిళల హక్కు' అంటున్న బాలీవుడ్
బాలికలకు శానిటరీ నేప్కిన్ల సరఫరాకు పథకాలు

సిగ్గుపడాల్సిందేమీ లేదు..

పేద మహిళలకు పీరియడ్ ప్యాడ్స్ అందించాలన్న లక్ష్యంతో కృషి చేసిన అరుణాచలం మురుగనాథమ్ జీవితం ఆధారంగా తీసిన 'ప్యాడ్‌మ్యాన్' సినిమాతో అక్షయ్ కుమార్ సంచలనం సృష్టించాడు. శానిటరీ ప్యాడ్ అందరికీ కనిపించేలా చూపిస్తూ..'సిగ్గు పడకండి..ఆరోగ్యం మహిళల హక్కు' అని నినదించాడు. అక్షయ్‌తోబాటు..అమీర్ ఖాన్, అరుణ్ ధావన్, అనుష్క శర్మ, కరణ్‌జోహార్ వంటి బాలీవుడ్ సెలబ్రిటీలు శానిటరీ ప్యాడ్‌తో ఫొటో దిగి..'ప్యాడ్‌మ్యాన్ చాలెంజ్ హ్యాష్‌ట్యాగ్‌తో ట్విటర్‌లో పోస్ట్ చేశారు. నెలసరిపై అపోహలు, మూఢ నమ్మకాలను దూరం చేయడానికి మేనకాగాంధీ నేతృత్వంలోని కేంద్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రయత్నిస్తోంది. 'గ్రీన్ టు రెడ్, 'పీరియడ్ ఆఫ్ చేంజ్' పేరుతో ఆన్‌లైన్ ఉద్యమాలు మొదలయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో శానిటరీ నేప్కిన్ వెండింగ్ మెషీన్ ఏర్పాటు చేశారు.

ఐటీబీపీ యుద్ధ విభాగం అధికారిగా
తొలిసారి ఓ మహిళ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అవకాశం ఇస్తే.. మహిళలు ఏ రంగంలోనైనా సత్తా చాటేందుకు ముందుకు వస్తారనేదానికి ఈ పరిణామమే ఉదాహరణ. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ)లో మొట్టమొదటిసారిగా యుద్ధ విభాగం కోసం ఓ మహిళ అధికారికి నేరుగా ప్రవేశం కల్పించారు. ప్రకృతి అనే 25 ఏళ్ల యువతిది ఈ అదృష్టం. ఐటీబీపీలో ఇప్పటికే మహిళలు ఉన్నా వారిలో ఎక్కువమంది కానిస్టేబుల్ ర్యాంకు కలిగినవారే ఉన్నారు. ఇతరులు కూడా వెటర్నరీ వైద్యం తదితర విభాగాల్లో ఉన్నారు. వాస్తవానికి 2016లోనే యుద్ధ విభాగంలోకి మహిళా అధికారులను ఐటీబీపీ ఆహ్వానించింది. అప్పట్లో ప్రకృతి ఒకరే దీనికి దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా ఆమె దరఖాస్తును అధికారులు క్లియర్ చేశారు. సైనిక దుస్తుల్లో దేశానికి సేవ చేయాలనేది తన గొప్ప లక్ష్యమని, ఈ విషయంలో ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసిన తండ్రే తనకు స్ఫూర్తి అని ప్రకృతి చెప్పారు. డెహ్రాడూన్‌లో శిక్షణ అనంతరం ప్రకృతిని ఐటీబీపీలో అసిస్టెంట్ కమాండెంట్‌గా నియమించే అవకాశాలున్నాయి



'సంపాదనలో సగం' కాదు

దేశంలో మహిళలు మగవారి కన్నా 20% తక్కువ వేతనం

న్యూఢిల్లీ, మార్చి 7: ఆకాశంలో సగం.. అంటారు. కానీ, భారత్‌లో మహిళలపై అన్ని రంగాల్లోనూ వివక్షే కొనసాగుతోందని, వేతనాల్లోనూ వారు వెనకబడే ఉన్నారని ఓ అధ్యయనం పేర్కొంది. మగవారితో పోలిస్తే మహిళలకు 20 శాతం తక్కువ వేతనాలున్నాయని మాన్‌స్టర్ ఇండెక్స్ డాట్‌కామ్ అనే వెబ్‌సైట్ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఉద్యోగులైన 5500 మంది పురుషులు, మహిళల వేతనాలపై సర్వే నిర్వహించగా.. మగవారికి గంటకు సగటున రూ.231 వేతనం ఉన్నట్లు, మహిళలకు గంటకు రూ.184.80 మాత్రమే ఉన్నట్లు వెల్లడయింది. అనుభవాన్ని బట్టి వేతనాల పెంపులోనూ తేడా ఉంటున్నట్లు స్పష్టమైంది.

వేలాది ముస్లిం మహిళలు కోల్‌కతా వీధుల్లో కదం తొక్కారు. ట్రిపుల్ తలాక్ బిల్లును తక్షణమే ఉపసంహరించాలంటూ నినదించారు. బురఖాలు ధరించిన 30 వేల మందికిపైగా మహిళలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.



640 జిల్లాలకు 'బేటీ బచావో.. బేటీ పడావో'

- నేడు రాజస్థాన్‌లో ప్రారంభించనున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మార్చి 7: బాలికల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న బేటీ బచావో.. బేటీ పడావో (బీబీబీపీ) పథకం 640 జిల్లాలకు విస్తరించనుంది. ప్రస్తుతం 161 జిల్లాల్లో ఈ పథకం అమలవుతోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం రాజస్థాన్‌లోని ఝుంఝునూలో బీబీబీపీ విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇదే కార్యక్రమంలో ఆయన జాతీయ పోషకాహార మిషన్ (ఎన్ఎన్ఎం)ను ఆవిష్కరించనున్నారు. దేశంలో పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులు, కిశోర బాలికలు, మహిళల సంఖ్యను తగ్గించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.

దివ్యాంగుల సంక్షేమమే సుప్రీం!

లా-లోచనం Law lochanam



దివ్యాంగుల హక్కుల చట్టాన్ని (2016) పటిష్ఠంగా అమలు చేసే యంత్రాంగాన్ని మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని సుజాతా భండారీ ఫౌండేషన్ కేసు సందర్భంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ సుప్రీంకోర్టు గత ఏప్రిల్‌లో తాఖీదు జారీ చేసింది. కోర్టు తలంటినా ప్రభుత్వాలు ఇంకా మీనమేషాలు లెక్కిస్తూనే వున్నాయి. -----2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.8 కోట్ల దివ్యాంగులు ఉన్నారని లెక్క తేల్చి, వీరందరికీ దేశ నిర్మాణంలో అవకాశాలు పెంపొందించాలని ప్రభుత్వం సంకల్పించి అనేక పథకాలు రూపొందించింది. అయితే, అధికారుల అలసత్వంతో దివ్యాంగుల సంక్షేమం కుంటినడకన సాగుతోంది. సుప్రీం ఆదేశించినా ప్రభుత్వాలు మొద్దు నిద్ర వీడటం లేదు. వాస్తవానికి 69% మంది దివ్యాంగులు గ్రామీణులే కావడంతో ప్రభుత్వ పథకాల జాడ వారికి తెలియడం లేదు. వైద్య, విద్య సౌకర్యాలూ అక్కడ గగనకుసుమాలే. ప్రభుత్వ లెక్కల ప్రకారం అవయవ లోపాలతో 22%, వినికిడి, చూపు మందగించడంతో 18%, ఇతర అవకరాలతో మరో 8% విధివంచితులు ఉన్నారు. మేధస్సు, తెలివితేటలకు లోటు లేనందున వారిని అంగవికలురుగా కాక 'దివ్యాంగులు'గా గుర్తించాలని ప్రధాని సూచించారు. వాస్తవానికి 2006లో వైకల్య బాధితుల సంక్షేమంపై దృష్టి సారించిన కేంద్రం ఓ జాతీయ విధానాన్ని రూపొందించింది.ఆత్మగౌరవం, వ్యక్తి స్వేచ్ఛ, అవకాశాల పెంపు, సామాజిక భద్రత కల్పిస్తూ 2016లో తీసుకొచ్చిన చట్టం ద్వారా దేశంలోని లక్షలాది దివ్యాంగులకు భరోసా ఇచ్చారు. అయితే, కీలక చట్టాలు వున్నా వికలాంగుల సంక్షేమం, జీవించే హక్కుల నిర్ధారణకు కోర్టులు పలు సందర్భాల్లో జోక్యం చేసుకోవాల్సి రావడం గమనార్హం. 'విభిన్న దక్షత' గల వ్యక్తులకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు 'రిజర్వేషన్లు' ప్రకటించడం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు తీర్మానించింది. ఈ మేరకు 'నేషనల్ ఫెడరేషన్ ఫర్ బ్లైండ్' కేసు(2013)లో ఈ తరహా రిజర్వేషన్ల రేటు పెంపు, ప్రవేశ పరీక్షలను నాలుగు మార్లకు బదులు ఏడు మార్లు రాయొచ్చంటూ ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతించింది. దివ్యాంగులకు రిజర్వు చేసిన ఉద్యోగాల శాతాన్ని కేటగిరీ ఖాళీలను బట్టి కాకుండా మొత్తం కేడరు సంఖ్యపై లెక్కించాలని, కనీసం ఐదు శాతం దివ్యాంగ ఉద్యోగులు ఆ కేడరు మొత్తంలో ఉండాలని సూచించడంతో ఈ జనవరి 18న కేంద్రం అధికారిక ఉత్తర్వులను జారీ చేసి దివ్యాంగులకు రిజర్వేషను విధానాలను సరళీకరించటం విశేషం.బధిర ఉద్యోగులకూ ఇతర అవయవ లోపాలున్న వారితో సమంగా రవాణా ఇతర భత్యాలను యాజమాన్యం చెల్లించాలని 'డెఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్' కేసు(2013)లో సుప్రీం వెల్లడించింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఆశించే దివ్యాంగులకు అర్హమైన ఉద్యోగాలు ముందుగా గుర్తించాలన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన కోర్టు, అభ్యర్థుల అర్హతలను అనుసరించి అన్ని రకాల ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ తప్పనిసరి చేయాలని రవిప్రకాశ్ గుప్తా కేసు (2010)లో స్పష్టం చేసింది. సెరిబ్రల్ పాల్సీతో వినికిడి, సంభాషణ లోపాలకు గురైన ఉపాధ్యాయుడు తరగతిలో బోధనా సేవలకు అనర్హుడని, తొలగించిన ప్రభుత్వ నిర్వాకాన్ని ఎండగట్టిన న్యాయస్థానం, అతనికి ఎలక్ట్రానిక్ సాధనాలను అందజేసి బోధనావకాశాలను మెరుగుపర్చాలని సయ్యద్ బషీరుద్దీన్ ఖాద్రీ కేసు (2010)లో ఆదేశించింది. మెడికల్ అలవెన్సుల చెల్లింపు ఖజానాకు భారమని, దివ్యాంగుడికి ఉద్యోగం నిరాకరించిన యాజమాన్యాన్ని మందలించిన బొంబాయి హైకోర్టు (రంజిత్‌కుమార్ రజక్ కేసు) తన తీర్పుతో స్టేట్‌బ్యాంక్‌కు చురకలంటించింది. పని చేసే చోట సమంజసమైన వసతి, సౌకర్యాలు దివ్యాంగ ఉద్యోగికి కల్పించాలని, హాస్టళ్లలో ఉండే దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు అందించాలని, ప్రజలతో సంబంధమున్న ప్రతి కార్యాలయంలోనూ బధిరులకు సంజ్ఞా సంకేత భాషానిపుణులను నియమించాలని, లోకోమోటర్ వ్యాధి పీడితులకు కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో 'ర్యాంపు' సౌకర్యం ఉండాలని హైకోర్టులు వివిధ సందర్భాల్లో ఆదేశాలు జారీ చేశాయి. ఈ నేపథ్యంలో సుజాతా భండారీ కేసులో సుప్రీం జారీ చేసిన హుకుం కోట్లాది మంది దివ్యాంగులకు ఊరట.



– వేదాంతం సీతారామావధాని, భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, సెల్ :70421 40099

పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఆందోళన

దురదృష్టకరం

▸ రిజర్వేషన్లు పెంచాలనడం.. వితండవాదం: కిషన్‌రెడ్డి



సిద్దిపేటజోన్/హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రిజర్వేషన్ల పెంపు అధికారం రాష్ట్రాలకే కేటాయించాలంటూ పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీలు నిరసన తెలపడం దురదృష్టకరమని బీజేపీ శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి అన్నారు. రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంతోపాటు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్‌ఎస్ ఎంపీలు వితండవాదం చేస్తూ ఢిల్లీలో తెలంగాణ పరువు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై మజ్లిస్ కనుసన్నల్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. దొడ్డిదారిన ముస్లింలకు ఇస్తున్న 4శాతం రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర కేబినెట్‌లో మహిళలకు అవకాశం ఇవ్వకుండా, వారి ఆత్మగౌరవాన్ని కేసీఆర్ దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఉద్దేశిస్తూ.. లక్ష మంది కేసీఆర్‌లు, వెయ్యి టీఆర్‌ఎస్‌లు వచ్చినా తాను బీజేపీని వీడబోనని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలు, మానవతా విలువలకు తిలోదకాలిస్తూ.. టీఆర్‌ఎస్ సర్కారు రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ విమర్శించారు. ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ చేస్తున్న విమర్శలు ఆయన అవగాహనారాహిత్యాన్ని బయటపెడుతున్నాయని ఓ ప్రకటనలో విమర్శించారు.

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం : టీడీఎల్పీ

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని టీడీఎల్పీ స్పష్టం చేసింది. ఈ నెల 12 నుంచి జరగనున్న సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు టీడీఎల్పీ బుధవారం సమావేశమైంది. అనంతరం అసెంబ్లీ మీడియాహాల్‌లో ఎమ్మెల్యే కృష్ణయ్య, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని, అసెంబ్లీలో మాట్లాడే సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, రుణమాఫీ అంశాలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.

డిమాండ్ల సాధనకు 10న సమావేశం: కృష్ణయ్య

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీసీల డిమాండ్ల సాధనకు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 10న విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేందుకు సీఎం కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

యూఎఫ్‌ఆర్‌బీయూ సమ్మెలో 'గ్రామీణ బ్యాంక్'

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ ఫోరం ఆఫ్ రీజినల్ రూరల్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌ఆర్‌బీయూ) పిలుపు మేరకు ఈనెల 26, 27, 28 తేదీల్లో గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొననున్నారు. డిమాండ్ల సాధనకోసం జరిగే సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్డర్.. ఆర్డర్

ఐఏఎస్ చిత్ర, 'రాంకీ'లకు నోటీసులు

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తమ ఆదేశాలను అమలు చేయడంలో హాసింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఐఏఎస్ చిత్రా రామచంద్రన్, రాంకీ ఇన్‌ఫ్రా సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యోగవర్గాలకు కోర్టు ఆదేశాలను అమలు చేయని చిత్రా రామచంద్రన్‌తోపాటు రాంకీ ఇన్‌ఫ్రా ప్రతినిధి ఎం.శ్రీధర్‌రెడ్డికి కోర్టు ధిక్కరణ కింద నోటీసులు జారీచేసింది. ఏప్రిల్ 6న వీరిని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.

బీబీనగర్ నిమ్స్ ప్రారంభమెప్పుడు?

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీబీనగర్‌లో నిర్మించిన నిమ్స్ ఆసుపత్రి ప్రారంభించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నిర్మాణం పూర్తయి ఏడేళ్ల గడుస్తున్నా ప్రారంభానికి ఎందుకు నోచుకోవడం లేదో వివరిస్తూ కౌంటర్ వేయాలని ఆదేశించింది. ప్రజాలోగ్య సంరక్షణ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలేంటో వివరించాలని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ వి. రామసుబ్రమణియన్, జస్టిస్ టి.అమరనాథ్ గౌడ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీచేసింది.

ఆ నలుగురిపై కేసు నమోదు చేయండి

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కోడిపందేలను ప్రోత్సహించడంతో పాటు వాటిలో పాల్గొన్నారంటూ గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు ప్రజాప్రతినిధులపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయాలని చెరుకుపల్లి పోలీసులను హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తు ప్రారంభించి కోర్టుకు చార్జీషీటు వేయాలని తేల్చిచెప్పింది. నేరం రుజువైతే రాజకీయ పార్టీలకతీతంగా చర్యలు ఉంటాయని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే ఎ. సత్యప్రసాద్, ఎమ్మెల్సీ ఎ. సతీశ్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని మల్లికార్జునరావు, ముమ్మనేని వెంకటసుబ్బయ్య చట్టవ్యతిరేకంగా కోడిపందేలను ప్రోత్సహించారంటూ గుంటూరు జిల్లాకు చెందిన న్యాయవాది టి. భానుప్రకాశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. చట్టాన్ని ఉల్లంఘిస్తూ కోడిపందేల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి చెందిన వారైనా చర్యలు తప్పవని ఈ సందర్భంగా ధర్మాసనం హెచ్చరించింది.

పోలవరం నిర్వాసితుల ఫిర్యాదులపై విచారణ

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కింద పశ్చిమ గోదావరి జిల్లా, ఏజెన్సీ ప్రాంతంలో భూములు కోల్పోయిన గిరిజనులకు కనీస పరిహారం చెల్లించడంలేదని హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. గిరిజన రైతుల ఫిర్యాదులపై విచారణ జరపాలని, ప్రాజెక్టు కింద భూములు కోల్పోయినవారిని గుర్తించేందుకు ఒక ప్రత్యేకాధికారిని నియమించి ఏప్రిల్‌లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. 'శక్తి' స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి పి. శివరామకృష్ణ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనలు విన్న ధర్మాసనం... రైతుల ఫిర్యాదులను డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు పరిశీలించాలని, ఆయనకు ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(గిరిజన సంక్షేమం) సహకరించాలని ఆదేశించింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల స్క్రీనింగ్

టెస్ట్ ఫలితాలు వెల్లడించొద్దు

▸ అంబేద్కర్ వర్సిటీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకానికి నిర్వహించిన ఫలితాలను వెల్లడించ వద్దని హైకోర్టు స్పష్టం చేసింది. యూజీసీ నిబంధనల ప్రకారం సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేయకుండానే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీచేయడాన్ని ప్రశ్నిస్తూ... కాకినాడకు చెందిన కె. దంతేష్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది సువ్వారి శ్రీనివాస్ వాదిస్తూ, యూజీసీ నిబంధనలను ఉల్లంఘిస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వడం చట్టవిరుద్ధం కాదన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లకు వ్యతిరేకమన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు..అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించవచ్చని స్పష్టం చేశారు. అయితే ఫలితాలను ప్రకటించ వద్దని మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు.



మానకొండూరు సభలో ప్రసంగిస్తున్న ఉత్తమ్, వేదికపై కాంగ్రెస్ నేతలు; హాజరైన జనం

తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం

కేటీఆర్ అండతోనే ఇసుక దందా: ఉత్తమ్.. కొడుకు కోసమే కొత్త డ్రామా: రేవంత్

వేములవాడ/సిరిసిల్ల/మాచారెడ్డి/కరీంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ అండతోనే ఇసుక అక్రమ దందా సాగుతోందని, ఇసుక రీచ్‌లన్నీ కేసీఆర్ బంధువులకే అప్పగించారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రడ్డి ఆరోపించారు. ఒక పర్మిట్‌తో ఒక్కో లారీ వంద సార్లు తిరుగుతోందని, ఇది తాను చెబుతున్న విషయం కాదని.. 'ఆంధ్రజ్యోతి' పత్రిక పరిశోధించి రాసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య బస్సు యాత్ర బుధవారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో కొనసాగింది. ఉత్తమ్‌తోపాటు కాంగ్రెస్ నేతలు వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డు, కరీంనగర్ జిల్లా మానకొండూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఉత్తమ్ మాట్లాడుతూ నేరెళ్లలో దళితులపై దాడి జరగడం..అత్యంత బాధాకరమని వ్యాఖ్యానించారు. గనుల శాఖ మంత్రిగా కేటీఆర్‌కు ఇసుక రీచ్‌ల్లో షేర్ ఉందని, అందుకే ఎదురుతిరిగిన దళితులను చిత్రహింసలకు గురిచేశారని విమర్శించారు. నేరెళ్ల బాధితులను చూసి మాజీ స్పీకర్ మీరాకుమార్ కంటతడి పెడితే.. ఆమెను చులకన చేసి మాట్లాడటం టీఆర్‌ఎస్‌కే చెల్లిందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ దళిత సమాజం మేల్కొని రానున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో నిరంకుశ పాలన సాగుతోందని, నాలుగేళ్లలో ఏ ఒక్క హామీని కేసీఆర్ అమలు చేయలేదని మండిపడ్డారు. వేములవాడలో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి.. మాట తప్పిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. మిషన్ భగీరథలో ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి 6 శాతం కమీషన్ దండుకుంటున్న తండ్రీకొడుకులు దేశంలోనే అత్యంత అవినీతిపరులని ధ్వజమెత్తారు. సార్వత్రిక ఎన్నికలు డిసెంబరులోనే వచ్చే అవకాశం ఉందని, కాంగ్రెస్ ప్రభంజనం ఖాయమని స్పష్టం చేశారు.



ఎన్నికల సందర్భంగా తన కారులో మూడు కోట్లు దొరికాయంటూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్న కేటీఆర్‌కు ఆ కేసును హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలియదా అని ప్రశ్నించారు. సరిహద్దులో దేశ రక్షణ కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడిన తనపై మరోసారి ఆరోపణలు చేస్తే తీవ్రంగా స్పందిస్తానని హెచ్చరించారు. కాంగ్రెస్, తెలంగాణ సమాజం కోసం తన జీవితం అంకితమని పునరుద్ఘాటించారు. ఓటమి తప్పదన్న భయంతోనే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేసీఆర్ 'థర్డ్ ఫ్రంట్' పేరిట డ్రామా ఆడుతున్నాడని ఎద్దేవా చేశారు. దళితులకు మూడు కరాల భూమి ఇస్తామన్న హామీ అమలు కాక మానకొండూరు ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ఇద్దరు దళిత యువకులు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే, ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తున్నందునే ఎకరాకు రూ.4వేల పెట్టుబడి సాయం ఇస్తానంటున్నారని తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, పంట బీమా పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ థర్డ్ ఫ్రంట్ పేరిట కొడుకును సీఎం చేసేందుకు కేసీఆర్ కొత్త నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల హామీలతో గద్దెనెక్కి.. ఒక్క హామీనీ నెరవేర్చకుండా ప్రజలను మోసగించారని విమర్శించారు. సిరిసిల్లను మరో సూరత్‌ను చేస్తామని చెప్పిన కేటీఆర్.. రూ.150 కోట్ల కమీషన్‌కు కక్కుర్తి పడి బతుకమ్మ చీరలను సైతం ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి పంపిణీ చేశారని ఆరోపించారు. కేసీఆర్‌పై పోరాటానికి కాంగ్రెస్ దండు కట్టిందని, ఉత్తమ్ నాయకత్వంలో చేయి చేయి కలుపుదామని పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు కొడుకు, మనువడి సోకు తగిలిందని అందుకే ఢిల్లీ మాట మాట్లాడుతున్నాడని మాజీ ఎంపీ హన్మంతరావు విమర్శించారు. బంగారు తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మార్చాడని మండిపడ్డారు. కేసీఆర్ 'నంబర్ వన్' అని గవర్నర్ పొగిడినందుకే ప్రభుత్వం రూ.1.69 కోట్ల ఖరీదైన బెంజ్ కారును బహుమతిగా ఇచ్చిందని విమర్శించారు. అంతకుముందు కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో షబ్బీర్‌అలీ మాట్లాడుతూ కేసీఆర్ పచ్చి అబద్ధాల కోరు అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో షబ్బీర్‌అలీని భారీ మెజార్టీతో గెలిపిస్తే ముఖ్యమంత్రి గానీ, ఉపముఖ్యమంత్రి గానీ అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమస్యలను పక్కదారి పట్టించేందుకే థర్డ్ ఫ్రంట్ పేరిట కేసీఆర్ నాటకాలు ఆడుతున్నారని కాంగ్రెస్ నేత సర్వే సత్యానారాయణ సిద్దిపేటలో విమర్శించారు. కేసీఆర్‌కు అధికారం వస్తే రాష్ట్రమే కాదు దేశం సర్వనాశనం అవుతుందని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. సభలో నేతలు భట్టి విక్రమార్క, శ్రీధర్‌రాబు, జీవన్‌రెడ్డి, బలరాంనాయక్, పొన్నం ప్రభాకర్, శారద పాల్గొన్నారు.

రైతుకు అవసరమైన చోటే

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

▸ అలా అయితేనే రాయితీలు

▸ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా రైతు కేంద్రంగా పాలసీ రూపకల్పన జరగాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఆయా పరిశ్రమలు అవసరం ఉన్నచోటనే ఔత్సాహికులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించింది. ఇప్పటికే ఏర్పాటైన పరిశ్రమల యాజమాన్యాలతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీపై మంత్రి పోచారం, ఉపసంఘం సభ్యులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, కేటీఆర్ తదితర మంత్రులు సచివాలయంలో సమావేశమయ్యారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీకి సంబంధించి పరిశ్రమలశాఖ ఇప్పటికే రూపొందించిన ముసాయిదా గురించి ఉపసంఘం సభ్యులకు, సమావేశంలో పాల్గొన్న అధికారులకు ఆ శాఖ ప్రతినిధి అఖిల్ వివరించారు. అనంతరం సమావేశంలో జరిగిన చర్చలో.. రైతు కేంద్రంగా పాలసీ రూపకల్పన జరగాలని నిర్ణయించారు. పరిశ్రమల యాజమాన్యాలు, స్టేక్ హోల్డర్లతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు తీసుకునే బాధ్యత వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథికి అప్పగించారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన అవకాశాలు ఎక్కడ ఉన్నాయి? తదితర అంశాలపైన నివేదికలు రూపొందించాల్సిందిగా అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. పరిశ్రమలు, స్టేక్ హోల్డర్ల అభిప్రాయాలు, అధికారుల నివేదికల ఆధారంగా పరిశ్రమల శాఖ రూపొందించిన పాలసీ ముసాయిదాకు తుది మెరుగులు దిద్దనున్నారు. ఈ పాలసీ ముసాయిదాను మంత్రివర్గ ఉపసంఘం ఆమోదించిన తర్వాతనే మంత్రివర్గం ముందుకు వెళుతుందని చెబుతున్నారు. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లోని బంగినపల్లి మామిడి, టమాటాలు, ఉమ్మడి నల్లగొండలో పండే బత్తాయి ఫుడ్ ప్రాసెసింగ్‌కు పనికిరావని చెబుతున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అనువుగా ఉండే రకాలు కావాలంటే అనువుగాలేని రకాలను తొలగించి.. వాటి స్థానే అనువైన రకాలను ప్రోత్సహించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంవత్సరాల వ్యవధి పడుతుందనీ చెబుతున్నారు. పప్పు, బియ్యం, పసుపు తదితర పంటల ఉత్పత్తులు ఏడాది పొడవునా ఉండకపోవడం వల్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏడాదిలో కొన్ని నెలలే పనిచేస్తాయని, దీనికి పరిష్కారం ఆలోచించాల్సిన అవసరం ఉందంటున్నారు.


తప్పుకొంటున్నాం!

కేంద్రంలో పదవులకు గుడ్‌బై.. నేడు అశోక్, సుజనా రాజీనామా

▸ జైట్లీ ప్రకటన దిగ్భ్రాంతికరం

▸ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గం నుంచి తాము తప్పుకొంటున్నట్లు తెలుగుదేశం అధిపతి, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తీవ్ర ఆవేదన, బాధతోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఏపీకి సహాయంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడిన పద్ధతి తమకు ఆవేదన కలిగించిందన్నారు. బుధవారం రాత్రి 10.50 గంటల సమయంలో... సచివాలయంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "ప్రత్యేక హోదా ఇవ్వం! ఎన్ని నిధులు ఇవ్వాలన్నది సెంటిమెంట్ నిర్ణయించలేదు! ఒక లెక్క ప్రకారం 138 కోట్లు, మరో లెక్క ప్రకారం 1600 కోట్లు ఇస్తాం. మేం నిర్ణయించాం! ఇక తీసుకోవడం, తీసుకోకపోవడం రాష్ట్రంఇష్టం" అనేలా జైట్లీ మాట్లాడారని చంద్రబాబు ఆక్రోశించారు. ఈఏపీలు, రాయితీల గురించి మాట్లాడకుండా... '30 శాతం అదనపు నిధులు' అంటూ సింపుల్‌గా తేల్చేశారన్నారు. "ఇదంతా చూస్తే... ఏపీకి సహాయం చేయాలనే ఉద్దేశం వారికి లేదని అనిపించింది. దీనిపై మంత్రులు, ఎంపీలతో చర్చించాను. రాష్ట్రాన్ని ఏమాత్రం పట్టించుకోనందున... కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాం. గురువారం అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి ప్రధాన మంత్రిని కలిసి రాజీనామాలు సమర్పిస్తారు" అని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఇది తాము వేస్తున్న మొదటి అడుగు అని... ఎన్డీయే కూటమిలో కొనసాగాలా, వద్దా అనేది తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే...



హృదయాలను గాయపరిచింది...

నేను ఎక్కడా ఆవేశానికి గురి కాకుండా, ఈ రాష్ట్రానికి ఉన్న సమస్యలు పరిష్కరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసే ధోరణిలో అసెంబ్లీలో సుదీర్ఘంగా మాట్లాడాను. అయితే... ఆ వెంటనే అరుణ్ జైట్లీ విలేకరుల సమావేశం పెట్టి, ప్రత్యేక హోదా ఇచ్చేది లేదు, మరేమీ చేయలేం అన్న ధోరణిలో మాట్లాడటం మా హృదయాలను గాయపరిచింది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి తప్పుకోవడమే మంచిదనే నిర్ణయానికి వచ్చాం. మిత్ర ధర్మం ప్రకారం ప్రధాని మోదీకి కూడా ఒక మాట చెప్పాలనుకున్నా... ఆయన అందుబాటులోకి రాలేదు. అందుకే, మా నిర్ణయాన్ని మేం ప్రకటించాల్సి వచ్చింది.

తప్పుడు లెక్కలు...

కేంద్ర సహాయంపై ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న మమ్మల్ని జైట్లీ మాట్లాడిన తీరు దిగ్భ్రాంతికి గురిచేసింది. పైగా... కేంద్ర రక్షణ నిధులు కూడా కోరుతున్నట్లుగా అవమానించేలా మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఇచ్చిన హామీల్లో బీజేపీ కూడా భాగస్వామి! ఆ విషయాన్ని మరిచిపోయి ఇప్పుడు మిగిలిన రాష్ట్రాలతో పోలిక పెట్టి మాట్లాడటం సరికాదు. రాష్ట్రానికి అందుతున్న ప్రయోజనాలపై కేంద్రం చేస్తున్న వాదనలో వాస్తవం లేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఈ ఏడాది జనవరి 31వ తేదీన రూ.350 కోట్లు విడుదల చేశారు. కానీ... ప్రధాని ఆమోదం లేదంటూ వెంటనే మొత్తం డబ్బు వెనక్కి తీసుకున్నారు. దీనిని సాయమనాలా, మరింకేదైనా అనాలా? కేంద్రం నుంచి విడుదలైన ప్రతి రూపాయికీ లెక్కలు ఇచ్చాం. అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాం. లెక్కలు చెప్పలేదనడం నూటికి నూరు శాతం అసత్యం. పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్రం పెట్టిన ఖర్చే ఇంకా 2500 కోట్లు రావాల్సి ఉంది. ఢిల్లీలో ఉన్న పెద్దలు వినే ధోరణిలో ఉంటే ఇవన్నీ చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ, వారు వినకపోడమే ప్రధాన సమస్యగా మారింది. రెవెన్యూ లోటును ఎక్కువ చేసి చూపించామన్న కేంద్రం వాదన కూడా తప్పు. పీఆర్సీ కింద ఉద్యోగులకు ఇవ్వాల్సిన 4వేల కోట్లు ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేశాం. విభజన ఫలితంగా 3 వేల కోట్లు పెండింగ్ బిల్లులు రాష్ట్రం ఖాతాకు వచ్చి పడ్డాయి. ఇక... పింఛన్లకు సంబంధించి కూడా 1900 కోట్లు తాము చెల్లింపులు చేయాల్సి వచ్చింది. ఇవేవీ పరిగణలోకి తీసుకోబోమని కేంద్రం అంటే ఇంకేం చేయగలం?

కష్టాలు వచ్చినా...

మేం తీసుకున్న నిర్ణయం వల్ల కష్టాలు, ఇబ్బందులు రావొచ్చు. అయినా సరే ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. రాబోయే సమస్యలపై అవగాహన ఉండటంవల్లే నాలుగేళ్లపాటు ఓపికతో వ్యవహరించి, కేంద్రానికి నచ్చజెప్పడం ద్వారా రాష్ట్రానికి రావాల్సినవి సాధించుకునే ప్రయత్నం చేశాను. 29 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగాను. అయినా, ఆశించిన ప్రయోజనం దక్కనందునే ఇప్పుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. నాకు వ్యక్తిగతంగా ఎవ్వరిపైనా కోపం లేదు. కేంద్రం నుంచి అందాల్సిన సాయం అందలేదన్న ఏకైక కారణంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. దీనిని కేంద్రంలోని పెద్దలు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

ప్రత్యేక హోదా ఇవ్వబోం

(మొదటి పేజీ తరువాయి)

సుజనా చౌదరి ఆ పదవులకు రాజీనామా చేస్తారని తెలిపారు. బుధవారం సాయంత్రం అరుణ్ జైట్లీ మీడియా ముందుకు వచ్చి... ఏపీకి సాయంపై కేంద్రం వైఖరిని తేటతెల్లం చేసిన వెంటనే అమరావతిలో పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. జైట్లీ స్పందనపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. అప్పటికప్పుడు అందుబాటులో ఉన్న మంత్రులను సచివాలయానికి పిలిచి మాట్లాడారు. ఢిల్లీలో ఉన్న ఎంపీలతోనూ టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'ఇక చాలు! కేంద్రంలో మంత్రి పదవుల నుంచి వైదొలగడమే మంచిది' అని ఎంపీలంతా ముక్తకంఠంతో చెప్పారు. తమ పార్టీ వైఖరిని ప్రధానికి చెప్పి, దీనిపై అధికారిక ప్రకటన చేయాలని చంద్రబాబు భావించారు. కానీ... కేంద్ర కేబినెట్ జరుగుతున్న నేపథ్యంలో మోదీ అందుబాటులోకి రాలేదు. దీంతో చంద్రబాబు రాత్రి పొద్దుపోయాక మీడియా ముందుకు వచ్చారు. 'కటీఫ్' సంగతి తెలిపారు. అయితే... ఎన్టీయేలో కొనసాగాలా, వద్దా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. మరోవైపు... టీడీపీ నిర్ణయం నేపథ్యంలో తాము కూడా రాష్ట్రంలో మంత్రి పదవులను వదులుకోవాలని బీజేపీ నేతలు అప్పటికప్పుడు తీర్మానించారు.

ఏపీకి హోదా ఇవ్వం

రాయితీలు ఇవ్వం.. ప్యాకేజీ 'ఫార్ములా'పై ఏపీనే తేల్చాలి


▸ సానుభూతి, రాజకీయాలతో డబ్బులు రావు

▸ కేంద్రానికి 29 రాష్ట్రాలూ సమానమే

▸ మా దగ్గర డబ్బులు పొంగి పొర్లడంలేదు

▸ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 'అంతా ఇచ్చేశాం! కొత్తగా ఇచ్చేదేమీ లేదు! హోదా ఇవ్వం. పారిశ్రామిక రాయితీలు ఇవ్వలేం" అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. అంతేకాదు... కేంద్రం వద్ద నిధులు పొంగి పొర్లడంలేదని, తాము మొత్తం 29 రాష్ట్రాలనూ చూసుకోవాలనీ అన్నారు. 'రాజకీయాలతో, సానుభూతితో నిధులు రావు' అని వ్యాఖ్యానించారు. నవ్యాంధ్రకు అన్యాయంపై టీడీపీ, బీజేపీ మధ్య దూరం పెరుగుతున్న నేపథ్యంలో... బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'ఏపీకి సంబంధించి... మరీ ముఖ్యంగా... ప్రత్యేక హోదా ప్రభావం గురించి చెప్పాలనుకుంటున్నాను' అని ఆయన మొదలుపెట్టారు. వాస్తవానికి ఈశాన్య రాష్ట్రాలకు సొంతంగా వనరులు, తగినంత ఆదాయం లేనందునే ప్రత్యేక హోదా ఇచ్చారన్నారు. "హోదా ఉన్న రాష్ట్రాలకు కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 30 శాతం అదనంగా నిధులు సమకూరుతాయి. అందువల్ల... ప్రత్యేక ప్యాకేజీ కింద, విదేశీ ఆర్థిక ప్రాజెక్టుల ద్వారా ఆ 30 శాతం సర్దుబాటు చేస్తామని ఏపీకి చెప్పాం. అందుకు వారు అంగీకరించారు. అయితే... ఈఏపీల ద్వారా కాకుండా నాబార్డు వంటి ఆర్థిక సంస్థల ద్వారా నిధులు ఇప్పించాలని ఈ ఏడాది జనవరిలో ముఖ్యమంత్రి కోరారు. ఇందుకు కూడా మేం సమ్మతించాం. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి నాబార్డు నేరుగా నిధులు ఇస్తే కేంద్రానికి ద్రవ్య లోటు పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వానికి నేరుగా నాబార్డు నిధులు అందితే రాష్ట్ర ద్రవ్య లోటు పెరుగుతుంది. రాష్ట్రానికి రుణం పొందే సామర్థ్యం కూడా తగ్గుతుంది. అయినా కూడా నాబార్డుతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నాము. కానీ ద్రవ్య లోటుపై ప్రభావం పడకుండా నిధులు తీసుకునే మార్గం అన్వేషించాలి" అని జైట్లీ చెప్పారు. ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో రాష్ట్ర అధికారులు కేంద్ర ఆర్థిక శాఖలోని వ్యయ విభాగం కార్యదర్శితో సమావేశమై దీనిపై చర్చలు జరిపారన్నారు. ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్, కంపెనీ లేదా కార్పొరేషన్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని, ఆ సంస్థలో నాబార్డు నిధులను జమ చేస్తుందని చర్చల సందర్భంగా తాము సూచించామని వెల్లడించారు. "దీనిపై రాష్ట్ర ప్రభుత్వ స్పందన కోసం వేచిచూస్తున్నాం. ఏ పద్ధతిలో నిధులు కావాలో రాష్ట్రమే ఖరారు చేసి చెప్పాలి. ఈఏపీ ద్వారా అయినా, నాబార్డు నుంచైనా నిధులు ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని చెప్పారు.



లోటు లెక్క ఇది...

రెవెన్యూ లోటుపైనా అరుణ్ జైట్లీ తమ సొంత లెక్కలే చెప్పారు. రాష్ట్రం చెప్పినట్లుగా 16వేల కోట్లు లేదన్నారు. "2013-14 ఆర్థిక సంవత్సరంలో అయిన వ్యయాన్ని ఆధారంగా తీసుకుని లెక్కిస్తే... విభజన తర్వాత జరిగిన పది నెలలకు రెవెన్యూ లోటు రూ.4వేల కోట్లు మాత్రమే. ఇందులో మరో రూ. 138 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రెవెన్యూలోటును లెక్కించేందుకు మరో సూత్రం కూడా ఉంది. 2015-16లో రెవెన్యూలోటును లెక్కించి... దానిని 2013-14 ఆర్థిక సంవత్సరంలోని 10 నెలలకు అన్వయిస్తే, ఏపీకి అదనంగా మరో రూ. 1600 కోట్లు వస్తాయి. ఆ మొత్తం చెల్లించేందుకూ మేం సిద్ధంగా ఉన్నాం" అని అరుణ్ జైట్లీ చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలో హామీ ఇచ్చిన విధంగా ఆయా సంస్థలకు కూడా నిధులు ఇస్తూనే ఉన్నామని, నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. నూతన రాజధానికి రూ.2500 కోట్లు ఇచ్చామని, త్వరలో రాజధాని అభివృద్ధి అవుతుందని ఆశిస్తున్నామని దీమా వ్యక్తం చేశారు.

సానుభూతితో ఉన్నా....

ఏపీ పట్ల తనకు సానుభూతి ఉందని అరుణ్ జైట్లీ చెప్పారు. "విభజనను తెలంగాణ కోరుకుంది. ఏపీ ప్రజలు దీనిని కోరుకోలేదు. దీనివల్ల ఏపీకి వనరుల లోటు ఏర్పడింది. ఈ విషయం అందరికీ తెలుసు" అని చెప్పారు. వ్యక్తిగతంగా తాను రాష్ట్రంపట్ల సానుభూతితో ఉన్నానన్నారు. కానీ... సానుభూతి, రాజకీయాల వల్ల నిధులు రావని వ్యాఖ్యానించారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు దాటవేయడమో, ముక్తసరిగా స్పందించడమో చేశారు. 'ప్రత్యేక హోదా ఇవ్వాలని సీఎం చంద్రబాబు పట్టుబడుతున్నారు కదా' అని ప్రశ్నించగా.... 'ఇక రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వవద్దని 14వ ఆర్థిక సంఘం సూచించింది" అని చెప్పారు. ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన విభజన కాబట్టి, ఏపీకి పలు ప్రయోజనాలు కల్పించాలన్న షరతుల మేరకే నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేయగా... "ప్రతీ షరతును సంతృప్తి పరుస్తాం. చట్టంలో ఉన్న అన్ని అంశాలకు కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే ఏపీకి హోదా ప్రకటిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారని జైట్లీ దృష్టికి తీసుకెళ్లగా... "సరే! అయినప్పటికీ నేను రాజ్యాంగమే ప్రకారం నడుచుకోవాలి" అని వ్యంగ్యంగా అన్నారు. ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు ఐజీఎస్టీ, సీజీఎస్టీ తిరిగి చెల్లిస్తున్నారు కదా? ఏపీకి ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించగా... "గతంలో హోదా కలిగిన రాష్ట్రాలకే అది ఇస్తున్నాము. బిహార్, జార్ఖండ్ కూడా విడిపోయాయి కదా! వాటికి మాత్రం ఎందుకు ఇవ్వకూడదని అడుగుతారు. కేంద్ర ప్రభుత్వం 29 రాష్ట్రాలను సమానంగా చూడాలి. కేంద్ర నిధులపై ప్రతీ రాష్ట్రానికి సమాన హక్కు ఉంది" అని తెలిపారు. ఏపీకి సంబంధించి 'సెంటిమెంట్' ఉంది కదా అని ప్రశ్నించగా... 'భావోద్వేగాల ద్వారా నిధులు పెంచడం సాధ్యం కాదు' అని ఆయన తెగేసి చెప్పారు.

పోలవరానికి 5 వేల కోట్లు ఇచ్చాం

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే దాదాపు రూ. 5 వేల కోట్లు ఇచ్చామని, దాన్ని సానుకూల వైఖరితో చూడాలని జైట్లీ సూచించారు. కేంద్ర పునరావాస వ్యయం కేంద్రం భరిస్తుందా అని ప్రశ్నించగా... 'నిధుల విషయంలో ఇలాంటి విలేకరుల సమావేశంలో హామీలు ఇవ్వలేం' అని తెలిపారు. వెనుకబడిన జిల్లాలకు ఇస్తున్న నిధులు సరిపోవడం లేదని రాష్ట్రం అంటుందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.... "మేం ఇచ్చేది ఇస్తాం. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఖర్చుపెట్టమనండి. ఏపీ ప్రగతిశీల రాష్ట్రం కదా.." అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమకు సంబంధించి రెవెన్యూలోటు, హోదా ప్రయోజనాలే ముఖ్యమైన అంశాలన్నీ... వాటిపై తమ వైఖరి సానుకూలంగా ఉందని తేల్చేశారు.

టాటాల చేతికి భూషణ్ స్టీల్?

ముంబై: దివాలా చట్టాల కింద విచారణను ఎదుర్కొంటున్న భూషణ్ స్టీల్‌ను దక్కించుకునేందుకు టాటా స్టీల్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించేట్టుగా ఉన్నాయి. భూషణ్ స్టీల్ కోసం దాఖలైన బిడ్స్‌లో గరిష్ఠ స్థాయి బిడ్ టాటా స్టీల్‌దే. భూషణ్ స్టీల్‌కు అప్పులిచ్చిన బ్యాంకుల కమిటీ ఈ విషయాన్ని ధృవీకరించింది. గరిష్ఠ బిడ్డర్‌గా రంగంలో నిలిచిన టాటా స్టీల్ తదుపరి ప్రక్రియపై సలహా సంస్థలతో, భూషణ్ స్టీల్ రుణదాతలతో చర్చిస్తోంది. బిడ్ వివరాలను టాటాలు వెల్లడించలేదు. అనధికార సమాచారం ప్రకారం, అప్‌ఫ్రంట్ బ్యాంకులకు 34,000 కోట్ల రూపాయల చెల్లించడంతో పాటు కంపెనీ పునరుద్ధరణ కోసం 1,200 కోట్ల రూపాయలను వెచ్చించడానికి టాటా స్టీల్ ముందుకు వచ్చింది. భూషణ్ స్టీల్‌లో 12 శాతం వాటాను కూడా రుణ సంస్థలకు ఆఫర్ చేసింది. ఆటో గ్రేడ్ స్టీల్ తయారీలోని అతిపెద్ద సంస్థగా పేరున్న భూషణ్ స్టీల్ బ్యాంకులకు మొత్తం 44,000 కోట్ల రూపాయలు బకాయి పడింది.

పారిశ్రామిక రంగంలో అతివల హవా

ఎనిమిదేళ్లలో 35 శాతం పెరిగిన నాయకత్వం

ముంబై: మన దేశ పారిశ్రామిక రంగంలోనూ నారీ లోకం తమ సత్తా చాటుతోంది. ఈ రంగంలో నాయకత్వ స్థానాల్లో ఉన్న స్త్రీల సంఖ్య మన దేశంలో గత ఎనిమిదేళ్లలో 30 శాతానికిపైగా పెరిగింది. ప్రస్తుతం దేశ పారిశ్రామిక రంగంలో నాయకత్వ స్థానాల్లో ఉన్న వారిలో ఐదో వంతు మంది స్త్రీలేనని బుధవారం విడుదలైన ఒక సర్వే పేర్కొంది. లింక్‌డ్‌ఇన్ డేటా ఆధారంగా ఈ సర్వే రూపొందించారు. సానుకూల వ్యాపార పరిస్థితులు, పెరుగుతున్న సులభతర వ్యాపార విధానాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. నాయకత్వ ఆలోచనలు ఉన్న స్త్రీలు ప్రస్తుతం వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ రాణిస్తున్నారు. 2009 తర్వాత ఈ తరహా ఆలోచనా విధానం మహిళల్లో 35 శాతం పెరిగింది. 'ప్రస్తుతం కంపెనీలు మహిళా సమానతకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధిలో ముందుకు పోతున్నాయి. దీంతో స్త్రీలు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత శాస్త్ర (స్టెమ్) రంగాల్లో స్త్రీలు నాయకత్వ స్థానాలు అధిరోహిస్తున్నారు' అని లింక్‌డ్‌ఇన్ ఇండియా హెచ్‌ఆర్ డైరెక్టర్ రాధా శ్రీనివాస్ చెప్పారు.

చేయాల్సింది చాలా ఉంది

పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో మహిళల పాత్ర పెంచేందుకు ఇంకా చేయాల్సింది చాలా ఉందని రాధా శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా ఈ రంగాల ఉద్యోగాల్లో మహిళల సంఖ్య పెంచడంతోపాటు, భవిష్యత్ నాయకులుగా వారిని తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. మహిళలు ఎక్కువగా ఉండే మీడియా, కమ్యూనికేషన్స్, విద్యా రంగాల వృద్ధి రేటు కూడా నిలకడగా ఉన్నట్టు సర్వే పేర్కొంది. 2017నాటికి మన దేశంలోని ఈ మూడు రంగాల్లోని ఉద్యోగుల్లో మహిళా ఉద్యోగులు 9.5 నుంచి 11 శాతం వరకు ఉన్నారు. అంతర్జాతీయంగా చూస్తే గత 40 సంవత్సరాల్లో స్టెమ్ రంగాలకు చెందిన ఉద్యోగాల్లో స్త్రీల సంఖ్య గణనీయంగా పెరిగిందని సర్వే పేర్కొంది.

ప్రస్తుతం సైన్యం, సముద్ర నౌకాయానం వంటి కీలకమైన 10 రంగాల్లోనూ మహిళలు నాయకత్వ స్థానాల్లో దూసుకు పోతున్నట్టు వెల్లడించింది. ట



మహిళా పైలెట్ల నియామకాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్పైస్ జెట్ విమానయాన సంస్థ మహిళా పైలెట్ల రిక్రూట్‌మెంట్ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బుధ, గురువారాల్లో ఇందుకోసం గురుగ్రామ్‌లోని స్పైస్ జెట్ ట్రైనింగ్ అకాడమీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. బోయింగ్ 737, బంబార్డియర్ క్యు400 విమానాలు నడిపేందుకు కమర్షియల్ పైలెట్ లైసెన్సు ఉన్న మహిళలు ఎవరైనా ఈ ఇంటర్వ్యూకి హాజరు కావచ్చు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజు నియామక పత్రాలు అందజేస్తారని తెలిపింది.

పూర్తి మహిళా సిబ్బందితో విమాన సర్వీసులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పూర్తిగా మహిళా పైలెట్లు, క్యాబిన్ సిబ్బందితో కొన్ని రూట్లలో విమాన సర్వీసులు నడుపుతున్నట్టు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా, ఎయిర్‌ఏసియా ఇండియా ప్రకటించాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అయితే కోచి, కోజికోడ్, తిరువనంతపురం, చెన్నై, మంగుళూరు, ముంబై, ఢిల్లీ నుంచి ఎనిమిది అంతర్జాతీయ రూట్లలో పూర్తిగా మహిళా సిబ్బందితో విమాన సర్వీసులు నడుపుతోంది. ఇదే రోజు తమ ఉద్యోగుల్లో 40 శాతం వరకు ఉన్న మహిళా సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించనున్నట్టు తెలిపింది. ఎయిర్‌ఏసియా ఇండియా కూడా గురువారం బెంగుళూరు-గువహతి, ఢిల్లీ-గోవా మధ్య పూర్తిగా మహిళా పైలెట్లు, క్యాబిన్ సిబ్బందితో రెండు ప్రత్యేక ఫ్లయిట్ సర్వీసులు నడుపుతోంది.

గోల్డ్ స్కీమ్‌లో స్కామ్ దాగుందా?

80:20 పథకంలో ఏం జరిగింది?



బంగారం దిగుమతులకు సంబంధించి యుపిఎ ప్రభుత్వం ప్రకటించిన 80:20 స్కీమ్ ఇప్పుడు మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం మెడకు చుట్టుకుంటోంది. ఈ స్కీమ్‌ను అతిపెద్ద స్కామ్‌గా మోదీ ప్రభుత్వం చెబుతోంది. ఆభరణాల వ్యాపారుల సంఘాలు ఈ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌కు మొరపెట్టుకున్నాయని, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు కూడా ఈ స్కీమ్‌ను వ్యతిరేకించారని పిఎసి సబ్ కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఒక బలమైన లాబీకి తలొగ్గి ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ముందుకు తెచ్చిందని, ఈ స్కీమ్ పర్యవసానమే నీరవ్ మోదీ, చోక్సీల 12,000 కోట్ల రూపాయల భారీ కుంభకోణానికి మూలమన్నది అభియోగం. ఈ స్కీమ్ దాని నేపథ్యంపై పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

- యుపిఎ ప్రభుత్వం 2013 జూన్‌లో ప్రభుత్వం బంగారం దిగుమతులపై కఠిన ఆంక్షలు విధించింది. అడ్డగోలు దిగుమతుల కారణంగా విలువైన ఫారెక్స్ అంతా బంగారం కోసం ఖర్చవుతుండటం, మరోవైపు కరెంట్ ఖాతా లోటు పెరిగిపోతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. స్వల్ప మొత్తాల్లో, అతికూడా ప్రత్యేక అవసరాల కోసం మాత్రమే బంగారం దిగుమతి చేసుకునేవిధంగా విదేశీ వాణిజ్య విధానంలో సవరణలు తెచ్చారు.
- ఆ తర్వాత నెల రోజుల వ్యవధిలోనే కొత్త స్కీమ్‌ను ప్రకటించారు. బంగారం వ్యాపారంలోని సంస్థలు అంతకు ముందు చేసుకున్న దిగుమతుల్లోంచి 20 శాతం వరకు ఎగుమతులు చేసిన పక్షంలో, మళ్లీ కొత్తగా బంగారం దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తూ 80:20 స్కీమ్‌ను ముందుకుతెచ్చారు. ఈ స్కీమ్ కింద బంగారం దిగుమతిచేసుకునే వెసులుబాటును కేవలం ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రమే ఇచ్చారు.
- 2014 మే 21న ఆర్‌బిఐ ఈ స్కీమ్‌కు సవరణలు చేస్తూ ప్రైవేట్ రంగంలోని 13 స్టార్ ట్రేడింగ్ హౌజెస్ (ఎస్‌టిహెచ్), ప్రీమియర్ ట్రేడింగ్ హౌజెస్ (పిటిహెచ్)లను బంగారం దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ కంపెనీల్లో చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ కూడా ఒకటి. ఈ సంస్థలు దిగుమతి చేసుకున్న బంగారంలో 80 శాతం లోకల్ మార్కెట్లో విక్రయించేందుకు ఆమోదిస్తూ, మరో 20 శాతం వాల్యూ యాడెడ్ ఉత్పత్తులుగా విదేశాలకు ఎగుమతి చేయాలని షరతు విధించారు.
- బంగారం దిగుమతులకు ప్రత్యేక అనుమతి పొందిన సంస్థల్లో బియ్యం వ్యాపారంలో ఉన్న సంస్థలు, ఉత్పత్తుల రంగంలోని సంస్థలు కూడా ఉన్నాయి. మెజార్టీ సంస్థలకు బంగారం, ఆభరణాల వ్యాపారంతో ఎలాంటి సంబంధం లేని సంస్థలున్నాయి. 2014 ఏప్రిల్-సెప్టెంబరు మధ్యకాలంలో మొత్తం దిగుమతుల్లో 40 శాతం బంగారం ఈ 13 సంస్థలే చేసుకున్నాయి.
- ఈ స్కీమ్ వల్ల బంగారం హోర్డింగ్‌కు ఆస్కారం ఏర్పడిందనీ, కృత్రిమంగా ధరలను పెంచి అడ్డగోలుగా వ్యాపారులు లాభాలను మూటగట్టుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. ఆభరణాల ఎగుమతి, దిగుమతుల వ్యాపారంతో సంబంధం లేని స్టార్‌హౌజ్‌లకు ఏకంగా రెండు టన్నుల వరకు బంగారం దిగుమతికి అనుమతించారని ఇండియన్ బులియన్ అండ్ జువెలరీ అసోసియేషన్ ఆరోపించింది. అప్పట్లో రఘురామ్ రాజన్ దృష్టికి కూడా ఈ విషయం తీసుకుపోయినట్టు చెబుతోంది.
- ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ స్కీమ్‌ను ఎత్తివేసింది. 2016లో కాగ్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ స్కీమ్ కారణంగా సర్కారు ఖజానాకు లక్ష కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లింది. కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు ఈ స్కీమ్‌ను ఉపయోగించుకొని రౌండ్ ట్రిప్పింగ్‌కు పాల్పడ్డారని అంటున్నారు.
- రౌండ్ ట్రిప్పింగ్ అంటే నల్లధనాన్ని బయటకు తరలించడం, దానినే తెల్లధనంగా స్వదేశానికి రప్పించడం. బంగారాన్ని దిగుమతి చేసుకోవడం, గాజులు, గొలుసుల రూపంలో దుబాయ్‌కి ఎగుమతి చేయడం అదే బంగారాన్ని కరిగించి దిగుమతు రూపంలో దేశంలోకి తేవడం... ద్వారా భారీ ఎత్తున మనీలాండరింగ్ జరిగిందని అంటున్నారు.

ఫోర్బ్స్ కుబేరుల్లో 8 మంది భారత మహిళలు





న్యూయార్క్ : ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితాలో భారత్ నుంచి ఎనిమిది మంది మహిళలకు స్థానం లభించింది. మొత్తం మహిళల నికర సంపద లక్ష కోట్ల డాలర్లు దాటడం విశేషం. అంతకు ముందు ఏడాదితో పోల్చితే ఇది 20 శాతం అధికం. వారిలో వారసత్వం ద్వారా సంపద లభించిన వారే ఎక్కువ. సొంతంగా సంపన్నులుగా మారిన మహిళల సంఖ్య గత ఏడాదిలో 56 ఉండగా.. ఈ ఏడాదిలో 72కు పెరిగింది. భారతీయ మహిళల్లో సావిత్రి జిందాల్ అండ్ ఫ్యామిలీ సంపద 880 కోట్ల డాలర్ల సంపదతో అగ్రస్థానంలో (ప్రపంచ జాబితాలో 176వ స్థానం)నిలిచింది. బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా రెండో స్థానంలో ఉన్నారు. ఈమె సంపద 360 కోట్ల డాలర్లు (629వ స్థానం). సమిత క్రిష్ణ-గోద్రెజ్ సంపద 290 కోట్ల డాలర్లు (822వ స్థానం), లీలా తివారీ సంపద 240 కోట్ల డాలర్లు (1,020వ స్థానం)గా ఉంది. హావెల్స్ ఇండియాకు చెందిన వినోద్, అనిల్ రాయ్ గుప్తా 1,103వ స్థానంలో (సంపద 220 కోట్లడాలర్లు) ఉన్నారు. అను అగా 140 కోట్ల డాలర్ల సంపదతో దేశీయంగా ఆరో స్థానంలో, ప్రపంచజాబితాలో 1,650వ స్థానంలో నిలిచారు. 110 కోట్ల డాలర్ల నికర విలువతో షీలా గౌతమ్ 1,999వ స్థానంలో నిలిచారు. 110 కోట్ల డాలర్ల సంపదతో మధు కపూర్ కూడా 1,999వ స్థానంలో ఉన్నారు.

యువ కుబేరుడు విజయ్ శర్మ



పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ దేశంలో అత్యంత యువ కుబేరుడిగా నిలిచారు. ఈయన వయసు 39 సంవత్సరాలు. 170 కోట్ల డాలర్ల సంపదతో ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితా 2018లో శర్మ 1,394వ స్థానంలో ఉన్నారు. 2011 సంవత్సరంలో ఈయన మొబైల్ వ్యాలెట్ పేటీఎంను ప్రారంభించారు. పేటీఎం మాల్‌తోపాటు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను కూడా నిర్వహిస్తున్నారు. ఫోర్బ్స్ జాబితాలో 40 ఏళ్లకన్నా తక్కువ వయసున్న వారి సంఖ్య 63 (వీరి సంపద 26,500 కోట్ల డాలర్లు). వీరిలో 34 మంది సొంతంగా కుబేరులయ్యారు. అల్‌కెమ్ లాబొరేటరీస్ గౌరవ ఛైర్మన్ సంప్రద సింగ్ అధిక వయసు (92 ఏళ్లు) కలిగిన సంపన్నుడిగా ఉన్నారు. 120 కోట్ల డాలర్ల సంపదతో ఈయన 1,867వ స్థానంలో నిలిచారు.

తెలుగు వారు ఇద్దరు

ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అరబిందో ఫార్మా వ్యవస్థాపకుడు పివి రామ్‌ప్రసాద్ రెడ్డి 965వ స్థానంలో నిలిచారు. ఈయన సంపద 250 కోట్ల డాలర్లుగా ఉంది. అలాగే దివీస్ లాబొరేటరీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మురళి దివీ 230 కోట్ల డాలర్ల సంపదతో 1070వ స్థానంలో ఉన్నారు.



11 సంవత్సరాలుగా చెక్కు చెదరని ముకేశ్ అగ్రస్థానం



భారత్‌లోని కుబేరుల జాబితాలో ఆర్‌ఐఎల్ అధినేత ముకేష్ అంబానీ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. వరుసగా 11వ సంవత్సరంలోనూ ఈయన స్థానం చెక్కు చెదరలేదు. 2018 ఫోర్బ్స్ మేగజైన్ ప్రకటించిన ప్రపంచ సంపన్నుల జాబితా ప్రకారం.. ముకేష్ అంబానీ సంపద 4,010 కోట్ల డాలర్లు (రూ.2,60,622 కోట్లు). ఏడాది కాలంలోనే ఈయన సంపద ఏకంగా 72.84 శాతం మేర పెరగడం విశేషం. ప్రపంచ సంపన్నుల్లో 2017 సంవత్సరంలో 33వ స్థానంలో ఉన్న ముకేష్ ఈ ఏడాదిలో 19వ స్థానానికి ఎగబాకారు.

- మన దేశం నుంచి ఫోర్బ్స్ జాబితాలో 119 మందికి స్థానం లభించింది. దేశీయ కుబేరుల్లో అజీమ్ ప్రేమ్ జీ రెండో స్థానంలో (ప్రపంచ జాబితాలో 58వ స్థానం, సంపద 1,880 కోట్ల డాలర్లు) ఉన్నారు. మూడో స్థానంలో లక్ష్మీ మిట్టల్ (98వ స్థానం, 1,850 కోట్ల డాలర్లు), నాలుగో స్థానంలో శివ్ నాడార్ (98వ స్థానం, 1,460 కోట్ల డాలర్లు), ఐదో స్థానంలో దిలీప్ సంఘ్వి (115వ స్థానం, 1,280 కోట్ల డాలర్లు) నిలిచారు.
- భారత్‌లోని టాప్ టెన్ కుబేరుల్లో కుమార్ మంగళం బిర్లా (ప్రపంచ జాబితాలో 127వ స్థానం, 1,180 కోట్ల డాలర్లు), ఉదయ్ కోటక్ (143వ స్థానం, 1,070 కోట్ల డాలర్లు), రాధాకృష్ణన్ దమాని (151వ స్థానం, 1,000 కోట్ల డాలర్లు), గౌతమ్ అదానీ (154వ స్థానం, 970 కోట్ల డాలర్లు), సైరస్ పూనావాలా (170వ స్థానం, 910 కోట్ల డాలర్లు), పతంజలి ఆయుర్వేద సహ వ్యవస్థాపకుడు ఆచార్య బాలకృష్ణ (274వ స్థానం, 630 కోట్ల డాలర్లు) ఉన్నారు.

నీరవ్ మోదీ ఔట్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ను మోసం చేసిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో స్థానం కోల్పోయారు. గత ఏడాది 180 కోట్ల డాలర్ల సంపాదనతో ఈయన ఫోర్బ్స్ జాబితాలో నిలిచారు.

ప్రపంచ కుబేరుల్లో జెఫ్ బెజోస్‌కు అగ్రస్థానం

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈయన సంపద 11,200 కోట్ల డాలర్లు. గత ఏడాది జాబితాలో ఈయన మూడో స్థానంలో ఉన్నారు. ఈయన తర్వాతి స్థానంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ (9,000 కోట్ల డాలర్లు) నిలిచారు. 8,400 కోట్ల డాలర్ల సంపదతో వారెన్ బఫెట్ మూడో స్థానంలో నిలిచారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 544వ స్థానం నుంచి 766వ స్థానానికి పడిపోయారు. ఈయన సంపద 310 కోట్ల డాలర్లు.

రాష్ట్రంలో జపాన్ ఎస్‌ఎంఇల కోసం ప్రత్యేక పార్క్

నైపుణ్యాల అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలి: మంత్రి కెటిఆర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : జపాన్ నుంచి పారిశ్రామిక పెట్టుబడులు ఆకర్షించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో జపాన్ చిన్న, మధ్య తరహా కంపెనీ (ఎస్‌ఎంఇ)ల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి కెటి రామారావు చెప్పారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ)-జపాన్ విదేశీ వాణిజ్య సంస్థ (జెట్‌రో) సంయుక్తంగా నిర్వహించిన భారత్-జపాన్ వ్యాపార భాగస్వామ్య సదస్సులో కెటిఆర్ మాట్లాడారు. అత్యాధునిక పారిశ్రామిక నైపుణ్యాల్లో కార్మికులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్‌లోనూ ఒక అత్యాధునిక నైపుణ్యాల అభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జెట్‌రోని మంత్రి కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే జపాన్ కంపెనీలకు అవసరమైన అన్ని రకాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భౌగోళికంగా దేశంలో హైదరాబాద్ నగరానికి ఉన్న ప్రత్యేకతలను మంత్రి జపాన్ ప్రతినిధి వర్గానికి వివరించారు. సులభతర వ్యాపార విధానాల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఐటి, ఫార్మాతో పాటు అత్యాధునిక తయారీ రంగంలో హైదరాబాద్ కంపెనీలతో కలిసి పని చేయాలని భావిస్తున్నట్టు జెట్‌రో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ షెజికో మెదా సదస్సుకు ముందు జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు.

తెలంగాణలో ఇఎస్‌ఇ ఫుడ్స్ యూనిట్!

జపాన్‌కు చెందిన ఇఎస్‌ఇ ఫుడ్స్ రాష్ట్రంలో తన యూనిట్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందని కెటిఆర్ చెప్పారు,. ఈ విషయాన్ని పరిశీలించడంతో పాటు రాష్ట్రం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ఈ నెల 12-13 తేదీల్లో ఆ కంపెనీకి చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్ వస్తోందన్నారు. ఈ సంవత్సరం జనవరిలో మంత్రి కెటిఆర్ జపాన్‌లో పర్యటించినప్పుడు ఇఎస్‌ఇ ఫుడ్స్ కంపెనీ ఛైర్మన్‌తోనూ సమావేశమయ్యారు. అప్పుడే రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆ కంపెనీ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

ఎస్‌బిఐకి రూ.40 లక్షల ఫైన్

ముంబై: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)పై ఆర్‌బిఐ రూ.40 లక్షల జరిమానా విధించింది. నకిలీ నోట్లను గుర్తించి, జప్తు చేసే విషయంలో ఆదేశాలు పాటించనందుకుగాను ఈనెల 1న ఎస్‌బిఐపై పెనాల్టీ విధించినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆర్‌బిఐ పేర్కొంది.

విస్తరణ బాటలో క్లిక్2క్లినిక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంటి వద్దే వైద్య సేవలను సమకూర్చే స్టార్టప్ క్లిక్2క్లినిక్ హెల్త్‌కేర్ భారీ విస్తరణ ప్రణాళికను రూపొందించుకుంది. ప్రస్తుతం ఐదు నగరాల్లో సేవలందిస్తున్నట్లు, ఈ ఏడాది చివరికల్లా 20 నగరాలకు సేవలను విస్తరించనున్నట్లు క్లిక్2క్లినిక్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ సుజీత్ ఆర్ పున్నమ్ తెలిపారు. 2019చివరినాటికి 60 నగరాలకు విస్తరించాలనుకుంటున్నామని చెప్పారు. హోమ్‌హీల్ అనే యాప్ ద్వారా సంస్థ సేవల కోసం రిజిస్టర్ చేసుకోవచ్చు. మంచానికే పరిమితమైన వృద్ధులు, ఆపరేషన్ చేయించుకున్నవారు, పసి పిల్లలకు నర్సులు, కేర్ గివర్స్, ఫిజియోథెరపిస్టులు, డాక్టర్ల ద్వారా ఇంటివద్దే వైద్య సేవలను ఆఫర్ చేస్తున్నట్టు సంస్థ తెలిపింది.

ఏప్రిల్‌కల్లా మరో రూ.3 కోట్ల ఫండింగ్

తమ సంస్థ ఇప్పటివరకు రూ.6 కోట్ల పెట్టుబడులు సేకరించిందని, ఈ ఏడాది సేవల విస్తరణ కోసం మరో రూ.3 కోట్ల మేర నిధులు సేకరించాలని అనుకుంటున్నట్లు క్లిక్2క్లినిక్ సహ వ్యవస్థాపకులు, సిఇఒ మురళీ భరద్వాజ్ తెలిపారు. ఇప్పటికే పలువురు ఇన్వెసర్లు తమ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని, ఏప్రిల్‌కల్లా ఫండింగ్ లభించవచ్చన్నారు. ఈ ఏడాది ముంబై, పుణె, చెన్నైతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, నిజామాబాద్ లోనూ సంస్థ సేవలను అందుబాటులోకి తేనున్నామని ఆయన చెప్పారు. వచ్చే ఏడాది మరో 40 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్న తమ సంస్థ ఇందుకోసం మరో రూ.6-7 కోట్ల మేర ఫండింగ్ సేకరించనుందన్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33033.09	10154.20	30705	38735	64.89	65.31
⬇ 284.11	⬇ 95.05	⬆ 100	⬆ 300	⬆	⬆

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

రూ.4,500 కోట్లతో
చిన్న విమానాశ్రయాల అభివృద్ధి

ఏడాదిన్నరకల్లా రెడీ, రక్షణ శాఖ అండదండలు.. పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషాపాధి




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉషాపాధి, బిఎఒఎ, డెలాయిట్ నివేదిక విడుదల చేస్తున్న ప్రతినిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వం ఉడాన్ పథకం కింద 4,500 కోట్ల రూపాయల పెట్టుబడితో దేశంలో 56 విమానాశ్రయాలు, 31 హెలీపాడ్‌లు అభివృద్ధి చేస్తున్నదని పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పాధి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో బిజినెస్ ఏవియేషన్‌పై జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా మాట్లాడుతూ... 2017 బడ్జెట్ ప్రసంగంలోనే ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఉడాన్ పథకాన్ని ప్రకటించారన్నారు. ఉడాన్ తొలి రౌండ్‌లో ప్రకటించిన ఈ విమానాశ్రయాల అభివృద్ధి, పునరుద్ధరణకు స్థానిక అవసరాల ఆధారంగా నాలుగు నెలల నుంచి 18 నెలల వ్యవధి ఇచ్చామని ఆమె చెప్పారు. అలాగే ఇటీవలే ప్రకటించిన ఉడాన్ రెండో రౌండ్‌లో మరో 60 విమానాశ్రయాల అభివృద్ధికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. రెండో విడతలో చిన్న ఎయిర్‌స్ట్రిప్‌లను, హెలీపాడ్‌లను కూడా డిమాండు ఆధారంగా అభివృద్ధికి చేపడుతున్నట్టు చెప్పారు. వాటిలో విమానాల రాకపోకలు ఏ మాత్రం లేనివి 21 ఉన్నాయని, అలాంటి చోట్ల ఎటిసి టవర్లతోపాటు అన్ని రకాల మౌలిక వసతులు అభివృద్ధి చేసి విమానాల రాకపోకలకు లైసెన్సులు ఇవ్వాల్సి ఉంటుందని ఉష తెలిపారు. అలాగే విమానాల రాకపోకలున్నప్పటికీ సామర్థ్యం పూర్తిగా వినియోగంలోకి రాని మరికొన్ని విమానాశ్రయాలు కూడా ఉన్నాయని, వాటికి మౌలికవసతుల అభివృద్ధి పెద్దగా అవసరం ఉండదని ఆమె అన్నారు.

అలాగే విమానాలు నడపడానికి వీలులేని మారుమూల ప్రాంతాల్లో హెలీపాడ్‌లు, హెలీపోర్ట్‌లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి చిన్న విమానాశ్రయాలు, హెలీపాడ్‌లను అభివృద్ధి చేయడం వల్ల ద్వితీయ, తృతీయ, నాలుగో శ్రేణి నగరాలకు విమాన సేవలు విస్తరించడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయ చర్యలకు, టూరిజం అభివృద్ధి, అత్యవసర వైద్య సేవల విస్తరణకు కూడా ఉపయోగపడతాయని ఆమె అన్నారు. ప్రాంతీయ కనెక్టివిటీ పెంచడం కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ చొరవకు రక్షణ శాఖ కూడా అండగా నిలుస్తున్నదని ఉష తెలిపారు. ఇప్పటివరకు రక్షణ శాఖకు చెందిన విమానాశ్రయాలు, హెలీపాడ్‌లను పౌర అవసరాలకు అనుమతించేవారు కాదని, ఉడాన్ 2 కింద వాటిని కూడా పౌర విమానాల రాకపోకలకు అనుమతిస్తూ రక్షణ శాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేసిందని ఆమె చెప్పారు. ఉడాన్‌కు ప్రోత్సాహకంగా వాటిలో ల్యాండింగ్ చార్జీల నుంచి కూడా మినహాయింపు ఇచ్చారని ఆమె అన్నారు. అయితే వాటిలో విమానాల పార్కింగ్‌కు వసతులు లేకపోవడం వల్ల సమీపంలోని ప్రభుత్వ స్థలాలను సేకరించి పార్కింగ్ వసతులు కల్పించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. అయితే పెద్ద నగరాల్లో విమానయాన మౌలికవసతులు విస్తరించాల్సి ఉందన్న బిజినెస్ ఏవియేషన్ విభాగం ఆందోళనను కూడా పరిగణనలోకి తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు.

నగరాల్లో మౌలిక వసతుల విస్తరణలో భాగంగా రూఫ్ టాప్ హెలీపాడ్‌లకు అనుమతి ఇవ్వడం, శివారు ప్రాంతాల్లో చిన్న విమానాశ్రయాల నిర్మాణం వంటి చర్యలు పరిశీలనలో ఉన్నట్టు తెలిపారు. దేశంలో 1,200 వరకు ఉపయోగంలో లేని విమానాశ్రయాలు, హెలీపాడ్‌లు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు తాము కృషి చేస్తున్నామని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జికె చౌకియాల్ చెప్పారు. వీటి అభివృద్ధి కోసం పర్యాటక శాఖతో భాగస్వామ్యం కుదుర్చుకునే విషయం కూడా పరిశీలనలో ఉన్నదన్నారు.

దేశంలో సివిల్ ఏవియేషన్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు దీటుగా బిజినెస్ ఏవియేషన్‌ను ప్రోత్సహించే చర్యలు తీసుకోవడంలేదని బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ (బిఎఒఎ) ప్రెసిడెంట్ రోహిత్‌కపూర్ తన ప్రారంభోపన్యాసంలో ఆవేదన వెలిబుచ్చారు. 2014 సంవత్సరంలో 24 శాతం వృద్ధిని నమోదు చేసిన బిజినెస్ ఏవియేషన్ విభాగం తదుపరి జీరో వృద్ధికి పడిపోయిందని, ఇప్పుడిప్పుడే ఒక అంకె వృద్ధికి చేరుకున్నదని ఆయన చెప్పారు. 2008-09 సంవత్సరంలో బిజినెస్ ఏవియేషన్‌లో మనకన్నా వెనుకబడి ఉన్న చైనా శర

మా గోడు పట్టించుకోండి

వేగంతో దూసుకుపోతున్నదని ఆయన తెలిపారు. ప్రధానంగా మౌలిక వసతుల కొరత తమను కుంగదీస్తున్నదని ఆయన అన్నారు. విమానాశ్రయాల్లో తమకు ల్యాండింగ్, పార్కింగ్ వసతులు లభించడంలేదని చెప్పారు. అలాగే నియంత్రణల సడలింపు పరంగా కూడా సరైన ముందడుగు పడడంలేదని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. జిఎస్‌టి ప్రభావం కూడా తమపై చాలా ఉన్నదని ఆయన అన్నారు. ప్రభుత్వం వీటన్నింటి మీద దృష్టి సారించాలని ఆయన కోరారు. "బిజినెస్ ఏవియేషన్‌పై జిఎస్‌టి ప్రభావం" అనే పేరుతో బిఎఒఎ సహకారంతో డెలాయిట్ రూపొందించిన నివేదికను ఈ సందర్భంగా విడుదల చేశారు.



స్వరాజ్ 963ఎఫ్ఇ ట్రాక్టర్‌తో ఎం అండ్ ఎం ఫార్మ్ ఎక్విప్‌మెంట్ విభాగ ప్రెసిడెంట్ రాజేశ్ జెజురికర్, స్వరాజ్ డివిజన్ సిఒఒ వీరేన్ పోప్లీ, సేల్స్ హెడ్ డివిజన్ రాజీవ్ రెల్లన్, ఆర్ అండ్ డివిజన్ హెడ్ జెఎస్ చావ్లా

మార్కెట్లోకి స్వరాజ్ 963 ఎఫ్ఇ ట్రాక్టర్

▸ ప్రారంభ ధర రూ.7.40 లక్షలు

మొహాలీ (పంజాబ్): మహీంద్రా గ్రూప్‌నకు చెందిన స్వరాజ్ ట్రాక్టర్స్ తాజాగా హై పవర్ సెగ్మెంట్లోకి ప్రవేశించింది. 'స్వరాజ్ 963 ఎఫ్ఇ' పేరుతో 60 నుంచి 75 హార్స్‌పవర్ (హెచ్‌పి) కేటగిరీలో తన తొలి ట్రాక్టర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.7.40 లక్షలు. సంస్థకు దేశవ్యాప్తంగా ఉన్న 875 డీలర్ల వద్ద ఈ ట్రాక్టర్‌ను అందుబాటులో ఉండనుంది. "స్వరాజ్‌కు మహత్తరమైన రోజు ఇది. చాలాకాలం తర్వాత కొత్త ప్లాట్‌ఫాం ట్రాక్టర్‌ను లాంచ్ చేయడమే కాకుండా 60-75 హెచ్‌పి సెగ్మెంట్లోకి అడుగుపెడుతోంది. ఇప్పటివరకు సంస్థ ఈ విభాగంలో లేదు. ఆ అంతరాన్ని పూడ్చేందుకే 60 హెచ్‌పి ట్రాక్టర్‌ను లాంచ్ చేస్తున్నాం" అని మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) లిమిటెడ్ ఎండి పవన్ గోయెంకా అన్నారు. బుధవారంనాడు జరిగిన స్వరాజ్ 963 ఎఫ్ఇ ట్రాక్టర్ విడుదల కార్యక్రమంలో గోయెంకా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మీడియాతో మాట్లాడారు. పంజాబ్‌లోని మొహాలీ నగరంలో ఉన్న పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) యూనిట్‌లోనే దీన్ని డిజైన్ చేశారని ఆయన చెప్పారు.

పిఎన్‌బి చీఫ్‌ను విచారించిన ఎస్ఎఫ్ఐఒ

▸ ఐదు గంటలపాటు ప్రశ్నల వర్షం కురిపించిన అధికారులు

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) ఎండి, సిఇఒ సునీల్ మెహతాను బుధవారం నాడు సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఒ) ఐదు గంటలపాటు ప్రశ్నించింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీ కలిసి పిఎన్‌బికి రూ.12,636 కోట్ల కుచ్చుటోపీ పెట్టిన కేసులో దర్యాప్తు చేస్తున్న ఎస్ఎఫ్ఐఒ.. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసింది. ముంబైలోని ఎస్ఎఫ్ఐఒ ఆఫీసుకు ఉదయం 11 గంటలకు వచ్చిన మెహతా.. సాయంత్రం 4 గంటలకు తిరిగి వెళ్లారు. ఈ కేసుకు సంబంధించి గడిచిన రెండు రోజుల్లో దర్యాప్తు ఏజెన్సీ విచారించిన బ్యాంకుల్లో పిఎన్‌బి మూడోది. మంగళవారం నాడు యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ అధికారులు ఎస్ఎఫ్ఐఒ విచారణకు హాజరై తమ వాగ్మూలం ఇచ్చారు.

దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద రుణ మోసం. ఈ కేసుపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లు కూడా దర్యాప్తు చేస్తున్నాయి. గతనెలలో సునీల్ మెహతాతోపాటు పిఎన్‌బి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవి బ్రహ్మాజీ రావ్‌ను సిబిఐ ప్రశ్నించింది. అయితే ఈ మోసం ఎలా జరిగిందనే విషయంలో సమగ్ర అవగాహనకు వచ్చేందుకే వారి పిలవడం జరిగిందే తప్ప దోషులుగా భావించడం లేదని సిబిఐ అధికారులు తెలిపారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన దర్యాప్తు విభాగమైన ఎస్ఎఫ్ఐఒ.. మోదీ, చోక్సీలకు సంబంధించిన కంపెనీలకు రుణాలిచ్చిన 31 బ్యాంకులకు సమన్లు జారీ చేసింది.



అపాచీ ఆర్‌టిఆర్‌లో రేసర్ ఎడిషన్

గరిష్ఠ ధర రూ.1,08,985

న్యూఢిల్లీ: దేశీయ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటార్స్.. అపాచీ ఆర్‌టిఆర్ 200 4వీలో రేసర్ ఎడిషన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని గరిష్ఠ ధరను రూ.1,08,985గా (ఢిల్లీ షోరూం) నిర్ణయించారు. 197.55 సిసి సింగిల్ సిలిండర్ మోటార్, 5 స్పీడ్ గేర్ బాక్స్‌తో కూడిన ఈ బైక్‌ను కార్బరేటర్, ఇఎఫ్ఐ, కార్బరేటర్ ఎబిఎస్ వేరియంట్లలో అందుబాటులోకి తెచ్చింది. ఇందులో ఇఎఫ్ఐ, ఎబిఎస్ వేరియంట్లు ఎంపిక చేసిన షోరూమ్‌లలో మాత్రమే లభించనున్నాయి. ఎ-ఆర్‌టి స్లిపర్ క్లచ్ టెక్నాలజీతో కూడిన ఈ సరికొత్త బైక్ మరింత మెరుగైన రేసింగ్ అనుభూతిని పంచనుందని టీవీఎస్ రేసింగ్, అంతర్జాతీయ వ్యాపారం, ప్రీమియం టూవీలర్ల విభాగ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ సిద్ధార్థ్ అన్నారు.

జోరందుకుంటున్న ప్రీమియం బైక్ విక్రయాలు

దేశంలో మాస్ సెగ్మెంట్ బైక్ సేల్స్‌తో పోలిస్తే తక్కువే అయినప్పటికీ ప్రీమియం మోటార్ సైకిళ్ల విక్రయాలు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయని టీవీఎస్ మోటార్ తెలిపింది. ప్రీమియం కేటగిరీలో 160 సిసి నుంచి 310 సిసి సామర్థ్యంతో కూడిన పలు మోడళ్లను విక్రయిస్తున్నట్లు టీవీఎస్ మోటార్ వైస్ ప్రెసిడెంట్ అనిరుద్ధ హల్దార్ తెలిపారు. టూవీలర్ల విభాగంలో స్కూటర్ల డిమాండ్ క్రమంగా పెరుగుతోందని, సంస్థ మొత్తం విక్రయాల్లో వీటి వాటా 35 శాతం వరకు ఉందన్నారు.

హీరో నుంచి
న్యూ సూపర్ స్ప్లెండర్

▸ ధర రూ.57,539

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అతి పెద్ద ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్.. న్యూ సూపర్ స్ప్లెండర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. హైదరాబాద్ షోరూంలో దీని ధరను రూ.57,539గా నిర్ణయించారు. ఫోర్ స్ట్రోక్ సింగిల్ సిలిండర్ 125 సిసి టార్క్ ఆన్ డిమాండ్ (టిఒడి) ఇంజిన్ కలిగిన ఈ బైక్‌లో హీరో ఐ3ఎస్ (ఐడిల్ స్టాప్ అండ్ స్టార్ట్ సిస్టమ్) ఫీచర్‌ను జోడించినట్లు సంస్థ తెలిపింది. గత తరం మోడళ్లతో పోలిస్తే ఈ మోటార్ సైకిల్ 27 శాతం అధిక శక్తి, 6 శాతం అధిక టార్క్ అందిస్తుందని కంపెనీ వెల్లడించింది. గరిష్ఠంగా గంటకు 94 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోగలదు.



ఆరో రోజూ కొనసాగిన అమ్మకాల హోరు

▸ 284 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

స్టాక్ మార్కెట్ పతనానికి ఇప్పట్లో బ్రేక్ పడే సూచనలు కనిపించడం లేదు. అమ్మకాల ఒత్తిడితో ప్రధాన ఇండెక్స్‌లు రెండూ వరసగా ఆరో రోజూ డీలా పడ్డాయి. సెన్సెక్స్ 284.11 పాయింట్ల నష్టంతో 33033 వద్ద 95.05 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 10154 వద్ద క్లోజయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా లేకపోవడం, వాణిజ్య యుద్ధంపై పెరుగుతున్న మాటల యుద్ధంతో దేశ, విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగించారు. దీంతో ఇన్‌ఫ్రా, పవర్, క్యాపిటల్ గూడ్స్, పిఎస్‌యు, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. గత ఐదు సెషన్స్‌లోనే సెన్సెక్స్ 1128.55 పాయింట్లు నష్ట పోయింది.

అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు ఢమాల్

బిజెపి ఎంపి సుబ్రమణ్య స్వామి అదానీ గ్రూప్ ప్రధాన ప్రమోటర్ గౌతమ్ అదానీపై చేసిన ఆరోపణ, ఆ గ్రూప్ కంపెనీల షేర్లను బాగా దెబ్బతీసింది. గౌతమ్ అదానీ దేశంలో అతిపెద్ద మొండి బకాయిదారని స్వామి ఆరోపించారు. దీంతో బిఎస్ఇలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా నష్ట పోయాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 7.24 శాతం, అదానీ పోర్ట్స్ 6.53 శాతం, అదానీ పవర్ 6.60 శాతం, అదానీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ షేర్లు 7.72 శాతం నష్ట పోయాయి. స్వామి ఆరోపణలపై అదానీ గ్రూప్ వివరణ ఇచ్చినా మార్కెట్ పెద్దగా పట్టించుకోలేదు.

బ్యాంకింగ్ షేర్లలో కొనసాగిన నష్టాలు

పిఎన్‌బి కుంభకోణం ప్రభావం బ్యాంకింగ్ షేర్లపై బుధవారమూ కొనసాగింది. ఎస్ఎఫ్ఐఒ దాదాపు 31 బ్యాంకుల సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారులను ప్రశ్నించబోతోందన్న వార్తలతో బ్యాంకింగ్ షేర్లు నష్ట పోయాయి. దీంతో ఎస్‌బిఐ, పిఎన్‌బి, ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్ షేర్లు 2.13 శాతం నుంచి 3.85 శాతం వరకు నష్ట పోయాయి.



ఐపిఒ కార్నర్

త్వరలో మరో మూడు కంపెనీలు నిధుల సమీకరణ కోసం త్వరలో ప్రైమరీ మార్కెట్‌కు వస్తున్నాయి. రూ.960 కోట్ల సమీకరణ కోసం ప్రభుత్వ రంగంలోని భారత్ డైనమిక్స్ (బిడిఎల్) కంపెనీ ఈ నెల 13-15 మధ్య మార్కెట్‌కు వస్తోంది. ఈ ఇష్యూ కోసం కేంద్ర ప్రభుత్వం బిడిఎల్ ఈక్విటీలో తనకున్న వాటాలో 12 శాతం షేర్లను రూ.413-428 ధరల శ్రేణిలో జారీ చేస్తోంది. తారాచంద్ లాజిస్టిక్స్ కంపెనీ కూడా రూ.20 కోట్ల సమీకరణ కోసం ఈ నెల 13న మార్కెట్‌కు వస్తోంది. ఇందుకోసం ఒక్కోటి రూ.10 ముఖ విలువ ఉండే 37.20 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.45 ప్రీమియంతో జారీ చేస్తోంది.

సంధార్ టెక్ ఐపిఒకు గ్రీన్ సిగ్నల్

సంధార్ టెక్నాలజీస్ ఐపిఒ ప్రతిపాదనకూ సెబి నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఐపిఒ కోసం గత ఏడాది డిసెంబరులో కంపెనీ సమర్పించిన ముసాయిదా పత్రాలను సెబి ఈ నెల 1న పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. దీంతో కంపెనీ ఐపిఒకు గ్రీన్ సిగ్నల్ లభించినట్టయింది. ఈక్విటీలో 80 లక్షల షేర్లను ఐపిఒ ద్వారా విక్రయించడం ద్వారా రూ.300 కోట్లు సమీకరించాలని సంధార్ టెక్నాలజీస్ భావిస్తోంది.

రేపు హెచ్‌జి ఇన్‌ఫ్రా షేర్ల లిస్టింగ్

ఇటీవల పబ్లిక్ ఇష్యూకు వచ్చిన హెచ్‌జి ఇన్‌ఫ్రా కంపెనీ షేర్లు శుక్రవారం బిఎస్ఇ, ఎన్ఎస్ఇల్లో నమోదవుతున్నాయి. గత నెల 26-28 తేదీల్లో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన ఈ కంపెనీ రూ.300 కోట్ల సమీకరణ కోసం 60 లక్షల షేర్లను రూ.263-270 ధరల శ్రేణిలో జారీ చేసింది. ఈ ఇష్యూ ఐదు రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. దీంతో శుక్రవారం లిస్టింగ్‌లోనూ ఈ షేర్లు ఇష్యూ ధర కంటే ప్రీమియంతోనే లిస్టవుతాయని భావిస్తున్నారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,640	31,550	31,560	31,400	30,710
క్రితం ముగింపు	31,440	---	31,530	31,350	30,540
22 క్యారెట్లు	29,300	29,250	29,030	29,180	29,250
క్రితం ముగింపు	29,110	---	29,050	29,060	29,090
వెండి (కిలో)	39,900	40,200	39,600	40,000	41,800
క్రితం ముగింపు	39,400	---	39,500	39,500	41,300

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	68.00	విజయవాడ	68.00
కరీంనగర్	69.00	గుంటూరు	68.00
వరంగల్	68.00	ఒంగోలు	70.00
మహబూబ్‌నగర్	68.00	చిత్తూరు	67.00
కర్నూలు	68.00	నెల్లూరు	67.00
విశాఖపట్నం	72.00	అనంతపురం	71.00
గోదావరి	68.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	345.00	చిత్తూరు	378.00
వరంగల్	347.00	చెన్నై	385.00
విజయవాడ	340.00	నమక్కల్	370.00
గోదావరి	340.00	బెంగళూరు	375.00
విశాఖపట్నం	350.00	ముంబై	390.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.04	68.46
పౌండ్	82.02	95.13
యూరో	73.31	85.01
ఆస్ట్రేలియా డాలర్	46.08	53.32
బహ్రెయిన్ దినార్	159.90	183.24
కువైట్ దినార్	179.03	222.87
ఒమని రియాల్	156.59	179.15
సౌదీ రియాల్	15.70	18.60
సింగపూర్ డాలర్	44.84	53.12
యుఎఇ దిరమ్	16.07	18.78

మరింత బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలోనే కీలక స్థాయి 10200 కన్నా దిగజారి బలహీనతలో ట్రేడవుతూ 95 పాయింట్ల నష్టంతో డే కనిష్ఠ స్థాయిలో క్లోజయింది. 100 డిఎంఎ దగ్గర నిలదొక్కుకోలేక ఇప్పుడు 200 డిఎంఎ వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. రానున్న కొద్ది రోజుల్లో ఏ స్థాయిలో మద్దతు తీసుకుని కన్సాలిడేట్ అవుతుందో వేచి చూడాలి.

- మైనర్ ఇంట్రాడే నిరోధం 10240 కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే మైనర్ ఇంట్రాడే అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది. 10300 కన్నా పైన కన్సాలిడేషన్ అనంతరమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది.
- ప్రధాన మద్దతు స్థాయి 10100. గత ఏడాది డిసెంబరు 18న ఈ స్థాయి నమోదయింది. అంతకన్నా దిగజారితే మరింత కరెక్షన్ ముప్పు ఎదురవుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 9950.
- బ్యాంక్ నిఫ్టీ కూడా డౌన్‌ట్రెండ్‌లోనే పడి కీలక స్థాయి 24000కి చేరువయింది.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10240 మద్దతు : 10100

■ వి.సుందర్ రాజా

సాధారణ నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ బహుళ సప్తమి

నక్షత్రం : అనూరాధ

భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశులవారుఅప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10154.20 (-95.05)

ట్రెండ్ మార్పు వేళలు : 11.34

ధోరణి : గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై ఒంటి గంట వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ 2.30 నుంచి చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని ఒంటి గంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10195, 10230 **మద్దతు స్థాయిలు :** 10115, 10080

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ADITYA SPIN. 8(8.4)2840
AGRO TECH FO 632(649.95)528
AISHWARYA TE 5.4(5.41)8610
ALPHAGEO (I) 779.3(791.6)2418
ALU FLUORIDE 108.45(110.95)7428
AMAR RAJA BA 773(798.75)33656
ANDHRA BANK 39.35(42.65)571384
ANDHRA CEMEN 10.27(10.81)22959
ANDHRA PETRO 52.35(55.1)74638
ANJANI PORTL 182(182.5)548
ASTRA MICRO 87.3(89.95)46753
AUROB.PHARMA 592.75(606.2)231670
AVANTEL LTD 528.2(555.95)7810
AVANTI FEEDS 2369.3(2421.4)17354
B.N.RATHI SE 38.2(39.35)7201
BALAJI AMINE 591.5(613.3)11200
BAMBINO AGRO 235.45(238.95)1704
BARTRONICSIN 12.49(12.84)14442
BHAGIRA.CHEM 287.25(295.85)1530
BHAGYA INL 50.8(53.75)637995
BHARATFIN 1035.5(1038.15)10132
BNR UDYOG 28.7(28.65)133
CAMBRIDGE 75.35(76.85)2810
CAT TECHN. 1.09(1.14)805
CCHHL 13.36(13.91)30732
CCL PRODUCTS 294.45(294.95)7277
CELESTIAL 15.75(16.1)12725
CIL SECURITS 26.65(28.6)1632
COROM INTER 536.65(569.2)13188
CUBEX TUBING 25.5(26)110
CYBERMATE 2.85(2.96)27515
CYIENT 626(623.4)5541
DANLAW TECH. 69.55(68.95)6749
DECAN CEMENT 547.35(561.05)417
DHAN ROTO SP 52.95(55.35)6254
DIAMONPOWER 12.87(12.84)112645
DIVI'S LAB. 991.05(1012)22790
DIVYA.GRANIT 90.1(93)807
DQ ENT 13.3(14)10930
DR.REDDY'S 2148.45(2175)34840
EMPEE SUGARS 4.11(3.93)1050
EVEREST ORG. 138.45(138.1)156
FACOR ALLOYS 2.81(2.91)111879
FIRSTOBJ 16.1(16)6134
GATI LTD. 102.35(107.1)118982
GAYATRI BIO 7.52(7.17)25
GAYATRI PROJ 204.7(205.4)34147
GENNEX LAB 3.86(4.04)209861
GMR INFRASTR 17.35(18.05)3842247
GODAVARI DRU 33.55(34.9)2179
GOLDST INFRA 197(204.8)35888
GOLDSTONE EN 13.43(14.13)4851
GRANULES (I) 108.05(110.45)127491
GVK POWERINF 14.25(14.95)1259328
HBL P SYS 51.7(54.3)83693
HERITGFOOD 670.95(691.55)1850
HIND.FLUROCA 10.9(11.47)2898
I.C.S.A. IND 3.1(3.1)7212
IKF TECHNO .64(.65)89202
INCAP LTD. 85.2(86.15)1475
IPAPPM 293.95(299.5)6002
IVRCL LTD 3.96(4.15)469187
KAKATIYA CEM 271.25(289.5)4711
KALLAM SPG. 31.05(31.85)108733
KAVERI SEED 460(477.7)76682
KCP LTD 116.2(120.95)35289
KERNEX MICRO 39.1(40.65)1300
KNR CONST 291.85(296.9)10468
KREBS BIOCHM 190.15(181.1)2661
LANCO INFRA 1.14(1.2)712516
LOKESH MACH 60.95(60.7)43535
LOTUS CHOC 50(50.5)6516
MADHUCON PRJ 25.65(26.6)42465
MOLD-TEK TEC 57.05(57.5)101429
MOSCHIP SEMI 30.15(31.8)92531
MSR INDIA 49(48.5)3294
N C L IND. 204.9(217.6)11868
NACLIND 38.9(41.4)40263
NATCO PHARM 722.65(729.85)70411
NCC 118.6(122.4)486708
NEHA INTER. 6.72(7.27)14646
NETTLINX LTD 74.15(76.3)7897
NEULAND LAB. 695.4(690.4)2297
NIHAR INFO 13.25(13.89)4755
NILE LTD. 767.7(795.7)5889
NTL 3.74(3.9)11
OIL COUNTRY 39.1(40)5151
PADMALAYA TE 4.2(4.4)9336
PALRED 74.5(83.55)40913
PANYAM CEMEN 41.5(45.6)37251
PENNAR STEEL 54.6(56.35)97136
PFL INFOTECH 8.01(7.63)750
PHYTOCHEM I. 61.5(64.4)2891
PITTI LAMIN. 87.65(89.95)9964
POKARNA LTD 196.35(202.6)4473
PRAJAY ENGS. 12.04(12.4)21246
PREMIER EXPL 365.9(377.15)4380
PRISM CEMENT 115.75(121.95)105432
RAIN 367.3(366.9)444279
RAJ PACKAGIN 33.95(35.85)2613
RAJVIR IND 48(46)412
RESTILE CER. 6.97(6.69)870
SAGAR CEM. 937.05(908.35)1225
SAMKRG PIST. 289.85(294.45)4435
SAMPRE NUTRI 54.5(56.6)4352
SANGHI IND. 109.35(115.55)33719
SATVAH.ISPAT 21.95(21.8)5669
SAVEN TECHNO 25.55(26.45)16133
SMPL 1.35(1.39)16823
SMS PHARMACE 80.9(85.6)3677
SREE RAYALA 157.1(162.6)1315
STEEL EXCH 26.8(28)20118
SUJANA INDUS .89(.85)27010
SURANATP 5.09(5.3)1978
SURYACHAKRA .89(.91)49117
SURYAMBA SP 71.8(72.7)300
SURYLAK.COTT 75.5(76.25)48226
SUVEN LIFE S 177.25(184.95)59031
TAJ GVK HOTL 157.15(160.8)4991
TANLA 34.6(33.95)169732
TRANSCORP IN 31.5(31.9)1061
TRANSGENE BI 2.59(2.67)1507
TRANSPORT CO 269.95(276.35)2349
USHER AGRO 5.75(5.9)9802
VICEROY HOTE 14.45(14.95)61866
VIJAY TEXTIL 49.9(52.5)2395
VIMTA LABS 195.85(205.2)2342
VIRAT CRANE 55.2(55.05)23670
VIRINCHI 109.85(114.2)48097
VISAKA IND. 662.3(678.95)5785
VISTA PHARMA 43.7(45.95)137280
VIVIMED LABS 69.35(73.15)135777
VST INDUS. 2942.2(3012.65)134
WATERBASE 276.75(297.45)246722
XLENERGY 2.45(2.55)5169
YBRANTDIGI 5.1(5.29)162766
ZEN TECH 122.35(130.7)118427
ZENOTECH 40.5(42.25)7609



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

ప్రభుత్వ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందాలి

» సబ్‌ప్లాన్ నిధులు 100 శాతం ఖర్చు చేయాలి: ఎర్రోళ్ల

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషన్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు బుద్ధప్రకాశ్, బెనహర్ మహేష్‌దత్ ఎక్కా, ఎస్సీ డెవలప్‌మెంట్ డైరెక్టర్, కార్పొరేషన్ ఎండీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల సెక్రటరీలు, పోలీసు ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా కేటాయించిన నిధులను 100శాతం ఖర్చు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత మంది దళితులపై దాడి జరిగింది? ఎన్ని ఫిర్యాదులు స్వీకరించారు? ఎఫ్ఐఆర్ నమోదు అయిన కేసుల వివరాలను ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. త్వరలో జరిగే సమావేశానికి పూర్తి వివరాలతో రావాలని ఆయన అధికారులకు సూచించారు.

ఇకపై నాలుగు వరుసల ఆర్వోబీలు

» అంగీకరించిన రైల్వే.. ఒప్పించిన మంత్రి తుమ్మల



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే బోర్డు ఇకపై రాష్ట్రంలో నాలుగు వరుసల రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)ల నిర్మాణాలు చేపట్టనుంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రాంగం ఫలించడంతో.. అధిక శాతం నిర్మాణ వ్యయాలను తామే భరించేలా రైల్వే అధికారులు అంగీకరించారు. ఈ వివరాలను మంత్రి తుమ్మల వెల్లడించారు. బుధవారం ఆయన రైల్వే అధికారులతో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మంలోని భద్రాచలం రోడ్-కొవ్వూరు మధ్య ప్రతిపాదించిన రైల్వే లైన్‌లో మార్పులను ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 460 రైల్వే లెవెల్ క్రాసింగ్‌లపై ఆర్వోబీల నిర్మాణాల ప్రతిపాదనలకు రైల్వే అధికారులు అంగీకరించారు. దశల వారీగా ఈ నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది 52 ఆర్వోబీలను నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. ప్రభుత్వం రోడ్ ఓవర్, రోడ్ అండర్ బ్రిడ్జిలకు ప్రాధాన్యమిస్తోందన్నారు. హైదరాబాద్ శివార్లలోని మియాపూర్-పటాన్‌చెరు మధ్య రైల్వే టెర్మినల్ నిర్మాణ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు.

పది లక్షల మందితో యాదవ, కురుమల సభ

» హాజరు కానున్న సీఎం కేసీఆర్.. మంత్రి తలసాని వెల్లడి

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పది లక్షల మంది యాదవ, కురుమలతో హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. వచ్చే నెల 29న ఈ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో బుధవారం యాదవ, కురుమ ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి గొల్ల, కురుమలు తరలి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత 70 ఏళ్లలో గొల్ల, కురుమల సంక్షేమానికి ఎవరూ చేపట్టని విధంగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా కురుమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేశం పేరును కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. రాజ్యసభకూ యాదవ కులస్తుడిని పంపుతామని ఆయన ప్రకటించారని చెప్పారు. ఇన్ని చేసిన సీఎం కేసీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి ఈ సభ ద్వారా కృజ్ఞతలు తెలుపుకుంటామన్నారు.

● ఏఈఈ భర్తీపై నివేదికివ్వండి: బీసీ కమిషన్

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఏఈఈ నియామకాలపై నివేదిక ఇవ్వాలని బీసీ కమిషన్ టీఎస్‌పీఎస్సీని కోరింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా 2016లో 900కుపైగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీ జరిగింది. ఎంపిక విధానంలో లోపం కారణంగా 47 మంది బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెపాక కుమారస్వామి, ముత్యం వెంకన్న గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తదితరులు టీఎస్‌పీఎస్సీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు స్పందించకపోవడంతో గత డిసెంబరులో బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్.. వివరాలతో కూడిన నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని టీఎస్‌పీఎస్సీని కోరినా పట్టించుకోలేదు. దీంతో మరోసారి గుర్తు చేస్తూ వెంటనే నివేదిక పంపాలని కోరిందని కుమారస్వామి తెలిపారు.

● విద్యుత్తు ఉద్యోగుల డీఏ పెంపు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జెన్‌కో ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) పెరిగింది. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ డి.ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 1 నుంచి పెరిగిన డీఏ అమల్లోకి వస్తుందన్నారు. గతంలో 19.264శాతంగా ఉన్న డీఏను 21.094శాతానికి పెంచినట్లు సీఎండీ తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలల బకాయిలను జీపీఎఫ్‌లో కలుపుతామని వివరించారు. మార్చి నుంచి నగదురూపంలో చెల్లింపులు ఉంటాయన్నారు.

● గురుకుల ప్రవేశాలకు నేటి నుంచి దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బీసీ గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాల్లో ప్రవేశాలకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ డైరెక్టర్ మల్లయ్య తెలిపారు. ఏప్రిల్ 11 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 26న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

● 'ఉపాధి' ఉద్యోగులకూ బదిలీలు

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ల బదిలీలకు అవకాశం కల్పిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేటగరీల్లోని ఉద్యోగులు బదిలీల కోసం ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

● ఉక్కు పరిశ్రమపై 'మెకాన్' నివేదిక!

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వీలుగా మెకాన్ సంస్థ సాధ్యాసాధ్యాల నివేదికను రూపొందిస్తోందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణుదేవ్ సాయి తెలిపారు. దానికి అవసరమైన వివరాలు తెలంగాణ ప్రభుత్వం ఇవ్వాలని గత ఏడాది డిసెంబరులో జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ఎంఏ ఖాన్ అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బుధవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

● వెల్‌నెస్ కేంద్రాలు మందులు కొనొద్దు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్)లో భాగంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాలకు ఇక నుంచి మందుల సరఫరా బాధ్యతను తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించాలని ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. ఇప్పటిదాకా వెల్‌నెస్ కేంద్రాల్లో ఉద్యోగులు, జర్నలిస్టులకు వైద్య పరీక్షలతో పాటు మందులను కూడా ఉచితంగానే ఇస్తున్నారు. అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మందులు, ఇంజెక్షన్లను బయట నుంచి తెప్పించి అందజేస్తున్నారు. ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని వెల్‌నెస్ కేంద్రాలకు అవసరమైన మందులను ఎప్పటికప్పుడు ప్రతిపాదిత లేఖ రాసి టీఎస్ఎంఎస్ఐడీసీ నుంచే తెప్పించుకోవాలని ఈహెచ్ఎస్ సీఈవో కల్వకుంట్ల పద్మను వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతకుమారి ఆదేశించారు. ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ బాధ్యతలు వదులుకొని ఈహెచ్ఎస్‌పైనే పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని పద్మను శాంతకుమారి సూచించినట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటికే రాష్ట్రంలోని సర్కారు ఆస్పత్రులకు టీఎస్ఎంఎస్ఐడీసీ మందులు సరఫరా చేస్తోంది. అక్కడ ఎప్పుడూ మందుల కొరత కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వెల్‌నెస్ కేంద్రాల్లోనూ మందుల కొరత ఏర్పడే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు రశీదు

» రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రానున్న శాసన సభ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ రశీదు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్ తెలిపారు. తెలంగాణ తొలి ప్రధాన ఎన్నికల అధికారిగా ఇటీవలే నియామకమైన ఆయన బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన.. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఏడాది కాలం తమకు అత్యంత ప్రత్యేకమైనదని, ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, రాజ్యాంగబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లో ఓటర్ల జాబితాలోని పేర్లను పెద్దఎత్తున తొలగించారన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఓటర్ల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ఎవరైనా అభ్యంతరాలను లేవనెత్తితే వెంటనే స్పందిస్తామన్నారు. ఓటర్ల జాబితా, ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. తాను గతంలో జిల్లా ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడిగా పనిచేశానని, ఆ అనుభవాన్ని ఉపయోగించి తనకు అప్పగించిన బాధ్యతలకు వంద శాతం న్యాయం చేస్తానన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఇంతవరకు ఉన్న ఒకే ఎన్నికల సంఘం తాజాగా విభజన నేపథ్యంలో కొన్ని పాలనాపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని, ముందుగా వాటిపై దృష్టి సారిస్తామని తెలిపారు. రాజ్యసభ నామినేషన్ల గడువు ఈనెల 12తో ముగుస్తుందని, అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

ముస్లిం కోటా ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులేవీ కేసీఆర్ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనల్లో ఉటంకించ లేదని స్పష్టం చేశారు. బుధవారం ఉదయం పార్లమెంటు ప్రారంభానికి ముందే ఈ సమాధానాలు సభ్యులకు చేరాయి. ముస్లిం రిజర్వేషన్లకు ప్రధాని మోదీ సానుకూలంగా ఉన్నారని గతంలో స్వయంగా సీఎం కేసీయారే ప్రకటించారు. ఇప్పుడు కేంద్రం పార్లమెంటు సాక్షిగా కుదరదని కుండబద్దలు కొట్టడంతో టీఆర్ఎస్ అగ్రహోదగ్రులయ్యారు. బుధవారం ఉదయం ఉభయ సభల్లో కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందే సభ్యులు అడ్డుపడ్డారు. రిజర్వేషన్లపై అధికారాన్ని రాష్ట్రాలకే ఇవ్వాలంటూ మూడో రోజూ పార్లమెంటును హోరెత్తించారు. ప్రజల స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వానికే స్పష్టత ఉంటుందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రిజర్వేషన్లు ఎలా ఇవ్వాలనే స్వేచ్ఛ రాష్ట్రాలకే ఉండాలని డిమాండ్ చేశారు. 'ఒకే దేశం.. ఒకే నీతి' అంటూ నినదించారు. లోక్‌సభ జరగనివ్వకుండా స్తంభింపజేశారు. దీంతో బుధవారం లోక్‌సభ ప్రారంభమైన 30 సెకన్లకే వాయిదా పడింది. స్పీకర్ సుమిత్రా మహాజన్ తన సీట్లో కూర్చోకముందే టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్ రెడ్డి, కల్వకుంట్ల కవిత, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాంనాయక్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, జి.నగేష్, మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీబీ పాటిల్.. పకార్డులు పట్టుకుని 'ఏక్ దేశ్.. ఏక్ నీతి' అంటూ పోడియంను చుట్టుముట్టారు. ప్రత్యేక హోదా అంశంపై టీడీపీ, వైసీపీ ఎంపీలు; కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలంటూ అన్నా డీఎంకే ఎంపీలు, నీరవ్ మోదీ ఎక్కడున్నాడున్నాంటూ తృణమూల్ కాంగ్రెస్, మరాఠీ భాషకు ప్రాచీనహోదా ఇవ్వాలంటూ శివసేన ఎంపీలు సైతం వెల్‌లోకి వచ్చి నిరసన తెలిపారు. సభ ప్రారంభమైన వెంటనే టీఆర్ఎస్ ఎంపీలు.. 'వన్ కంట్రీ.. వన్ లా' అంటూ గట్టిగా నినాదాలిచ్చారు. స్పీకర్ ఏం మాట్లాడకుండానే సభను వాయిదా వేశారు. వాయిదా విషయాన్ని కూడా ఓ అధికారి లేచి గట్టిగా అరిచి చెప్పాల్సి వచ్చింది.

ప్రధాన ద్వారం వద్ద నిరసన..

లోక్‌సభ వాయిదా అనంతరం ఎంపీలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని తమ డిమాండ్లపై నినాదాలిస్తూ బైఠాయించారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా అక్కడికి వచ్చి వారికి సంఘీభావం తెలిపారు. వారి వద్ద నుంచి ప్లకార్డును చేతిలోకి తీసుకుని నిరసనలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సభ ప్రారంభం కావడానికి ముందే సభ్యులు మళ్లీ స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. సభా కార్యక్రమాలు మొదలైనా.. ఆందోళన కొనసాగించారు. ఈ సమయంలో శివసేన ఎంపీ ఒకరికి మాట్లాడే అవకాశం రావడంతో ఆ పార్టీ సభ్యులు వెల్‌లోనుంచి దగ్గర్లో ఉన్న సీట్ల వద్దకు వెళ్లారు. అయితే ఇతర పార్టీల ఎంపీలు పలువురు.. కెమెరాకు ఆయన కనిపించకుండా చుట్టూ మోహరించారు. వెల్‌లో ఒకేసారి 110 మంది ఉండటంతో అంతా గందరగోళంగా మారింది. దాంతో వెంటనే సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. వాయిదా అనంతరం ఇతర పార్టీలసభ్యులంతా సభను వీడినా.. టీఆర్ఎస్ సభ్యులు మాత్రం అరగంట అక్కడే ఉండి భవిష్యత్తు ప్రణాళికపై మంతనాలు జరిపారు. కాగా ప్రతిష్ఠంభనను తొలగించేందుకు అన్ని పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలతో స్పీకర్ సమావేశం ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా.. విగ్రహాల ధ్వంసం అంశం రాజ్యసభను వేడెక్కించింది. ఏ రాష్ట్రంలోనైనా సరే.. విగ్రహాలను ధ్వంసం చేయడం తప్పు అని, దీనిని ఖండించాల్సిందేనని రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. దీనిపై చర్చకు అనుమతిస్తానని, శాంతపడాలని ఆయన పదే పదే కోరినా విపక్ష సభ్యులు ఆగలేదు. చివరకు సభను ఒకసారి వాయిదా వేసిన చైర్మన్.. తిరిగిసమావేశమైన తర్వాతకూడా అదే స్థితి కొనసాగడంతో గురువారానికి వాయిదా వేశారు.



పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో టీఆర్ఎస్ ఎంపీల నిరసన

85% బడుగులకు న్యాయం చేయాలి

తెలంగాణలో 85 శాతం బడుగు వర్గాలే ఉన్నారని, వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు అన్నారు. రిజర్వేషన్లపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇస్తేనే అది సాధ్యమవుతుందన్నారు. కాగా తాము చెప్పినట్లే రాష్ట్రాలు నడుచుకోవాలనే ధోరణితో కేంద్రం వ్యవహరిస్తోందని టీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత జితేందర్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు చెప్పిందనే సాకు చూపుతూ రాష్ట్రాలను కంట్రోల్‌లో పెట్టుకోవాలని కేంద్రం భావిస్తోందని ఆరోపించారు. 192 కులాలు ఎస్టీల్లో చేర్చాలని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాయని, అయినా చేర్చుతారో, లేదో అనే విషయాన్ని కేంద్రం ఎందుకు చెప్పడం లేదని సీతారాం నాయక్ ప్రశ్నించారు.

జనాభా ప్రాతిపదికన ముస్లిం రిజర్వేషన్లా?

» తెలంగాణ ప్రతిపాదన రాజ్యాంగబద్ధం కాదు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జనాభా ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలంటూ కేసీఆర్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన రాజ్యాంగబద్ధం కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఇందర్ సహానీ కేసులో 1992లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం రాజ్యాంగంలోని 16వ అధికరణలో నాలుగో క్లాజు సరైన విధంగా ప్రాతినిధ్యం కల్పించాలని మాత్రమే చెప్పిందని, జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని ఎక్కడా చెప్పలేదని కేంద్రం పేర్కొంది. బుధవారం రాజ్యసభలో తెలుగుదేశం సభ్యుడు టి.దేవేందర్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ జవాబిస్తూ రాజ్యాంగంలోని 201 అధికరణ కింద రాష్ట్రపతి పరిశీలనార్థం తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్యాసంస్థలు, రాష్ట్ర నియామకాల్లో సీట్ల రిజర్వేషన్) బిల్లును పంపిందని చెప్పారు. ఈ బిల్లును సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలకు పంపినట్లు తెలిపారు. సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకించిందన్నారు. అంతేగాక ఆర్టికల్ 16లోని నాలుగో క్లాజు ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీం చెప్పినట్లు తెలిపారు. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే రిజర్వేషన్ల శాతాన్ని సడలించవచ్చని, ప్రత్యేకంగా రిజర్వేషన్ ఇచ్చేందుకు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొన్నట్లు ఆయన గుర్తు చేశారు. సుప్రీం తీర్పునకు భిన్నంగా రిజర్వేషన్లకు అనుమతి ఇచ్చేలా తెలంగాణ ప్రభుత్వం తన ప్రతిపాదన ను బలపరిచే ఎలాంటి వాస్తవాలను, ఆధారాలను సమర్పించలేదని మంత్రి చెప్పారు. సిబ్బంది శిక్షణ మంత్రిత్వ శాఖతో పాటు గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా తన పరిశీలనలను పంపిందని.. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి వివరణ కోసం పంపామని ఆయన చెప్పారు.

మీ మధ్య అవగాహన కుదిరితే చాలా?

» మా సమస్యలను పట్టించుకోరా?

» లోక్‌సభ స్పీకర్‌ను నిలదీసిన జితేందర్‌రెడ్డి

» అఖిలపక్ష సమావేశంలో పలు అంశాల ప్రస్తావన

న్యూఢిల్లీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "మీరు మీరూ ఒప్పందం కుదుర్చుకుంటే సరిపోతుందా? మేము లేవనెత్తిన అంశాల మాటేమిటి?" అని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత జితేందర్‌రెడ్డి నిలదీశారు. దేశాన్ని రూ.13 వేల కోట్లకు పైగా ముంచి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై కాంగ్రెస్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని ఆమోదించి, సభలో ప్రతిష్ఠంభనను తొలగించడంపై సుమిత్రా మహాజన్ సమక్షంలో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో జితేందర్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో 'మీకు ఏం కావాలి రెడ్డి సాబ్' అని స్పీకర్ ప్రశ్నించగా జితేందర్ పలు సమస్యలను ప్రస్తావించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత వివిధ ప్రాంతాల్లో విస్తరించిన గిరిజన జనాభాను బట్టి రిజర్వేషన్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే రిజర్వేషన్‌ను 50%కు మించి కల్పించేందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేయాలని తెలంగాణ అసెంబ్లీ కూడా తీర్మానించిన విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు చేసే విషయంపై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎయిమ్స్, ఐఐఎం, గిరిజన యూనివర్సిటీ మొదలైనవి ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంటు పట్ల టీఆర్ఎస్‌కు అపార గౌరవం ఉందని, అయితే ప్రజలకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించాల్సిన బాధ్యత కూడా తమపై ఉందన్నారు.

రాజ్యాంగ సవరణ ద్వారానే అసెంబ్లీ సీట్ల పెంపు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యంగ సవరణ ద్వారానే ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ వెల్లడించారు. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 26కు అనుగుణంగా రాజ్యాంగంలోని 170 ఆర్టికల్‌ను సవరించాలని పేర్కొన్నారు. లేదంటే 2026 తర్వాత అందుబాటులో ఉండే జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు రాజ్యసభలో ఎంపీలు టీజీ వెంకటేశ్, డీ. శ్రీనివాస్ అడిగిన ఓ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సీట్లను పెంచాలని విజ్ఞప్తి చేశాయని పేర్కొన్నారు.

వీసీలు ఉన్నట్టా? లేనట్టా?

యూనివర్సిటీల్లో ఎలాంటి మార్పు రాలేదు.. ప్రభుత్వం అనుమతిచ్చినా పోస్టుల భర్తీ జరగడం లేదు

» పీహెచ్‌డీ అడ్మిషన్లను నిర్వహించలేని అసమర్థతా!

» వీసీల తీరు, వర్సిటీల పరిస్థితిపై కడియం ఆగ్రహం



వైస్ చాన్సలర్లతో భేటీ అయిన డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): "యూనివర్సిటీల్లో వీసీలు ఉన్నట్టో.. లేనట్టో అర్థం కావడం లేదు. ఏ యూనివర్సిటీలోనూ ఎలాంటి మార్పు రాలేదు. గతంలో ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఐదోసారి వీసీల సమావేశం నిర్వహిస్తున్నాను. కానీ, గతంలో తీసుకున్న నిర్ణయాలు ఆశించిన మేరకు అమలు కావడంలేదు" అని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం నిర్వహించిన యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల సమావేశంలో వీసీల తీరుపై, వర్సిటీల పరిస్థితిపై కడియం ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వ పరంగా అర్థం చేసుకోవడంలో లోపం ఉందా? మీ పని తీరులో లోపం ఉందా? లేక ఉన్నత విద్యామండలి మిమ్మల్ని సరిగా గైడ్ చేయలేకపోతోందో తెలియడం లేదు' అని వ్యాఖ్యానించారు. ఆరు నెలల క్రితం గవర్నర్ నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పూర్తి చేస్తామని ఆయనకు హామీ ఇచ్చామని, కానీ.. ఇంతవరకు ఒక్కటి కూడా చేయలేదని అన్నారు. గవర్నర్ మళ్లీ సమావేశం నిర్వహిస్తే ఆయనకు ఏం సమాధానం చెబుతామని ప్రశ్నించారు. ఈ పరిస్థితి మారాలని, అలసత్వాన్ని ప్రభుత్వం సహించబోదని కడియం స్పష్టం చేశారు. యూనివర్సిటీల వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని, పూర్తి పారదర్శకంగా ఉంటోందని తెలిపారు. అయినప్పటికీ వీసీలు ఈ అవకాశాన్ని ఎందుకు ఉపయోగించుకోలేక పోతున్నారని అన్నారు. వీసీలపై ప్రభుత్వానికి అపారమైన గౌరవం ఉందని, దానిని నిలబెట్టుకోవాలని సూచించారు. ఇకనుంచైనా యూనివర్సిటీల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ఇక కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయలేమని, అందుకు యూజీసీ నిబంధనలు, కోర్టు తీర్పులు అనుకూలంగా లేవని గతంలోనే చెప్పినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అయితే ఇందుకు ప్రత్యామ్నాయంగా వారి వేతనాలను వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చామన్నారు. వర్సిటీల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి నియామకాలు జరపొద్దని ఆదేశించినా.. అవి జరుగుతూనే ఉన్నాయని తప్పుబట్టారు.

జూన్ నాటికి పోస్టులు భర్తీ చేయాలి...

యూనివర్సిటీల్లో 1061 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని వీసీలను మంత్రి కడియం ఆదేశించారు. జూన్ చివరిలోగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందించాలని, యూజీసీ నూతన నిబంధనలు కొన్నింటిని ప్రస్తుతం పాటించాల్సిన అవసరం లేదని అన్నారు. మార్చి 31 వరకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. యూనివర్సిటీల్లో 1061 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇక పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ ఇంటర్వ్యూల్లో మార్కులు వేసేప్పుడు ఎందుకు పక్షపాతం వహిస్తున్నారని ప్రశ్నించారు. అడ్మిషన్ల ప్రక్రియను కఠినతరం చేయాలన్నారు. నూతన జిల్లాల ప్రకారం వర్సిటీల పరిధులను మార్చేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్సిటీతోపాటు ప్రైవేటు కాలేజీల్లోనూ సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ఏర్పాటు చేయాలని 6నెలల క్రితం ఆదేశించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి మహిళా యూనివర్సిటీ

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ విద్యార్థినులకు మహిళా యూనివర్సిటీని కానుకగా ఇవ్వనున్నట్లు కడియం శ్రీహరి తెలిపారు. వీసీల సమావేశంలో భాగంగా ఆయన ఈ ప్రకటన చేశారు. కోఠి ఉమెన్స్ కాలేజీని మహిళా వర్సిటీగా మార్చుతున్నట్లు గతంలోనే ప్రకటించిన నేపథ్యంలో.. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రతిపాదనలు సిద్ధం కాగానే యూజీసీకి పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో ఇప్పట్లో ప్రైవేటు యూనివర్సిటీలు ఏర్పాటయ్యే అవకాశం లేదని, దీనిపై ప్రస్తుతానికి ఎలాంటి ఆలోచన చేయడం లేదని తెలిపారు.

ఒకటి ఢీకొట్టింది.. మరోటి తొక్కేసింది

» ఇసుక లారీల బీభత్సం.. ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం



దీపక్ (ఫైల్)

సుల్తానాబాద్, మార్చి7: అనుకోని ఆపద.. ఆపై నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. వేగంగా వచ్చిన ఇసుక లారీ విద్యార్థులను ఢీకొడితే సాయం అందించాల్సిన స్నేహితుడు తన బైక్‌ను ఢీకొన్న లారీని వెంబడించాడు. ఇంతలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో ఇసుక లారీ.. కింద పడి ఉన్న వారిపై నుంచి వెళ్లింది. ఫలితంగా ఇద్దరు బీటెక్ విద్యార్థుల జీవితాలు అర్థాంతరంగా ముగిశాయి. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. కోమాకుల కమల్, మార్త దీపక్, అఫ్రోజ్‌లు వరంగల్‌లోని ఎస్వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. మంథని జేఎన్‌టీయూలో చదువుతున్న తమ స్నేహితులను కలిసేందుకు మరికొందరు స్నేహితులతో బుధవారం ఉదయం ద్విచక్రవాహాలపై వచ్చారు. స్నేహితులతో కాసేపు సరదాగా గడిపి సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. కాట్నపల్లి సమీపంలోకి రాగానే అఫ్రోజ్ నడుపుతున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన ఇసుక లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న కమల్, దీపక్ ఎగిరి రోడ్డుపై పడ్డారు. అయితే తన బైక్‌ను ఢీకొట్టిన లారీని వెంబడించేందుకు అఫ్రోజ్ అలాగే ముందుకు వెళ్లాడు. ఈలోగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన మరో ఇసుక లారీ కమల్, దీపక్‌లపై నుంచి వెళ్లడంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని పట్టుకున్నారు. మరో లారీని పట్టుకునేందుకు వాహనాల తనిఖీలు చేపట్టారు. మరోవైపు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇసుక లారీల అతివేగమే విద్యార్థుల ప్రాణాలు బలి తీసుకుందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం, పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలోని ఆరెంద ఇసుక క్వారీల నుంచి ఈ రహదారి గుండా నిత్యం వందలాది ఇసుక లారీలు హైదరాబాద్‌కు వెళుతుంటాయి. ప్రతి రోజూ వీటి రాకపోకలు.. ద్విచక్ర వాహనదారుల పాలిట ప్రాణ సంకటంగా మారిందని స్థానికులు అంటున్నారు.

'ఆధార్' ఇస్తేనే పట్టాదార్ పాస్‌పుస్తకం

» భూపరిపాలన ప్రధాన కమిషనర్ రాజేశ్వర్ తివారీ

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ వివరాలు ఇస్తేనే పట్టాదార్ పాస్‌పుస్తకం ఇచ్చేందుకు వీలవుతుందని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) రాజేశ్వర్ తివారీ అన్నారు. బుధవారం సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, కార్యదర్శి స్మితా సబర్వాల్, సీసీఎల్ఏ డైరెక్టర్ వాకాటి కరుణతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ ఖాతాలకు ఆధార్ అనుసంధానం పూర్తిచేయాలని, పట్టాదారుల వివరాలను ఈనెల 9వ తేదీలోగా అందించాలని ఆయన సూచించారు. ప్రతి రైతుకూ చెందిన వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు పక్కాగా సేకరించాలన్నారు. ఆధార్‌లోని ఫొటోనే ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదారు పాస్‌పుస్తకం మొదటి పేజీలో ఉంటుందని, దీని దృష్ట్యా ఆధార్ వివరాలు తప్పనిసరన్నారు. పంట సాయానికి కూడా ఇదే ప్రామాణికమన్నారు. సాదా బైనామాలు, అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించుకున్న వారికికూడా పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందించాలన్నారు. ఆధార్‌కార్డు ఇవ్వని ఖాతాలపైనా డిజిటల్ సంతకాలుచేయాలని, ఆధార్ వివరాలు వారంతా ఇచ్చిన తర్వాతే పాస్‌పుస్తకం ముద్రణకు వివరాలు పంపాలని సూచించారు.

2 శాతం డీఏ పెంపు

▸ కేంద్ర ఉద్యోగులకు తీపికబురు

న్యూఢిల్లీ, మార్చి 7: కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు తీపి కబురుచెప్పింది. ఉద్యోగులు, పింఛనుదారులకు కరువు భత్యం, కరువు సాయం (డీఏ మరియు డీఆర్) 2 శాతం పెంచుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కరువు భత్యం మూల వేతనంపై 5 శాతంగా ఉంది. దీనికి మరో 2 శాతం జతైంది. ఏడో వేతన సంఘం సూచించిన విధంగా పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. డీఏ పెంపుతో 48.41 లక్షల మంది ఉద్యోగులకు, 61.17 లక్షల మంది పింఛనుదార్లకు లబ్ధి చేకూరనుంది. కేంద్రంపై రూ.6077.72 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఈ భారం మొత్తం రూ.7090.68 కోట్లగా ఉంటుందని అధికారవర్గాలు అంచనా. పెంచిన డీఏ మొత్తాన్ని ఈ ఏడాది జనవరి 1 నుంచీ వర్తింపజేస్తారు.

నీట్‌కు ఆధార్ తప్పనిసరి కాదు: సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 7: ఈ ఏడాది నీట్, ఇతర అఖిలభారత పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ నెంబరు తప్పనిసరిగా సమర్పించాలంటూ నిబంధన విధించవద్దని సుప్రీంకోర్టు సీబీఎస్ఈని ఆదేశించింది. ఈ సమాచారాన్ని సీబీఎస్ఈ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా సీజే దీపక్ మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించింది. బుధవారం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు జరిగాయి. ఈ ఏడాది నీట్‌కు హాజరుకాగోరు విద్యార్థుల నుంచి విధిగా ఆధార్ నెంబరు తీసుకోవాలని తాము సీబీఎస్ఈని ఆదేశించలేదని యూఐడీఏఐ ధర్మాసనానికి తెలిపింది. అయితే జమ్మూకశ్మీరు, మేఘాలయ, అసోం వంటి రాష్ట్రాల్లోని అభ్యర్థుల నుంచి పాస్‌పోర్టు, ఓటరుకార్డు, రేషన్ కార్డు వంటి ఇతర గుర్తింపు పత్రాలను సీబీఎస్ఈ తీసుకోవచ్చని యూఐడీఏఐ తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ చెప్పారు. ఈ ఏడాది నీట్ రాసే విద్యార్థులు విధిగా ఆధార్ నెంబరు లేదా ఆధార్ నమోదు సంఖ్యను సమర్పించాలంటూ సీబీఎస్ఈ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా యూఐడీఏఐ ఈ వివరణ ఇచ్చింది.

'కూచిభొట్ల'ను చంపింది నేనే: ఆడమ్స్



వాషింగ్టన్, మార్చి 7: అమెరికాలో తెలుగు ఇంజనీర్ కూచిభొట్ల శ్రీనివాస్‌ను కాల్చి చంపిన కేసులో నిందితుడు ఎట్టకేలకు కోర్టులో తన నేరాన్ని అంగీకరించాడు. ఇందులో తన తప్పేమీ లేదని మొదటినుంచీ వాదిస్తున్న నిందితుడు ఆడమ్ ప్యూరింటన్.. తాజా విచారణలో తప్పును ఒప్పుకున్నాడు. ఈ కేసులో మే 4న శిక్ష ఖరారు కానుంది. హత్య కేసులో అతడికి జీవిత ఖైదుతో పాటు హత్యాయత్నం ఆరోపణలపై కనీసం 12ఏళ్ల నుంచి గరిష్ఠంగా 54ఏళ్ల వరకూ జైలుశిక్ష పడే అవకాశం ఉంది. "ఈ రోజు నిందితుడు తన నేరాన్ని అంగీకరించడం నా శ్రీనుని తిరిగి తీసుకురాలేదు. కానీ, జాతి విద్వేషం ఎన్నటికీ ఆమోదయోగ్యం కాదనే బలమైన సందేశాన్ని అందిస్తుంది." అని శ్రీనివాస్ భార్య సునయన దూమాల ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చెత్త అణుబాంబు పేలితే చూడాలని ఉందా?

▸ కేంద్ర, రాష్ట్రాలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 7: "చెత్తతో నిండిపోయిన అణుబాంబు పేలితే అధికారులు చూద్దామనుకుంటున్నారా? ఘన వ్యర్థాల నిర్వహణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి ఆందోళనా లేదు" అని సుప్రీంకోర్టు చివాట్లేసింది. వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం బుధవారం ప్రభుత్వాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘన వ్యర్థాల నిర్వహణ జాతీయ సమస్యలాంటిదనీ, ఇదేమీ పట్టనట్లు ప్రభుత్వాలు వ్యవహరించడం దిగ్భ్రాంతి కలిగిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణలో ఢిల్లీ మినహా, ఇతర రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల న్యాయవాదులెవరూ హాజరుకాకపోవడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

పురాణాలతో దేశచరిత్ర సంబంధాన్ని తేల్చండి

▸ ప్రత్యేక కమిటీకి సూచించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 7: రామాయణం, మహాభారతం వంటి పురాణాలు వట్టి గాథలేనా? లేక నిజంగానే భారత ప్రాచీన చరిత్రలో విభాగమా? దీనిపై స్పష్టత కోసం పురాణాలకు, భారత ప్రాచీన చరిత్రకు మధ్య సంబంధాలను తేల్చాలని కేంద్ర సంస్కృతిక మంత్రిత్వ శాఖ నియమించిన కమిటీకి సూచించింది. 12 వేల ఏళ్ల క్రితం భారత సంస్కృతి పుట్టుక, తదనంతర పరిణామాలపై లోతైన అధ్యయనం చేయాలని, ప్రపంచంలోని ఇతర సంస్కృతులతో సంబంధాలను తేల్చాలని ఆదేశించింది. 2016 నవంబరులో నియమించిన 14 మంది సభ్యుల కమిటీలో బ్యూరోక్రాట్లు, పురావస్తు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఉన్నారు.

తొగాడియాకు త్రుటిలో తప్పిన ముప్పు

సూరత్, మార్చి 7: వీహెచ్‌పీ(విశ్వ హిందూ పరిషత్) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియాకు త్రుటిలో ప్రమాదం తప్పింది. గుజరాత్‌లోని సూరత్ జిల్లా కమ్రేజ్ పట్టణానికి కిలోమీటరు దూరంలో ఆయన ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ఓ ట్రక్కు ఢీకొంది. అయితే తొగాడియాకు గాయాలేమీ కాలేదు. మరోవ్యక్తితో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సూరత్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తమ కారును, తర్వాత డివైడర్‌ను ఢీకొన్నా ఆ ట్రక్కుకు బ్రేక్ వేయలేదని తొగాడియా ఆరోపించారు. గుజరాత్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తనకు జడ్ ప్లస్ కేటగిరీ భద్రతను తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది బుల్లెట్ ప్రూఫ్ కారు కాకుంటే తన ప్రాణాలు పోయేవని వాపోయారు. డ్రైవర్‌ను అరెస్టు చేశామని ఎస్పీ ఎంకే నాయక్ చెప్పారు.


రాజస్థాన్‌లో మళ్లీ కాంగ్రెస్ పైచేయి

▸ స్థానిక ఉప ఎన్నికల్లో హస్తం హవా

జైపూర్, మార్చి 7: రాజస్థాన్‌లో అధికార బీజేపీపై కాంగ్రెస్ మళ్లీ పైచేయి సాధించింది. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసింది. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో మంగళవారం ఉప ఎన్నికలు జరగగా.. అన్ని చోట్లా ఆధిపత్యం ప్రదర్శించింది. ఇందులో 6 జెడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 4 చోట్ల కాంగ్రెస్ గెలుపొందింది. బీజేపీకి ఒక్క స్థానం మాత్రమే దక్కింది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఇక 21 పంచాయతీ సమితి సభ్యులకు ఉప ఎన్నికలు జరగగా.. ఇందులో కాంగ్రెస్ 12, బీజేపీ 8 చోట్ల విజయం సాధించాయి. కాగా ఆరు నగర పాలక సంస్థలకు ఉప ఎన్నికలు నిర్వహించగా.. కాంగ్రెస్ నాలుగింటిని, బీజేపీ రెండింటిని దక్కించుకున్నాయి. రాష్ట్రంలో ఇటీవల ఉప ఎన్నికలు జరిగిన రెండు లోక్‌సభ స్థానాలనూ హస్తం పార్టీ గెలుచుకున్న విషయం తెలిసిందే.

కర్ణాటక ఎన్నికలు ఏప్రిల్ చివర్లో!

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ చివర్లో లేదా మే మొదటి వారంలో జరిపేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో పరిస్థితిని అంచనా వేసి, షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ఈసీ ఈ నెలాఖరులోగా రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉంది. ఈనెల 20 తర్వాత ఏ క్షణంలోనైనా షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది. 224 మంది సభ్యులున్న అసెంబ్లీ కాలం మే 28తో ముగియనుంది. ఆ లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఈసీ భావిస్తోంది.



ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ రాసిన లేఖ ఇది. సాపేక్ష సిద్ధాంతం గురించి వివరిస్తూ 1928లో బెర్లిన్ నుంచి ఆయనీ లేఖను ఓ గణితశాస్త్రవేత్తకు పంపారు. జెరూసలెంలో దీనిని వేలం వేయగా ఏకంగా రూ.65 లక్షల ధర పలికింది.


పంచెకట్టు.. పాత గొంగడి..
ఓ ఎమ్మెల్యే!

ప్రజల వద్దకు కాలినడకనే.. అసెంబ్లీకి బస్సు, రైల్లోనే..

▸ 200 ఎకరాలు ప్రజలకు ధారాదత్తం

▸ ప్రజాసేవలో పిచ్చయ్య ఆదర్శం

▸ దయనీయ స్థితిలో ఆయన కుటుంబం



మాజీ ఎమ్మెల్యే పిచ్చయ్య (ఫైల్)



పానుగంటి పిచ్చయ్య దంపతులు (ఫైల్)

పాల్వంచరూరల్, మార్చి 7: ఆయనో ఎమ్మెల్యే! కద్దరు బనీన్, పంచెకట్టుతో భుజాన ఓ పాత గొంగడి వేసుకొని కాలినడకన నియోజకవర్గంలో తిరిగేవారు! వాహనం ఉపయోగించేవారు కాదు. అసెంబ్లీ సమావేశాలకు బస్సు లేదా రైల్లోనే వెళ్లేవారు. ఎమ్మెల్యేగా వచ్చే జీతంలో కొద్ది మొత్తం ఉంచుకొని, మిగతాదంతా ప్రజలకే ఖర్చు చేసేవారు. సమస్యలు చెప్పుకొనేందుకు ఇంటికొచ్చిన ప్రజలకు భోజనం పెట్టేవారు. ఇదంతా ఒకెత్తయితే వారసత్వంగా సంక్రమించిన 200 ఎకరాల భూమిని ఆయన ప్రజలకు దానం చేశారు! ఐదేళ్ల పదవీకాలంలో అనుక్షణం ప్రజాసేవకే అంకితమైన ఆయన తనకంటూ మిగిల్చుకుంది. ఆరెకరాల భూమి, ఓ ఇల్లు మాత్రమే! ఆయనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మాజీ ఎమ్మెల్యే, దివంగత పానుగంటి పిచ్చయ్య. గొప్ప దాతృత్వం, సాదాసీదా జీవితాన్ని చూసి పిచ్చయ్యను 'పాల్వంచ అపరగాంధీ' అని పిలిచేవారు. 1960లో పాల్వంచ నియోజకవర్గం వరంగల్ జిల్లా పరిధిలో ఉండేది. పాల్వంచ, కొత్తగూడెం మేజర్ పంచాయతీలతోపాటు గుండాల, ఆళ్లపల్లి కూడా ఈ నియోజకవర్గంలోనే ఉండేవి. పాతపాల్వంచకు చెందిన పిచ్చయ్యను ప్రజలు విశేషంగా అభిమానించేవారు. తొలుత సర్పంచ్‌గా, 1961లో పాల్వంచ సమితి అధ్యక్షుడిగా గెలుపొందారు. 1967లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1972వరకు ఆ పదవిలో ఉన్నారు. ఈ కాలంలోనే భద్రాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా కొనసాగారు.1971లో పాత పాల్వంచలో ఓ ఇంటిని నిర్మించుకున్నారు. పాల్వంచ సమితి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ప్రభుత్వం జీపును కేటాయించినా ఉపయోగించుకోలేదు.ఆ జీపును అధికారులకు అప్పజెప్పి.. ప్రజల వద్దకు కాలి నడకనే వెళ్లేవారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వాహనానికి లోన్ పెట్టుకోవాలని తోటి ఎమ్మెల్యేలు సూచించినా నిరాకరించారు. సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన మంచి పనులను ప్రజలు నేటికీ స్మరించుకుంటారు. అప్పట్లో ఓ 100 ఎకరాల ప్రభుత్వ భూమిలో మామిడితోటను వేసి ఆ ఫల సాయాన్ని అభివృద్ధి పనులకు కేటాయించారని ఇప్పటికీ చెప్పుకొంటారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోజుల్లోనే పిల్లల పెళ్లిళ్లు జరిపించారు. 1997లో పరమపదించారు.



పాతపాల్వంచలో 1971లో నిర్మించుకున్న ఇల్లు

పింఛన్ కోసం కుమారుడి ఎదురుచూపు



కుమారుడు సత్యనారాయణ

పిచ్చయ్య మరణానంతరం కుటుంబసభ్యులంతా జీవనోపాధి కోసం చెల్లాచెదురయ్యారు. పిచ్చయ్యకు భార్య సాయమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. పెద్దకుమారుడు సీతయ్య హైదరాబాద్‌లో ఉంటున్నాడు. చిన్నకుమారుడు సత్యనారాయణకు 73 ఏళ్లు. ఆయన భార్య రమణమ్మ రెండేళ్ల క్రితం మృతి చెందింది. కొడుకు ఓ ప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. పాత పల్వంచలో తండ్రి కట్టించిన ఇంట్లో సత్యనారాయణ ఒంటరిగా కాలం గడుపుతున్నారు. అనారోగ్యం వల్ల ఇంట్లో ఓ భాగాన్ని విక్రయించారు. పేదరికంలోకొట్టుమిట్టాడుతున్న సత్యనారాయణకు వృద్ధాప్య పెన్షన్ కూడా రావడం లేదు. అధికారులను అడిగితే.. 'మీ తండ్రి పేరు మీద వందల ఎకరాల భూములున్నాయి. మీకు పింఛను ఎలా వస్తుంది?'అని అధికారులు ప్రశ్నిస్తున్నారని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో వాపోయారు. ఆ భూములన్నీ ఇతరులకు రిజిస్ట్రేషన్ కాకున్నా ఎవరి చేతిలో ఉన్నాయో తనకు తెలియదని, ఇప్పుడు తన పరిస్థితి దయనీయంగా ఉందని ఆయన వాపోయాడు. ఒకపూట వండుకుని మరోపూట పస్తులుంటున్నానన్నారు. వారసత్వ భూముల్లో కొన్నింటిని తండ్రి దానం చేయగా మరికొన్ని ఆక్రమణకు గురయ్యాయన్నారు. సత్యనారాయణకు వృద్ధాప్య పెన్షన్‌పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ గన్యాను అన్నారు.

కరువును పారదోలుతున్నాం

▸ కరువు ప్రాంతాలకు కాళేశ్వరం తొలిఫలితం

▸ ఇక చెరువులు ఎండిపోవు

▸ వానాకాలం నాటికి 75వేల ఎకరాలకు నీరు

▸ పాదయాత్రలతో ఉపయోగం లేదు: హరీశ్

▸ సిద్దిపేట జిల్లాలో మంత్రి సుడిగాలి పర్యటన

సిద్దిపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి)/కోహెడ/మద్దూరు/బెజ్జంకి/హుస్నాబాద్ టౌన్: ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తొలిఫలితాన్ని కరువు ప్రాంతాలైన హుస్నాబాద్, మానకొండూరు, కరీంనగర్, వేములవాడ నియోజకవర్గాలకు అందించనున్నట్లు భారీనీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. వచ్చే వానాకాలంతర్వాత చెరువులు ఎండబోవని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తోందని, కరువును పారదోలేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో బుధవారం మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. కోహెడ మండలం శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు ఆధునీకరణ పనులు, తోటపల్లి రిజర్వాయర్ పనులు, మోయతుమ్మెదవాగు ఆనకట్ట, గౌరవెల్లి రిజర్వాయర్ సొరంగం, కాలువల పనులు పరిశీలించారు. కాలువల వెంట నడుస్తూ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మిడ్‌మానేరు రిజర్వాయర్ పనులు 98% పూర్తయ్యాయని, వానాకాలం నాటికి హుస్నాబాద్, మానకొండూరు, కరీంనగర్, వేములవాడ నియోజకవర్గాల్లో 75 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. 1992 నుంచి మిడ్‌మానేరు రిజర్వాయర్ నిర్మాణం గురించి ప్రతిపాదనలు చేస్తున్నారని, 2005 నుంచి 2014 వరకు 30% మట్టిపనులు మాత్రమే పూర్తిచేశారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన మూడున్నరేళ్లలోనే మిగతా 70% పనులు చేశామన్నారు. 1.4టీఎంసీలు ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 8టీఎంసీలకు పెంచామన్నారు.శనిగరం ప్రాజెక్టు పనులను మార్చినెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పాదయాత్రలు, ఉపన్యాసాలతో ప్రజలకు ఉపయోగం ఉండదని, వారి ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులను తాము అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మంత్రి వెంట కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఉన్నారు. కాగా, మంత్రి హరీశ్‌రావు చొరవతో లద్నూరు రిజర్వాయర్‌లోకి ట్రయల్‌రన్ ద్వారా గోదావరి జలాలు విజయవంతంగా తరలిస్తున్నారు.



సిద్దిపేట జిల్లాలోని శనిగరం గ్రామశివారులో తన కాన్వాయ్‌ని ఆపి ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ వినోద్

ఆటోలో మంత్రి

హుస్నాబాద్‌లో చేపట్టిన ఆటోయూనియన్ ర్యాలీలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆటో నడపగా మంత్రి హరీశ్ పక్కన కూర్చొని బస్‌డిపో నుంచి బస్టాండ్ మీదుగా మార్కెట్‌యార్డు వరకు వెళ్లారు. ఆటో యూనియన్ భవనానికి స్థలం చూడాలని ఆర్డీవోను ఆదేశించారు.

గింత దూరం మీరే వచ్చిండ్రు అన్న...

శనిగరం ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి హరీశ్ తనకు ఎదురుగా వస్తున్న కొంతమంది మహిళలను ఆప్యాయంగా పలకరించారు. శనిగరం చెరువును చూసేందుకు తానువచ్చానని మంత్రి చెప్పగా 'రాళ్లు, రప్పలు, గుట్టల దారిలో గింత దూరం మీరే వచ్చిండ్రన్న, మా యాదిలో ఇక్కడికి వచ్చి చెరువు చూసిన నాయకులైతే ఎవరూ లేరన్న. మీరు ఎట్ల పనిజేస్తరో, సిద్దిపేటను ఎట్ల జేసిండ్రో చూసినమన్న' అంటూ అనూష, వర్షిణి అనే మహిళలు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. ఎండలో పనిచేస్తుంటే చేతులకు పొక్కులు వస్తున్నాయని, కూలీ డబ్బులు గిట్టుబాటు కావడం లేదని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చించాలని పక్కనే ఉన్న ఎంపీ వినోద్‌కుమార్‌కు మంత్రి చెప్పారు. కూలీ డబ్బులు పెంచడంతోపాటు పనుల వద్ద సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గుంటి వీరయ్య అనే వృద్ధుడిని మంత్రి పలకరించారు. గౌరవెల్లి రిజర్వాయర్ వద్ద బిహార్‌కు చెందిన కూలీలతోనూ ముచ్చటించారు.

ఎకరా ఉంటే చాలు

▸ రైతు కోటా సీట్లపై ప్రభుత్వం నిర్ణయం

▸ నేడో, రేపో ఉత్తర్వులు!

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జయశంకర్ వ్యవసాయ వర్సిటీ కోర్సుల సీట్లలో రైతు కోటా కింద విద్యార్థుల కుటుంబాలకు ఉండాల్సిన వ్యవసాయ భూమిని ఒక ఎకరాకు కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనుంది. దీంతో రాష్ట్రంలోని గ్రామీణ విద్యార్థులకు మేలు జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ కోర్సుల్లో 40 శాతం సీట్లను రైతు కోటా కింద భర్తీ చేసేవారు. రాష్ట్రం విడిపోయి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఏర్పడిన తరువాత కూడా సీట్ల భర్తీలో అదే విధానం కొనసాగుతోంది. రైతు కోటా సీట్లకు అర్హతల్లో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు నాలుగేళ్లపాటు విద్యాభ్యాసం చేసి ఉండాలన్నది నిబంధనగా ఉంది. అదేవిధంగా ఆయా విద్యార్థుల కుటుంబాలకు 3 ఎకరాలు, ఆపై వ్యవసాయ భూమి ఉండాలనే నిబంధనా ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచీ రైతు సగటు కమతం హెక్టారు, అంతకంటే తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ 3 ఎకరాల పరిధిని కుదించాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏటా అడ్మిషన్ల ముందు ఈ వివాదం ముందుకు రావడం, తర్వాత సద్దుమణగడం జరుగుతూ ఉంది. తాజాగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఈ కోటా కింద అర్హతల్లో విద్యార్థి కుటుంబానికి ఉండాల్సిన వ్యవసాయ భూమిని ఎకరాకు కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎకరా భూమి కూడా లేకుండా.. భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతుల పిల్లలకు ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం నిరాశే కలిగిస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయ భూమిలేని కౌలు రైతులు లక్షల సంఖ్యలో ఉన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. కౌలురైతులే కాకుండా.. వ్యవసాయ కూలీలకూ భూమి ఉండదని, ఈ వర్గాల విద్యార్థులు రైతు కోటా కింద దశాబ్దాలుగా అర్హత లేకుండా ఉన్నారని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రేపు మావోయిస్టుల బంద్

▸ అప్రమత్తమైన పోలీసులు

▸ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని నేతలకు సూచన

చర్ల/గార్ల/ఏటూరునాగారం/హైదరాబాద్(ఆంధ్రజ్యోతి), మార్చి 7: ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 9న తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కోసం అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సుకు మావోయిస్టులు నిప్పంటించి, ఓ వ్యక్తిని హత్య చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల-బయ్యారం సరిహద్దులోని కన్నాయిగూడెం మూలవాగు బ్రిడ్జి వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఓ వాహనానికి నిప్పుపెట్టారు. మరోవైపు ఎన్‌కౌంటర్‌కు అధికార పార్టీ నేతలు బాధ్యతవహించాలని జయశంకర్ జిల్లా ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియాకమిటీ కార్యదర్శి వెంకటేశ్, మణుగూరు ఏరియా కార్యదర్శి స్వర్ణక్క హెచ్చరించారు. హిట్‌లిస్టులో ఉన్న నాయకులను, ఏజెన్సీల్లోని మండల, గ్రామస్థాయి టీఆర్ఎస్ నేతలను పోలీసులు పట్టణాలు, నగరాలకు తరలిస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఏజెన్సీ గ్రామాల్లో పర్యటించవద్దని సూచించారు.

దోచుకోవడానికే దాడులు: వికల్ప్

మావోయిస్టులపై సాయుధబలగాల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ ఒక ఆడియో రికార్డును విడుదల చేశారు. అటవీ ప్రాంతాల్లోని ఖనిజ వనరులను దోచుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై దాడులు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమం చేస్తున్న మావోయిస్టులకు.. ప్రజా సంఘాలు, మేధావులు, విద్యార్థులు మద్దతు ఇవ్వాలని కోరారు.




భూపాలపల్లి జిల్లా వెంకటాపురంలో పోలీసుల తనిఖీలు

ఇంజనీరునంటూ ఏటీఎంను కొల్లగొట్టాడు

▸ బ్యాంకు అధికారుల కళ్ల ముందే

రూ. 18 లక్షల దోపిడీ

ముజఫర్‌నగర్, మార్చి 7: 'ఏటీఎం పనిచేయడం లేదంటూ మీ బ్యాంకు వాళ్లు ఫిర్యాదు చేశారు.. రిపేర్ చేయడానికి వచ్చాను' అంటూ యూపీలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును ఓ మోసగాడు బురిడీ కొట్టించాడు. ఏటీఎంలోని రూ. 18 లక్షలతో ఉడాయించాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని శామ్లీ జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం ఇక్కడి ఓవర్సీస్ బ్యాంకుకు వచ్చిన ఓ యువకుడు తనను తాను ఇంజనీర్‌గా పరిచయం చేసుకున్నాడు. ఏటీఎంకు మరమ్మతులు చేయడానికి వచ్చానని నమ్మబలికాడు. కాసేపటికి రిపేర్ పూర్తయిందంటూ వెళ్లిపోయాడు. ఏటీఎంలో డబ్బులు లేవంటూ కొందరు వినియోగదారులు ఫిర్యాదు చేయడంతో బ్యాంకు అధికారులు మోసాన్ని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగంతుకుడు రూ. 18.37 లక్షలతో ఉడాయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు.. బ్యాంకు సిబ్బందిని కూడా ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు



సాగర్ జలాశయంలో ప్రస్తుతం నీటి పరిస్థితి, ప్రస్తుతం 520.60 అడుగుల వద్ద నాగార్జునసాగర్ నీటి మట్టం

సాగర్‌ను తోడేస్తున్నారు!

▸ ఇరు రాష్ట్రాల ఇష్టారాజ్యం


▸ ఎడమ, కుడి కాలువల ద్వారా ఎడా పెడా తరలింపు

▸ వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవంటున్న నిపుణులు

నాగార్జునసాగర్, మార్చి 7: నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కనీస నీటి మట్టం నిర్వహణ సాధ్యమేనా? ప్రస్తుతం అక్కడ తోడివేతను చూస్తే అసాధ్యమంటున్నారు నీటి రంగ నిపుణులు. గత జూన్ నుంచి ఇప్పటివరకు ఎగువ నుంచి సాగర్‌కు 248 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఈ నీటిని కనీస నీటి మట్టం వరకు తోడుకోవాల్సి ఉండగా.. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఎడమ, కుడి కాలువల ద్వారా ఎడాపెడా తోడేస్తున్నాయి. ఈ రబీ సీజన్‌లో ఎడమ కాలువ పరిధిలో గత డిసెంబరు 10 నుంచి ఇప్పటివరకు 36 టీఎంసీల నీటిని విడుదల చేయగా, కుడి కాలువకు అక్టోబరు 31 నుంచి 66 టీఎంసీల నీటిని విడుదల చేశారు. కానీ కృష్ణా బోర్డు ఈ నెల 6న నిర్వహించిన సమావేశంలో సాగర్‌లో మార్చి 20 నాటికి కనీస నీటిమట్టం 515 అడుగులు ఉంచాలని నిర్ణయించింది. బోర్డు నిర్ణయం హర్షణీయమే అయినప్పటికీ ఇరు రాష్ట్రాల అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పోటాపోటీగా నీటిని తోడేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాగే మరో పదిరోజులు నీటిని తోడుకుంటే సాగర్ నీటి మట్టం 500 అడుగులకు పడిపోయే ప్రమాదం ఉందని నీటి రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజాగా బోర్డు ఏపీకి 9 టీఎంసీలు, తెలంగాణకు 24 టీఎంసీల నీటిని కేటాయించింది. దీంతో కుడి కాలువకు ఈ నెల 1 నుంచి రోజుకు 2 వేల క్యూసెక్కుల నీటిని ఐదురోజులపాటు 10వేల క్యూసెక్కులు విడుదల చేయలని బోర్డు నిర్ణయించింది. ఐదు రోజులు దాటినప్పటికీ బుధవారం కూడా కుడి కాలువకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సాగర్‌లో కనీస నీటి మట్టం నిర్వహణ సాధ్యపడదని, జంటనగరాలు తాగునీటి అవసరాలకు వేసవిలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

షేమ్..మి!


భార్యతో షమి



బౌలర్ షమికి అక్రమ సంబంధాలు • అతడి కుటుంబ సభ్యుల వేధింపులు
చంపేందుకూ యత్నించారు • షమి భార్య సంచలన ఆరోపణలు

కోల్‌కతా: భార్య, కూతురితో కలిసిఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో విడుదలజేస్తూ తరచూ సంప్రదాయవాదుల ఆగ్రహావేశాలు ఎదుర్కొనే టీమిండియా పేసర్ మహ్మద్ షమి పెద్ద వివాదంలో చిక్కుకున్నాడు. అతడికి పలువురు మహిళలతో అక్రమ సంబంధాలున్నాయని ఏకంగా షమి భార్య హసీన్ జహ బుధవారం సంచలన ఆరోపణలు చేసింది. అంతేకాదు..షమి పాకిస్థాన్‌లో ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడని కూడా ఆరోపించింది. ఇటీవల దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం ఆమెను కలిసేందుకు అతడు పాక్ వెళ్లాడని వెల్లడించింది. భార్య ఆరోపణలు మీడియాలో రావడంతో షమి ట్విటర్ ద్వారా స్పందించాడు. అవి నిజం కావని, తన కెరీర్‌ను నాశనం చేసేందుకు జరుగుతున్న కుట్రగా అభివర్ణించాడు.

అక్రమ సంబంధాలు..వేధింపులు: భర్త షమి గురించి హసీన్ తన ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించిన వివరాలు..'27 ఏళ్ల నా భర్త షమికి ఎందరో అమ్మాయిలతో సంబంధం ఉంది. ఈ విషయాలు అతడి సెల్‌ఫోన్ చూసినపుడు నాకు తెలిశాయి. 2014లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ షమికి ఓ మొబైల్ బహుమతిగా ఇచ్చింది. దానిని తన బీఎండబ్ల్యూ కారులో దాచాడు. నేను దానిని చూసినప్పుడు షమి పలువురు యువతులతో అసభ్యంగా చాటింగ్ చేస్తున్న విషయాలు, వారితో అక్రమ సంబంధాలు కలిగిఉండడం తెలిశాయి. ఆ విషయం నాకు తెలియడంతో రెండున్నరేళ్లుగా షమి, అతడి కుటుంబ సభ్యులు నన్ను వేధిస్తున్నారు. అతడి తల్లి, సోదరుడు తిడుతూ ఉంటారు. తెల్లవారుజాము 2, 3 గంటల వరకూ వారి వేధింపులు కొనసాగుతాయి. చంపేందుకూ ప్రయత్నించారు' అని జహ ఆరోపించింది. షమి చాటింగ్ చేసే అమ్మాయిల ఫోన్ నెంబర్లు, ఆ చాటింగ్‌ల వివరాలు, వారితో సన్నిహితంగా ఉన్న చిత్రాల స్క్రీన్‌షాట్లను ఆమె తన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. షమి కారులో కండోమ్స్ కూడా ఉన్నాయని వెల్లడించింది. మ్యాచ్‌లకోసం షమి ఎక్కడికి వెళ్లినా కుల్దీప్ అనే వ్యక్తి అమ్మాయిలను సరఫరా చేస్తాడని హసీన్ ఆరోపించింది. ఈ విషయం బీసీసీఐకి తెలిసినా చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహించింది. 'గతంలో ధర్మశాలలో భారత్ ఆడిన ఓ మ్యాచ్‌కు నన్ను కూడా తీసుకువెళ్లాలని కోరాను. కానీ అందుకు షమి నిరాకరించాడు. అక్కడికి వెళ్లాక ఫోన్ చేసి నన్ను తిట్టాడు' అని వాపోయింది. తన భర్త మారతాడని రెండేళ్లుగా ఎదురు చూశానని చెప్పింది. 'అతడు మారేందుకు తగిన సమయం ఇవ్వాలనుకున్నా. అందుకే ఇప్పటి వరకూ మౌనంగా ఉన్నా. కానీ అతడు తన తప్పులను సరిదిద్దుకోకపోగా నాపై ఆగ్రహిస్తున్నాడు. అంతేకాదు..నేను క్షేమంగా ఉండాలంటే నోర్మూసుకొని పడిఉండాలని బెదిరిస్తున్నాడు' అని జహ వెల్లడించింది. షమి, అతడి కుటుంబ సభ్యుల ప్రవర్తనను పోలీసుల దృష్టికి తీసుకెళ్లానని, అయితే కేసు పెట్టలేదని చెప్పింది.

కోర్టుకు వెళతా..: షమితో తన వైవాహిక బంధాన్ని తెంచుకోనని హసీన్ స్పష్టంజేసింది. అతడిని కోర్టుకు లాగుతానని ఓ వార్త సంస్థతో మాట్లాడుతూ వెల్లడించింది. 'నా భర్త శృంగార పురుషుడు. అతడికి పలువురు యువతులతో అక్రమ సంబంధాలున్నాయి. వాటి ఆధారాలు నావద్ద ఉన్నాయి. వాటితో కోర్టు మెట్లు ఎక్కుతా' అని తెలిపింది. 2012 ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా జహను షమి మొదటిసారి కలిశాడు. అలా ప్రేమలో పడిన వారిద్దరూ 2014 జూన్ 6న వివాహం చేసుకున్నారు. వీరికి మూడేళ్ల పాప ఐరా ఉంది.



కాంట్రాక్టు నిలిపిన బీసీసీఐ: షమి భార్య ఆరోపణల నేపథ్యంలో అతడిని సెంట్రల్ కాంట్రాక్టును బీసీసీఐ నిలిపివేసింది. 26మంది క్రికెటర్లతో కూడిన సెంట్రల్ కాంట్రాక్టు జాబితాను బోర్డు బుధవారం విడుదలజేసింది. అందులో షమి పేరు లేకపోవడం గమనార్హం.

అంతా అబద్ధం: షమి

అయితే తనపై వస్తున్న వార్తలకు ట్విటర్ ద్వారా షమి స్పందించాడు. 'హాయ్ నేను షమిని. నా వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలన్నీ శుద్ధ అబద్ధం. నా ఆటను నాశనం చేసేందుకు, నా పేరు ప్రతిష్ఠలు మంటగలిపేందుకు ఎవరో చేస్తున్న పెద్ద కుట్ర' అని ప్రత్యారోపణ చేశాడు. దేవధర్ ట్రోఫీకోసం ప్రస్తుతం షమి ధర్మశాలలో ఉన్నాడు.

భువీ, బుమ్రా ఎ-ప్లస్

- కోహ్లీ, ధవన్, రోహిత్‌లతో కలసి కొత్త కేటగిరీకి ప్రమోషన్
- భారీగా పెరిగిన జీతాలు • కొత్త కాంట్రాక్టులు ప్రకటించిన బోర్డు

న్యూఢిల్లీ: నెలలుగా నలుగుతున్న క్రికెటర్ల కాంట్రాక్టు సమస్య ఓ కొలిక్కి వచ్చింది. ఏడాది కాలానికి క్రికెటర్ల (టీమిండియా, సీనియర్ మహిళలు, దేశవాళీ) కాంట్రాక్టులను బీసీసీఐ బుధవారం ప్రకటించింది. అంతేకాదు అన్ని కేటగిరీల క్రికెటర్ల జీతాలనూ భారీగా పెంచింది. ఈ కాంట్రాక్టు 2017 అక్టోబరు నుంచి 2018 సెప్టెంబరు వరకూ అమలులో ఉంటుంది. ఈసారి కొత్తగా ఎ-ప్లస్ కేటగిరీ ప్రవేశపెట్టింది. ఇక మాజీ కెప్టెన్ ధోనీ, సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ల టాప్ కేటగిరీ దిగజారింది. వీరిద్దరికీ గ్రేడ్-ఎ కాంట్రాక్టులిచ్చింది. ఎ-ప్లస్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శిఖర్ ధవన్, పేసర్లు భువనేశ్వర్‌కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాలకే చోటు కల్పించింది. వీరికి ఒక్కొరికీ ఏడాదికి రూ. ఏడు కోట్లు జీతాలుగా చెల్లించనుంది. మహీ, అశ్విన్‌తోపాటు జడేజా, విజయ్, పుజారా, రహానే, సాహా ఎ-గ్రేడ్‌లో ఉన్నారు. వీరికి ఒక్కొరికీ రూ.ఐదు కోట్ల చొప్పున అందుతుంది. షమి భార్య ఆరోపణల నేపథ్యంలో అతడిని కాంట్రాక్టు నుంచి పక్కనబెట్టారు. వెటరన్ యువ రాజ్ సింగ్, యువ కీపర్ రిషభ్‌పంత్‌కు అసలు చోటే దక్కకపోగా..ఇటీవల టీమిండియాలో పునరాగమనం చేసిన సురేష్ రైనాకు కాంట్రాక్టు లభించడం గమనార్హం.

ఎక్కువ ఆట..ఎక్కువ జీతం..

ధోనీకి టాప్ కేటగిరీ కాంట్రాక్టు ఇవ్వకపోవడంపై 'ఎక్కువ ఆడండి. ఎక్కువ పొందండి అన్న సింపుల్ లాజిక్‌ను సెలెక్టర్లు పాటించారు. ఆ ఐదుగురు క్రికెటర్లు ప్రస్తుతం అన్ని ఫార్మాట్లలో ఆడడం తప్పనిసరి. అందువల్ల ఎక్కువ చెల్లించేందుకు వారు అర్హులే. అంతేకాదు రవిశాస్త్రి, కోహ్లీ, ధోనీ అభిప్రాయాలనూ వారు పరిగణనలోకి తీసుకున్నారు' అని ఓ బోర్డు అధికారి వివరించాడు. 'ధోనీ రిటైర్ అయ్యాడు. అశ్విన్, జడేజా వన్డేలకు ఎంపికవడం అంతంతమాత్రమే. వారిద్దరూ ప్రపంచ కప్ స్కీంలో లేరు. అందువల్ల రెండో కేటగిరీకి పరిమితం చేశారు' అని అధికారి తెలిపాడు. బి-కేటగిరీలో కేఎల్ రాహుల్, ఉమేష్, కుల్దీప్, చాహల్, హార్దిక్ పాండ్యా, ఇషాంత్ శర్మ, దినేశ్ కార్తీక్, గ్రేడ్-సిలో కేదార్, మనీష్ పాండే, అక్షర్, కరుణ్ నాయర్, రైనా, పార్థివ్, జయంత్ యాదవ్‌లను చేర్చారు. గ్రేడ్-బి క్రికెటర్లు


భువనేశ్వర్, బుమ్రా

ఒక్కోరికీ రూ. మూడు కోట్లు, గ్రేడ్-సి ఆటగాళ్లు ఒక్కోరికీ రూ. కోటి చెల్లిస్తారు. గతసారి టాప్ కేటగిరిలో ఉన్న క్రికెటర్లకు రూ. రెండు కోట్లు చెల్లించారు. అయితే క్రికెట్ పాలక మండలి (సీవోఏ) ఆధ్వర్యంలోని బీసీసీఐ దానిని ఈసారి ఏకంగా 350 శాతం పెంచి రూ. ఏడు కోట్లు చేయడం విశేషం. రెండో కేటగిరి ఆటగాళ్లకు 500 శాతం హెచ్చించి రూ. ఐదు కోట్లు ఇవ్వనున్నారు.

దేశవాళీ క్రికెర్లకు ధమాకా..

దేశవాళీ క్రికెటర్ల జీతాలు ఊహించని విధంగా పెరిగాయి. ఇకపై తుది 11 మంది జట్టులో చోటు దక్కిన ఆటగాడు నాలుగు రోజుల మ్యాచ్‌లో రోజుకు రూ. 35వేలు పొందుతాడు. అంటే మ్యాచ్‌కు రూ. 1.40 లక్షలన్నమాట. టీవీ హక్కుల రుసుమును కూడా చేర్చితే ఒక్కో మ్యాచ్‌కు వారి జీతం రూ మూడు లక్షలు అవుతుంది. రిజర్వ్ క్రికెటర్లకు రోజుకు రూ. 17, 500 చెల్లిస్తారు. అండర్-23 క్రికెటర్లకు..తుది 11 మందిలోని ఆటగాళ్లకు ఒక్కోరికి రోజుకు రూ. 17,500, రిజర్వ్ క్రికెటర్లకు ఒక్కోరికీ రోజుకు రూ. 8,750 జీతం అందుతుంది. అండర్-19లో తుది 11 మందిలో ఒక్కొక్కరికి రోజుకు రూ. 10, 500, రిజర్వ్ క్రికెటర్లకు ఒక్కోరికీ రోజుకు రూ. 5,250 చెల్లిస్తారు.


ధోనీ

మహిళా క్రికెటర్లకూ..


మిథాలీ

మహిళలకు సంబంధించి ప్రపంచకప్ స్టార్లు మిథాలీ, జులన్, హర్మన్‌ప్రీత్, స్మృతిలను టాప్ కేటగిరీలో చేర్చారు. వీరికి ఏడాది రూ. 50 లక్షల చొప్పున చెల్లిస్తారు. ఇక గ్రూప్-బి మహిళా క్రికెటర్లు ఒక్కోరికీ రూ. 30 లక్షలు, సి-కేటగిరీ వారికి రూ. 10 లక్షలు అందజేస్తారు. దేశవాళీల్లో.. మహిళల్లో సీనియర్ విభాగంలో తుది 11 మందిలో ఒక్కొక్కరికి రోజుకు రూ. 12,500, రిజర్వ్ క్రికెటర్లు ఒక్కోరికీ రూ. 6,250 చెల్లిస్తారు. 'కోహ్లీసేన స్వదేశంలో ఆడే మ్యాచ్‌లను బట్టి ప్రతి ఏడాది బోర్డు ఆదాయంలో హెచ్చుతగ్గులు ఉంటాయని సీవోఏ గుర్తించింది. అందువల్ల 'ప్లేయర్స్ రెవెన్యూ-కాంపెన్సేషన్ ఈక్వలైజేషన్ ఫండ్' ఏర్పాటుకు అనుమతించింది. దీనికి బోర్డు ఏటా రూ. 125 కోట్లు కేటాయిస్తుంది' అని బీసీసీఐ వివరించింది.

ఏ విభాగంలో ఎవరు
ఎ-ప్లస్ (7 కోట్లు): కోహ్లీ, రోహిత్, ధవన్, భువనేశ్వర్, బుమ్రా;
ఎ (5 కోట్లు): ధోనీ, అశ్విన్, జడేజా, విజయ్, పుజారా, రహానె, సాహా;
బి (3 కోట్లు): రాహుల్, ఉమేష్, కుల్దీప్, చాహల్, హార్దిక్, ఇషాంత్, దినేష్ కార్తీక్;
సి (కోటి): కేదార్, మనీష్, అక్షర్, కరుణ్ నాయర్, రైనా, పార్థివ్, జయంత్
మహిళల ఎ-కేటగిరీ (50 లక్షలు): మిథాలీ, జులన్, హర్మన్, స్మృతి మంధాన;
బి (30 లక్షలు): పూనమ్ యాదవ్, వేదా, రాజేశ్వరీ, ఏకా బిస్త్, శిఖా, దీప్తి శర్మ;
సి (10 లక్షలు): మాన్సి జోషి, అనుజ, మోనా, నుజత్, సుష్మ, పూనమ్ రౌత్, జెమీమా, రోడ్రిగ్స్, పూజ, తానియా భాటియా



రాత్రి 7 గంటల నుంచి డీస్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

బంగ్లాపై ఏం చేస్తారో!

కొత్త రూపుతో.. కొత్త ఆశలతో.. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన భారత కుర్రాళ్లు తొలి పోరులో ఉసూరుమనిపించారు. సీనియర్లు రోహిత్ శర్మ, సురేశ్ రైనా పేలవ ప్రదర్శన చేసిన వేళ.. యువ ఆటగాళ్లూ తేలిపోయారు. దాంతో, ఆతిథ్య లంక చేతిలో దారుణంగా ఓడి నిరాశాజనకంగా టోర్నీని ఆరంభించిన టీమిండియా... ఇప్పుడు బంగ్లాదేశ్‌తో మలి పోరుకు సిద్ధమైంది. అంచనాలకు అందని ఆటతో బంగ్లా ఎప్పుడూ ప్రమాదకారే..! మరి గత ఓటమి నుంచి భారత్ బయటపడుతుందా... బంగ్లాను ఓడించి బోణీ కొడుతుందా..?

ఒత్తిడిలో టీమిండియా • నేడు బంగ్లాదేశ్‌తో మ్యాచ్ • ముక్కోణపు టీ-20 సిరీస్

కొలంబో: రిజర్వ్ బలాన్ని పరీక్షించుకోవాలని భావించిన టీమిండియాకు నిదహాస్ ట్రోఫీలో ఆదిలోనే ఎదురుదెబ్బ తగులుతుందని ఎవరూ ఊహించలేదు. యువ ఆటగాళ్లతో కూడిన మనది ద్వితీయ శ్రేణి జట్టే అయినా.. ప్రత్యర్థులు అంత బలమైనవి కాకపోవడంతో భారత్‌పై సహజంగానే అంచనాలు పెరిగాయి. కానీ, సొంతగడ్డపై చెలరేగి ఆడిన శ్రీలంక షాకిచ్చింది. ఆరంభ మ్యాచ్‌తోనే టోర్నీలో వేడి పుట్టించింది. టోర్నీ ప్రారంభం వరకూ భారతే ఫేవరెట్ అన్న వారిని పునరాలోచనలో పడేసింది.



అయితే, ఈ షాక్ నుంచి వెంటనే కోలుకునేందుకు రోహిత్‌సేన రెడీ అయింది. బంగ్లాదేశ్‌తో గురువారం జరిగే తమ రెండో మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. గత ఓటమితో తమపై తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ.. మైదానంలో దాన్ని దరిచేరనీయకుండా బంగ్లా పని పట్టాలని కోరుకుంటోంది. అయితే, అంచనాలకు అందని బంగ్లాదేశ్‌ను ఏ మాత్రం తేలిగ్గా తీసుకోకూడదు. తనదైన రోజున ఎలాంటి ప్రత్యర్థినైనా ఓడించే సత్తా ఉన్న బంగ్లా.. కుర్రాళ్లతో కూడిన భారత్‌పై సత్తా చాటేందుకు ఇదే సరైన సమయం అనుకుంటోంది. లంక మాదిరిగా భారత్‌కు షాకిచ్చి టోర్నీని గొప్పగా ఆరంభించాలని చూస్తోంది. దాంతో, ఈ మ్యాచ్ సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది.

సమష్టిగా ఆడితేనే..!

లంక చేతిలో ఓటమికి కేవలం అనుభవలేమి ఒక్కటే కారణం కాదు. భారత్ అవకాశాలను సృష్టించుకోవడంలో విఫలమైంది. కొన్నిసార్లు వచ్చిన అవకాశాలనూ చేజార్చుకుంది. ఒకరిద్దరూ మెరుగ్గా ఆడినా.. సమష్టిగా రాణించలేకపోయింది. ఉపఖండంలో అద్భుత రికార్డున్న రోహిత్ శర్మ డకౌట్ కావడం ఆదిలోనే భారత్‌ను దెబ్బతీసింది. కుర్రాళ్లలో విశ్వాసం నింపాలంటే సారథిగా రోహిత్ ముందుండి నడిపించాల్సి ఉంటుంది. ఆఫ్‌స్టంప్ ఆవలి బంతులను ఆడే విధానంలో అతను మెరుగవ్వాలి. ఇక, తొలి ఓవర్లోనే రోహిత్ అవుటైనప్పుడు.. జాగ్రత్తపడాల్సింది పోయి మూడు స్టంప్‌లను వదిలేసి ఆడి వికెట్ చేజార్చుకున్న సురేశ్ రైనా తీరు ఆక్షేపణీయం. జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ ఉన్నందున.. ఇలాంటి ప్రదర్శనలు తన అవకాశాలను దెబ్బతీస్తాయని రైనా గుర్తుంచుకోవాలి. పరిమిత ఓవర్ల జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని భావిస్తున్న మనీష్ పాండేతో పాటు యువ ఆటగాడు రిషభ్ పంత్ కావాల్సినన్ని బంతులు ఎదుర్కొన్నా వేగంగా ఆడలేకపోయారు.ఇక బౌలింగ్ విషయానికి వస్తే వాషింగ్టన్ సుందర్ మినహా అంతా విఫలమయ్యారు. సఫారీ గడ్డపై విజృంభించిన చాహల్‌తోపాటు భువీ, బుమ్రా గైర్హాజరీలో కొత్త పేసర్లు ఉనాద్కట్, శార్దూల్ ఠాకూర్ కూడా ప్రభావం చూపలేకపోయారు.

బంగ్లాకు మహ్మదుల్లా సారథ్యం

కెప్టెన్ షకీబల్ హసన్ గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దాంతో, మహ్మదుల్లా సారథ్యంలో బంగ్లా బరిలోకి దిగుతోంది. తామిప్పుడు బలంగా లేకపోయినా కచ్చితంగా పుంజుకోగలమన్న విశ్వాసం ఉన్నదని బ్యాట్స్‌మన్ తమీమ్ ఇక్బాల్ అంటున్నాడు. షకీబల్ గైర్హాజరీలో బంగ్లా బ్యాటింగ్‌లో అతను కీలకం కానున్నాడు. తమీమ్‌తోపాటు ఇమ్రుల్ కైస్, ముష్ఫికర్ రహీమ్, సౌమ్య సర్కార్, షబ్బీర్ రహ్మాన్ బ్యాటింగ్ బాధ్యతలు మోయనున్నారు. ఆల్‌రౌండర్లు మహ్మదుల్లా, మెహ్దీ హసన్‌తో పాటు ముస్తాఫిజూర్, తస్కిన్ అహ్మద్‌తో బంగ్లా బౌలింగ్ కూడా బాగానే ఉంది. మరి, కుర్రాళ్లతో కూడిన భారత్‌పై బంగ్లా ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

బోణీ చేసిన భారత్

5-1తో మలేసియాపై గెలుపు • సజీవంగా ఫైనల్ ఆశలు • అజ్లాన్ షా కప్

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో భారత హాకీ జట్టు ఎట్టకేలకు బోణీ చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య మలేసియాను 5-1తో చిత్తు చేసింది. రెండు ఓటములు, ఒక డ్రాతో ఉన్న భారత్.. టోర్నీలో తొలి విజయాన్ని నమోదు చేసింది. దీంతో టీమిండియా ఫైనల్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. అయితే శుక్రవారం జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై భారీ విజయాన్ని నమోదు చేయాల్సి ఉంది. దీంతోపాటు ఇతర జట్ల గెలుపోటములపై భారత్ ఫైనల్ ఆశలు ఆధారపడి ఉన్నాయి. టీమిండియా తరపున గుర్జంత్ సింగ్ (42వ, 57వ), శిలానంద్ లక్రా (10వ), సుమీత్ కుమార్ (48వ), రమణదీప్ సింగ్ (51వ) గోల్స్ చేశారు. మలేసియా జట్టులో ఫైజల్ సారి (33వ) ఏకైక గోల్ చేశాడు. ఆస్ట్రేలియా చేతిలో 2-4తో ఓడిన భారత్.. ఈ మ్యాచ్‌లో మాత్రం పూర్తి భిన్నమైన ఆట తీరును కనబరిచింది. ఎంతో స్వేచ్ఛగా ఆడుతూ ప్రత్యర్థి గోల్ పోస్టుపై పదేపదే దాడులు చేసింది. భారత ఆటగాళ్ల చివరి క్వార్టర్‌లో చెలరేగి మూడు గోల్స్ సాధించడం విశేషం.

హైజంప్‌లో తేజస్విన్ జాతీయ రికార్డు

పటియాలా: ఫెడరేషన్ కప్ నేషనల్ సీనియర్ చాంపియన్‌షిప్స్ హైజంప్‌లో ఢిల్లీ అథ్లెట్ తేజస్విన్ శంకర్ జాతీయ రికార్డుతో స్వర్ణం సాధించాడు. బుధవారం జరిగిన పోటీల్లో 2.28 మీటర్ల ఎత్తు దూకిన శంకర్.. తన 2.26 మీ. రికార్డును తానే అధిగమించాడు. ఈ నేపథ్యంలో కామన్వెల్త్ బెర్త్‌ను కూడా దక్కించుకున్నాడు. హరియాణాకు చెందిన సిద్ధార్థ్ యాదవ్ 2.25 మీ. దూకి రజతంతోపాటు కామన్వెల్త్‌కు అర్హత సాధించాడు. మహిళల 10 వేల మీటర్ల రేస్‌లో సురియా 32:23:96 సెకన్ల టైమింగ్‌తో కామన్వెల్త్ క్రీడల బెర్త్ సొంతం చేసుకుంది.

రాష్ట్రానికి 3 సింథటిక్ ట్రాకులు

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నాలుగు స్టేడియాల్లో అథ్లెటిక్ సింథటిక్ ట్రాకులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, అందులో మూడు స్టేడియాలకు మంజూరు చేశామని కేంద్ర క్రీడా శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ వెల్లడించారు. ఈ మేరకు రాజ్యసభలో టీఆర్ఎస్ ఎంపీ డి. శ్రీనివాస్ అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బుధవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఖేలో ఇండియా పథకం కింద ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం (మెదక్), కరీంనగర్ స్టేడియం, వరంగల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రూ. 7 కోట్లతో వరంగల్‌లో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించామని, అందులో రూ. 3 కోట్లను విడుదల చేశామని వివరించారు. కాగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటును ఆమోదించలేదని పేర్కొన్నారు.

ఢిల్లీ కెప్టెన్‌గా గంభీర్



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ కెప్టెన్‌గా సీనియర్ బ్యాట్స్‌మన్ గౌతమ్ గంభీర్ నియమితుడయ్యాడు. గతేడాది జహీర్ ఖాన్ జట్టుకు నాయకత్వం వహించాడు. తొలి మూడు సీజన్లలో డేర్‌డెవిల్స్‌కే ప్రాతినిధ్యం వహించిన గంభీర్ తర్వాత 2011లో కోల్‌కతా నైట్‌రైడర్స్ పగ్గాలు చేపట్టాడు. 2012, 2014 సీజన్లలో జట్టును విజేతగా నిలిపి సత్తాచాటాడు. ఈసారి వేలంలో గంభీర్‌ను రూ.2.8 కోట్లకు డేర్‌డెవిల్స్ దక్కించుకుంది.

వార్నర్‌కు జరిమానా



డర్బన్: డికాక్‌తో ఘర్షణలో ఆస్ట్రేలియా వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ మ్యాచ్ ఫీజులో కోత పడింది. డర్బన్‌లో జరిగిన తొలి టెస్టు సందర్భంగా సౌతాఫ్రికా కీపర్ క్వింటన్ డికాక్, వార్నర్ మధ్య గొడవ జరిగింది. దీనిపై విచారించిన ఐసీసీ.. వార్నర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. క్రికెట్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా డేవిడ్ ప్రవర్తించాడని ఒక ప్రకటనలో తెలిపింది. అతడి మ్యాచ్ ఫీజులో 75 శాతం జరిమానాగా విధిస్తున్నట్టు పేర్కొంది.

పాక్ కోచ్‌గా ఓల్ట్‌మన్స్



న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు మాజీ కోచ్ రోలెంట్ ఓల్ట్‌మన్స్.. పాకిస్థాన్ చీఫ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. రెండున్నరేళ్లపాటు పాక్ కోచ్‌గా ఓల్ట్‌మన్స్ సేవలందించనున్నట్టు పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ ప్రకటించింది. నెదర్లాండ్స్‌కు చెందిన ఓల్ట్‌మన్స్ భారత జట్టు హైపెర్ఫామెన్స్ డైరెక్టర్, కోచ్‌గా నాలుగేళ్లపాటు సేవలందించాడు. అయితే, గత సెప్టెంబరులో ఈ డచ్ కోచ్‌పై హాకీ ఇండియా (హెచ్ఐ) వేటు వేసింది.

రాస్ టేలర్ భారీ శతకం

- నాలుగో వన్డేలో కివీస్ విజయం

డ్యునెడిన్: న్యూజిలాండ్ వెటరన్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ పరుగుల మోత మోగించాడు. ఇంగ్లండ్‌తో నాలుగో వన్డేలో టేలర్ (147 బంతుల్లో 17 ఫోర్లు, 6 సిక్సర్లతో 181 నాటౌట్) వీరవిహారం చేయడంతో.. కివీస్ 5 వికెట్లతో గెలిచి.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బెయిర్‌స్టో (138), రూట్ (102) శతకాలతో ఇంగ్లండ్ 9 వికెట్ల నష్టానికి 335 పరుగులు చేసింది. అనంతరం టేలర్‌తో పాటు లాథమ్ (71) రాణించడంతో కివీస్ 5 వికెట్లు కోల్పోయి మరో 3 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది.


టేలర్ (181 నాటౌట్)



కరెన్సీ నోట్లను దాచుకుంటున్నారు



తెలుగు రాష్ట్రాలపై జైట్లీ అనుమానం

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రజలు భారీ ఎత్తున కరెన్సీని దాచుకున్నారా? అందుకే ఏటీఎంలలో నోట్ల కొరత ఏర్పడిందా? ఈ ప్రశ్నలకు స్వయానా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అవునన్నట్లుగా సమాధానం చెబుతున్నారు. బుధవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిలో ఉండగా.. తెలంగాణ బీజేపీ నాయకురాలు, మాజీ మంత్రి పుష్పలీల అక్కడికి వచ్చారు. తెలుగు రాష్ట్రాల్లోని ఏటీఎంలలో డబ్బులు లేవని, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయనకు వివరించారు. దీనికి మంత్రి స్పందిస్తూ.. తాము ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు విడుదల చేయాల్సిన దానికంటే ఎక్కువ కరెన్సీని సరఫరా చేశామని వివరించారు. అయినా.. కరెన్సీ కొరత నెలకొనడం ఆశ్చర్యకరమన్నారు. నోట్ల కట్టలను ఇళ్లలో.. లాకర్లలో దాచుకోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

చిదంబరంపై సీబీ 'ఐ'



- బంగారం దిగుమతి స్కాంపైనా దర్యాప్తు
- సిఫారసు చేయనున్న పీఏసీ
- డీఆర్ఐ వారించినా 80-20 స్కీంకు గేట్లెత్తిన నాటి ఆర్థికమంత్రి
- నాటి మెమొరాండంను రాజ్యసభలో చూపిన రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ, మార్చి 7: ఐఎన్ఎక్స్ కుంభకోణంలో పీకల్లోతు మునిగిపోయిన మాజీ ఆర్థిక మంత్రిపై మరో ఉచ్చు బిగించడానికి కేంద్రం సమాయత్తమవుతోంది. వజ్రాభరణాల సంస్థలకు మేలు చేసేలా బంగారం దిగుమతికి అనుమతి ఇచ్చిన కుంభకోణం (80: 20 స్కీం స్కాం)పై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కుంభకోణం లోతును పరిశీలించిన ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయనుందని కమిటీ సభ్యుడొకరు తెలిపారు. చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నపుడు 2013లో ఈ స్కీంను ప్రతిపాదించారు. మోదీ అధికారంలోకి వచ్చాక 2014 నవంబరులో దీన్ని రద్దు చేశారు. ఆనాడు అనుమతి ఇచ్చిన ఏడు సంస్థల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకును ముంచేసిన మెహుల్ చోక్సీ సంస్థ గీతాంజలి కూడా ఉంది. రెవెన్యూలోటు పూడ్చడానికి నానా ఇబ్బందులూ పడుతూ బంగారం దిగుమతులపై ఆంక్షలు విధించాలనుకుంటున్న సమయంలో- వజ్రాల వ్యాపారుల తమకు నచ్చినట్లు బంగారం దిగుమతి చేసుకోడానికి వీలు కల్పించే సౌలభ్యం కల్పించడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది. ఈ కుంభకోణానికి సంబంధించి- పీఏసీ ఆదేశాల మేరకు ఆర్థికశాఖ అధికారులు బుధవారం కమిటీ అధ్యక్షుడు నిశికాంత్ దూబే ఎదుట హాజరై- అప్పుడు జరిగిన విషయాల్ని ఏకరువు పెట్టారు. ఈ స్కీం దుర్వినియోగం అవుతుందని.. నల్లధనాన్ని వైట్ చేసుకోడానికి, మనీ లాండరింగ్‌కు వజ్రాల వ్యాపారులు దీన్ని వాడుకుంటారని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు వారించినా చిదంబరం వినలేదని, ఏడు సంస్థలకు అనుమతి ఇస్తూ స్కీంను ప్రారంభించేశారని వారు వెల్లడించినట్లు తెలుస్తోంది. మరోవైపు రాజ్యసభలో ఇదే అంశాన్ని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ లేవనెత్తారు. చిదంబరం, ఆయన కుమారుడు కార్తిపై తగిన ఆధారాలు లేకుండా కక్ష గట్టి కేంద్రం దర్యాప్తులు చేస్తున్నదని కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ ఆరోపించారు. దీంతో రవిశంకర్ ప్రసాద్- 2014లో మే 16వ తేదీన ఓ పక్క లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుండగా చిదంబరం ఈ ఏడు సంస్థలకు అనుమతినిచ్చే ఫైలుపై సంతకం చేశారని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఆఫీసు మెమోను సభలో చూపారు. రాజ్యాంగం తెలిసిన చిదంబరం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. మరో పక్క.. కార్తి నుంచి నిజాలు రాబట్టేందుకుగాను నార్కో పరీక్షలకు అనుమతివ్వాలని సీబీఐ- ప్రత్యేక కోర్టులో ఓ పిటిషన్ వేసింది.

తమిళనాట 'పెరియార్ అగ్గి'

బ్రాహ్మణుల జంధ్యాలు తెంచేశారు!.. రాజా వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాల



చెన్నైలో రాజా దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ఆందోళనకారులు (ఇన్‌సెట్లో) అరెస్టయిన పెరియార్ ద్రావిడకళగం కార్యకర్తలు

- కోవై బీజేపీ ఆఫీసుపై బాంబుదాడి
- క్షమాపణలు చెప్పిన రాజా

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): త్రిపురలో విగ్రహాల ఉదంతం నేపథ్యంలో.. తమిళనాట పెరియార్ విగ్రహాలను కూల్చివేసే తరుణం ఆసన్నమైందంటూ బీజేపీ జాతీయ కమిటీ కార్యదర్శి రాజా చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా అగ్గిని రాజేశాయి. ద్రావిడ పార్టీలు, వామపక్షాలు, డీపీఐతో పాటు పలు తమిళ సంస్థలు బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఆయన చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ, దిష్టిబొమ్మలను దహనం చేశాయి. కొయంబత్తూరులోని బీజేపీ కార్యాలయంపై ద్రావిడకళగం కార్యకర్తలు పెట్రోల్‌బాంబుతో దాడి చేశారు. బీజేపీ నేత రాజా తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని సినీనటుడు కమల్‌హాసన్ డిమాండ్ చేశారు. మరోవైపు రాజాపై చర్యలు తీసుకోవాలంటూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అన్ని వర్గాలు మండిపడుతుండడంతో బీజేపీ నేత రాజా వెనక్కి తగ్గారు. తనకు తెలియకుండానే ఫేస్‌బుక్ అడ్మిన్ ఆ వ్యాఖ్యలు నమోదు చేశారని పేర్కొంటూ క్షమాపణలు చెప్పారు. మరోవైపు చెన్నైలో కొందరు దుండగులు రోడ్డుపై నడిచి వెళ్తున్న బ్రాహ్మణుల జంధ్యాలను తెంపివేసి పరారయ్యారు. మైలాపూరు నల్లతంబి వీధిలో మరో పదిమంది బ్రాహ్మణుల జంధ్యాలను దుండగులు తెంపి పారిపోయారు.

సంపన్నుల సంఖ్య పైపైకి!

2022 నాటికి దేశంలో వారి సంఖ్య 71% మేర పెరుగుదల



ముంబై, మార్చి 7 : ఐదు కోట్ల డాలర్లు(దాదాపు రూ.325 కోట్లు) అంతకంటే ఎక్కువ సంపద ఉన్న భారత కుబేరుల సంఖ్య 2022 నాటికి 71 శాతం మేర పెరగనుందని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ అంచనా వేసింది. అదే సమయంలో ఆసియా సగటు 61 శాతంగా.. అంతర్జాతీయ సగటు 43 శాతంగా ఉండొచ్చని 'వెల్త్ రిపోర్ట్ 2018' పేరిట విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఆసియాలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని పేర్కొంది. "2022 నాటికి.. రూ.325 కోట్లు అంతకు మించి సంపాదన ఉన్న సంపన్నులు మరో 2000 మంది దాకా కొత్తగా తయారవుతారు. ఏడాదికి 2.5 లక్షల డాలర్లకు పైగా (అంటే దాదాపు రూ.1.6 కోట్లు) సంపాదన ఉండే కుటుంబాల సంఖ్య అత్యధికంగా పెరుగుతూ పోయి, ముంబై, ఢిల్లీ లాంటి నగరాలు టాప్ 10 మార్కెట్లలో చోటు సంపాదిస్తాయి." అని అంచనా వేసింది. చైనా, జపాన్‌ల తర్వాత అత్యధిక సంపన్నులుండే మూడో దేశంగా భారత్ నిలుస్తుందని పేర్కొంది. మొత్తం 52 దేశాల్లోని 314 నగరాల్లోని అపర కుబేరుల సంపద విలువను అంచనా వేసి 5 కోట్ల డాలర్ల కన్నా ఎక్కువ సంపద ఉన్న వారి జాబితాను నైట్ ఫ్రాంక్ విడుదల చేసింది. దాని ప్రకారం..

- సిటీ వెల్త్ ఇండెక్స్‌లో.. 314 నగరాల్లో ముంబై 47వ స్థానంలో నిలిచింది. సంపద, పెట్టుబడులు, జీవనశైలి, భవిష్యత్తు.. ఈ నాలుగు అంశాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. ఇందులో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన దేశాలు వరుసగా.. న్యూయార్క్, లండన్, శాన్ ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజెలిస్, చికాగో, సింగపూర్.
- ప్రపంచంలోని అత్యంత ఖరీదైన 20 (టాప్-20) నగరాల జాబితాలో ముంబై 16వ స్థానంలో నిలిచింది. 'ఖరీదైన' అంటే.. ముంబైలో 10 లక్షల డాలర్ల (దాదాపు రూ.6.5 కోట్లు) డబ్బు పోస్తే ఇంచుమించుగా 110 చదరపు గజాల స్థలం కొనగలం అంతే! ఆ జాబితాలో ఢిల్లీ 22వ స్థానంలో, బెంగళూరు 26వ స్థానంలో నిలవడం గమనార్హం.
- దేశంలో 50 లక్షల డాలర్లు అంతకు మించి సంపద ఉన్న వారి సంఖ్యలో 2016-17లో 21 శాతం పెరుగుదల నమోదై ఆ సంఖ్య 47,720కి పెరిగింది. ఈ విషయంలో అంతర్జాతీయ సగటు కేవలం 9 శాతం. ఆసియా సగటు 14 శాతం.
- ఐదు కోట్ల డాలర్లు అంతకన్నా ఎక్కువ సంపద ఉన్నవారి సంఖ్య 2012-2017 నడుమ 54 శాతం మేర పెరిగింది. 2017 నాటికి దేశంలో వీరి సంఖ్య 11,630. అంతర్జాతీయంగా.. 1,29,730.
- అధ్యయనంలో పాల్గొన్న సంపన్నుల్లో 95 శాతం మంది.. తమ సంపదను ఈక్విటీల్లో పెంచుకున్నట్టు చెప్పారు. ఆస్తుల్లో పెట్టిన పెట్టుబడుల విలువ తగ్గినట్టు 50 శాతం మంది చెప్పారు.
- స్థిరాస్తుల్లో పెట్టుబడి పెట్టడానికి భారతీయ సంపన్నుల్లో కేవలం 23 శాతం మందే సుముఖత చూపగా.. అంతర్జాతీయంగా ఆ సంఖ్య 43 శాతంగా ఉంది.
- భారతదేశానికి ఆవల పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్న దేశాలు .. యూకే, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.
- ప్రైమ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ఇండెక్స్‌లో టాప్-5లో నిలిచిన దేశాలు గువాంగ్‌ఝూ, కేప్ టౌన్, యాస్పెన్, ఆమ్‌స్టర్‌డామ్, సియోల్. ఈ జాబితాలో ముంబై 57 (గత ఏడాది 30)వ స్థానంలో నిలవగా.. ఢిల్లీ, బెంగళూరు వరుసగా 83 (గత ఏడాది 88), 84 (గత ఏడాది 61) స్థానాల్లో నిలిచాయి.
- స్థిరాస్తుల్లో భారతీయ సంపన్నుల పెట్టుబడుల శాతం 36 కాగా.. ఆసియా సగటు 39%, అంతర్జాతీయ సగటు 43%.
- ఎక్కువ మంది పెట్టుబడులు పెట్టింది.. క్రిప్టో కరెన్సీ (71%), బంగారం (69%).

కోల్‌కతాలో శ్యామాప్రసాద్.. మేరఠ్‌లో అంబేడ్కర్

- కొనసాగుతున్న విగ్రహాల కూల్చివేతలు

కోల్‌కతా, మార్చి 7: దేశవ్యాప్తంగా విగ్రహాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. వివిధ పార్టీలు, గ్రూపులకు చెందిన కార్యకర్తలు విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. మంగళవారం త్రిపురలో లెనిన్ విగ్రహాలు, తమిళనాడులో పెరియార్ విగ్రహాన్ని కూల్చివేయగా.. బుధవారం కోల్‌కతాలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని, ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. 'రాడికల్' సంస్థకు చెందిన ఆరుగురు యువకులు, ఓ మహిళ దక్షిణ కోల్‌కతాలో ఉన్న శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ధ్వంసం చేస్తుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పుణె మున్సిపల్ కార్పొరేషన్‌లో 17వ శతాబ్దికి చెందిన కోండ్‌దేవ్ చిత్రపటాన్ని పెట్టడంపై సాంభాజీ బ్రిగేడ్, బ్రాహ్మిణ్ మహాసంఘ్‌లు వాగ్వాదానికి దిగాయి.

విగ్రహాల కూల్చివేత సరికాదు



- ఖండించిన ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 7: దేశంలోని వివిధ ప్రాంతాల్లో విగ్రహాల కూల్చివేతలను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఆయన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోనూ మాట్లాడారు. విగ్రహాల కూల్చివేత సిగ్గుచేటని, అది పిచ్చి పని అని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వేర్వేరు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. ఈ తరహా ఘటనలకు కలెక్టర్లు, ఎస్పీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని కేంద్రం హోంశాఖ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఘటనలను విపక్షాలు ఖండించాయి. కాగా.. త్రిపుర గవర్నర్ తథాగతరాయ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లెనిన్ విగ్రహాన్ని తొలగించడంలో తప్పేముందని ప్రశ్నించారు.



జస్టిస్ విశ్వనాథను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కర్ణాటక లోకాయుక్తకు కత్తిపోట్లు



కార్యాలయంలోనే దుండగుడి హత్యాయత్నం

- జస్టిస్ విశ్వనాథ షెట్టికి తప్పిన ప్రాణాపాయం

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక లోకాయుక్తపై హత్యాయత్నం జరిగింది. రాజధాని శక్తి కేంద్రం విధానసౌధకు అనుబంధంగా ఉండే లోకాయుక్త కార్యాలయంలో విధుల్లో ఉన్న న్యాయమూర్తి జస్టిస్ విశ్వనాథ షెట్టిపై బుధవారం మధ్యాహ్నం తేజ్‌రాజ్ శర్మ అనే దుండగుడు కత్తితో దాడి చేశాడు. న్యాయవాదినంటూ లోకాయుక్త కార్యాలయంలోకి ప్రవేశించి.. నేరుగా జస్టిస్ చాంబర్‌లోకి వెళ్లి ఆయనపై కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. చాంబర్ నుంచి అరుపులు వినిపించడంతో ఉద్యోగులు హుటాహుటిన పరుగెత్తుకు వెళ్లి తేజ్‌రాజ్‌ను పట్టుకొని చితకబాదారు. తీవ్రంగా గాయపడిన జస్టిస్ విశ్వనాథ షెట్టిని మల్య ఆస్పత్రికి తరలించారు. ఆయన పొట్ట, చేతితోపాటు ఛాతీ సమీపంలో కత్తిపోట్లు ఉన్నాయి. చికిత్స అనంతరం ఆయన ప్రాణాపాయ స్థితినుంచి బయటపడినట్లు తెలిసింది. ఆర్టీఐ కార్యకర్తగా ప్రచారం చేసుకుంటున్న తేజ్‌రాజ్ 14మందితో పాటు కాగ్‌పై లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. అవినీతికి సంబంధించి ఆధారాలు సమర్పించినా కేసు కొట్టివేయడంపై లోకాయుక్తతో వాగ్వాదానికి దిగిన అతను కత్తితో దాడి చేసినట్లు తెలిసింది. కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్ పనిచేయకపోవడంతోనే తేజ్‌రాజ్ శర్మ కత్తితో సులభంగా లోపలకు ప్రవేశించినట్లు తెలుస్తోంది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.



HAPPY WOMEN'S DAY

మార్చి 8... అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ప్రతీ ఏడాది 'ఆమె' ఎన్నో అద్భుతాలను ఆవిష్కరిస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతూనే ఉంది. సాహసాలతో, సమన్వయంతో అనుకున్నది సాధిస్తూ ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తూనే ఉంది. మహిళలే రైల్వేస్టేషన్‌ను నిర్వహించడం, బస్సుడ్రైవర్‌గా పనిచేయడం... మహిళల జీవితాల్లో పరివర్తన తీసుకొస్తున్న గ్రామీణ, పట్టణ కార్యకర్తలు... వీరంతా స్త్రీశక్తిని సగర్వంగా చాటుతున్నారు. అదేవిధంగా 'స్వేచ్ఛ' గురించి ఈతరం మహిళలు ఏమనుకుంటున్నారు? వంటి అనేక ఆసక్తికర అంశాలతో 'నవ్య' ముస్తాబైంది.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో...

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

ప్రత్యేకం

ఆ రైల్వే స్టేషన్‌లో టికెట్లు ఇచ్చేది, జెండా ఊపేది, రైళ్ళ రాకపోకలను నియంత్రించేది, ప్రయాణీకుల భద్రతకు భరోసా ఇచ్చేదీ మహిళలే. స్టేషన్‌లో అడుగు పెట్టినప్పటి నుంచీ అన్ని సేవల్లోనూ స్త్రీలే కనిపిస్తారు. దక్షిణ భారతదేశంలోనే తొలి ప్రయత్నం ఇది. తిరుపతి సమీపంలోని చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను మహిళా రైల్వేస్టేషన్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 'మహిళా దినోత్సవం' కానుకగా 5న (సోమవారం) దీనిని ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో ముంబయి, జైపూర్‌లలో మాత్రమే మహిళా రైల్వే స్టేషన్‌లు ఉన్నాయి. ఇది మూడవది.

మహిళా సాధికారతకు పచ్చజెండా!

చుట్టూ చింత చెట్లు... చిట్టడవిని తలపించే ముళ్ల పొదలు... బండి బాటను చీల్చుకుంటూ వెళ్లితే దర్శనమిస్తుందో రైల్వేస్టేషన్. అక్కడ సగటున ప్రతి అరగంటకో రైలు కూత పెడుతుంది. అంత బిజీ స్టేషన్‌లో అన్ని విధుల్లోనూ స్త్రీలే కనిపిస్తారు. నరశింగాపురం వద్ద ఉండే చంద్రగిరి రైల్వే స్టేషన్‌ను మహిళా స్టేషన్‌గా కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటించింది. తిరుపతికి పది కిలోమీటర్ల దూరంలో ఉండే స్టేషన్ ఇది. ప్రస్తుతం ఒక స్టేషన్ మాస్టర్, ముగ్గురు డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్లు, పాయింట్స్‌ఉమన్, నలుగురు సెక్యూరిటీ సిబ్బంది, ఓ ప్రైవేట్ బుకింగ్ ఏజెంట్ ఇక్కడ విధుల్లో ఉన్నారు. రోజుకు మూడు షిఫ్ట్‌ల్లో వారు పనిచేస్తున్నారు. తొలి ప్రయోగంలో తాము భాగం కావడాన్ని గర్వంగా భావిస్తున్నారు. ఈ స్టేషన్‌లో విధులు నిర్వహించే అవకాశం అందుకున్న మహిళలు ఏమంటున్నారో విందాం...



ప్రివిలేజ్‌గా భావిస్తున్నా..

మా ఊరు చిత్తూరు సంతపేట. పదేళ్ల కిందటే ఉద్యోగ బాధ్యతలను చేపట్టాను. పాకాలలో పనిచేస్తుండగా రెండు రోజుల కిందటే ఇక్కడికి బదిలీ అయ్యాను. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఓ రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేయడం... అందులో పనిచేసే అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉంది. దీన్ని ప్రివిలేజ్‌గా భావిస్తున్నా. అయితే జనసంచారం లేని చోట ఉండడం వల్ల మహిళా రక్షణ చర్యలను పెంచాల్సి ఉంది.

- కె. పూర్ణిమ, స్టేషన్ మాస్టర్



సంతోషంగా ఉంది

మాది చిత్తూరు జిల్లా పాండురంగవారిపల్లె. గత కొంత కాలంగా రైల్వే బుకింగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాను. మహిళలుగా మా సామర్థ్యాలను నిరూపించుకునేందుకు ఇదొక అవకాశం.

-కె.అక్షిత, బుకింగ్ ఏజెంట్



మహిళకు దక్కిన గౌరవం

మాది చిత్తూరు జిల్లా సోమల. ఇంతకుముందు రేణిగుంటలో పనిచేసేదాన్ని. మహిళా రైల్వేస్టేషన్లో విధులు వేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలే నిర్వహించే రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేయడం బావుంది. ఇది మహిళలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా.

- ఆర్‌ఎన్ మల్లేశ్వరి, మహిళా పోలీస్



ఇదో కొత్త అనుభూతి

చిత్తూరు జిల్లా బోయకొండ మా సొంతూరు. 2004లో భర్త చనిపోవడంతో రైల్వేలో నాకు ఉద్యోగం వచ్చింది. నా పిల్లలు ఊర్లోనే ఉన్నారు. నేను ఇక్కడే ఉంటూ, వారానికోసారి ఇంటికి వెళ్లొస్తుంటా. ఉద్యోగం కొత్త కాదు. కానీ, లేడీస్ స్పెషల్ రైల్వే స్టేషన్‌లో పనిచేయడం సరికొత్త అనుభూతికి గురిచేస్తోంది.


- ఎం. శ్యామల, పాయింట్స్ ఉమన్

• **జోగిరెడ్డి భాస్కర్ రెడ్డి,** ఫోటోలు: రామాపురం లావణ్య కుమార్

సర్వే

స్వేచ్ఛ కావాలి!

పట్టణ మహిళలు ఏం కావాలనుకుంటున్నారు? ఎలాంటి కలలు కంటున్నారు? ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో 20 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసున్న మహిళలు 'స్వేచ్ఛ' గురించి భిన్నంగా స్పందించారు. మహిళల్లో సగానికి సగం మంది తమ టాలెంట్‌ను నిరూపించుకుని, గొప్ప కెరీర్‌ను ఏర్పరుచుకోవాలని చూస్తున్నారు. తమదైన శైలితో విభిన్నంగా ఉండాలనుకుంటున్నవారు 26 శాతం ఉంటే... ప్రేమ, అనుబంధాలను కోరుకుంటున్నవారు 13 శాతం ఉన్నారు. ఇంతకీ మహిళలు దేన్ని 'స్వేచ్ఛ'గా భావిస్తున్నారు?



75%	నాకు నచ్చిన తరహాలో స్వేచ్ఛగా జీవించాలనుకుంటున్నా
11%	నేను సంపాదించిన డబ్బును నా ఇష్టప్రకారం ఖర్చు చేసే స్వేచ్ఛ కావాలి
9%	నగరంలో/సమాజంలో స్వేచ్ఛగా తిరగాలి
5%	నాకు ఇష్టమైన వ్యక్తిని ప్రేమించి, అతడితో సన్నిహితంగా ఉండాలి

అను'బంధం'

సాటి మహిళతో ఇలా!

మహిళకు మహిళే శత్రువు అంటూ ఉంటారు కొంతమంది. కానీ అది నిజం కాదని నిరూపించాలంటే, ప్రతి మహిళా సాటి మహిళతో ఎలా మసలుకోవాలో తెలుసుకోవాలి. చాలా మామూలుగా తోచే కొన్ని అసందర్భ ప్రవర్తనలను చిన్న చిన్న దిద్దుబాట్లతో ఎలా సరి చేసుకోవచ్చో తెలుసుకుందాం!

- **కట్టుబొట్టు మీద కామెంట్లు కూడదు:** మహిళల వస్త్రధారణ గురించి కామెంట్ చేయటానికి పురుషులకెలా హక్కు లేదో, మహిళలకూ అలాంటి హక్కు లేదు. ఎదుటి వాళ్లకి నచ్చనంత మాత్రాన మనకు నచ్చిన దుస్తులు ధరించటం మానేస్తున్నామా? అలాంటప్పుడు ఎదుటి వాళ్ల డ్రస్సింగ్ గురించి కామెంట్ చేసే హక్కు మనకెక్కడిది?
- **'అమ్మాయివైనా' అనటం మానేయండి:** 'అమ్మాయివైనా భలే ధైర్యంగా ఉన్నావే?' అనే బదులు, 'అమ్మాయిలా పోరాడు' అనటం అలవాటు చేసుకోండి. మహిళలకు మహిళలే తోడ్పాటును, ప్రోత్సాహాన్ని అందించాలి.
- **బరువును విమర్శించొద్దు:** ఇంకా అందంగా కనిపించాలంటే ఏం చేయాలో, అధిక బరువు ఎలా తగ్గాలో ఎదుటి మహిళ అడగకుండా ఉచిత సలహాలివ్వకండి. 'నువ్వు నవ్వితే ఇంకా అందంగా ఉంటావు, నవ్వుతూ ఉండు' అనేది ప్రోత్సాహం. 'నువ్వు మరీ లావుగా ఉన్నావు' అనేది విమర్శ. తేడా గమనించండి.
- **బంధం బలంగా:** ఏ ఇద్దరు మహిళలూ స్నేహితులు కాలేరు అనే నానుడి అబద్ధమని నిరూపించండి. నిజానికి ఈ మాటలు నిరాధారమైనవే అయినా... సాటి మహిళల్ని కించపరిచినా, తక్కువ చేసి మాట్లాడినా ఆ మాటల్లో కాస్త నిజం ఉందనే భావన అందరికీ కలగటం సహజం. కాబట్టి మాట తూలకండి.
- **భావోద్వేగాల ప్రాముఖ్యం:** మహిళల భావోద్వేగాలన్నిటినీ ప్రి మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ (పి.ఎం.ఎస్) కోవలోకి తోసేస్తుంటారు. వారి భావోద్వేగాలకు తగిన ప్రాధాన్యం దొరకదు. అసలు వాటినంత సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం లేదనే భావనే అంతటా! కానీ సాటి మహిళగా వాటి లోతు మీకు తెలుసు. కాబట్టి సాటి మహిళ భావోద్వేగాలను తక్కువ అంచనా వేయకండి.



- **చేయి అందించండి:** అవసరమైనప్పుడు చేయి (హ్యాండ్) ఇవ్వకుండా, ఆసరాగా మీ చేతిని అందించి ఆదుకోండి. ప్రతి ఒక్కరి జీవితంలో గెలవాల్సిన యుద్ధాలుంటాయి. ఆ పోరాటంలో చేయందించాలిగానీ, చేయి పట్టి వెనక్కి లాగేయకూడదు.
- **పురుషుడే చివరి లక్ష్యం కాదు:** ఇప్పటికీ మహిళల విజయానికి వారెంచుకునే పురుషుడే కొలమానంగా ఎంచే పరిస్థితి. అలాగని పురుషుడే లక్ష్యంగా మహిళలందరూ జీవితాన్ని కొనసాగించలేరుగా! ఈ ఒరవడికి భిన్నంగా ఒంటరి మహిళలూ ఉంటారు. వాళ్లనూ అభిమానించి, ఆదరించండి.

పురస్కారం

బస్సు డ్రైవర్ అంటే సాధారణంగా మగవాళ్లు మాత్రమే అనే భావన. కానీ, మగవారికి దీటుగా రాణిస్తున్నారు వాంకుడోతు సరిత. ఢిల్లీకి చెందిన ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ)లో తొలి మహిళా ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ, చరిత్ర సృష్టించారు. మానవీయ కోణంలో ఆలోచించి తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తే, మలిసంధ్యలో ఉన్న తల్లితండ్రులకు దగ్గరగా, కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటానంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేళ తెలంగాణ ప్రభుత్వ అవార్డు అందుకుంటున్న ఈ ప్రగతి రథ సారథి కథ ఇది...

ప్రగతి రథ సారథి

"మాది యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థానారాయణపురం మండలం వాయిళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సిత్యతండా. మా అమ్మానాన్న వాంకుడోతు రాంకోటి, రుక్క. మాది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాళ్ళం.

'ఆడ'పిల్లలేనా అనుకున్నారు!

మేము ముగ్గురం ఆడపిల్లలం. నేను అందరి కంటే చిన్న. నన్ను ఉన్నంతలో పెద్ద చదువు చదివించాలని అప్పటికే పెళ్లయిన మా పెద్దక్క దగ్గరకు పంపించారు. అయితే, మగ పిల్లవాడు కావాలనే ఆశ మా కుటుంబాన్ని ఛిద్రం చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో మా అమ్మే, నాన్నకు రెండో పెళ్లి చేసింది. ఆ తర్వాత మా కుటుంబంలో కష్టాలు మొదలయ్యాయి. తప్పని పరిస్థితుల్లో పూట గడవడం కోసం రెండో భార్యను తీసుకొని హైదరాబాద్ వెళ్లాడు. రిక్షా తొక్కుతూ జీవనం సాగించాడు. ఆమెకు మగ పిల్లవాడు పుట్టాడు. కొద్ది రోజులకే ఆమె చనిపోయింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో నాన్న మళ్ళీ మా తండాకు చేరుకున్నాడు.

కష్టాలే కదిలించాయి!

చదువు కోసమని మా అక్క దగ్గరికి వెళ్లిన నాకు మా కుటుంబ పరిస్థితి చూసి బాధ కలిగించింది. ఏడో తరగతి పూర్తి చేసి, తిరిగి అమ్మానాన్నల దగ్గరకు వచ్చేశా. ఆ సమయంలో ఒక్కోసారి తినడానికి కూడా తిండి దొరకని పరిస్థితి. అమ్మ పొలం పనులకు వెళితే, నేను అమ్మతో పాటు పొలం పనులకు వెళ్లేదాన్ని. ఒకవైపు పని చేస్తూనే, మరో వైపు దూర విద్యలో పదో తరగతి పూర్తి చేశా. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చాను. వ్యవసాయం కలిసి రాకపోవడంతో దేవరకొండలో ఉన్న మా పెద్ద అక్క దగ్గరకు వెళ్లి కుట్టు పని నేర్చుకున్నా. మా అక్క వాళ్లకు ఆటో ఉండేది. బావ ఆటోడ్రైవర్. దాంతో ఆటో డ్రైవింగ్ నేర్చుకున్నా. కొంత కాలం ఆటో కూడా నడిపించా. 'ఆడపిల్లేంటి... ఆటో నడపడం ఏంటని అందరూ వెటకారం చేశారు. ఆటో ఎక్కేవారు కొంత మంది అసభ్యంగా ప్రవర్తించేవారు. ఆ సమయంలోనే మా బావ కూడా చనిపోయాడు. దీంతో పెద్ద అక్క పిల్లల భారం నా పైనా పడింది. ఒక పక్క అక్క కుటుంబం, మరో వైపు అమ్మానాన్నలు, చిన్న అక్క, తమ్ముడిని నేనే చూడాల్సి వచ్చింది. ఆటోతో ఎంత కష్టపడ్డా రోజుకు మూడు, నాలుగొందల రూపాయలే వచ్చేవి. ఈ కష్టాల నుంచి బయట పడాలని నిర్ణయించాను. పొడవాటి జుట్టును కత్తిరించాను. చొక్కా, ప్యాంట్ వేసుకున్నాను. కొన్నాళ్లకు ఆటో కొనుక్కున్నా.



ఆర్మీకి వెళ్లాలనుకున్నా!

నాకు ఆర్మీలో చేరాలని ఉండేది. అందుకోసం ఆర్మీ పరీక్ష రాశా. హర్యానాలో శిక్షణకు అర్హత సాధించా. మరో పది రోజుల్లో పరీక్షలు ఉండగా, అనుకోని పరిస్థితుల్లో తండాకు వచ్చా. దీంతో ఆర్మీలో చేరే అవకాశం కోల్పోయా. 2010లో ఆర్టీసీ డ్రైవర్ కావాలని ప్రకటన చూశా. మహిళల నుంచి నేనొక్కదాన్నే దరఖాస్తు చేసుకున్నా. దాంతో నన్నొక్కదాన్నే తీసుకోవడం కుదరదని చెప్పారు. భారీ వాహనాలు నడపడానికి అవసరమైన అన్ని లైసెన్సులూ తీసుకున్నా. ఓ మహిళా కళాశాలలో అమ్మాయిల కోసం ఏర్పాటు చేసిన బస్సు నడిపా. ఏడాది పాటు ఆ ఉద్యోగం చేశాక, క్యాబ్ డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఆ టైమ్‌లోనే ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ)లో పని చేసే ఉన్నతాధికారి ఆసక్తి ఉన్న మహిళలు కార్పొరేషన్‌లో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. దీంతో 2015లో డీటీసీలో దరఖాస్తు చేశా. ఆ ఉద్యోగానికి ఎంపికయ్యా. డీటీసీ పరిధిలో 12వేల మందికి పైగా బస్సు డ్రైవర్లుంటే, అందులో ఒకే ఒక్క మహిళా బస్సు డ్రైవర్‌ను నేను.

ఎన్నో అవార్డులు..

విధి నిర్వహణలో నా ప్రతిభకు ఇప్పటికే డీటీసీతో పాటు కేంద్ర ప్రభుత్వం, వివిధ సంస్థలు ఎన్నో అవార్డులు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల దేశంలో వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరుస్తున్న వారిని గుర్తించింది. అందులో నన్ను ఎంపిక చేసి, ఫస్ట్‌లేడీ అవార్డు, సర్టిఫికేట్‌ను రాష్ట్రపతి కోవింద్ ఇటీవలె అందజేయడం మరిచిపోలేను. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మహిళా అవార్డుకు ఎంపిక చేసింది.

• **పి.నర్సింహ,** సంస్థాన్ నారాయణపురం

స్ఫూర్తి

వాళ్లకూ హక్కులున్నాయ్!



పాతికేళ్ల క్రితం చెన్నై నుంచి తిరుపతికి వచ్చా. సెక్స్‌వర్కర్ల సమస్యలు, మహిళల హక్కుల గురించి పని చేయాలనుకుని 'విన్స్' స్వచ్ఛందసంస్థను ప్రారంభించా. సమాజంలో దారుణ వివక్షను ఎదుర్కొంటున్నవాళ్ళు సెక్స్‌వర్కర్లు, హిజ్రాలు. వారి కథలు వింటే గుండె నీరై పోతుంది. ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. వినేకొద్దీ చేయాల్సినది ఏమిటో దారి స్పష్టం కావడం మొదలైంది. నా భర్త డాక్టర్ కావడంతో ఆయన సహాయ సహకారాలూ, ప్రోత్సాహం నాకు శక్తినిచ్చాయి. మొదట్లో సెక్స్‌వర్కర్ల దగ్గరకు వెళ్లినప్పుడు, బయటి వాళ్లే కాదు, వాళ్లూ నన్ను వద్దనే అన్నారు. వాళ్ల కోసమే అని చెప్పినా అనుమతించేవాళ్లు కాదు. ఆరోగ్యాలు పాడు చేసుకుని అన్యాయంగా చచ్చిపోతున్నారు వాళ్లు. అవగాహన లేకపోవడమే ప్రధాన లోపం. పోలీసుల సాయంతో అయితే సెక్స్‌వర్కర్లు అవగాహన పొందుతారని వారి సహకారం తీసుకున్నా. 'మాతో మీరు ఉంటే మిమ్మల్ని కూడా మాలాగే చూస్తారు' అని సెక్స్‌వర్కర్లు చెప్పేవాళ్లు. నచ్చచెప్పి అందరినీ సమీకరించా. ఒక ఊరినుంచి వృత్తిపనుల మీద బయటప్రాంతాలకు వెళ్లేవారు ఎక్కువగా హెచ్‌ఐవీకి గురవుతున్నారు. పేదరికం, నిరక్షరాస్యతే ప్రధానంగా ఎయిడ్స్ మహమ్మారికి దగ్గరయ్యేలా చేస్తోంది. అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. అందరం చేయిచేయి కలిపితే ఎయిడ్స్‌ను ఎదుర్కోవచ్చు అని అర్థం చేయించే ప్రయత్నం చేశాం. బతకడానికి ఈ వృత్తిలోకి దిగిన ఆడవాళ్ళు నిరంతరం హింస అనుభవిస్తున్నారు. మీకూ హక్కులున్నాయి అంటే నమ్మే స్థితిలో సెక్స్‌వర్కర్లు లేరు. వారిని బయటకు తీసుకురావడానికి చాలానే కృషి జరగాల్సి ఉంది. పోలీసు వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు మారాలి. ప్రభుత్వ సహకారం ఉండాలి. ఈ రంగంలో పని చేయడం నల్లేరు మీద నడక కాదు. అవమానాలు, అవరోధాలు ఉంటాయి. అయినా ఈ పని నాకు సంతృప్తి నిస్తోంది. ఇది నా రంగం అని నిర్ణయించుకున్నా.

-ఆర్. మీరా రాఘవేంద్ర, 'విన్స్' సంస్థ నిర్వాహకురాలు, తిరుపతి.

సోలో ట్రావెల్... సో బెటరూ!



నయా హవా

తీరిక వేళల్లో, సెలవుల్లో కుటుంబం అంతా కలిసి ఎక్కడికైనా వెళ్లాలనుకుంటే, ఎక్కడికి వెళ్లాలనే నిర్ణయం ఎనభై శాతం మహిళలదే! ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అధ్యయనాలు ఈ సంగతి చెబుతున్నాయి. కానీ, మహిళలు ఏదైనా కొత్త చోటికి వెళ్లాలంటే కుటుంబ సభ్యులనో, స్నేహితులనో, పరిచయస్థులనో సాయం అడగక తప్పని పరిస్థితి మన దేశంలో చాలాకాలంగా కొనసాగుతూ వచ్చింది. అయితే, ఇది క్రమేపీ మారుతోంది. ఆ మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది కూడా! మహిళలు కుటుంబాలను వదిలి మునుపెన్నడూ పరిచయం లేని ప్రాంతాల్లో చదువులకూ, ఉద్యోగాలకూ వెళుతున్నారు. ఉన్నత చదువులు, మంచి ఉద్యోగాలతో తమ కాళ్ల మీద తాము నిలబడుతున్నారు. కొత్త చోట్లనూ, ప్రకృతినీ ఆస్వాదించడానికి ఎవరి సాయం అక్కర్లేదన్న అవగాహన కూడా పెంచుకుంటున్నారు. వారాంతాల్లో, వరుసగా సెలవులు వచ్చిన రోజుల్లో తమకు నచ్చిన, చూడాలనిపించిన ప్రదేశాలకు ఒక్కరే బయలుదేరుతున్నారు.

స్వావలంబనే పునాది!

మహిళల సోలో ట్రావెలింగ్ ట్రెండ్ విదేశాల్లో ఇదివరకే ఉంది. మన దేశంలో ఇప్పుడిది శరవేగంతో విస్తరిస్తోంది. కొనుగోలు శక్తి చేకూరడం, ఆర్థిక స్వాతంత్ర్యం, సొంత నిర్ణయాలు తీసుకొనే స్వేచ్ఛ ఆధునిక మహిళా పర్యాటకం పెరగడానికి దోహదం చేస్తున్నాయి. అలాగే ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి రావడంతో సమాచారం తెలుసుకోవడం చాలా సులువవుతోంది. ఎక్కడికి వెళ్లాలి, ఎలా వెళ్లాలి, ఏం తినాలి, ఎక్కడ ఉండాలి, భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాల మీద అవగాహన ఇదివరకటికన్నా ఇప్పుడు మహిళల్లో బాగా పెరిగింది. కుటుంబం, స్నేహితులు, పరిచయస్థుల ప్రమేయం లేకుండా- భావసారూప్యం ఉన్న ఇతర మహిళా బృందాలతో పర్యటనలు చేసే వారు కూడా పెరిగారు.

మహిళలకు మాత్రమే!

దీనికి అనుగుణంగా మహిళల కోసం ప్రత్యేకంగా టూర్లను నిర్వహిస్తున్న ఆపరేటర్లు, క్లబ్‌లు ఏర్పాటవుతున్నాయి. గత నాలుగైదేళ్లలో ప్రపంచంలో 'మహిళలకు మాత్రమే' టూర్ ఆపరేటర్ల సంఖ్య రెండువందల ముప్పై శాతం పెరిగిందని ఒక అంచనా. భారత్‌లో కూడా ఇలాంటి క్లబ్‌లు ఏర్పడ్డాయి. ఓన్లీ ఫర్ ఉమెన్ టూర్ ప్యాకేజీలను టూర్ ఆపరేటర్స్ అందిస్తున్నారు. రిజిస్టర్ చేసుకున్న మహిళల కోసం వారి అభిరుచులకు అనుగుణమైన టూర్స్ ఏర్పాటు చేసే క్లబ్‌లు, ఒక ప్యాకేజీని ముందే నిర్దేశించి, ఆ ప్రకారం టూర్స్ నిర్వహించే ఆపరేటర్స్ అందుబాటులోకి రావడం ఇటీవలి పరిణామాల్లో ఒకటి.

సాహసానికి సై!

భారతీయ మహిళలు సాహస యాత్రల పట్ల ఎక్కువ ఆకర్షితులవుతున్నారని ట్రావెలింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు. మన దేశంలో వివిధ ప్రాంతాల్ని చూడాలనుకొనే మహిళల కోసం టూర్స్ నిర్వహిస్తున్న ఎఫ్‌ఎఫ్ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ అడ్వంచరస్, వైల్డ్ లైఫ్ టూర్లకు మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. "కొన్నాళ్ళ కిందట పద్నాలుగు నుంచి పద్దెనిమిది సంవత్సరాల మధ్య వారి కోసం అడ్వంచరస్ టూర్ ప్రకటించాం. కేవలం రెండు రోజుల్లోనే బుకింగ్ పూర్తయిపోయింది. దాదాపు నలభయ్యేయిదేళ్ళ మహిళల వరకూ సాహసకృత్యాల మీద ఉత్సాహం చూపిస్తున్నారు" అని చెప్పారు. సోలోగా, అలాగే 'మహిళలకు మాత్రమే టూర్స్'పై ఆసక్తి చూపించే వారిలో ఎక్కువమంది పద్నాలుగు నుంచీ నలభై అయిదేళ్ళ వయసు మధ్య వారేనని వివరించారు.

లేడీస్ ఛాయిస్ ఇదీ!

అంతర్జాతీయ ట్రావెల్స్ సంస్థ ఒకటి సర్వే నిర్వహించి, మహిళలు ఎలాంటి గమ్యాలను ఎంచుకుంటున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేసింది. ఆ సర్వే నివేదిక ప్రకారం:

- 56 శాతం మంది విదేశాలు చుట్టి రావాలనుకుంటున్నారు
- 45 శాతం మంది సాహసకత్యాలు తమ ట్రిప్‌లో భాగంగా ఉండాలనుకుంటున్నారు
- 44 శాతం మంది రోడ్ ట్రిప్స్ వేయాలనుకుంటున్నారు
- 39 శాతం మంది ఎకో టూర్స్ ఇష్టపడుతున్నారు
- 23 శాతం మంది ఆధ్యాత్మిక పర్యటనలవైపు మొగ్గు చూపుతున్నారు
- 21 శాతం మంది స్వచ్ఛంద సేవలకు ఆస్కారం ఉండే గమ్యాలను ఇష్టపడుతున్నారు

మహిళా చైతన్యం ముఖ్యం

భారత మహిళలు వివిధ రకాల అసమానతలు, హింసలకు గురవుతున్నారు. కట్నం ఇవ్వవలసివస్తుందనే భయంతో మహిళలు పురిట్లోనే ఆడ పిల్లలను చంపేసే పరిస్థితి. మహిళల మీద మానభంగాలు, దాడులు అంతకంతకీ పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు 465 మిలియన్ల మంది మహిళలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. మహిళల మీద అత్యాచారాలు, హత్యలను ఆపటం కోసం, మహిళల్ని గౌరవించే సమాజ స్థాపన కోసం మా ఐ.డబ్ల్యు.ఓ (ఇండియన్ విమెన్స్ ఆర్గనైజేషన్) తరఫున ఎన్నో అవగాహనా యాత్రలు, ధర్నాలు చేపట్టాం. రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులు, చట్టపరమైన చర్యలు తీసుకునే విధానాల పట్ల మహిళలకు అవగాహన ఏర్పరిచి, వారిని అప్రమత్తం చేయటమే మా ఐ.డబ్ల్యు.ఓ లక్ష్యం. ఇందుకోసం ఐ.డబ్ల్యు.ఓ చీఫ్ లీడర్లందరం, కమిటీ సభ్యులు, కార్యకర్తలతో కలిసి ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేస్తాం. ఇప్పటివరకూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి, సూర్యాపేట... ఇలా మొత్తం 11 తెలంగాణా జిల్లాల్లో ఆడ పిల్లలు, మహిళల మీద అత్యాచారాలు, దాడులను అడ్డుకుని, తమను తాము కాపాడుకునేలా అప్రమత్తతా కార్యక్రమాలు, సమావేశాలు ఏర్పాటుచేశాం. మహిళలపై హింస తగ్గాలంటే మహిళలందరూ సంఘటితం కావాలి.



● **లలిత సంపతి,** మహిళా కార్యకర్త - ఐ.డబ్ల్యు.ఓ తెలంగాణ జనరల్ సెక్రటరీ

మీకు తెలుసా?

అక్కడ... పురుషులకు నో ఎంట్రీ!

పురుషుల్లేని ప్రపంచంలోకి వెళిపోవాలని ఏదో ఒక క్షణంలో కొంతమంది మహిళలైనా అనుకొని ఉంటారు. అలాంటి వారి కోసమే ఏకంగా ఓ దీవి ఉందట. దాని పేరే 'సూపర్ షీ ఐలాండ్'. ఈ దీవికి చేరుకోవాలంటే మీరు ఫిన్‌లాండ్ వెళ్లాల్సిందే. అమెరికాకు చెందిన క్రిస్టినా రోత్ అనే మహిళా వ్యాపారవేత్తకు ఈ ఐడియా తట్టింది. ఓ కన్సల్టింగ్ సంస్థకు సీఈవోగా పనిచేసిన రోత్ కొన్నాళ్ల క్రితం రాజీనామా చేసి ప్రపంచాన్ని చుట్టడం మొదలుపెట్టారు. అప్పుడే ఎంతో మంది మహిళలను కలుసుకొని, వారి కష్టాలను తెలుసుకున్నారు. ఇదే క్రమంలో తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి ఫిన్‌లాండ్‌కు వెళ్లిన రోత్, అక్కడ ఓ దీవిని చూశారు.. వెంటనే నచ్చేసి కొనుగోలు చేశారు. మహిళల కోసమే ప్రత్యేకంగా ఆ దీవిలోనే రిసార్ట్ ఓపెన్ చేశారు. ఇదే ఇప్పుడు క్రేజీ న్యూస్. అన్నట్టు అక్కడికి వెళ్లాలంటే వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం వీ-వీఐపీలకు మాత్రమే ఎంట్రీ ఉంది. జూలై 1 నుంచి సాధారణ ప్రజలందరికీ ఈ దీవి అందుబాటులోకి వస్తుందట. అయితే మద్యపానానికి అనుమతి లేదు.



ట్రై చేయండి!

ఇలా కుట్టేస్తే చాలు!

తెలియని ప్రదేశాలకు వెళ్లినప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయో తెలీదు. ఒక్కోసారి డ్రెస్‌లు పాడయ్యే అవకాశం ఉంది. ఎంత ఖరీదైనా సరే చిన్న లోపం ఉన్నా సరే వాటి లుక్ మిస్ అవుతుంది. ప్రయాణాల్లో దుస్తులను సరిగ్గా మెయిన్‌టెయిన్ చేయడం చాలా కష్టం. పొరబాటున చిరిగిపోతే అప్పటికప్పుడు కుట్టుకోగలమా? కష్టమే. కానీ ఈ కిట్ ఉంటే ఇలాంటి ఇబ్బందులను తొలగించుకోవచ్చు. ఇంతకీ ఇందులో ఏముంటాయా అని అనుకుంటున్నారా? సూది, దారాలు, కత్తెర, టేప్ ఉంటాయి. వీటన్నిటికీ ప్రత్యేకంగా అరలు కూడా ఉంటాయి, కాబట్టి ఇవి పడిపోయే అవకాశం ఉండదు. ఈ కిట్ పేరు 'మేకప్ మినీ సీవింగ్ కిట్'. ఆన్‌లైన్‌లో దీని ధర రూ. 1300.



స్టార్ వెకేషన్

ఆ అయిదూ ఉంటే చాలు!



విలక్షణమైన పాత్రలకు పెట్టింది పేరు విద్యాబాలన్. 'డర్టీ పిక్చర్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ బాలీవుడ్ తారను వరించిన పురస్కారాలు లెక్కలేనన్ని. టూర్లంటే ఎంతో ఇష్టమనీ, ఎంత బిజీగా ఉన్నా పర్యటనలకు తీరిక చేసుకుంటాననీ అంటారు విద్య. మరి ఆమె ఇష్టపడే గమ్యాలు ఏవంటే...

నచ్చే ప్రదేశాలు: న్యూజిలాండ్ అంటే భలే ఇష్టం. ఇప్పటి వరకూ నేను చూసిన వాటిలో అదే అత్యుత్తమం. న్యూయార్క్ కూడా నచ్చుతుంది. కెనడాలోని టొరెంటో అందం అద్భుతం.


మన దేశంలో: భారతదేశంలో కేరళ నచ్చుతుంది. 'దేవుడి సొంత గడ్డ' అని పేరు పొందిన కేరళకు నేను తరచూ వెళుతూ ఉంటాను. ఇక, నగరాల్లో ముంబయ్ బాగా నచ్చుతుంది.

ఎవరైనా ఉండాల్సిందే: కుటుంబ సభ్యులతో లేదా స్నేహితులతో కలిసి వెళ్తేనే సరదా. అందుకే తీరిక దొరికినప్పుడూ, పర్యటనల్లో ఉన్నప్పుడూ కూడా వాళ్ళతోనే ఎక్కువ సమయం గడుపుతాను.

నచ్చే ఫుడ్: ఎక్కడికి వెళ్ళినా ఆ ప్రాంతంలో స్ట్రీట్ ఫుడ్ ట్రై చేస్తాను.

కంపల్సరీ ఫైవ్: నేను ఒక దీవిలో ఒంటరిగా చిక్కుకుపోయాననుకోండి. నాతో తప్పనిసరిగా ఉండాలని కోరుకొనేవి ఏమిటో తెలుసా? ఐ పాడ్, ఓ పుస్తకం, వెజిటేరియన్ ఫుడ్స్, ఐపాడ్‌లో చూడడానికి కొన్ని సినిమాలు... ఇంకా నా టూత్ బ్రష్. అంతే!

అధ్యయనం



తెలంగాణ నెంబర్ టూ!

ఎవరి తోడూ లేకుండా టూర్లకు వెళ్తున్న మహిళల సంఖ్య దేశంలో కొంతకాలంగా పెరుగుతోంది. దీనిపై కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ ఒక నివేదికను ప్రచురించింది. ఈ నివేదిక ప్రకారం ఒంటరి మహిళా పర్యాటకుల్లో ఎక్కువ శాతం మంది పంజాబ్ రాష్ట్రానికి చెందిన వారు. కాగా రెండవ స్థానంలో తెలంగాణ మహిళలు ఉన్నారు. ఇలాంటి సోలో మహిళా పర్యాటకుల్లో రాత్రి పూట ప్రయాణాలు చేస్తున్న వారి సంఖ్య నలభై శాతం వరకూ ఉంది. భద్రతకు సంబంధించిన ఆందోళన లేకుండా ఉండడం కోసం టూర్ ఆపరేటర్ల దగ్గర వారు తమ వివరాలు నమోదు చేసుకుంటున్నారని ఆ నివేదిక తెలిపింది. అలాగే ప్రత్యేకించి ఒంటరిగా ట్రిప్స్‌కు వెళ్ళే మహిళల కోసం ఈ ఆపరేటర్స్ ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు. అంతేకాదు, భావసారూప్యం కలిగిన ఇతర మహిళా ప్రయాణికులతో వారు అనుసంధానం అవడానికి సాయపడుతున్నారు. భవిష్యత్తులో ఈ ధోరణి ఇంకా పెరుగుతుందని పర్యాటక రంగ నిపుణులు చెబుతున్నారు.

మీ కోసం...



ఓన్లీ ఫర్ లేడీస్!

మీరు ఎక్కడికైనా దూర ప్రదేశాలకు వెళుతున్నారా? కానీ ఒంటరిగా వెళుతుంటే కాస్త జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. కానీ అస్సలు ఏమీ తెలియని ప్రదేశాల్లో ఒంటరిగా వెళ్లడం కూడా అంత మంచిది కాదు. కానీ మీలానే లోకల్‌గా అక్కడ ప్రయాణించేవారి గురించి తెలుసుకుంటే వారితో పాటు వెళ్లచ్చు కదా? ఈ ఐడియాతోనే మొదలైన యాప్ 'టూర్‌లినా'. ఇది కేవలం మహిళలకు మాత్రమే. మీరు చేయాల్సిందల్లా ఒకటే... ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసి, మీ ఫేస్‌బుక్ అకౌంట్‌తో లాగిన్ కావడమే. మీరు వెళ్లిన చోట యాప్ ఓపెన్ చేస్తే చాలు. లోకల్‌గా మీలాగా టూర్‌కి వచ్చిన వారితో ఇది కనెక్ట్ చేస్తుంది. ట్రావెల్ పార్ట్‌నర్ దొరకడమంటే మామూలు విషయం కాదు... కొంత మందికి తిరిగేసి వెంటనే వచ్చేయాలనిపిస్తుంది. మరికొంత మందికి ట్రెక్కింగ్, క్లిఫ్ క్యాంపింగ్ ఇలాంటివి చేయాలనిపిస్తుంది. ఇలా రకరకాల ప్రయాణికులు ఉంటారు. మీ ఇష్టాయిష్టాలకు తగ్గట్టుగానే మీ పార్ట్‌నర్‌ను వెతుక్కునే సౌకర్యం ఉంది. మీకు నచ్చితే వారితో ప్రయాణం మొదలుపెట్టచ్చు. ప్రస్తుతం 160 దేశాల్లో ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు.

సంఘటిత శక్తితో సాధ్యం

సమాజంలో మహిళలకు ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వం లేదు. ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత 'విధ్వంసక అభివృద్ధి' పెరిగింది. ఇది ఒక పార్శ్వమైతే, మరో వైపు హిందూ మతతత్త్వం, ఫండమెంటలిజం బాగా పెరిగింది. మహిళలు ఏం ధరించాలి? ఎలా మసలుకోవాలి? ఇంకా అనేక తిరోగమన భావాలతో మహిళలను నియంత్రించటం జరుగుతోంది. మారిటల్ రేప్, కుటుంబాల్లో స్త్రీలను బంధించటం, వారి మీద దాడులు చేయటం అనేది ఇప్పటికీ అంత పెద్ద చర్చనీయాంశం కావటం లేదు. ప్రతి మగ పిల్లవాడికీ, స్త్రీపురుష సమానత్వం గురించిన బోధన ప్రతి ఇంట్లో, ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి బడుల్లో చిన్న వయసు నుంచే మొదలవ్వాలి. మహిళలకు రాజకీయాల్లో ప్రవేశాన్ని నిరోధించటానికీ, ఆస్తుల మీద హక్కు లేకపోవటానికీ, వ్యవసాయం చేస్తున్నప్పటికీ మహిళా రైతులను వ్యవసాయదారులుగా గుర్తించకపోవటానికీ, వ్యవసాయ భూముల మీద హక్కు లేకపోవటానికీ కారణం ప్రభుత్వ విధానాలే! మహిళల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని మహిళా సంఘాలు ఎప్పటినుంచో అడుగుతూ ఉన్నాయి. 30 ఏళ్లుగా మహిళా కార్యకర్తగా మద్యపానానికి, స్త్రీల మీద హింసకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలంపాటు సాగుతున్న ఉద్యమాల్లో నేను ఓ భాగం. గతంలో పి.ఓ.డబ్ల్యు జనరల్ సెక్రటరీగా ఉన్న సమయంలో మహిళా అసమానతల మీద పోరాడాం. గ్రామీణ ప్రాంతాల్లో వరకట్న హత్యలు, అత్యాచారాలు జరిగినప్పుడు అక్కడ బహిరంగంగా మహిళా పంచాయితీలు పెట్టి విచారణ జరిపించాం! మహిళలు విడివిడి సంఘాలుగా కాకుండా ఐక్యంగా ఉద్యమించాలి. ఇతర ప్రజలు సాగిస్తున్న ఉద్యమాల్లో మహిళలూ భాగస్వాములు కావాలి. అప్పుడే మహిళల హక్కులు పరిరక్షించబడతాయి, అభివృద్ధి సాధ్యపడుతుంది.



• **విమల,**
మహిళా కార్యకర్త, పి.ఓ.డబ్ల్యు మాజీ జనరల్ సెక్రటరీ

హెల్త్ వెల్త్

ఆనందంగా... ఆరోగ్యంగా...!

మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారు... అన్నింటా ముందున్నారు. సరే... మరి వాళ్ల ఆరోగ్యం విషయమో! అది మాత్రం డౌటే.. కుటుంబ, ఉద్యోగ బాధ్యతల వల్ల 'తమ గురించి తమ బాధ్యత'ను పట్టించుకోవడాన్ని వెనక్కి నెట్టే ఆడవాళ్లే ఎక్కువమంది. 'టైం' సరిపోవడం లేదన్నా.. కొన్ని విషయాలు తప్పక పాటించాలి. అప్పుడే మీరు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటారు.

- డైటింగ్ అంటూ కార్బోహైడ్రేట్ లేదా కొవ్వులకు కోత విధించొద్దు. లీన్ ప్రొటీన్స్, క్యాల్షియం, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటేనే శరీరం సరిగా మీ మాట వింటుంది.
- దాదాపు అన్ని ఆరోగ్య సమస్యలకి పరిష్కారం మంచినీళ్లలోనే ఉంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి నెట్టేస్తాయి. అందుకే మంచినీళ్లను 'మంచి'గా తాగాలి. కాస్త నిమ్మరసం, మరికాస్త తేనె కలుపుకుని తాగితే ఇంకా ఆరోగ్యకరం.
- ఉదయాన్నే మీరెంత బిజీగా ఉన్నా కాస్త సమయాన్ని మీకోసం కేటాయించాల్సిందే. ప్రొటీన్స్‌తో నిండిన బ్రేక్‌ఫాస్ట్ తినాల్సిందే. అదికూడా కడుపు నిండా సుమా!
- అతిగా డైటింగ్ చేయొద్దు. మీ శరీరం ఎలా ఉంటే అలా దాన్ని అంగీకరించాలంతే. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలి. ఫిట్‌నెస్‌తో ఉండాలి. శక్తిని పెంచుకునే వ్యాయామాలు చేయండి.
- చర్మానికి సంబంధించి వాడే ఉత్పత్తుల్లో రసాయనాలతో నిండినవి కాకుండా సహజ ఉత్పత్తులను వాడండి.
- ఆహారంతో పాటు శారీరక వ్యాయామం కూడా అవసరం. అలాగని రోజుకి రెండు గంటలు జిమ్‌లో ఉండాల్సిన అవసరంలేదు. రోజుకి 30 నిమిషాలు నచ్చిన అవుట్‌డోర్ స్పోర్ట్ ఆడితే చాలు.
- సాధారణంగా ఆడవాళ్లు తమకు వచ్చే ఆరోగ్య సమస్యల్ని బయటకు చెప్పరు. ఆరు నెలలకి ఒకసారి హెల్త్ చెకప్ అనేది తప్పనిసరి. దీంతో పాటు ఏ మాత్రం తేడా కనిపించినా, అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తగిన పరీక్షలు చేయించుకోవాలి.
- ఆరోగ్యకరమైన ఆహారం అన్నారు కదాని నచ్చిన ఆహారానికి దూరంగా ఉండాల్సిన అవసరంలేదు. నచ్చిన ఆహారాన్ని మితంగా తినొచ్చు జిహ్వను సంతృప్తి పరచొచ్చు.
- మూడ్‌ను సరిచేసే రంగురంగుల పళ్లు, కాయగూరలు ఆహారంలో చేర్చండి. ఒత్తిడికి దూరంగా ఉండండి.

డైలీ సుడోకు - 125

				7				4
3			1		5			9
	5		2	9	4		3	
6						2		
	4						6	
		2						8
	7		8	4	1		5	
1			5		2			3
4				3				

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 124 సమాధానం

4	9	8	6	1	2	7	3	5
1	5	7	8	3	9	4	6	2
2	3	6	7	4	5	1	8	9
5	7	9	4	2	6	8	1	3
3	6	4	1	5	8	9	2	7
8	1	2	9	7	3	5	4	6
6	8	1	2	9	7	3	5	4
9	2	3	5	8	4	6	7	1
7	4	5	3	6	1	2	9	8



స్ఫూర్తి

వారి జీవితం సంపూర్ణం

చిన్నతనంలోనే పోలియో బారినపడినా ఆత్మవిశ్వాసాన్ని మాత్రం ఇసుమంతైనా కోల్పోలేదు. అందరిలా ఉద్యోగం చేయాలన్న తన ఆశయాన్ని నెరవేర్చుకోవడమే కాదు...సమాజానికి ఏదైనా చేయాలన్న సంకల్పంతో సాటి దివ్యాంగులకు అండగా నిలుస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు చందూరి సత్య. విశాఖలో ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించి, వారు తయారు చేసే ఉత్పత్తులను 'సంపూర్ణ' పేరిట అందిస్తూ ఎందరో దివ్యాంగులకు చేయూతనిస్తున్నారు. ఆమె స్ఫూర్తిదాయక ప్రయాణం ఇది.....

"ఏడాదిన్నర వయస్సులోనే పోలియో బారినపడినట్టు అమ్మానాన్న గుర్తించారు. ఊహ తెలిసే నాటికే వెన్నెముక, కాళ్లు, చేతులు ఇలా ఏం కద పాలన్నా.. కాలిపర్స్, క్రైచెస్‌లాంటి వాటి సహకారం తీసుకోక తప్పేది కాదు. 17 ఏళ్ల వరకు అదే పరిస్థితి. అలాగే విద్యాభ్యాసం పూర్తిచేశాను. డిగ్రీ బీకాం పూర్తయ్యాక అందరిలాగే ఉద్యోగం చేయాలన్న తలంపుతో కొన్నేళ్లు వివిధ సంస్థల్లో పనిచేశాను. తర్వాత పీజీ కూడా పూర్తిచేశాను. సొంతంగా టెలిఫోన్ ఆపరేటర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను నిర్వహించాను. ఆ రోజుల్లో మరెక్కడా ఆ సౌకర్యం ఉండేది కాదు. ఆర్థికంగానూ బాగానే ఉండేది. కానీ నాలా మారుమూలల్లో, పల్లెటూళ్లలో ఎందరో దివ్యాంగులు ఇంటికే పరిమితం అయిపోతున్నారు. వారు ఏం చేయలేమన్న భావనలోనే ఉండిపోతుంటారు. అటువంటి వారి కోసం ఏదైనా చేయాలన్న ఆలోచన నుంచి పుట్టిందే పీహెచ్‌డబ్ల్యూఏ (ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ అసోసియేషన్).

ప్రచారంతో ప్రారంభం..

నాతో పాటు మరికొందరు ఈ కార్యానికి జత కలిశారు. అనుకున్నదే తడవుగా 1979లో ప్రచార కార్యక్రమానికి నాంది పలికాం. వికలాంగులకు ప్రభుత్వపరంగా దక్కే పథకాల గురించి అప్పటి జేసీ ఒక కాపీ ఇచ్చారు. వాటిని ప్రింట్లు తీసి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, యూనివర్సిటీ..ఇలా జనసంచారం అధికంగా ఉండే అన్ని ప్రాంతాల్లోనూ అంటించేవాళ్లం. రెండేళ్ల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. శిరీష అనే స్నేహితురాలు సహకారంతో 2000 సంవత్సరంలో ఈ సంస్థను స్థాపించాం. ఆమె ఆర్థిక సాయం అందించేది. అలా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే దివ్యాంగులకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేతనైన కృషిచేసేవాళ్లం. ఫేబ్రిక్ పెయింటింగ్, టైలరింగ్, సాఫ్ట్‌టాయ్స్, క్యాండిల్స్ తయారీ, కంప్యూటర్స్ ఇలా పలురకాల ఉపాధి వృత్తుల్లో శిక్షణ ఇచ్చేవాళ్లం. కాలక్రమంలో దివ్యాంగులు వివిధ కేటగిరీలుగా విభజన చేస్తూ వచ్చారు. మూగ, చెవుడు, పోలియో, అంధులు, అవయవ లోపం ఉన్నవాళ్లకు వేర్వేరుగా ప్రభుత్వ పథకాలు, గృహాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ అప్పటికే సుమారు నాలుగు వేల మందికిపైగా దివ్యాంగ మహిళలకు ఉపాధి శిక్షణ ఇచ్చాం. వారి కాళ్లమీద వాళ్లు నిలబడి సంపాదించుకోవాలన్న లక్ష్యంతోనే ఆ కార్యక్రమానికి పూనుకున్నాం. ఈ క్రమంలో ఎన్నోసార్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వాటిని తట్టుకుని నిలబడేందుకు నాకు నేను ఎంతో కౌన్సెలింగ్ చేసుకోవాల్సి వచ్చేది. పది మందికి మార్గం చూపాలని నిర్ణయించుకుని తాత్కాలిక ఇబ్బందులతో వెనకడుగు వేయకూడదని ఎంతో శ్రమించేదాన్ని. అందుకు కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారం ఎంతో ఉంది.

నిరుపేదలకు అండగా....

కేవలం శిక్షణకే పరిమితం కాకుండా కొంతమందిని ఎంపిక చేసుకుని వారికి జీవితాన్ని ఇవ్వాలనీ మంచి స్థానంలో నిలబడేలా తీర్చిదిద్దాలనీ నిర్ణయించుకున్నా. అందుకోసం నిరుపేదలైన ఇరవై మందిని ఎంపిక చేసుకున్నాను. వారిలో 17 మంది పోలియో బారిన పడిన మహిళలే. వారికి హోమ్ ఫుడ్స్, పేపర్ బ్యాగులు, హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇచ్చి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో సంస్థ నిర్వహణ, వారికి కొంత ఆర్థిక సాయం దక్కేలా రూపకల్పన చేశాను.

సంపూర్ణ బ్రాండ్‌తో..

ఇక్కడి దివ్యాంగులు తయారు చేసే ఉత్పత్తులకు 'సంపూర్ణ' అనే బ్రాండ్ నేమ్ ఇచ్చాం. ఎటువంటి మార్కెటింగ్ చేసే ఆర్థిక స్తోమత మాకు లేదు. కానీ స్థానికుల సహకారం వల్ల అనేకమంది వచ్చి ఉత్పత్తులు కొనుగోలు చేసుకుంటుంటారు. ప్రస్తుతం 17 మంది దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. సంస్థ నిర్వహణ ఖర్చులన్నీ పోనూ నెలకు రూ.నాలుగు వేల వరకు ఒక్కొక్కరికి మిగులుతోంది. ఒక్కో సందర్భంలో వంద రూపాయలు కూడా ఇవ్వలేని స్థితిని ఎదుర్కొన్నాం. కానీ మాలో సమష్టితత్వం వల్ల ఈ విజయాన్ని అందుకోగలిగాం. ఉదయం పది గంటలకు ప్రతి ఒక్కరూ పనిలో ఉండాల్సిందే. క్రమశిక్షణతోనే ఏదైనా సాధ్యం అని నమ్మేతత్వం నాది. వారికీ అదే నేర్పాను. సాయంత్రం ఆరు గంటల వరకు పని చేస్తారు. మా బేకరీ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఐదు కిలోమీటర్ల వరకు దుకాణాలకు, బేకరీలకు త్రీవీల్ చైర్‌లో వెళ్లి మా సభ్యులే డెలివరీ చేస్తారు. అవసరమైన సరుకులు వాళ్లే మార్కెట్‌లో కొనుగోలు చేసుకుని వంటకాలకు సిద్ధం చేస్తారు. మాదంతా ఒక కుటుంబంలా ఉంటుంది. నేను లేకపోయినా..ఈ సంస్థ ముందుకు నడిచేలా వారిని తీర్చిదిద్దగలిగాను. ఇంకా ఆర్డర్లు పెరిగితే ఉత్పత్తితో పాటు వారి సంఖ్యను పెంచేందుకు వీలవుతుంది. నా లక్ష్యం ఒకటే.. వాళ్లు జీవితంలో స్థిరపడాలి. మరో పది మందికి జీవితాన్ని ఇచ్చే స్థితికి చేరాలి. మాకు ఇదే ప్రపంచం. అందుకే అన్ని పండుగలు చేసుకుంటాం. ప్రతి ఏటా ఏదో ఒక దేవస్థానాన్ని సందర్శిస్తాం. షిర్డీ, తిరుపతి, విజయవాడ ఇలా...ఏదో ఒక క్షేత్రానికి వెళుతూ ఉంటాం. టూర్ ప్లాన్ అంతా వాళ్లే చేసుకుంటారు. 'మేం ఎవరికన్నా...తక్కువ కాదు' అన్న భావన ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తుంది. నెలకోసారి వారి ఇళ్లకు వెళ్లి వస్తుంటారు. చేతనైన డబ్బులు ఇంటికి పంపుతారు. వాళ్ల తల్లిదండ్రుల్లో ఆనందం చూసుంటే...వీరికోసం పడిన కష్టమంతా ఆవిరైపోతుంది.

• **వాసు,** విశాఖపట్నం
ఫొటోలు: రామకృష్ణ

పురస్కారం

సేవా రమణీయం!

రాజకీయ, సేవా రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా ముద్ర వేశారు గంద్ర రమాదేవి. సామాజిక సేవా విభాగంలో తెలంగాణ ప్రభుత్వం ఆమెను ఉత్తమ మహిళగా ఎంపిక చేసింది. రాయికల్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలుగా జగిత్యాల జిల్లా రాయికల్ మండల రాజకీయాల్లో ఆమె తనదైన పాత్ర పోషిస్తున్నారు. వార్డు సభ్యురాలు నుంచి జడ్పీటీసీ వరకు పలు పదవులు పొంది ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న ఆమె సేవా ప్రస్థానం ఆమె మాటల్లోనే..



"మా సొంతూరు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కంచర్ల. మారుమూల గ్రామం. చిన్నప్పటి నుంచి అక్కడి ప్రజల కష్టాలను చూస్తూ పెరిగా. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన గంద్ర అచ్యుత్‌రావుతో 1981లో నా వివాహం జరిగింది. ఆ ఏడాదే రాయికల్‌కు వచ్చాం. అక్కడి మహిళలు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలనుకున్నా. అవకాశం రావటంతో రాజకీయాల్లో అడుగుపెట్టా. మరోవైపు మహిళల్లో చైతన్యం కోసం గ్రామైక్య సంఘాల ఏర్పాటులో చురుగ్గా పాల్గొన్నా. నా సేవాభావం గుర్తించిన గ్రామప్రజలు 1987లో గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలిగా ఎన్నుకున్నారు. పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో 1996లో జడ్పీటీసీగా పోటీచేసి గెలిచాను. జడ్పీటీసీ సభ్యులుగా ఉంటూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ అధ్యక్షురాలిగా పనిచేశాను. అప్పుడు మహిళల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాను. మా మండలానికి జడ్పీ నుండి అధిక నిధులు సాధించి పలు అభివృద్ధి పనులు చేశాను. 2001లో మండల ప్రాదేశిక సభ్యురాలిగా ఎన్నికయ్యాను. సంక్షేమ పథకాల ఫలితాలు సామాన్య మహిళలకు సైతం అందేలా కృషి చేశాను. 2004లో జడ్పీటీసీగా రెండోసారి ఎన్నికయ్యాను. అప్పుడు రాయికల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహించి 2 వేల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించడంలో ప్రధాన భూమిక పోషించా. మండలవ్యాప్తంగా 1600 డ్వాక్రా మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించాను. ఎస్సీ, ఎస్టీ మహిళలకు దీపం పథకం ద్వారా విరివిగా గ్యాస్ కనెక్షన్లు ఇప్పించాను. మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు కృషిచేశాను. ఆర్‌ఎస్‌ఎంఏ పథకం ద్వారా మండలంలోని ఉన్నత పాఠశాలలకు పక్కాభవనాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాను."

• **కూర్మాచలం శ్రీనివాస్**
ఫొటో: పిట్టల శ్రీధర్

ఆంధ్రజ్యోతి
HAPPY WOMEN'S DAY
చిత్ర జ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 8 మార్చి 2018

అందాల భామలు...
అక్కున చేర్చుకున్న అమ్మలు!

సమాజం నాకేం ఇచ్చింది? అని ఆలోచించిన వాళ్లే వీళ్లంతా. వారి ప్రశ్నకు సమాధానం దొరకగానే మళ్లీ సమాజానికి ఇచ్చేయడానికి ముందుకొచ్చారు. నిజమే తాము కన్న కలలను సాకారం చేసుకోవడానికి వీళ్లకు సమాజం చేయూతనిచ్చింది. పేరు, ప్రతిష్ఠలతో పాటు పైసలను కూడా ఇచ్చింది. ఈ భామలు ఆ విషయాన్ని అర్థం చేసుకున్నారు. చుట్టూ ఉన్న వారిలో కొంతమందికైనా అవసరాలను తీర్చాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆచరిస్తున్నారు. ఈ సేవల గురించి నాయికామణులు ఏమంటున్నారంటే...



వాళ్లకు అన్నీ నేనే!
- హన్సిక

"అమ్మ కడుపు నుంచి పుట్టేటప్పుడు బిడ్డ పిడికిలి ముడుచుకుని పుడుతుందట. అదృష్టం, దురదృష్టం అంతా... ఆ పిడికిలిలోనే ఉంటుందట. అలా నేను ఈ లోకంలోకి తెచ్చుకున్న అదృష్టం ఈ జీవితం. ప్రజల అభిమానం. ఈ నాకున్న దాన్ని పది మందికి పంచడానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను" అని అంటున్నారు హన్సిక. ఇప్పుడు ఆమె దాదాపు ముప్పై మంది పిల్లలకు తల్లి. ఈ విషయాన్ని హన్సిక ప్రస్తావిస్తూ "కంటేనే పిల్లలా? నా కడుపున పుట్టకపోయినా అంత మందీ నాకు పిల్లలే. వాళ్లకు నేను తల్లినే. మా అమ్మ వాళ్లకి అమ్మమ్మే. వాళ్లకు కేవలం భోజనం, చదువు మాత్రమే కాదు.. వసతి సదుపాయాన్ని కూడా కల్పించాలనే సంకల్పం మొదటి నుంచీ ఉండేది. నా పిల్లలు చదువులోనూ, ఆటపాటల్లోనూ ముందుంటారు. అనాథలు అనే భావన వారిలో ఎట్టి పరిస్థితుల్లో రానివ్వను. నా ప్రతి పారితోషికం నుంచీ వారికి ఒక మొత్తాన్ని కేటాయిస్తాను. కేవలం కేటాయిస్తే సరిపోతుందా? వాళ్లు నన్ను మిస్ అవుతుంటారు కదా? ఆ భావన వారిలో రానివ్వను. వీలైన ప్రతి సందర్భంలోనూ వారితో సమయాన్ని గడుపుతాను. ఆ మధ్య అందరం కలిసి ట్రిప్ వెళ్లాం. త్వరలో వాళ్లందరినీ ఫారిన్‌కి కూడా తీసుకెళ్లాలని ఉంది" అని అన్నారు. ఆమె ఇంకా చెబుతూ "సీనియర్ సిటిజన్స్ కోసం ఓ భవనాన్ని నిర్మించాలని ఉంది. మరోవైపు రొమ్ముకేన్సర్‌తో బాధపడుతున్న పది మంది మహిళల వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్నాను" అని అన్నారు. "మా అమ్మ డాక్టర్. ఆమె దగ్గరకు కొందరు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం చేయమని వస్తుంటారు. అలా వచ్చినవారిలోనే పది మంది కేన్సర్ బాధిత మహిళలకు సాయం చేస్తున్నా. భవిష్యత్తులో వీరి సంఖ్యను పెంచే ఆలోచన కూడా ఉంది" అని చెప్పారు హన్సిక.

అమ్మాయిలకు ఆసరా!
- అమలాపాల్

"వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ ఎదగాలి. మనం మాత్రమే అభివృద్ధి చెందితే సరిపోదు. జీవితంలో పైకి వచ్చిన తర్వాత పది మందికీ సాయపడాలి. నాకు చిన్నతనం నుంచి మా తల్లిదండ్రులు నేర్పించిన విషయం ఇదే. అలాంటి పరిసరాల్లో పెరిగాను కాబట్టి ఇప్పుడు సమాజం గురించి ఆలోచించగలుగుతున్నాను" అని అంటున్నారు అమలాపాల్. ఇటీవల ఆమె 26వ పుట్టినరోజును జరుపుకొన్నారు. ఆ సందర్భంగా 30 మంది అమ్మాయిల విద్యకు అయ్యే ఖర్చును భరించడానికి ముందుకొచ్చారు. మరో 16 మంది పిల్లలను దత్తత తీసుకున్నారు. అసలు దత్తత తీసుకోవాలనే ఆలోచన ఎక్కడిది అని ప్రశ్నిస్తే.. అమలాపాల్ చాలా విషయాలనే చెప్పుకొచ్చారు. "అందరి జీవితాలూ ఒకే విధంగా ఉండవు. భగవంతుడు అందరి రాతలనూ ఒకే రకంగా రాయడు. ఈ ప్రపంచంలో చాలా మంది మహిళలకు ఎలాంటి అండా ఉండటం లేదు. అలాంటివారికి నాకు చేతనైనంత సాయం చేయాలనేది నా సంకల్పం. అందుకే 30 మంది అమ్మాయిలను ఎంపిక చేసుకుని ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువు చెప్పిస్తున్నా. పదో తరగతి పాస్ అయినవాళ్లకి కనీస జ్ఞానం ఉంటుంది. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడగలరని నా నమ్మకం. తల్లిదండ్రులను కోల్పోయి బంధువుల ఇళ్లల్లో పెరుగుతున్న మరో 16 మంది అమ్మాయిలను దత్తత తీసుకుని వారి బాగోగుల్ని సంపూర్ణంగా చూసుకుంటున్నాను. ఇప్పుడు నేను ఈ 46 మంది పిల్లలకు తల్లిని. అందరినీ నేను దగ్గరుండి చూసుకోకపోవచ్చు.. కానీ నన్ను కని పెంచిన తల్లి వాళ్ల ఆలనాపాలనా చూస్తోంది. మా అమ్మ సపోర్ట్ లేకపోతే నేను ఇంత మందికి సాయం చేయలేను. మనం ఎదిగితే సరిపోదు... మన చుట్టూ ఉన్న సమాజానికి సాయం చేయాలనే దృక్పథాన్ని నాలో అలవరిచిన మా తల్లిదండ్రులకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. నా చిన్నతనం నుంచి ఓనమ్, క్రిస్‌మస్ వంటి పండుగలు వచ్చినప్పుడు ఎక్స్‌ట్రా ఫుడ్‌ని ప్యాక్ చేసి అనాథ శరణాలయాల్లో మా తల్లిదండ్రులు పంచేవారు. ఇప్పటికీ ఆ అలవాటును కొనసాగిస్తున్నాం" అని చెప్పారు.





మహిళా దినోత్సవ ప్రత్యేకం

అప్పుడే మొదలైంది
- శ్రియ

"ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడానికి చాలా మంది ముందుకు వస్తారు. కానీ అన్నం వండుకోవడానికి కావాల్సిన సామగ్రిని సమకూర్చుకోవడానికి వారికి శక్తిని సమకూర్చగలిగితే..? ఆ ఆలోచన నాకు నచ్చింది. అందుకే అదే ఆలోచనతోనే నేను 'స్పా' పెట్టాను. అందులో అంధులకు ఉపాధిని కల్పించా. చూపు లేకపోయినంత మాత్రాన బతుకుమీద ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదనీ, ఉపాధి మార్గం ఉందని వారికి ఆత్మ స్థైర్యం కల్పించడానికి ప్రయత్నించా" అని అంటున్నారు శ్రియ. త్వరలో పెళ్లికూతురు కాబోతోన్న శ్రియ నటిగా అందరికీ సుపరిచితురాలు. ఆమె మాట్లాడుతూ "అంధులను చూసి ఎవరూ జాలిపడాల్సిన అవసరం లేదు. వాళ్లు మనకన్నా మానసికంగా దృఢంగా ఉంటారు. ప్రతి విషయాన్ని చాలా పాజిటివ్‌గా చూస్తారు" అని అన్నారు. అంధులతో ఆమెకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు శ్రియ. ఆమె మాట్లాడుతూ "నాకు 15 ఏళ్లున్నప్పుడు మా అమ్మతో కలిసి తొలిసారి హరిద్వార్‌లో అంధుల పాఠశాలకు వెళ్లాను. ఎందుకో మనసుకు చాలా సంతోషంగా అనిపించింది. అప్పటిదాకా కొన్ని విషయాల పట్ల 'నేను చేయలేనేమో' అని అనుమానం ఉండేది. కానీ వాళ్లతో మాట్లాడిన తర్వాత నాలో కొత్త ఉత్తేజం వచ్చింది. సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు అని అనిపించింది. అప్పటి నుంచి తరచూ అక్కడికి వెళ్లేదాన్ని. నటిగా సెటిల్ అయిన తర్వాత సమాజానికి ఏదైనా తిరిగి ఇవ్వాలని భావించినప్పుడు నాకు ముందు గుర్తుకొచ్చింది మా హరిద్వార్‌లోని అంధుల పాఠశాలే. వారిలో చదువుకున్న వారున్నారు. సమర్థవంతులున్నారు. రకరకాల ప్రతిభ కలిగిన వారున్నారు. వారందరినీ ఒకచోట చేర్చి 'స్పా' మొదలుపెట్టాను. ఒకప్పుడు వాళ్లు నాలో నింపిన ఆత్మవిశ్వాసాన్ని నేను మళ్లీ వాళ్లలో నింపగలిగినందుకు భగవంతుడికి ధన్యవాదాలు చెప్పుకొన్నాను. ఇప్పటికీ నాకు ఏ మాత్రం సమయం దొరికినా వాళ్లందరి మధ్యకు చేరుకుంటాను. వాళ్లు చెప్పే ఆసక్తికరమైన కబుర్లు వింటుంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది. జీవితాన్ని వారు చూసే కోణం చాలా పాజిటివ్‌గా ఉంటుంది. అది నాకు చాలా నచ్చుతుంది" అని అన్నారు.

టార్గెట్... 2020!



రాజమౌళి దర్శకత్వంలో నటించే సినిమా పనుల నిమిత్తం ఎన్టీఆర్, రామ్‌చరణ్ అమెరికా వెళ్లారు. కానీ, రాజమౌళి మాత్రం వెళ్లలేదట. ఇద్దరు హీరోలతో పాటు ఆయన కుమారుడు కార్తికేయను పంపారని సమాచారం. ఫొటోషూట్ కోసం హీరోలు అమెరికా వెళ్లారని, లేదు లేదు... పది రోజులు అక్కడ జరిగే వర్క్‌షాప్‌లో పాల్గొంటారని ప్రచారం జరుగుతోంది. చిత్రబృందం సన్నిహిత వర్గాల నుంచి అందుతోన్న సమాచారం ప్రకారం అసలు విషయం ఏంటంటే... యాక్షన్ ఎపిసోడ్స్‌లో గ్రాఫిక్స్ కోసం హీరోల బాడీ మెజర్‌మెంట్స్, బాడీ లాంగ్వేజ్ క్యాప్చర్ చేయడం కోసం ఇద్దర్నీ రాజమౌళి అమెరికా పంపారట! ఆయన సినిమాల్లో యాక్షన్ ఎపిసోడ్స్ ఎంత భారీగా ఉంటాయో తెలిసిందే. పైగా, 'బాహుబలి' తర్వాత గ్రాఫిక్స్‌పై ఆయనకు చాలావరకూ అవగాహన వచ్చింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ సినిమా గ్రాఫిక్స్ వల్ల ఆలస్యం కాకూడదని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నమాట! ఇప్పటినుంచి సినిమా కోసం సన్నాహాలు ప్రారంభించినా... విడుదల మాత్రం 2020లోనే అంటున్నారు. ఈపాటికి చిత్రీకరణ మొదలు కావలిసిన ఎన్టీఆర్-త్రివిక్రమ్ సినిమా ఇంకా మొదలు కాలేదు. అలాగే, బోయపాటి సినిమా షూటింగులో రామ్‌చరణ్ ఇంకా జాయిన్ కాలేదు. ముందుగా అనుకున్న షెడ్యూల్స్ కంటే ఈ రెండు సినిమాలు కొంచెం ఆలస్యమయ్యాయి. దీనికి తోడు రాజమౌళి భారీగా సినిమా తీయాలనుకోవడంతో ఎక్కువ రోజులు చిత్రీకరణకు కేటాయించాల్సిన పరిస్థితి. అందువల్ల, సినిమాను 2020లో విడుదల చేయాలనుకుంటున్నారట!



కపూర్ డాటర్స్ @ జాన్వీ బర్త్ డే

అమ్మతోడుకి దూరమైన అమ్మాయికి తోడుగా కపూర్ కుటుంబంలో అమ్మాయిలు అందరూ ఒక్క చోట చేరారు. మంగళవారం శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ 21వ ఏట అడుగుపెట్టారు. అందులోనూ శ్రీదేవి మరణించిన తర్వాత వచ్చిన తొలి పుట్టినరోజు. అమ్మ దూరమైందనే బాధలో ఉన్న ఆ అమ్మాయి పుట్టినరోజును కపూర్ కుటుంబం ఆత్మీయుల మధ్య సెలబ్రేట్ చేసింది. మంగళవారం రాత్రి జాన్వీతో కేక్ కట్ చేయించారు. ఆ తర్వాత దిగిన ఫొటోను 'కపూర్ డాటర్స్' క్యాప్షన్‌తో సోనమ్ కపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.


తండ్రితో జాన్వీ...

షకీలా 250వ చిత్రం 'శీలవతి'!


షకీలా, గీతాంజలి

కేరళలో జరిగిన వాస్తవ సంఘటన ఆధారంగా రూపొందిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ 'శీలవతి'. శృంగారతార షకీలా నటించిన 250వ చిత్రమిది. సాయిరామ్ దాసరి దర్శకుడు. 'జి' స్టూడియోస్ సమర్పణలో రాఘవ ఎమ్. గణేష్, వీరు బాసింశెట్టి నిర్మించారు. 'ఈ భూమ్మీద పుట్టిన ప్రతి ఒక్క స్త్రీ శీలవతే' అనే డైలాగ్‌తో కూడిన ఈ సినిమా టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. "ఇందులో ముఖ్యమైన పాత్ర చేశా. నాకూ తర్వాత సన్నివేశంలో ఏం జరుగుతుందనేది తెలియకుండా దర్శకుడు చిత్రం తీశారు" అని షకీలా అన్నారు. నిర్మాత వీరు బాసింశెట్టి మాట్లాడుతూ "షకీలాగారితో నటి-నిర్మాతగా మొదలైన మా బంధం అక్కా-తమ్ముడు అనుకునేంతగా బలపడింది. సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వేసవి సందర్భంగా మేలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. నిర్మాతగా నాకు బాగా సంతృప్తినిచ్చిన చిత్రమిది" అన్నారు. "చిత్రం చూశాక 'ఇంతకు ముందు షకీలా వేరు. ఇప్పటి షకీలా వేరు' అని ప్రేక్షకులు అంటారు" అని దర్శకుడు అన్నారు. 'జబర్దస్త్' అర్జున్, గీతాంజలి, అశోక్, కొండ, తిరుపతి, చిన్నా తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్.

ఆ నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు?
- నట్టికుమార్



చిత్రపరిశ్రమ మేలు కోసం కాకుండా కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం థియేటర్ల బంద్ జరిగిందని నిర్మాత నట్టికుమార్ ఆరోపించారు. చిన్న సమస్య కోసం ఆరు రోజులు బంద్ చేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. బంద్ వల్ల చిన్న నిర్మాతలు, ఎగ్జిబిటర్లకు ఏర్పడిన కోట్ల రూపాయలు నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. డి. సురేశ్‌బాబు, అల్లు అరవింద్ వంటి నిర్మాతలు 'డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్' క్యూబ్, యు.ఎఫ్.ఓ సంస్థల వెనక ఉండడం వల్లే ఇలాంటి పరిస్థితులు వచ్చాయని నట్టి కూమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ "డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్' అధిక రేట్లు వసూలు చేస్తుండం కారణంగా చూపి బంద్ చేశారు. ప్రస్తుతం వారానికి 12 వేలు వీపీఎఫ్ (వర్చువల్ ప్రింట్ ఫీజ్)గా వసూలు చేస్తుంటే.. అందులో రెండు వేలు తగ్గించమని బతిమాలారు. రెండు వేలు కాదు... 10 వేలు తగ్గించి వీపీఎఫ్ రెండు వేలు చేయాలి" అన్నారు.